


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 281

బుధవారం
1-1-2025



SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'మినీ పాకిస్తాన్'పై దుమారం

కేరళ 'మినీ పాకిస్తాన్'గా మారిందన్న నితీశ్ రాణే వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీనిపై కేరళ సీఎం విజయన్ సీరియస్ అయ్యారు.

- వివరాలు 6లో▶



అందరికీ 'వాట్సాప్ పేమెంట్'

వాట్సాప్‌లో కొద్దిమందికి మాత్రమే ఇతరులకు నగదు బదిలీ వెసులుబాటు ఉండగా ఇకపై అందరికీ ఆ అవకాశం దక్కనుంది.

- వివరాలు 6లో▶



'సారీ' చెప్పిన మణిపూర్ సీఎం

జాతుల వైరంలో 250మందికి పైగా ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చినందుకు క్షమించాలని మణిపూర్ సీఎం ఎన్.బిరేన్ సింగ్ కోరారు.

- వివరాలు 6లో▶



క్షిపణులతో విరుచుకుపడ్డ రష్యా

ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా ఆ దేశంలోని పలు ప్రాంతాలపై మంగళవారం రష్యా క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడింది.

- వివరాలు 6లో▶

సంక్రాంతికే భరోసా!

సెల్ఫ్ డిక్లరేషన్ మాత్రం తప్పనిసరి.. మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయం

ఎంత భూమిలో సాగు చేశాడో స్వయంగా తెలియజేస్తూ రైతు ఇచ్చేదే సెల్ఫ్ డిక్లరేషన్

ఎంత మేర భూమి సాగు చేస్తే అంత విస్తీర్ణానికే లెక్కగట్టి పెట్టుబడి సాయం

శాటిలైట్ ఇమేజ్, రిమోట్ సెన్సింగ్ డేటాతో నిర్ధారణ

వ్యవసాయాధికారి ఇచ్చే లెక్కలతో సరిపోల్చుకున్న తర్వాతే భరోసా



- రైతుల్లో జవాబుదారీతనం పెంపొందుతుందంటున్న ప్రభుత్వం
- ఎకరాకు రూ.7,500 చొప్పున చెల్లింపుపై కొరవడిన స్పష్టత
- ఒక్కో రైతుకు ఎన్ని ఎకరాలకు సాయం ఇవ్వాలనేదీ ఖరారు కాని వైనం
- జనవరి 2 లేదా 3న మరోసారి ఉప సంఘం భేటీ

4న జరిగే కేబినెట్ సమావేశంలో విధివిధానాలకు ఆమోదముద్ర!

ఏమిటీ సెల్ఫ్ డిక్లరేషన్?

'అయ్యా.. ఫలానా గ్రామానికి చెందిన నాకు సర్వే నంబర్ 1లో ఎకరం పొలం ఉంది. నా ఇంటి ఆవరణతో కలిపి 100వ సర్వే నంబర్‌లో మరో ఎకరం చెలక ఉంది. ఇంటి జాగా 2 గుంటలు పోను మొత్తం ఎకరా 38 గుంటల్లో కూరగాయలు సాగు చేస్తున్నాను. ఇందులో ఎలాంటి తప్పుడు లెక్కలు చూపినట్లు తేలినా.. ప్రభుత్వం తీసుకునే చర్యలకు కట్టుబడి ఉంటాను. దయచేసి నేను సాగు చేసే భూమికి సంబంధించి రైతు భరోసా అందించగలరని మనవి'

రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందాలనుకునే రైతు ఎవరైనా భవిష్యత్తులో వ్యవసాయ శాఖకు ఇవ్వాల్సిన 'సెల్ఫ్ డిక్లరేషన్' నమూనా ఇది.



సాక్షి, హైదరాబాద్: 'రైతుభరోసా' అమలుకు ముహూర్తం ఖరారైంది. కొత్త సంవత్సరంలో సంక్రాంతి కానుకగా ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత కొన్నేళ్లుగా అమల్లో ఉన్న పెట్టుబడి సాయం 'రైతుబంధు' స్థానంలో 'రైతు భరోసా'ను కాంగ్రెస్ ప్రభుత్వం తెరపైకి తెచ్చిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్‌కమిటీ ఇప్పటికే పలుమార్లు సమావేశమై పథకం మార్గదర్శకాలపై చర్చించింది. తాజాగా రెండురోజుల క్రితం జరిగిన సమావేశంలో తుది కసరత్తు కూడా పూర్తి చేసింది. వానాకాలం, యాసంగి సీజన్లలో రైతు ఎంత మేర భూమి సాగు చేస్తే అంత విస్తీర్ణానికే లెక్కగట్టి రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించింది. గతంలో ఎంత భూమి ఉంటే అంత భూమికి రైతుబంధు అందేది. ఇలాఉండగా రైతు ఎంత భూమిలో సాగు చేశాడో స్వయంగా తెలియజేసే 'సెల్ఫ్ డిక్లరేషన్' నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని కూడా మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. శాటిలైట్ ఇమేజ్, రిమోట్ సెన్సింగ్ డేటా ఆధారంగా రైతు సాగు చేసిన భూమిని

మిగతా 12వ పేజీలో ▶



బాణసంచా కాంతులు, లేజర్ షో వెలుగుల్లో కాంతులీనుతున్న ఆస్ట్రేలియాలోని సిడ్నీ ఒపేరా హౌస్.. ప్రపంచవ్యాప్తంగా నూతన సంవత్సర సంబరాలు అంబరాన్ని తాకాయి. కిరిబాటీ రిపబ్లిక్ 2025కు స్వాగతం పలికిన తొలి దేశంగా నిలిచింది. ఇటు మన దేశంలోనూ ఆనందోత్సాహాలు మిన్నంటాయి.

వేడుకల వీడియో చూడాలా.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

నయా సాల్.. నయా జోష్

6లో



కొత్తగా ఉందాం

క్యాలెండర్ మారితే సంతోషపడటం కాదు. మనం ఏం మారామనేది ముఖ్యం. అవే పాత అలవాట్లు.. పాత తలపోతలు పాత బలహీనతలు.. పాత అనవసర భారాలు... వాటిని మోస్తూనే కొత్త సంవత్సరంలో అడుగు పెడితే మీరు అదే పాత మనిషి అవుతారు. కొత్తగా ఉండటం చాలా ముఖ్యం. మీ చుట్టూ మిమ్మల్ని మబ్బులో పెట్టి పబ్బం గడిపే వారుంటారు. మబ్బు వీడండి.. కొత్త మనిషిగా ముందుకు అడుగు వేయండి.

హ్యాపీ న్యూ ఇయర్.

13లో

న్యూస్‌రీల్

జేఈఈ అడ్వాన్స్‌డ్ తర్వాతే కౌన్సెలింగ్ షెడ్యూల్



జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష పూర్తయిన తర్వాతే ఈసారి కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేయాలని 'జోసా' నిర్ణయించింది. ఆరు రౌండ్ల కౌన్సెలింగ్‌ను 2025లో కుదించే ఆలోచన చేస్తున్నారు.

- వివరాలు 3లో▶

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు 'కార్పొరేట్' లుక్



రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన సేవలతోపాటు వారికి అవసరమైన వసతులు కల్పించడమే ధ్యేయంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యకలాపాలు ఉండాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. శాశ్వత భవనాల కోసం స్థలాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

- వివరాలు 3లో▶

15 రోజుల్లో ప్రమోషన్లు



నీటిపారుదల శాఖలోని అన్ని స్థాయిల ఇంజనీర్లకు 15 రోజుల్లోగా పదోన్నతులు, బదిలీలు చేపడతామని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు.

- వివరాలు 12లో▶


'పామాయిల్' ధర పెంపు



రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం నూతన సంవత్సర కానుకను ప్రకటించింది. టన్ను పామాయిల్ గెలల ధరను రూ. 20,506 వద్ద స్థిరీకరించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. పెరిగిన ధరలు జనవరి 1 నుంచే అమల్లోకి రానున్నాయి.

- వివరాలు 5లో▶





తుది తీర్పు వరకు కేటీఆర్ అరెస్టు వద్దు



'ఫార్ములా ఈ' కేసులో ఏసీబీకి హైకోర్టు ఆదేశం

మాజీ మంత్రి కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి..

- మంత్రిగా కేటీఆర్ అవినీతికి పాల్పడలేదు.. క్రిమినల్ సెక్షన్లు ఈ కేసులో వర్తించవు
- కేటీఆర్ తరపు న్యాయవాది సిద్ధార్థ దవే వాదన
- 2023లో ఒప్పందానికి ముందే చెల్లింపులు.. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా పట్టించుకోలేదు: ఏజీ

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ కార్ రేసు వ్యవహారంపై నమోదైన కేసులో ఎఫ్‌ఐఆర్‌ను రద్దుచేయాలని కోరుతూ.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తుది తీర్పు ప్రకటించే వరకు ఆయనను అరెస్టు చేయవద్దని ఏసీబీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. డిసెంబర్ 31 వరకు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించింది. ఫార్ములా–ఈ కార్ రేసింగ్ కోసం విదేశీ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా డబ్బు చెల్లించారని మున్సిపల్ శాఖ


మిగతా 12వ పేజీలో ▶

రేపటి నుంచి ఈడీ విచారణ

- 2న ఈడీ ముందుకు హెచ్‌ఎండీఏ మాజీ సీఈ బీఎల్‌ఎన్‌రెడ్డి
- 3న ఐఏఎస్ అర్వింద్‌కుమార్, 7న మాజీ మంత్రి కేటీఆర్

12లో

కిక్కుతో వీడ్కోలు!



కొత్త సంవత్సర వేడుకలకు భారీగా మద్యం అమ్మకాలు

ఆరు రోజుల్లో డిపోల నుంచి షాపులకు రూ.1,220 కోట్ల మందు

సోమవారం ఒక్కరోజే రూ.402 కోట్ల మేరకు..

సాధారణ రోజుల్లో విక్రయాలు రూ.117 కోట్ల వరకే

సాక్షి, హైదరాబాద్: కొత్త సంవత్సరానికి మందుబాబులు ఘన స్వాగతం పలికారు. డిసెంబర్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా రూ.3,523 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరగ్గా, చివరి ఆరు రోజుల్లోనే రూ.1,220 కోట్ల మద్యం అమ్ముడుపోయింది. అంటే నెల మొత్తంలో విక్రయించిన దాంట్లో చివరి ఆరు రోజుల్లో దాదాపు 40 శాతానికి పైగా అమ్మకాలు జరిగాయి. దీన్ని బట్టి 2024 సంవత్సరానికి మందుబాబులు మంచి కిక్కుతో వీడ్కోలు పలికినట్లు అర్థమవుతోంది. ఎక్సైజ్ గణాంకాల ప్రకారం ఒక్క సోమవారమే (డిసెంబర్ 30) రికార్డు స్థాయిలో 7.7 లక్షలకు పైగా కేసుల మద్యం, బీర్లు డిపోల నుంచి షాపులకు వెళ్లాయి. ఆ మద్యం విలువ రూ. 402 కోట్ల పైమాటే. ఈ ఏడాది డిసెంబర్ నెలలో

మిగతా 3వ పేజీలో ▶

2023 డిసెంబర్ కంటే ఈ డిసెంబర్‌లో రూ.624 కోట్లు తగ్గుదల

హైదరాబాద్ వేదికగా గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్



- జనవరి 3 నుంచి 5 వరకు మూడు రోజులపాటు నిర్వహణ
- హాజరు కానున్న తెలుగు రాష్ట్రాల సీఎంలు, సినీ నటుడు చిరంజీవి
- స్టార్టప్‌లకు ఇదొక ప్లాట్‌ఫాం: 'ఆప్టా' అధ్యక్షుడు సుబ్బు

3లో

ఆటో దిగ్గజాల జత సక్సెస్ మంత్ర?



- తాజాగా జట్టు కట్టిన హోండా, నిస్సాన్
- చైనా పోటీకి చెక్ పెట్టే ప్రణాళికలు.. 9 ఏళ్ల తదుపరి విడిపోయిన డైమ్లర్ క్రిస్లర్
- 2008 సంక్షోభంతో టాటాల చేతికి జేఎల్‌ఆర్

15లో

బిజినెస్‌మెన్.. బీ అలర్ట్!

బీఈసీతో వ్యాపార సంస్థలపై సైబర్ నేరగాళ్ల పంజా

హ్యాకింగ్ ద్వారా వ్యాపారుల సర్వర్లలోకి చొరబాటు

కీలక సూచనలు చేసిన పోలీసులు



నూతన సంవత్సర శుభాకాంక్షల 'సైబర్ వల'

లింకులపై క్లిక్ చేయవద్దని హైదరాబాద్ పోలీసుల సూచన

16లో






A quality product from
PAN BAHAR
PAN BAHAR
ది హెరిటేజ్ ఇలాచి
విజయానికి గుర్తింపు
Happy New Year
NEW PACK
PAN BAHAR
THE HERITAGE ELAICHI
TOLL FREE NO.: 1800 257 2258
www.panbahar.in

అడ్వాన్స్‌డ్ తర్వాతే కౌన్సెలింగ్ షెడ్యూల్

జేఈఈ పరీక్షపై జోసా నిర్ణయం..

కౌన్సెలింగ్ రౌండ్లు తగ్గించే యోచన

అడ్వాన్స్‌డ్ పరీక్ష కాస్త సరళతరం..

అడ్మిట్ కార్డులకు సరికొత్త సాఫ్ట్‌వేర్

సాక్షి, హైదరాబాద్

➤ జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష పూర్తయిన తర్వాతే ఈసారి కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేయాలని జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) నిర్ణయించింది. అన్ని రాష్ట్రాల్లో స్థానిక కౌన్సెలింగ్ ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. జోసా కౌన్సెలింగ్ సాధారణంగా ఆరు రౌండ్ల వరకూ ఉంటుంది. అయితే 2025లో దీన్ని కుదించే ఆలోచన చేస్తున్నారు. నాలుగు రౌండ్లలోనే పూర్తి చేయడంపై కసరత్తు చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఎక్కువ దశల కౌన్సెలింగ్ వల్ల కూడా విద్యార్థులు ఆప్షన్ల ఎంపిక, అంతర్గత స్లైడింగ్ విధానంలో ఇబ్బంది పడుతున్నట్టు గత రెండేళ్ళుగా ఫిర్యాదులు వస్తున్నాయి. ఇక అడ్వాన్స్‌డ్ పరీక్ష విధానాన్ని కూడా కొంత సరళీకరించాలనే యోచనలో ఉన్నారు. అత్యంత కఠినం, కఠినం, సాధారణ ప్రశ్నల్లో.. అత్యంత కఠినం స్థాయిని కొంతమేర తగ్గించాలని భావిస్తున్నారు.



సర్వర్ సమస్యకు చెక్

➤ జేఈఈ మెయిన్స్ తొలి దశ జనవరి 22 నుంచి 31 వరకు, రెండో దశ ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు జరుగుతుంది. దేశవ్యాప్తంగా దాదాపు 12 లక్షల మంది ఈ పరీక్ష రాస్తారు. తెలుగు రాష్ట్రాల నుంచి 2 లక్షల మంది మెయిన్స్‌కు హాజరవుతారు. అయితే ఏటా ఎక్కడో ఒకచోట అడ్మిట్ కార్డులు సరిగా డౌన్‌లోడ్ అవ్వడం లేదు. దీనికి సర్వర్ సమస్య కారణమని గుర్తించడంతో, ఈసారి కొత్త సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానం చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. మెయిన్స్‌లో మెరిట్ సాధించిన విద్యార్థుల్లో 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తారు.


రాష్ట్రంలో 13 కేంద్రాల్లో పరీక్ష

➤ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాష్ట్రంలో 13 ప్రాంతాల్లో జరుగుతుంది. విద్యార్థుల సంఖ్యను బట్టి కేంద్రాలను ఎంపిక చేసినట్టు అధికారులు తెలిపారు. ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, సత్తుపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్ కేంద్రాలను ఎంపిక చేశారు. ఏపీలో కూడా పలు కేంద్రాల్లో పరీక్ష జరుగుతుంది. ఆయా కేంద్రాలను జనవరిలో కాన్పూర్ ఐఐటీ అధికారులు పరిశీలిస్తారు. మే 18న అడ్వాన్స్‌డ్ పరీక్ష పూర్తయిన తర్వాత 22న అభ్యర్థుల ఓఎంఆర్ పత్రాలు వెబ్‌లో ఉంచుతారు. 26వ తేదీన ప్రాథమిక కీ విడుదల చేస్తారు. 26–27 వరకు ఈ కీపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. జూన్ 8న ఫలితాలు వెల్లడిస్తారు. ఈ నేపథ్యంలో మే 25లోగా జోసా కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. జోసా కౌన్సెలింగ్ చివరి రౌండ్‌ను బట్టి రాష్ట్రంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ చివరి రౌండ్ ఉంటుంది.

గ్రామీణ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామీణ నిరుద్యోగ యువతీయువకులకు హాస్టల్, భోజనంతో కూడిన ఉచిత శిక్షణ.. అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన దిశగా స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ చర్యలు చేపడుతోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని ఈ సంస్థ ద్వారా ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణా కార్యక్రమాలకు అర్హత, ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. బీకాం పాసైన వారికి మూడున్నర నెలల అకౌంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ), ఇంటర్ పాసైన వారికి మూడున్నర నెలలపాటు బేసిక్ కంప్యూటర్స్ (డేటాఎంట్రీ ఆపరేటర్), ఇంటర్ అర్హతతో మూడున్నర నెలల కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్, పదో తరగతి పాసైన వారికి మూడున్నర నెలల ఆటోమొబైల్–టూవీలర్ సర్వీసింగ్, నాలుగు నెలల సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, పది పాసైన/ఐటీఐ ఉత్తీర్ణులైనవారికి ప్రాధాన్యత కల్పిస్తూ ఐదునెలల ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్), నాలుగు నెలల సోలార్ సిస్టమ్ ఇన్‌స్టలేషన్, సర్వీస్‌లలో శిక్షణను ఇవ్వనున్నారు. వీరిలో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థిని, విద్యార్థులకు ప్రాధాన్యతనివ్వనున్నారు. గురువారం (జనవరి 2న) యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని జలాల్‌పూర్‌లోని ఈ సంస్థలో... గ్రామీణ యువతీయువకులు (18–30 ఏళ్ల మధ్యలోని వారు), తమ అర్హతల ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ సెట్‌తో, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డ్‌లతో హాజరుకావాల్సి ఉంటుంది. మంగళవారం ఈ మేరకు ఈ సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలను 9133908000, 9133908111, 9133908222, 9948466111 నంబర్ల ద్వారా తెలుసుకోవచ్చునని సూచించారు.



క్లుప్తంగా...

ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా మహ్మద్ అసదుల్లా

సాక్షి, హైదరాబాద్: ఉర్దూ అకాడమీ కొత్త డైరెక్టర్/సెక్రటరీగా మహ్మద్ అసదుల్లాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మైనార్టీ సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్న మహ్మద్ అసదుల్లాకు.. డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, మహ్మద్ అసదుల్లా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు తెలంగాణ ఉర్దూ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ వి.కృష్ణ, పీఎస్/సూపరింటెండెంట్ షేక్ ఇస్మాయిల్, సూపరింటెండెంట్ పి.అత్తావుల్లాఖాన్ స్వాగతం పలికి ఉర్దూ అకాడమీ పథకాలను వివరించారు.

విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు ఒప్పుకోం

జేఏసీ కన్వీనర్ రత్నాకర్ రావు

సాక్షి, హైదరాబాద్: దేశంలో విద్యుత్ రంగ ప్రైవేటీకరణకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను అంగీకరించమని, తీవ్రంగా అడ్డుకుంటామని పవర్ ఎంప్లాయీస్ జేఏసీ కన్వీనర్ పి.రత్నాకర్‌రావు అన్నారు. నేషనల్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజనీర్స్ పిలుపు మేరకు మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో.. తెలంగాణ జెన్‌కో ఈఆర్‌పీ భవనం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రత్నాకర్ రావు మాట్లాడుతూ.. యూపీ, రాజస్తాన్, చండీగఢ్ రాష్ట్రాల విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆ మూడు రాష్ట్రాల్లోని 27లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు బీసీ రెడ్డి, ఈశ్వరయ్య గౌడ్, సదానందం, మనోరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి

టీఎస్ యూటీఎఫ్



సాక్షి, హైదరాబాద్: విద్యారంగానికి బడ్జెట్‌లో 15% నిధులు కేటాయించాలని, పాఠశాలల బలోపేతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నూతన అధ్యక్షుడు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్ డిమాండ్ చేశారు. సంఘం నూతన క్యాలెండర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ, డిసెంబర్ 28, 29, 30 తేదీల్లో నల్లగొండ పట్టణంలో 3 రోజులపాటు రాష్ట్ర 6వ మహాసభలు జరిగాయని, నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. ఉపాధ్యక్షులుగా కె.జంగయ్య, సీహెచ్ దుర్గా భవాని, కోశాధికారిగా టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు ఏడుగురితో రాష్ట్ర ఆడిట్ కమిటీ, కుటుంబ సంక్షేమ నిధి (ఎఫ్‌డబ్ల్యూఎఫ్) చైర్మన్‌గా ఎం.రాజశేఖర్‌రెడ్డి, సెక్రెటరీగా జి.వి.నాగ మల్లేశ్వరరావు, కోశాధికారిగా వై.సైదులు మరో 18 మంది ఎన్నికైనట్టు తెలిపారు.

డాక్టర్ 'గూగుల్'!

తలనొప్పి నుంచి పెద్దజబ్బుల దాకా సోషల్ మీడియాలో శోధన..

సామాజిక మాధ్యమాల్లో వర్టిగోపై అత్యధిక శోధన

ఆన్‌లైన్ వైద్య పరిష్కారాలు మంచిది కాదంటున్న వైద్యులు

నిర్లక్ష్యంలో చాలా 'స్మార్ట్'

నత్తనడకన స్మార్ట్‌సిటీ పనులు

ఇప్పటికే రెండుసార్లు గడువు పొడిగించిన కేంద్రం

వివరాలు సాక్షి ప్లస్(ఈ-పేపర్)లో

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు 'కార్పొరేట్' లుక్

- సీఎస్ఆర్ నిధులతో శాశ్వత భవనాలు, పునర్వ్యవస్థీకరణ
- తొలిదశలో 4 జిల్లాల్లో నిర్మాణం... గచ్చిబౌలిలో మోడల్ ఆఫీస్
- సేవ, వసతులే ప్రధానాంశాలుగా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు
- స్టాంపులు, రిజిస్ట్రేషన్ల సమీక్షలో రెవెన్యూ మంత్రి పొంగులేటి



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు మెరుగైన సేవలతోపాటు వారికి అవసరమైన వసతులు కల్పించడమే ధ్యేయంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యకలాపాలు ఉండాలని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ప్రజలు చెట్ల కింద నిరీక్షించే పరిస్థితిని నివారించేలా ప్రస్తుతమున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించడంతోపాటు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) నిధులతో అత్యాధునిక హంగులతో శాశ్వత భవనాలు నిర్మిస్తామన్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డితో కలిసి మంగళవారం ఆయన రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లతో సమీక్ష నిర్వహించారు.

తొలుత పటాన్‌చెరు, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్, ఫోర్త్‌సిటీలో నిర్మాణం

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల శాశ్వత భవనాల కోసం స్థలాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. దశలవారీగా ఈ నిర్మాణాలు ఉంటాయని, తొలిదశలో పటాన్‌చెరు, సంగారెడ్డి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్‌తోపాటు రంగారెడ్డి జిల్లా కందుకూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఫోర్త్ సిటీ లో నిర్మిస్తామని చెప్పారు. గండిపేట, శేరిలింగంపల్లి, రంగా రెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలను కలిపి గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) కార్యాలయంలో సమీకృత సబ్‌రిజిస్ట్రార్ నమూనా కార్యాలయాన్ని నిర్మిస్తామని వివరించారు. ఈ నెలలో శంకుస్థాపనలు చేస్తామని చెప్పారు. హైదరాబాద్ జిల్లాలోని బంజారాహిల్స్, ఎస్ఆర్‌నగర్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను షేక్‌పేటలో నిర్మించాలని నిర్ణయించామన్నారు.

వెయిటింగ్ హాల్, విశాల పార్కింగ్ సదుపాయాలతో..

మొదటి దశలో నిర్మించే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కనీసం 3 ఎకరాల్లో ఉంటాయని, 10–15 వేల చదరపు అడుగుల్లో కార్యాలయాల భవన నిర్మాణాలు చేపడతామని పొంగులేటి చెప్పారు. వెయిటింగ్ హాల్, తాగునీటి సదుపాయం, విశాల పార్కింగ్ వసతులుండేలా డిజైన్‌లు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వల్ల పనితీరు మెరుగుపడుతుందని, పర్యవేక్షణ సులభతరం అవుతుందని.. దస్త్రాల పరిశీలన వేగవంతం అవుతుందన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిని నిర్మూలించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడేలా తక్షణమే కార్యాచరణ రూపొందించాలని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ జ్యోతి బుద్ధప్రకాశ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ వేదికగా గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్

హాజరు కానున్న తెలుగు రాష్ట్రాల సీఎంలు, సినీనటుడు చిరంజీవి

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ వ్యాపారవేత్తల సదస్సు (ఆప్టా కేటలిస్ట్ గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్)కు భాగ్య నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. ప్రపంచస్థాయిలో రాణిస్తున్న తెలుగు రాష్ట్రాల వ్యాపారవేత్తలతో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు హైటెక్స్‌లో సదస్సు జరగనుంది. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఏపీ సీఎం చంద్రబాబు, ప్రముఖ సినీనటుడు చిరంజీవి, ఇతర ప్రముఖులు ఈ సదస్సుకు హాజరు కానున్నట్లు దీన్ని ఏర్పాటు చేస్తున్న అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్టా) అధ్యక్షుడు కోట సుబ్బు తెలిపారు. మంగళవారం స్థానిక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

3న ఏపీ సీఎం, 4న తెలంగాణ సీఎం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు జనవరి 3న, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 4న, ప్రముఖ నటుడు చిరంజీవి 5న సదస్సుకు హాజరు కానున్నారని కోట సుబ్బు వివరించారు. కొత్త ఆలోచనలు ఉన్నా ఆర్థిక సహకారం లేనివారికి.. ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టాలన్న మార్గదర్శనం తెలియని వారిని ఒకచోట కలిపి, వ్యాపార సూచనలు, సలహాలు అందించేందుకు ఈ కాన్ఫరెన్స్ ఉపయోగపడుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా స్టార్టప్‌లకు ఈ సదస్సు ఒక వేదికగా దోహదపడుతుందన్నారు. పది దేశాల నుంచి సుమారు వెయ్యి మంది వ్యాపార సంస్థల ప్రతినిధులు సదస్సుకు హాజరవుతారని పలువురు అసోసియేషన్ సభ్యులు వివరించారు. సుమారు రూ. 5 లక్షల కోట్ల విలువ ఉన్న వ్యాపార సంస్థలు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొంటాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 100కుపైగా స్టార్టప్ కంపెనీలు దరకాస్తు చేసుకున్నాయని తెలిపారు. 2016లో 100 మంది సభ్యులతో ఆప్టా బిజినెస్ ఫోరం ఏర్పాటు చేశామని.. ప్రస్తుతం ఆ సంఖ్య 800 మందికి చేరిందన్నారు. ఆప్టా 35 రకాల సేవా కార్యక్రమాలను చేపడుతోందని చెప్పారు. అమెరికా రావాలనుకునే వారికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తుందన్నారు. సమావేశంలో ఆప్టా బిజినెస్ ఫోరం ప్రతినిధులు రమేశ్, మధు, సాగర్, తేజ్ పాక్యాల, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రేపటి నుంచి టీజీ టెట్

20వ తేదీ వరకు 20 సెషన్లుగా పరీక్షల నిర్వహణ


17 జిల్లాల్లో 92 సెంటర్లు ఏర్పాటు చేసిన పాఠశాల విద్య డైరెక్టరేట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీ టెట్)లు ఈ నెల 2 (గురువారం) నుంచి 20వ తేదీ వరకు విడతలవారీగా జరగనున్నాయి. కంప్యూటర్ ఆధారితంగా జరిగే ఈ పరీక్షలను మొత్తం 10 రోజులపాటు 20 సెషన్స్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి 11:30 గంటల వరకు ఒక సెషన్.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4:30 గంటల వరకు రెండో సెషన్ జరగనుంది. ఇందుకోసం 17 జిల్లాల్లో 92 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పాఠశాల విద్య డైరెక్టరేట్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. పేపర్–1కు 94,327 మంది, పేపర్–2కు 1,81,426 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలు సజావుగా సాగేలా ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పాఠశాల విద్య కమిషనర్ ఇ.నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఉదయం సెషన్ పరీక్ష రాసే అభ్యర్థులు ఉదయం 7:30 గంటలకల్లా, మధ్యాహ్నం సెషన్ అభ్యర్థులు మధ్యాహ్నం 12:30 గంటలకల్లా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులను ఉదయం 8:30 తర్వాత, మధ్యాహ్నం 1:30 తర్వాత పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. టెట్‌పై సందేహాలకు 7032901383, 9000756178, 7075028882, 7075028885 నంబర్లకు సంప్రదించొచ్చని సూచించారు.

కిక్కుతో వీడ్కోలు..

▶ మొదటి పేజీ తరువాయి

సగటున రోజుకు రూ.117 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరగ్గా.. సోమవారం నాలుగింతలు అమ్ముడయిందని గణాంకాలు చెబుతున్నాయి. అంతకుముందు ఆదివారం(డిసెంబర్ 29) కూడా మద్యం డిపోలు తెరిచే ఉంచారు. బ్యాంకులు లేకపోయినా వైన్‌షాపుల యజమానులు తీసుకున్న పాత డీడీలతో రూ.50 కోట్లకు పైగా విలువైన మద్యాన్ని డిపోల నుంచి తీసుకెళ్లారు. ఇక, గత 6 రోజుల విక్రయ గణాంకాలు 2023 సంవత్సరం డిసెంబర్‌లోని చివరి 6 రోజులతో పోలిస్తే దాదాపు ఒకే స్థాయిలో ఉన్నాయి. డిసెంబర్ మొత్తంతో పోలిస్తే మాత్రం 2023 కంటే ఈసారి లిక్కర్ అమ్మకాలు భారీగా పడిపోవడం గమనార్హం. 2023, డిసెంబర్‌లో రూ.4,147.18 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోగా, డిసెంబర్‌లో రూ.3,523 కోట్లకే పరిమితమైంది.



ఇక 'పాంప్' ద్వారా ఆలయ బంగారం కరిగింపు


హైదరాబాద్ మింట్ తప్పుకోవడంతో ఎంఎంటీసీ ద్వారా కొత్త ఒప్పందం

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో 825 కిలోల బంగారు నిల్వలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని దేవాలయాల్లో భక్తులు కానుకలుగా సమర్పించే బంగారాన్ని కరిగించే బాధ్యతను స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ బులియన్ రిఫైనరీ 'పాంప్'పొందింది. గతంలో హైదరాబాద్ మింట్ ఆధ్వర్యంలో బంగారాన్ని కరిగించి 24 క్యారెట్ల బిస్కెట్లుగా మార్చే పద్ధతి ఉండగా ఆ బాధ్యత నుంచి హైదరాబాద్ మింట్ తప్పుకుంది. ముందస్తు ఆర్డర్ ద్వారా ముంబైలోని మింట్‌లో కరిగించుకోవాలని సూచించింది. అయితే అంతదూరం బంగారాన్ని తరలించడం క్షేమం కాకపోవడంతో దేవాదాయ శాఖ ఆ బాధ్యతను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన మినరల్స్ అండ్ మెటల్స్ ట్రేడింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఎంటీసీ)కు అప్పగించింది. ఆ సంస్థ స్విట్జర్లాండ్‌కు చెందిన 'పాంప్'తో అధికారిక ఒప్పందంలో ఉండటంతో దేవుడి బంగారాన్ని కరిగించే పని 'పాంప్'కు చేరింది.

825 కిలోల బంగారు నిల్వలు..

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయశాఖ అధీనంలోని దేవాలయాల్లో 825 కిలోల బంగారం, 38 వేల కిలోల వెండి నిల్వలు ఉన్నాయి. అయితే అవన్నీ దేవతామూర్తుల అలంకరణ, వాడకానికి వీల్లేని ముక్కల రూపంలో ఉన్నాయి. చాలా దేవాలయాల్లో మూలమూర్తులు, ద్వారబంధాలకు వెండి తాపడం చేయిస్తున్నారు. ఆయా పనులకు అప్పటికప్పుడు భక్తులు కొంతమొత్తం విరాళంగా ఇస్తుండగా, మిగతాది దేవాలయం అధీనంలోని నిల్వ నుంచి వాడుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి వెండి నిల్వలు భారీగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. బంగారం ధర పెరిగిన నేపథ్యంలో కొందరు భక్తులు స్వర్ణం బదులు వెండిని కానుకలుగా సమర్పిస్తుండటమే కారణం.





వ్యక్తులు, పరిస్థితులతో నిరాశ చెందవద్దు.
మీ ప్రతిస్పందన లేకపోతే ఏవైనా శక్తిహీనమే!
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 1 జనవరి 2025

అభివృద్ధా? అంతరమా?

సాధారణంగా కనిపించే లెక్కలు అసాధారణమైన అనేక అంశాలను మనకు పట్టి ఇస్తాయి. మన దేశ ప్రజలు దేని మీద ఎంత ఖర్చు చేస్తున్నారు లాంటి లెక్కలు చూసినప్పుడు సమాజంలో వచ్చిన అనేక మార్పులు కళ్ళకు కడతాయి. అతి విస్తృత స్థాయిలో దాదాపు 2.61 లక్షల గృహాలను సర్వే చేసి సేకరించిన సమాచారంతో గణాంకాలంటే ఇక వేరే చెప్పేది ఏముంది! ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గృహ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్) అందుకు ప్రత్యక్ష ఉదాహరణ. 2023 ఆగస్ట్ నుంచి 2024 జూలై మధ్య ప్రజల వినియోగాన్ని ఈ తాజా సర్వే ఫలితాలు తెలియజేస్తున్నాయి. సర్వసాధారణంగా అయిదేళ్ళకోసారి జరిపే ఈ సర్వేను వరుసగా గత ఏడాది, ఈ సంవత్సరం కూడా నిర్వహించడం విశేషమే. ప్రజా క్షేమం కోసం ప్రభుత్వం చేపట్టాల్సిన పథకాలు, అనుసరించాల్సిన విధానాలకు ఇలాంటి సర్వే ఫలితాలు దిక్సూచి. అలాగని వాస్తవాల సమగ్ర స్వరూపాన్ని ఇవి ప్రతిబింబిస్తాయని అనుకోలేం. అనేక ఇతర అంశాలు ఈ గృహవినియోగ వ్యయం లెక్కలను ప్రభావితం చేస్తాయన్న సంగతి విస్మరించి, వీటిని బట్టి జనజీవన ప్రమాణాల స్థాయిని నిర్ధారిస్తే అది సరికాదు. వేతనాలతో సహా అనేక ఇతర అంశాలపై సమాచారంతోనూ బేరీజు వేసుకోవాలి.

2023–24కి గాను కేంద్ర గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వ శాఖ గత వారం విడుదల చేసిన ఈ హెచ్‌సీఈఎస్ సర్వే అనేక అంశాలను విశ్లేషకుల దృష్టికి తెచ్చింది. దేశ ఆర్థిక రంగంలో వినియోగదారుల డిమాండ్ ఏ మేరకుంది, మరీ ముఖ్యంగా మహానగరాల్లో ఎలా ఉంది, దాన్నిబట్టి మన ఆర్థిక వ్యవస్థ ప్రస్థానాన్ని ఎలా అంచనా వేయాలనే దానిపై కొంతకాలంగా అనేక సందేహాలు, ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజా హెచ్‌సీఈఎస్ సర్వే ఫలితాల పట్ల అందరిలో ఆసక్తి నెలకొంది. నిజానికి, దాదాపు 11 ఏళ్ళ విరామం తర్వాత గడచిన రెండేళ్ళుగా ఈ సర్వేలు వెలువడడం విశేషం. గడచిన ఏడాదితో పోలిస్తే 2023–24లో ఆహారపదార్థాలపై జనం వెచ్చించే మొత్తం పెరిగినట్టుగా తాజా సర్వేలోని గణాంకాలు చెబుతున్నాయి. గ్రామీణ కుటుంబాలు చేసే మొత్తం ఖర్చులో సైతం... తిండికి వెచ్చించేది మునుపు 2022–23లో 46.4 శాతం ఉండేది. ఇప్పుడు 2023–24లో అది 47.04కి పెరిగింది. పట్టణప్రాంత నివాసాల్లోనూ ఇలాంటి పరిస్థితే. ఆహారంపై జనం ఎక్కువ వ్యయం చేస్తున్నా, ఇప్పటికీ ఇంటి బడ్జెట్‌లో ఆహారేతర అంశాలదే సింహభాగం.

ఆహారం మీద చేస్తున్న ఖర్చు ఏటేటా పెరుగుతున్నదన్నది మాత్రం స్పష్టం. అంత మాత్రం చేత ప్రజలందరి జీవన ప్రమాణాలు, పౌష్టికాహారం పట్ల శ్రద్ధ, ఆహార భద్రత అధికమయ్యాయని అనుకోలేం. ఆహార ద్రవ్యోల్బణం పెరగడంతో తిండిపై జనం చేయాల్సి వస్తున్న ఖర్చు కూడా అనివార్యంగా పెరిగిందన్నది విస్మరించలేం. ఇంకా చెప్పాలంటే, ఈ 2023–24లో గృహవినియోగ వ్యయం 8 – 9 శాతం దాకా పెరిగింది కానీ, అందుకు కూడా ద్రవ్యోల్బణమే ప్రధాన కారణం. దాన్ని గనక తీసేస్తే, అసలు సిసలు లెక్కల్లో వినియోగం ఏ మేరకు పెరిగిందన్నది తేలుతుంది. ఆ రకంగా చూస్తే, గృహవినియోగ వ్యయం కేవలం 3.5 శాతమే పెరిగిందట. ఆ పెరుగుదల కూడా 2024 ఆర్థిక సంవత్సరంలోని వాస్తవిక స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 8.2 శాతం కన్నా చాలా తక్కువ. అదీ విశ్లేషకులు తేలుస్తున్న మాట. అంటే, సర్వే గణాంకాలు పైకి ఏమి చెప్పినా, అసలు సిసలు వినియోగ వ్యయ వృద్ధి నత్తనడకనే సాగుతోందని అర్థం. దీనికీ మళ్ళీ కారణం – ద్రవ్యోల్బణం, అందులోనూ ఆహార ద్రవ్యోల్బణమే. ఈ సమస్యను సత్వరమే పరిష్కరించాలి.

సర్కారు సైతం ఈ సంగతి గ్రహించకపోలేదు. ఆహార సరఫరా వ్యవస్థలో లోపాలను సరిదిద్దేందుకు ప్రయత్నం కూడా చేసింది. ఆహార నిల్వలు, అలాగే కొన్ని ఆహార పదార్థాలు – కూరగాయల ఎగుమతులపై నిషేధం, వంట నూనెల లాంటి వాటిపై దిగుమతి సుంకాల తగ్గింపు తదితర చర్యలు చేపట్టింది. ఈ చర్యల వల్ల కొంత ఫలితం వచ్చింది. ఆహార ద్రవ్యోల్బణానికి ఒక మేర ముకుతాడు వేయగలిగారు. కానీ, ఇవన్నీ శాశ్వత పరిష్కారం చూపలేవు. ఇవాళ్టికీ మనం వ్యవసాయాధార దేశం కావడం, అందులోనూ మన వ్యవసాయమంతా ప్రధానంగా వర్షాధారమైనది కావడం ప్రధానమైన అవరోధం. ఇక, తాజా సర్వే ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో తలసరి నెలవారీ గృహ వినియోగ వ్యయం నిరుటి రూ. 3,773 నుంచి రూ. 4,122కు పెరిగింది. పట్టణాల్లో అది రూ. 6,459 నుంచి రూ. 6,996కు హెచ్చింది. ఖర్చు విషయంలో గ్రామీణ – పట్టణ ప్రాంతాల మధ్య అంతరం అంతకంతకూ వేగంగా తగ్గుతోందని ఈ సర్వే డేటా చెబుతోంది. పుష్కరకాలం క్రితం 2011–12లో ఆ వ్యత్యాసం 83.9 శాతం. నిరుడు అది 71.2 శాతం. ఇప్పుడు 69.7కు తగ్గాయని సర్వే మాట.

ఖర్చుల్లో అంతరాలు తగ్గినట్టు పైకి కనిపిస్తున్నా, అది వేతనంలో గణనీయమైన పెరుగుదల వల్ల వచ్చినవని చెప్పలేం. ఎందుకంటే, 2023–24తో ముగిసిన అయిదేళ్ళ కాలంలో గ్రామీణ వేతనాలు నామమాత్రంగా 5.2 శాతమే పెరిగాయి. పైగా, వాస్తవ వేతన వృద్ధి మైనస్ 0.4 శాతమే. అంటే, ఇవాళ్టికీ గ్రామీణ – పట్టణ, ధనిక – పేద అంతరాలు గణనీయంగానే ఉన్నాయన్నది నిష్ఠుర సత్యం. ఎక్కువగానే ఖర్చు పెడుతున్నారన్నది సర్వేల సారమైనా, చాలీచాలని జీతాలతో, బతుకు బండి ఈడుస్తున్న బడుగుల మాట ఏమిటి? అసలు ఖర్చే పెట్టలేని సగటు ప్రాణుల స్వరాలను ఈ సర్వేలు సరిగ్గా పట్టుకోగలుగుతున్నాయా? ఆ అసమానతలు తొలగించగలిగితేనే ప్రయోజనం. తొలగించడానికి తోడ్పడగలిగితేనే ఈ లెక్కలకు సార్థకత.

కాలాన్ని మంచి చేసుకోవాలి!

సందర్భం



డా॥ మృణాళిని

కాలం మనల్ని వెక్కిరిస్తూ ముందుకు పరిగెత్తుతూంటుంది. మనం దానితోపాటు నడవలేం. దాన్ని ఆపలేం. దాని వెంట పరిగెత్తనూలేం. చేయగలిగిందల్లా దాన్ని వీలైనంత 'మంచి' చేసుకోవడమే. అంటే దాన్ని సరిగ్గా వాడుకోవడమే. దాని వేగాన్ని తగ్గించలేక పోయినా దాని విలువను గుర్తించడం మన చేతుల్లోనే ఉందని తెలుసుకోవాలి.

'నాకు సమయం లేదు' అనీ, 'రోజులు గడిచిపోతున్నాయి. చాలా చెయ్యాలనుకున్నా. ఏమీ చెయ్యలేకపోయా' అనీ, 'ఉన్న సమయమంతా ఇంకొకళ్ల కోసమే అయిపోతోంది. ఇక నా కోసం ఏం చేసుకోడానికైనా టైం ఏదీ' అనీ, 'ఇల్లు, ఆఫీసు... ఈ రెండిటితోనే సరిపోతుంది. ఇంకేమీ చెయ్యలేను బాబూ'... ఇలాంటి మాటలు ఎంత తరచుగా వింటామో! ఈ మాటలు చాలా మంచి 'సాకులు'. అవి కఠోర వాస్తవాలని మనల్ని మనం మభ్యపెట్టుకోవచ్చుగానీ నిజానికి అవి మనం 'మనకు నచ్చిన పని చెయ్యకుండా, మనం చెయ్యాల్సిన పని చెయ్యకుండా' తప్పించుకోడానికి కల్పించుకునే సాకులే.

> ఎవరికైనా రోజులో ఉన్నవి ఇరవై నాలుగ్గంటలే. అయినా అనుకున్నంతగా, సామర్థ్యానికి తగినంతగా సాధించలేక పోతున్నాం. ఆ సంతృప్తిని సాధించే సమయం కూడా మన వద్ద ఉండటం లేదు. ఎందువల్ల? కాలాన్ని వాడుకోవడం చేత కాకపోవడం వల్ల; కాలం పట్ల భయమే తప్ప గౌరవం, ఇష్టం లేకపోవడం వల్ల.

కాలం అందరికీ ఒకటే. ఎవరికైనా రోజులో ఉన్నవి ఇరవై నాలుగ్గంటలే. కొందరు రోజుకు పది పనులు అవలీలగా చేసేస్తారు; మరికొందరు ఒకటిన్నర పనితో సరిపెట్టుకుంటారు. ఈ తేడాకు కారణం మరొకరిపై తోసేయడం సులువు. దానికి మనం ఎంతవరకు కారణమో ఆలోచించడం నేర్పు. ఇప్పటి ఆడవాళ్లకు అవసరమైంది ఈ నేర్పే. 'సులువు'లు చాలా ఏళ్లగానే వాడుకుంటున్నాం. ఇక మన నేర్పును చూపించే వేళ ఆసన్నమైంది.

కొంత వెనక్కి వెళ్లి చూస్తే– మనలో మంచి చిత్రకారిణి ఉంది; పాటగత్తె ఉంది; సమాజ సేవకురాలు ఉంది; రచయిత్రి ఉంది; నృత్యకారిణి వుంది; నాయకురాలు ఉంది; వ్యాపారవేత్త ఉంది; దానికి పదును పెట్టాలన్న కోరికా ఉంది. కానీ లేనిదల్లా ఆ పదును పెట్టడానికి సమయమే. ఎందుకంటే వీటితో పాటే 'నువ్వు ఏదైనా చెయ్యి కానీ నీ ఇంటి బాధ్యతలు పూర్తి చేశాకే' అని తర్జని చూపించే కుటుంబమూ ఉంది. 'ఆవిడ అంత పేరు తెచ్చుకుందంటే ఇల్లొదిలి తిరిగింది కాబట్టేగా' అని మూతి విరిచే సమాజమూ ఉంది. ఇప్పుడు ఆ కుటుంబాన్నీ, సమాజాన్నీ నోటితో కాకపోయినా నొసలుతో వెక్కిరించే చైతన్యం ఎంతో కొంత మనకు అబ్బింది. అయినా అనుకున్నంతగా, మన సామర్థ్యానికి తగినంతగా సాధించలేకపోతున్నాం. ప్రతి పనినీ 'వాయిదాలు' వేస్తాం. వాయిదా వేయడానికి కనిపించినన్ని కారణాలు, ఉపయోగించేంత తెలివి తేటలు, పని చెయ్యడానికే వెచ్చిస్తే ఎంత బాగుంటుంది! అలా కూర్చునీ, కూర్చునీ 'వయసైపోతోంది. ఏం సాధించాను ఈ జీవితంలో?' అని నిస్పృహగా ప్రశ్నించుకుంటున్నాం. 'నాలో ఎంతో ప్రతిభ ఉంది. ఏమీ ప్రతిభ లేని వాళ్లు ముందుకు వెళ్లిపోతున్నారు. నేనింకా వెనకబడే ఉన్నాను' అని వాపోతున్నాం. గుర్తింపు కోసం, అవార్డుల కోసం, కీర్తి ప్రతిష్ఠల కోసం, బిరుదుల కోసం తహతహలాడటం మానుకోలేకపోతున్నాం. మన మానసిక సంతృప్తి వల్ల లభించే 'విజయం' మరే వేదికల వల్లా రాదని గుర్తించలేకపోతున్నాం. ఆ సంతృప్తిని సాధించే సమయం కూడా మన వద్ద ఉండటం లేదు. ఎందువల్ల? కాలాన్ని వాడుకోవడం చేతకాకపోవడం వల్ల; కాలం పట్ల భయమే తప్ప గౌరవం, ఇష్టం లేకపోవడం వల్ల.

ఏం జరుగుతోందో అర్థమయ్యాక దాన్ని తట్టుకునేందుకూ లేదా అధిగమించేందుకూ ఏం చెయ్యాలో కూడా ఆలోచించాలి. మనం రోజులో ఎంత సమయం ఎలా వృథా చేస్తున్నామో తెలుసుకోవాలి. వంట చెయ్యడం, ఇంటి పనులు, పిల్లల పనులు చెయ్యడం కాదు వృథా చెయ్యడమంటే. సమయం వృథా చెయ్యడమంటే కాలాన్ని అగౌరవ పరచడం. అది ఎలా చేస్తున్నాం? ఇతరుల గురించి ఆలోచించడం; ఇతరుల పట్ల ఈర్ష్యను పెంచి పోషించడం; ఇతరుల జీవితాల్లో ఎన్ని లొసుగులున్నాయో వాకబు చెయ్యడం; మన గురించి ఇతరులు ఏమనుకుంటున్నారో సామాజిక మాధ్యమాల్లో వెతుక్కోవడం; మనల్ని ఎంతమంది మెచ్చుకుంటున్నారో తెలుసుకుని గంటల తరబడి ఆనందించడం; ఎంతమంది తిడుతున్నారో తెలుసుకుని కుంగిపోవడం; లేదా శాపనార్థాలు పెట్టుకోవడం; మనకిష్టం లేని వాళ్లను ఎలా భ్రష్టు పట్టించాలో పన్నాగాలు వేయడం; అస్మదీయులతో బృందాలను ఏర్పరచుకుని వారితో పేరంటాలు, పండగలు చేసు కోవడం; మనకు ఉత్తరోత్తరా పనికి వచ్చే వాళ్లతో స్నేహాల కోసం ప్రయత్నించడం; మనల్ని బాధపెట్టిన వాళ్ల గురించి, మనకు నచ్చని వాళ్ల గురించి గంటల తరబడి ఫోన్లలో సంభాషణలు చేయడం; మన బాధ ప్రపంచపు బాధ అనుకుని అందరికీ మన గోడు, మనకు జరిగిన అన్యాయాలనూ వినిపించుకోవడం; ఈ ప్రపంచానికి మనల్ని అవమానించడం మినహా మరో పని లేదనే భ్రమలో జీవించడం. ఇదంతా ఇప్పటి మధ్య వయస్కుల తరం కాలాన్ని గడిపే వైనం. మరి 'కాలం' బాధపడదూ? మనకు మేలు చెయ్యాలని ఉన్నా ఎందుకులే ఈ మొహాలకు అని మొహం చాటేయదూ? తాము పుట్టడమే ఈ లోకానికి మహోపకారమనుకునే అహంభావుల కోసం తనెందుకు ఆగాలని అనుకోదూ?

> సమయం వృథా చెయ్యడమంటే కాలాన్ని అగౌరవ పరచడం. అది ఎలా చేస్తున్నాం? ఇతరుల జీవితాల్లో ఎన్ని లొసుగులున్నాయో వాకబు చెయ్యడం; మన గురించి ఇతరులు ఏమనుకుంటున్నారో సామాజిక మాధ్యమాల్లో వెతుక్కోవడం; ఈ ప్రపంచానికి మనల్ని అవమానించడం మినహా మరో పని లేదనే భ్రమలో జీవించడం.

కనక, మన జీవితాలను బాగుపరచుకోడానికి గొప్ప అవకాశం ఇచ్చే అనంతమైన కాలాన్ని కొత్త సంవత్సరం నుంచి అయినా ఒక్క చిటికెడు, దోసెడు గౌరవిద్దాం.

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి, ఆచార్యులు

వెల్‌కమ్ న్యూ ఇయర్ – 2025



సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చేసుకోగలిగే తీర్మానాలు



2025 తీర్మానాలకు కొన్ని ఆలోచనలు: ఎక్కువ కదలండి, తక్కువ కూర్చోండి; పర్యావరణ హిత ఎంపికలను చేసుకోండి; చేతిరాత ఉత్తరాలు పంపండి; స్థిరంగా ఒక సమయానికి నిద్ర లేవండి; భోజన వేళల్ని స్థిరంగా ఉంచుకోండి; టీవీకి బదులుగా సంగీతం వినండి; ఒక్కటైనా చక్కగా వండటం నేర్చుకోండి; ఒక్క చెడు అలవాటును వదులుకోండి; శ్వాస మీద దృష్టి నిలపండి; మీలోని సృజనను వెలికితీయండి. ఇవన్నీ చేయగలిగేవే!

– ఎస్.వై. ఖురేషీ,
కేంద్ర మాజీ ఎన్నికల ప్రధాన అధికారి

2025 డిజిటల్ హెల్త్ ప్లాన్



1. మొబైల్ ఫోన్లను ఇంట్లో ఒక దగ్గర ఉంచి, కాల్స్‌కు మాత్రమే వాడండి; 2. నోటిఫికేషన్లను సైలెంట్‌లో పెట్టి, అత్యవసర విషయాలకు ఇతరులను కాల్ చేయమనండి; 3. గాఢనిద్ర కోసం పడకగదిలో వై–ఫై, గ్యాడ్జెట్స్ లేకుండా ఉంచుకోండి; 4. వ్యసనానికి గురిచేసే యాప్స్‌ను తొలగించి, అత్యవసరమైనవే ఇన్‌స్టాల్ చేసుకోండి; 5. మిమ్మల్ని శక్తిమంతులను చేసే కంటెంట్‌నే ఎంచుకోండి. మీ గ్యాడ్జెట్స్‌కు మీరే యజమానిగా ఉండండి. వాటికి బానిస కావొద్దు.

– బి.కె. శివాని, ఆధ్యాత్మిక బోధకురాలు

కొత్త ఆశలతో...



అల్పత్వం, అనిశ్చితి, ఒంటరితనాలను 2024లోనే వదిలేసి, సరికొత్త ఆశలతో 2025ను వేడుకగా మొదలుపెట్టండి.

– రుజుతా దివేకర్, న్యూట్రిషనిస్ట్

కొత్త చిట్కా



2025లో ఒక దేశ జీడీపీని పదింతలు చేసే కచ్చితమైన మార్గం ఏమిటంటే, వాట్సాప్‌లో 'గుడ్ మార్నింగ్' మెసేజుల మీద నామమాత్ర జీఎస్టీ వసూలు చేయడం.

– పర్మీందర్ సింగ్, గూగుల్ మాజీ సీఈఓ

మంచి సంబంధాల్లో...



అనారోగ్యకర సంబంధాల్లో, జనం తమ అవసరంలో మాత్రమే మిమ్మల్ని సంప్రదిస్తారు. మీ ప్రతిస్పందనను లావాదేవీగా చూడటం వల్ల మిమ్మల్ని వాడుకున్న భావన కలుగుతుంది. ఆరోగ్యకర సంబంధాల్లో మీరు గుర్తొచ్చినప్పుడు మిమ్మల్ని చేరుకుంటారు. వాళ్లు మీ సంబంధానికి విలువనిస్తూ సాయానికి సిద్ధంగా ఉంటారు.

– ఆడమ్ గ్రాంట్,
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

ఆశల భవిష్యత్తులోకి...

చూస్తూ చూస్తూ ఉండగానే మరో ఏడాది కాలగర్భంలో కలిసిపోయింది. కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నప్పుడల్లా, మనకు ఓ విధమైన నూతన అనుభూతి కలుగుతుంది. అనునిత్యం మార్పు చెందే ఈ కాల ప్రవాహంలో సంవత్సరాలు మారడం అనేది పెద్ద విశేషమేమీ కాదు. ఈ మార్పు ఒక చిన్న బిందువు లాంటిది. ఇది నిరాటంకంగా, ప్రతినిత్యం జరిగే సహజ ప్రక్రియ. మనం గోడకు నూతన సంవత్సర క్యాలెండరును వేలాడదీసే ముందు, ఎన్నో విషయాలు, గణాంకాలు మారిపోయిన సంగతి బోధపడుతుంది. అంటే ఈ నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టే ముందు, మనం గతాన్ని నెమరు వేసుకొని జాగృతం అయ్యే అవకాశం ఉందన్నమాట. భవిష్యత్ కలలను సాకారం చేసుకునే దిశగా అడుగులు ముందుకు వేయాలి. ఈ క్రమంలో గడిచిన కాలాన్ని మరింత దగ్గరగా, నిశితంగా పరిశీలించడం వల్ల ఇక ముందు మనం ఏం చేయాలో, ఏం చేయకూడదో ఒక స్పష్టత వస్తుంది. మారుతున్న కాలం మన జీవితాలు సరైన పంథాలో పయనించడానికి తోడ్పడుతుంది. జీవితంలో సంభవించిన ఆసక్తికరమైన అంశాలతో పాటు, మనపై ప్రభావం చూపిన అంశాలను కూడా ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకోవాలి. వాటిని అవలోకనం చేసుకోవాలి.

జీవితం చాలా చిన్నది. ఎవరి జీవితం ఎప్పుడు సమాప్త మవుతుందో ఎవరికీ తెలియదు. కనుక ఆనంద సమయమని హద్దుల్ని అతిక్రమించకుండా విలువలతో గడపడానికి శాయశక్తులా ప్రయత్నించాలి. సమాజ హితం కోసం సమయాన్ని వెచ్చించాలి. కాలాన్ని వినియోగం చేసుకోవడం పైనే సాఫల్య వైఫల్యాలు ఆధారపడి ఉన్నాయన్న వాస్తవాన్ని గ్రహించాలి. దైవం అందరి జీవితాల్లో నిండు వసంతం పండించాలని మనసారా కోరుకుందాం!

– ఎం.డి. ఉస్మాన్ ఖాన్

కాలచక్రం



రెండు చక్రాలు
దూరం భారం మోసినట్టు
రెండు ముళ్ళు
అనంత కాలాంబుధి ఈదుతాయి
సజీవ హృదయాలపై
భూత భవిష్యత్ వర్తమానాలు
ప్రదర్శించే చలనమే కాలచక్రం
అంతం లేని కాలంలో
ఏ ఒక్క మజిలీలో
నిరాశతో మనిషి ఆగడు
ఆశల శ్వాసలు ఆశయాల ఘోషలు
మళ్ళీ మూటలు కట్టుకొని
లెక్కలు బేరీజు వేసుకొని
రేపటి మజిలీకి ఉవ్విళ్లూరతాడు
నిన్న మొన్నకి నేడు నిన్నకిలానే
రేపు నేటికి...
రేపన్న ఆశే మనిషి శ్వాస
వచ్చే కాలాన్ని పోయే కాలం
దైవంలా భావిస్తుంది అందుకే!
గతం నుండి నేర్చుకుంటూ
వర్తమానంలో జీవిస్తూ
భవిత దిద్దుకోడమే ప్రగతి లక్షణం!

– భీమవరపు పురుషోత్తమ్

విస్మృత చరిత్రపై వెలుగు రేకలు

చరిత్రను మట్టితో కప్పేస్తే అది పుడమిని చీల్చుకుంటూ ఏదో ఒక రోజు బహిర్గతమవుతుంది. అందుకు మంచి ఉదాహరణ భీమా కోరేగావ్ యుద్ధ చరిత్ర. మహారాష్ట్రలోని ప్రస్తుత పుణే జిల్లాలో భీమా నది ఒడ్డున ఉన్న ఒక చిన్న గ్రామం భీమా కోరేగావ్. 1818 జనవరి1న అక్కడ ఓ యుద్ధం జరిగింది. మరాఠా సమాఖ్యలోని పీష్వా వర్గానికీ, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకీ మధ్య జరిగిన యుద్ధాన్ని స్వాతంత్ర పోరాటంగా చిత్రీకరిస్తూ అసలైన చరితను మరుగున పరిచే కుట్రలు జరిగాయి. అసలేం జరిగిందంటే...



బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ నాయకత్వంలో 500 మంది మహర్ సైనికులు, 250 మంది అశ్వికదళం, 24 గన్నర్లతో బెటాలియన్ తరలి వెళ్తున్న సమయంలో 'కోరేగావ్' గ్రామంలో (పుణేకు 30 కిమీ) 20,000 పదాతి దళం, 8,000 మంది అశ్విక దళంతో కూడిన పీష్వాల సైన్యం అనుకోకుండా ఎదురైంది. దాదాపు 50 రెట్లు అధికంగా ఉన్న శత్రు సైన్యాన్ని చూసినా భయపడకుండా, ముందుకు దూకింది మహర్ సైన్యం. మధ్యాహ్నానికి తమ వెంట వచ్చిన అశ్విక దళం, గన్నర్లతో పాటు ఆహారం మోసుకొచ్చేవారూ పారిపోయినా మహర్లు వెనకడుగు వేయకుండా పోరాడ సాగారు. ఒకానొక దశలో ఇక ఓటమి తప్పదని భయపడిపోయిన కెప్టెన్ స్టాటన్ యుద్ధం ముగిసిందని ప్రకటించి తన సేనను లొంగిపొమ్మని ఆజ్ఞాపించాడు. అప్పుడు మహర్ సైన్యం నాయకుడు శికనాగ్ యుద్ధాన్ని విరమించడానికి నిరాకరించాడు. వందల సంవత్సరాలుగా తమని బానిసలుగా మార్చి పశువులకన్నా హీనంగా చూస్తున్న బ్రాహ్మణ ఆధిపత్యంపై బదులు తీర్చుకోవడానికి ఇదే అవకాశం అని వాదించాడని అంటారు. మొత్తానికి కెప్టెన్ స్టాటన్ తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నాడు. ఆహారం, నీరు కూడా లేకుండా ఒక పగలు, ఒక రాత్రి జరిగిన భీకర యుద్ధంలో 500 మంది మహర్ సైనికులు 28,000 మంది పీష్వా సైన్యాన్ని ఊపిరి సలపనీయకుండా ఎదుర్కొన్నారు. మహర్ల ప్రతాపానికి, భీమా నది పీష్వా సైనికుల రక్తంతో ఎర్రగా మారిపోయింది. పీష్వా సైన్యాధ్యక్షుడి కొడుకు గోవింద్ బాబా తలను మొండెం నుండి వేరు చేసి బాపు గోఖలేకు పంపాడు శికనాగ్. దీంతో పీష్వా సైన్యం, పూల్గావ్ లోని బాజీరావు శిబిరం వైపు పరుగులు తీయ సాగారు. వారిని భీమా నది దాటేదాకా తరిమింది మహర్ సైన్యం.

చరిత్రలో ఈ ఘటనకు బ్రిటిష్ వారి ఆధిపత్యాన్ని సంపూర్ణం చేసిన ఆంగ్లో–మరాఠా యుద్ధంగా, అందులో పోరాడిన పీష్వాను స్వాతంత్ర్య సమరయోధునిగా చెబుతారు సంప్రదాయ చరిత్రకారులు. కానీ నిజానికి సమానత్వం కోసం, మానవ హక్కుల కోసం మహర్ సైనికులు చేసిన ఒక వీరోచిత యుద్ధం ఇది. ఈ చరిత్రకు సాక్ష్యంగా 1821లో కోరేగావ్ గ్రామంలో యుద్ధం జరిగిన ఆ ప్రాంతంలో 'విజయస్తూపం' ఏర్పాటు చేసింది బ్రిటిష్ ప్రభుత్వం. యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన 22 మంది మహర్ సైనికుల పేర్లను ఆ విజయ స్తూపంపై చెక్కించి ప్రతి సంవత్సరం వారికి నివాళి అర్పించేది. 'ఇది మహర్ పోరాట యోధుల చరిత్ర. యావత్ సమాజానికి స్ఫూర్తినిచ్చే పోరాట'మని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 1927 నుండీ చనిపోయేదాకా కూడా ప్రతి సంవత్సరం జనవరి 1న తప్పకుండా ఈ విజయ స్తూపాన్ని సందర్శించి నివాళులు అర్పించేవారు. బాబాసాహెబ్ తదనంతరం ఆయన ఆలోచనా విధానాన్ని కొనసాగించే బాధ్యత తీసుకున్న 'సమతా సైనిక్ దళ్'వారు ఇప్పటికీ ప్రతీ సంవత్సరం జనవరి 1వ తేదీన వేల సంఖ్యలో హాజరై నివాళులు అర్పిస్తూ చరిత్రను కాపాడుకుంటూ వస్తున్నారు. ఆ అసలైన చరిత్రను భావి తరాలకు అందజేద్దాం. అసమానతలు లేని సమ సమాజం వైపు పయనిద్దాం.

– ములక సురేష్, ఉపాధ్యాయుడు । 94413 27666

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

కాలపురుషుడి కానుక

ఏడు వందల కోట్ల పాత్రధారులతో, ఆరు ఖండాల మేర పరచుకొన్న విశాల రంగస్థలం మీద కాలం కలకాలమూ నడిపిస్తూ ఉండే జగన్నాటకంలో క్రీ.శ. 2024వ అంకం ముగిసింది. రెప్పపాటు వ్యవధిలో 2025వ అంకం ఆరంభమైపోయింది కూడా. పాత అంకంలో రసవంతమైన ఘట్టాలు ఓసారి నెమరు వేసుకొనే అవకాశం కూడా ఇవ్వకుండా, సూత్రధారుడు కొత్త అంకానికి తెర ఎత్తేశాడు.

ఓ రకంగా అదీ మంచిదే. మంచో, చెడో గతం గతః. అది కాల గర్భంలో కలిసిపోయింది. దానికి కృతజ్ఞతతో, సగౌరవంగా వీడ్కోలు పలికేసి, కావలసిన కార్యాల మీదా, ముందు జరగబోయే ముచ్చటల మీదా దృష్టి పెడితేనే మంచిది.



'2025 మంచి సంఖ్య. అందులో అంకెలు కూడితే తొమ్మిది వస్తుంది. తొమ్మిది అంటే 'అదృష్ట' సంఖ్య. పైగా 2025 అంటే, 45 అనే అద్భుతమైన సంఖ్యకు 'స్క్వేరు'. 45×45. ఇలాంటి సంవత్సరం ఈ శతాబ్దంలో మళ్లీ రాదు' అని మిత్రులు చెప్పిన మాటలు మననం చేసుకొంటూ వెళ్తుంటే, మార్గమధ్యంలో మహాకవి కనిపించి మందలించారు.

'2025లో రాబోయే శుభాశుభాలు అంకెల గారడీ వల్ల రావు. అవన్నీ నీ స్వయంకృతాలే. 365 పుటల ఖాళీ పుస్తకం కాలపురుషుడు నీకు మళ్ళీ కానుక చేశాడు. నువ్వు చెయ్యబోయే నిర్వాకాల చరిత్రే ఆ పుటల మీద నమోదవుతుంది. 2025 అద్భుతంగా ఉంటుందా, అధ్వాన్నంగా ఉంటుందా అన్నది వర్గమూలాల లెక్కల బట్టి ఉండదు. నీ జాతి సాధించే ఘనకార్యాల మీద ఆధారపడి ఉంటుంది!' అన్నాడు మహాకవి. ఉలిక్కిపడి, 'అయితే నేనేం చేయాలి?' అని అడిగాను.

'ఏం చేయకూడదో ముందు విను. **ఒట్టి మాటలు కట్టిపెట్టోయి/ గట్టి మేల్ తలపెట్ట వోయి! / వ్యర్థ కలహం పెంచబోకోయి / కత్తి వైరం కాల్చవోయి!'** అన్నాడు. ఆయన మాట్లాడితే, ఆకులందున అణగి మణగి కవిత కోకిల పాడినట్టుంది.

'ఏం చేయాలో కూడా విను. **పూని ఏదైనాను ఒక మేల్ / కూర్చి జనులకు చూపవోయి!/ఒరుల మేలుకు సంతసిస్తూ–ఐకమత్యం నేర్చవోయీ! /ఒకరి మేల్ తన మేలనెంచే నేర్పరికి మేల్ కొల్లలోయీ!/ స్వంత లాభం కొంత మానుకు పొరుగు వాడికి తోడు పడవోయీ!'** అన్నాడు.

అవును కదా? కొత్త సంవత్సరంలో అందరమూ ఈ నాలుగు ముక్కల మీదా కొంత శ్రద్ధ పెడితే, 2025 సంవత్సరం మధుర ఘట్టాల మయమై, చిరస్మరణీయమౌతుంది!

అందరికీ నూతన సంవత్సరంలో అన్ని శుభాలూ, సుఖాలూ కలగాలని ఆకాంక్ష. సర్వే భవంతు సుఖినః, సర్వే సంతు నిరామయాః!!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.విదియ రా.3.34 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.1.18 వరకు, తదుపరి శ్రవణం, **వర్జ్యం:** ఉ.9.15 నుండి 10.51 వరకు, తదుపరి తె.5.15 నుండి 6.47 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ఉ.11.44 నుండి 12.32 వరకు, **అమృతఘడియలు:** సా.6.41 నుండి 8.17 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.34, **సూర్యాస్తమయం:** 5.32.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

పామాయిల్ గెలల ధర పెంపు

టన్ను ధర రూ. 20,506

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం నూతన సంవత్సర కానుకను ప్రకటించింది. టన్ను పామాయిల్ గెలల ధరను రూ. 20,506 వద్ద స్థిరీకరించినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించారు. పెరిగిన ధరలు జనవరి 1వ తేదీ నుంచే అమల్లోకి వస్తాయని ఒక ప్రకటనలో తెలిపారు. కాగా టన్ను పామాయిల్ గెలల ధర గత నెలలో రూ.20,413 ఉండగా, దానికి రూ.93 పెంచి స్థిరీకరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, సన్న ధాన్యానికి రూ.500 బోనస్ వంటి సంక్షేమ పథకాలతో తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం తనవంతు మేలు చేస్తోందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

కేసీఆర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు శుభాకాంక్షలు తెలిపారు. 2025 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని, సుఖశాంతులతో జీవించాలని కేసీఆర్ ఆకాంక్షించారు. కాల ప్రవాహంలో ఎదురొచ్చే మంచిచెడులను, కష్టసుఖాలను సమానంగా స్వీకరించే స్థితప్రజ్ఞతను అలవర్చుకుంటూ ఆశావహ దృక్పథంతో తమ జీవితాలను చక్కదిద్దుకోవాలని అన్నారు.

ఆనందాలు వెల్లివిరియాలి

వైఎస్ జగన్ శుభాకాంక్షలు



సాక్షి,అమరావతి: తెలుగు ప్రజలకు మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో ఇంటింటా ఆనందాలు, ప్రతి కుటుంబంలో అభివృద్ధి కాంతులు వెల్లివిరియాలని, ప్రజలకు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్క కుటుంబంలో ప్రతి ఒక్కరికీ దైవానుగ్రహం సంపూర్ణంగా లభించాలని వైఎస్ జగన్ మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

అంతులేని ఐశ్వర్యాలివ్వాలి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు కొత్త సంవత్సరం అంతులేని ఐశ్వర్యాలు, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యం కలగాలని, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఇంటా సంక్షేమ సిరులు కురవాలని కోరుకుంటున్నట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా తెలంగాణ ప్రజలకు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలంగాణ ప్రగతికి కట్టుబడ్డాం: కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. 2025 సంవత్సరంలో ప్రజలకు మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

ఏడాదిలో తెలంగాణకు ఏం ఒరగలేదు: బండి



సాక్షి, హైదరాబాద్: ఏడాది కాలంలో తెలంగాణ ఏం చూసిందని? 12 నెలల ప్రత్యక్ష నరకం తప్ప.. అని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. జనవరి నుంచి డిసెంబర్ దాకా 12 నెలల్లో రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలు, ప్రభుత్వ వైఫల్యాలను ఉటంకిస్తూ ఆయన మంగళవారం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

పోలవరం అనుమతీ చెల్లదు!

పోలవరంపై టీఏసీ భేటీకి మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ను కూడా పిలవలేదు

- తెలంగాణ ప్రాజెక్టులపై టీఏసీ భేటీకి తమను పిలవలేదన్న ఏపీ వాదనకు తెలంగాణ కౌంటర్
- గోదావరి జలాల పంపిణీకి ట్రిబ్యునల్ అవసరం లేదని స్పష్టీకరణ
- అనుమతి లేని ప్రాజెక్టులకు నీటి హక్కుల కోసమే ఏపీ వాదన అని ఆరోపణ
- గోదావరి బోర్డుకు లేఖ రాసిన తెలంగాణ ఇరిగేషన్ శాఖ ఈఎన్‌సీ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని సీతారామ- సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చే అంశంపై నిర్వహించనున్న టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ (టీఏసీ) సమావేశానికి తమను పిలవలేదని, సీడబ్ల్యూసీ అంతర్గతంగా తీసుకునే నిర్ణయాలకు తాము కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాదనను తెలంగాణ ప్రభుత్వం తిప్పికొట్టింది. అలా అయితే, గోదావరి పరీవాహక ప్రాంతంలోని మిగతా రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలను ఆహ్వానించకుండానే.. 2009లో టీఏసీ నిర్వహించి పోలవరం ప్రాజెక్టుకు ఇచ్చిన అనుమతులూ చెల్లుబాటు కావు అని స్పష్టం చేసింది. సీతారామ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీలోని టీఏసీ అనుమతులకు సిఫార్సు చేస్తూ గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశంలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ బోర్డుకు ఇటీవల ఏపీ లేఖ రాసింది. 'ప్రస్తుతం 2017 మార్గదర్శకాలు అమల్లో ఉండగా, 1996 మార్గదర్శకాల ప్రకారం తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులివ్వడం సరికాదు'అని అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏపీ అభ్యంతరాలను తోసిపుచ్చుతూ తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్ సోమవారం గోదావరి బోర్డుకు లేఖ రాశారు. 'పోలవరం ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ 2009, 2011లో అనుమతులను 1996 మార్గదర్శకాల ప్రకారమే ఇచ్చింది. వీటి ఆధారంగానే తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో వ్యవహరిస్తోంది'అని బదులిచ్చారు. న్యాయస్థానానికి వెళ్లక తప్పని పరిస్థితి కల్పించారని ఏపీ పేర్కొనగా, తప్పుడు ఉద్దేశాలతో కేసులేసినా నిలబడవని తెలంగాణ కౌంటర్ ఇచ్చింది.

గోదావరి ట్రిబ్యునల్ అవసరం లేదు

అంతర్‌రాష్ట్ర జలవివాదాల చట్టంలోని సెక్షన్ 3 కింద ఏపీ, తెలంగాణ మధ్య గోదావరి జలాల పంపకానికి ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని ఏపీ కోరగా, అది ఏమాత్రం అవసరం లేదని తెలంగాణ స్పష్టం చేసింది. తాము 531.908 టీఎంసీల గోదావరి జలాల వినియోగం కలిగి ఉన్నట్టు సీడబ్ల్యూసీ నిర్ణయించడం ఏకపక్షమన్న ఏపీ వాదనను కూడా తెలంగాణ తోసిపుచ్చింది. 'రాష్ట్ర విభజన ప్రక్రియలో భాగంగా ఉమ్మడి ఏపీకి ఉన్న 1,486 టీఎంసీల నీటి వాటా నుంచి తెలంగాణకు 967.94 టీఎంసీలు, ఏపీకి 518.215 టీఎంసీలను కేటాయిస్తూ ఉమ్మడి రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ 2014 జనవరి 2న రాష్ట్ర ప్రణాళిక సంఘం కార్యదర్శికి లేఖ రాశారు. దానినే నాటి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. వరద జలాలు/మిగులు జలాల ఆధారంగా చేపట్టిన పురుషోత్తపట్నం లిఫ్టు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, చింతలపూడి లిఫ్టు, గోదావరి–పెన్నా అనుసంధానం తదితర ప్రాజెక్టులకు నీటి హక్కులు సాధించుకునేందుకే ఏపీ తప్పుడు ఉద్దేశాలతో ట్రిబ్యునల్ ఏర్పాటును కోరుకుంటోంది. ఈ ప్రాజెక్టులకు నేటికీ సీడబ్ల్యూసీ నుంచి టెక్నో ఎకనామికల్ క్లియరెన్స్, టీఏసీ అనుమతి లేదు. దీంతో వీటిని రాష్ట్ర విభజన తర్వాత చేపట్టిన కొత్త ప్రాజెక్టులుగానే పరిగణించాల్సి ఉంటుంది. గోదావరి జలాల్లో ఏపీకి 531.908 టీఎంసీల న్యాయబద్ధమైన వినియోగం ఉన్నట్టు నిరూపించడంలో ఆ రాష్ట్రం విఫలమైంది'అని తెలంగాణ స్పష్టం చేసింది.

ఏపీ అభ్యంతరాలను సీడబ్ల్యూసీ పరిగణనలోకి తీసుకుంది

సీతారామ ప్రాజెక్టు వల్ల ఏపీ హక్కులకు ఎలాంటి నష్టం ఉండదని సీడబ్ల్యూసీ చెప్పడం సరికాదని ఆ రాష్ట్రం పేర్కొనగా.. ఏపీ అభ్యంతరాలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న తర్వాతే సీడబ్ల్యూసీ ఈ మేరకు తేల్చిందని తెలంగాణ వివరణ ఇచ్చింది. ఇచ్చంపల్లి ప్రాజెక్టు ద్వారా 85 టీఎంసీల వినియోగంపై గోదావరి ట్రిబ్యునల్ విధించిన ఆంక్షలు ఆ ప్రాజెక్టుకే పరిమితమని, సీతారామ ప్రాజెక్టుకు వర్తించవని తెలిపింది. 35 టీఎంసీలతో దేవాదుల, 195 టీఎంసీలతో కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టడంతో ఆ 85 టీఎంసీలను తెలంగాణ వాడుకున్నట్లేనని, దీంతో సీతారామ ప్రాజెక్టుకు నీటి లభ్యత లేదన్న ఏపీ వాదనను తోసిపుచ్చింది. ట్రిబ్యునల్ మార్గదర్శకాలకు కట్టుబడే దేవాదుల, కాళేశ్వరంతో పాటు పోలవరం ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ అనుమతిలిచ్చిందని తెలిపింది.

పోలవరం ప్రాజెక్టుపై ప్రభావం ఉండదు

'పోలవరం ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చే సమయంలో అక్కడ 991 టీఎంసీల నీటి లభ్యత ఉందని వ్యాప్కోస్ నిర్ధారించగా, 861 టీఎంసీలేనని సీడబ్ల్యూసీ కుదించింది. 2018 నాటి సీతారామ ప్రాజెక్టు డీపీఆర్ ప్రకారం పోలవరం వద్ద నీటి లభ్యత 460.7 టీఎంసీలకు తగ్గింది. సీతారామ డీపీఆర్ ప్రకారం అక్కడ నికర లోటు 13.64 టీఎంసీల నుంచి 151 టీఎంసీలకు పెరిగింది. గోదావరిలో మిగులు జలాల లభ్యత లేదని నదుల అనుసంధానం సందర్భంగా సీడబ్ల్యూసీ తేల్చింది. ఎగువ నుంచి ప్రవాహాలు తగ్గిన నేపథ్యంలో పోలవరం వద్ద నీటి లభ్యతపై తాజా అధ్యయనం జరపాలి'అని ఏపీ కోరింది. సీడబ్ల్యూసీలోని హైడ్రాలజీ డైరెక్టరేట్ పరీవాహకంలోని అన్ని రాష్ట్రాల ప్రాజెక్టులను పరిగణనలోకి తీసుకుని పోలవరం ప్రాజెక్టుపై ఎలాంటి ప్రభావం ఉండదని నిర్ధారించిందని తెలంగాణ బదులిచ్చింది.

ఎస్సీ గురుకుల విద్యార్థి ఆత్మహత్య

- ఖమ్మం జిల్లా మధిర మండలంలో ఘటన
- ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసుల అనుమానం.. మృతుడి చొక్కా జేబులో ప్రేమలేఖ... విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్, హౌస్ మాస్టర్‌పై సస్పెన్షన్ వేటు


సాయివర్ధన్ (ఫైల్)

మధిర: ఖమ్మం జిల్లా మధిర మండలం కృష్ణాపురం సమీపంలోని ఎస్సీ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన మంగళవారం రాత్రి చేటుచేసుకుంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం పోలంపల్లికి చెందిన మాడుగుల రాంబాబు కుటుంబం 30 ఏళ్ల క్రితం ఖమ్మం జిల్లా ముదిగొండలో స్థిరపడ్డారు. రాంబాబు ఇంజిన్ల మెకానిక్‌గా పని చేస్తుండగా ఆయన భార్య సునీత కూలి పనులకు వెళ్తోంది. వారి కుమారుడు సాయివర్ధన్ (17) క్రిస్మస్ సెలవులకు డిసెంబర్ 23న ముదిగొండకు వెళ్లి 30న కళాశాలకు వచ్చాడు. అప్పటి నుంచి ముభావంగా ఉంటున్న అతను.. సోమవారం రాత్రి 10 గంటలకు సహచర విద్యార్థులతో కలిసి గ్రౌండ్ ఫ్లోర్‌లోని గదిలో నిద్రించాడు. స్నేహితులంతా నిద్రపోయాక మొదటి అంతస్తుకు వెళ్లి అక్కడి గేట్‌కు తాళం వేసుకున్నాడు. అనంతరం విద్యార్థుల ట్రంక్ పెట్టెలను ఒక దానిపై ఒకటి పేర్చుకొని ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు తెలుస్తోంది. బుధవారం ఉదయం సాయివర్ధన్ లేకపోవడంతో స్నేహితులు నైట్ డ్యూటీలో ఉన్న జువాలజీ లెక్చరర్ జవ్వాజి నరేష్‌బాబుకు చెప్పగా గేటు తాళం పగలగొట్టి వెళ్లేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. విద్యార్థి మృతికి ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి చొక్కా జేబులో ప్రేమలేఖ లభించిందని వైరా ఏసీపీ రెహమాన్ చెప్పారు. అయితే అందుకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం వెల్లడించలేదు. గురుకుల విద్యార్థి ఆత్మహత్య విషయం తెలియడంతో విద్యార్థి సంఘాలు, పలు పార్టీల నేతలు గురుకులం వద్ద ధర్నా చేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయడంతోపాటు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు కూడా ఈ ఆందోళనలో పాల్గొనడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో అక్కడకు చేరుకున్న ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, గురుకులాల జోనల్ ఆఫీసర్ కె.స్వరూపరాణి విద్యార్థి సంఘాలను శాంతింపజేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్ శ్రీనివాస్, హౌస్ మాస్టర్ మోషేను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు.

సెల్‌ఫోన్ చూస్తున్నావన్నారని..

యువతి ఆత్మహత్య


మనీషా (ఫైల్)

ఏటూరునాగారం: సెల్‌ఫోన్ చూస్తున్నావని తల్లిదండ్రులు మందలించడంతో ఒక యువతి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ములుగు జిల్లా ఏటూరునాగారంలో మంగళవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. మండల కేంద్రంలోని 4వ వార్డుకు చెందిన బట్టు బాబు సమ్మక్కలకు ఇద్దరు అమ్మాయిలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె బట్టు మనీషా (25) తరచూ ఫోన్ చూసేది. దీంతో తల్లిదండ్రులు ఆమెను మందలించారు. మనస్తాపానికి గురైన మనీషా డిసెంబర్ 29న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. ఇరుగు పొరుగు వారు గమనించి ఆమెను వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీనిపై ఎస్ఐ తాజొద్దీన్‌ను వివరణ కోరగా బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదూ రాలేదని స్పష్టం చేశారు. ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ అఖిలభారత అధ్యక్షురాలు డాక్టర్ హేమలత

రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి

- ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఇందిరా పార్కు వద్ద ఆశాల రాష్ట్రవ్యాప్త బస్సుజాత ముగింపు సభ

కవాడిగూడ (హైదరాబాద్): రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఆశావర్కర్లకు రూ. 18 వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో డిసెంబర్ 15న నిర్మల్‌లో ప్రారంభమైన రాష్ట్ర బస్సుజాత 17 రోజులపాటు కొనసాగి.. మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ముగింపు సభతో ముగిసింది. ఈ సందర్భంగా ఇందిరాపార్కు వద్దకు వేలాది మంది ఆశా వర్కర్లు తరలివచ్చారు. డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ధర్నాలో సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ కె.హేమలత మాట్లాడుతూ, గత 19 సంవత్సరాలుగా ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌లో భాగంగా ఆశావర్కర్లు పనిచేస్తున్నారని వీరంత పేద బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారని ఆమె తెలిపారు. రాత్రనక పగలనక నిరంతరం ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. ఇంత వెట్టిచాకిరీ చేసినా నేటికీ ప్రభుత్వం ఆశావర్కర్లకు రూ.9,900 మాత్రమే పారితోషికం చెల్లిస్తూ శ్రమదోపిడీ చేస్తోందని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఆశాలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

సైబర్ మోసం తాళలేక విద్యార్థి ఆత్మహత్య

- తల్లి ఖాతాలోంచి రూ. 90 వేలు తీసుకొని ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేసిన వైనం
- పెట్టిన సొమ్ము తిరిగిచ్చేందుకు రూ. 2 లక్షలకుపైగా అడగడంతో మనస్తాపం
- సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య.. కరీంనగర్ జిల్లాలో విషాదం


రుషివర్ధన్ (ఫైల్)

వీణవంక (హుజూరాబాద్): సైబర్ మోసానికి ఓ విద్యార్థి బలైపోయాడు. రూ. 5 వేలు పెట్టుబడి పెడితే రెండింతలు ఇస్తాం' అంటూ ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌కు ఆకర్షితుడై పలు దఫాలుగా కేటుగాళ్లకు రూ.90 వేల మేర ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేసి మోసపోయాడు. చివరకు మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతిగల్ గ్రామంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.

మహిళా సంఘం నుంచి తల్లి తీసుకున్న చిట్టీ డబ్బులతో..

బేతిగల్ గ్రామంలో నివసిస్తున్న గుమ్మడి సృజన్–ఉమ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రిషివర్ధన్ (18) ఇటీవల డిప్లొమా పూర్తి చేసి బీటెక్ ప్రయత్నాల్లో ఉన్నాడు. వారం క్రితం అతని మొబైల్‌కు కేటుగాళ్లు ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట పంపిన సందేశం చూసి ఆకర్షితుడయ్యాడు. తన తల్లి ఇటీవల మహిళా సంఘం నుంచి రూ. 90 వేల చిట్టీ పాడుకోవడంతో వచ్చిన డబ్బును ఇందుకోసం వాడుకోవాలనుకున్నాడు. వెంటనే ఆమె ఖాతాలోంచి ఆ సొమ్మును తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. తొలుత రూ. 5 వేలను సైబర్ నేరగాళ్ల ఖాతాకు పంపాడు. అయితే రెట్టింపు సొమ్ము పొందాలంటే రెండో టాస్కగా రూ. 23,500 పెట్టుబడి పెట్టాలంటూ వారు మెలిక పెట్టడంతో ఆ సొమ్మునూ చెల్లించాడు. మూడో టాస్క్‌లో రూ. 68 వేలు పెట్టుబడి పెడితే రీఫండ్ వస్తుందని కేటుగాళ్లు నమ్మించడంతో ఆ మొత్తం కూడా బదిలీ చేశాడు. అయితే ఆ సొమ్ముకు రెట్టింపు పొందాలంటే రూ. 2 లక్షల 6 వేలను బదిలీ చేయాలని వారు పేర్కొనడంతో తాను మోసపోయినట్లు గుర్తించాడు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందు కుటుంబ సభ్యులకు లేఖ రాశాడు. 'సారీ మమ్మీ.. నేను చనిపోతున్నా, రిన్నూ (తమ్ముడు) జాగ్రత్త.. డాడీ, మమ్మీ ఇన్నీ రోజులు నన్ను భరించినందుకు థ్యాంక్స్. నేను ట్రేడింగ్ (స్టాక్ మార్కెట్)లో డబ్బులు పెట్టి మోసపోయా. కంపెనీ వివరాలు నా మొబైల్‌లో ఉన్నాయి' అంటూ లేఖలో పేర్కొన్నాడు.

పోలీసులకు ఉత్తమ సేవా పతకాలు

శౌర్య, మహోన్నత సేవ, ఉత్తమసేవ, కఠినసేవ, సేవా పతకాల ప్రకటన


ఎస్.శంకర్


బి.శ్రీనివాస్


మధుసూదన్‌రావ్


పోచ నర్సయ్య


ఆర్.రవికుమార్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందికి నూతన సంవత్సర ప్రారంభాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పలు రకాల పతకాలు ప్రకటించింది. తెలంగాణ స్టేట్ శౌర్య పతకం, మహోన్నత సేవా పతకం, ఉత్తమ సేవా పతకం, కఠిన సేవా పతకం, సేవా పతకం కేటగిరీల్లో పతక విజేతల జాబితాను హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా మంగళవారం విడుదల చేశారు. పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఫైర్ సర్వీసెస్, యాంటీ కరప్షన్ బ్యూరో, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల్లోని అధికారులు, సిబ్బందికి పతకాలు దక్కాయి. ఇందులో తెలంగాణ స్టేట్ శౌర్య పతకం దక్కిన వారికి వేతనంలో రూ.500తోపాటు ఒకేసారి రూ.10వేల నగదు ఇస్తారు. మహోన్నత సేవా పతకం పొందిన వారికి రూ. 40 వేలు, ఉత్తమ సేవా పతకం పొందిన వారికి రూ.30 వేలు, కఠిన సేవా పతకం , సేవా పతకం పొందిన వారికి రూ.20 వేలు ఒకేసారి అందిస్తారు.

శాఖల వారీగా పతకాలు ఇలా...: రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత పతకమైన తెలంగాణ స్టేట్ శౌర్య పతకం గ్రేహౌండ్స్ సీనియర్ కమాండెంట్ టి.రాకేశ్‌కు దక్కింది. పోలీస్ శాఖలో మహోన్నత సేవాపతకం 17 మందికి, ఉత్తమ సేవాపతకం 93 మందికి, కఠిన సేవా పతకం 46 మందికి, సేవా పతకం 460 మందికి లభించాయి. ఏసీబీలో మహోన్నత సేవాపతకం ఇద్దరికి, ఉత్తమ సేవాపతకం ముగ్గురికి, సేవా పతకం ఒకరికి వచ్చింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో మహోన్నత సేవాపతకం ఒకరికి, సేవా పతకం నలుగురికి దక్కాయి. తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో మహోన్నత సేవా పతకం ఒకరికి, ఉత్తమ సేవా పతకం ముగ్గురికి, సేవా పతకం 15 మందికి దక్కాయి. అగ్నిమాపకశాఖలో మెదక్ ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్‌మన్ పోచ నర్సయ్య, జహీరాబాద్ ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్‌మన్ బి.శ్రీనివాస్, పటాన్‌చెరు ఫైర్ స్టేషన్ డ్రైవర్ ఆపరేటర్ ఎస్.శంకర్, సదాశివపేట్ ఫైర్‌స్టేషన్ ఫైర్‌మన్ ఆర్.రవికుమార్, వికారాబాద్ ఫైర్ స్టేషన్ ఫైర్‌మన్ పి.మధుసూదన్‌రావులకు తెలంగాణ స్టేట్ ఫైర్‌సర్వీసెస్ శౌర్య పతకాలు లభించాయి. మహోన్నత సేవాపతకం ఒకరికి, ఉత్తమ సేవాపతకం ముగ్గురికి, సేవా పతకాలు 14 మందికి లభించాయి.

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ, ప్రాంతీయ కార్యాలయం, P.R.E.D., వికారాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No. RO/PRED/VKB/166-255/2024-25 తేది: 30.12.2024
సం/- రీజినల్ ఆఫీసర్ (FAC), P.R.E.D., వికారాబాద్
DIPR RO No. 8504-PP/CL/Advt/1/2024-25, Dt: 31.12.2024

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనముల శాఖ
టెండర్ ప్రకటనకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ సవరణ
చీఫ్ ఇంజనీర్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN: NIT No.7970/DCE-R/EE-R/DEE-I/AEE-I / 2024-25, తేది: 31-12-2024. సవరణ వివరాలు: 1. పెద్దపల్లి (01 పని), కరీంనగర్ (01 పని) మరియు నల్గొండ (01 పని) జిల్లాలో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ప్లాన్ క్రింద రోడ్డు పనులు (03 నం.లు) కొరకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడినవి. దాని ఆన్‌లైన్ టెండర్ల స్వీకరణకు చివరి తేది: 03-01-2025న మ.3.30 గం. వరకు. దీనిని ఈ విధంగా చదువుకోవలెను: 1. టెండరుదారులు కరీంనగర్ (01 పని) మరియు నల్గొండ (01 పని) కొరకు టెండరు షెడ్యూల్స్‌ను ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనవలెను. ఆన్‌లైన్ టెండర్ల స్వీకరణకు చివరి తేది: 07-01-2025న సా.4.00 గం. వరకు అని చదువుకోవలెను. టెండరుదారులు టెండర్ షెడ్యూల్స్‌ను మరియు తదుపరి వివరాలను http://tender.telangana.gov.in వద్ద డౌన్‌లోడ్ చేసుకొనవలెను.
సం/- చీఫ్ ఇంజనీర్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN తరఫున
DIPR RO No.8512-PP/CL/Advt/1/2024-25, Dt.31-12-2024

తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్
విద్యుత్ నియంత్రణ్ భవన్, జి.టి.ఎస్. కాలనీ, కళ్యాణ్ నగర్, హైదరాబాద్ - 500 045.
O.P. No. 33 of 2024
ప్రకటన
1) టీజీ డిస్కమ్‌లు అనగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (TGSPDCL) మరియు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (TGNPDCL)లు సోలార్ పవర్ డెవలపర్స్ ద్వారా గ్రిడ్ నుండి ఎగుమతి చేసిన విద్యుత్ బిల్లింగ్ కొరకు మోడల్ సోలార్ PPA కు సవరణ కొరకు తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ సమక్షంలో ప్రతిపాదనలు దాఖలు చేశాయి. పైన తెలిపిన ముసాయిదా PPAను ఆమోదించవలసిందిగా టీజీ డిస్కమ్‌లు కమిషన్‌ను అభ్యర్థించాయి. 2) సంబంధిత డాక్యుమెంట్లతోపాటు ప్రతిపాదనల కాపీలు కమిషన్ వెబ్‌సైట్ www.tgerc.gov.in పై అప్‌లోడ్ చేయబడినవి. అందరు స్టేక్ హోల్డర్లు మరియు సాధారణ ప్రజల నుండి సదరు విషయంలో సూచనలు / అభ్యంతరాలు / వ్యాఖ్యలు దిగువ చిరునామాకు 20.01.2025న లేదా అలోగా సా. 5.00 గం.లోగా చేరు విధంగా కోరబడుచున్నవి : కమిషన్ సెక్రటరీ, తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్, విద్యుత్ నియంత్రణ్ భవన్, జి.టి.ఎస్. కాలనీ, కళ్యాణ్ నగర్, హైదరాబాద్ - 500 045. ఇ-మెయిల్ ఐడి : secy@tserc.gov.in.
తేది : 31.12.2024 సం/- కమిషన్ సెక్రటరీ
DIPR RO No. 8518-PP/CL/ADVT/1/2024-25, Dt. : 31.12.2024

REPLY NOTICE

The General Public are hereby informed that a **false Caution Notice** with Incorrect facts and baseless allegations is given on behalf of (1) Mala @ Bollam Siddalah @ Siddappa, (2) Mala @ Bollam Chinna Mallaiah by Mr. B. Venkateshwar Reddy, T. Raghunath Reddy, K. Gopal, A. Jayanth Reddy, Advocates, in Deccan Chronicle and Sakshi dated 22-12-2024 and other newspapers.

It is denied that my clients **DSR SSI Builders and Developers** is constructing residential blocks - A and B under the name and style **"THE TWINS BY DSR"** in the land belonging to the above persons who issued notice in the newspaper. The said notice is issued with an intention of creating panic amongst the purchasers of my client and to malign my client in the business circles and General Public. My client is entitled to deal with the land of Ac.2-35 guntas in Sy.No. 278/1 and transact business in respect of apartments in **"THE TWINS BY DSR"** as the land Owners namely (1) Gadde Venkata Naveen, (2) R. Phanindra Kumar, (3) M.B. Srinivas Rao, (4) Muvva Srinivasa Babu, (5) S. Chakradhar, (6) Gadde Buchi Babu, (7) Ch. Venkateswarlu, (8) Aashritha Constructions and (9) Channamaneni Vamsheedhar have perfect title for the same.

The Publication in the News Paper on 22-12-2024 by the said (1) Mala @ Bollam Siddalah @ Siddappa, (2) Mala @ Bollam Chinna Mallaiah is with malafide intention and with ulterior motives and clearly for the purpose of demanding ransom amounts and to damage our interest by suppressing correct facts about the title of the land of Ac.2-35 guntas in Sy.No. 278/1 where my client is constructing **"THE TWINS BY DSR"** apartments.

The said (1) Mala @ Bollam Siddaiah @ Siddappa, (2) Mala @ Bollam Chinna Malliah have executed a power of attorney dated 23-10-1991 bearing registered document No. 1980/1991, wherein, they have appointed Shri Ranbeer Pershad Dubey as their power of attorney holder conferring on him all the powers pertaining to the land in Sy.No. 278 including the power to execute and register sale deeds. Said power of attorney holder on behalf of the principals, in turn alienated the land admeasuring Ac. 4-24 gts in Sy.No. 278 in favour of M/s. Jagna Chemicals limited. In the said sale deed, the description of GPA was wrongly mentioned as document No. 15/1992, the same got rectified as document No. 1980/1991 through a registered rectification deed. The publishers of the caution notice mentioned about the GPA Doc. No. 15/1992 dated 04-01-1992 which has no relevance for subject property and understandably only for the purpose of misleading the public.

My client states that they have obtained valid developmental rights from the present lawful owners and possessors of the land for the purpose of development of the project and the link cum flow of their title is ultimately traceable to original owners.

My client further cautions the said (1) Mala @ Bollam Siddalah @ Siddappa, (2) Mala @ Bollam Chinna Mallaiah that if they fail to withdraw the notice under reply and do not restrain themselves from making such false allegations and acts, they shall be made liable for all the losses and damages that my client may suffer on account of such allegation and acts.

Hence this Reply Notice and clarification for the benefit and information of the purchasers of my client and to the General Public.

Bhaskara Rao Pelluru, Advocate
Flat No. 201, Sapthagiri Towers, Begumpet, Secunderabad - 500 016

ఊహాజనిత అంచనాలొద్దు

గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఖర్చులను తగ్గించుకోండి

- కొత్త పథకాలకు ప్రత్యేకంగా నిధుల అంచనాలు చూపెట్టాలి
- 4వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలి
- 2025–26 బడ్జెట్ తయారీ కోసం ఆర్థిక శాఖ మార్గదర్శకాలు



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025–26) గాను వార్షిక బడ్జెట్ తయారీ కోసం అన్ని ప్రభుత్వ శాఖలు తమ అంచనాలను జనవరి 4వ తేదీలోగా పంపాలని ఆర్థిక శాఖ ఆదేశించింది. ఈ మేరకు బడ్జెట్ రూపకల్పన మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మంగళవారం జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం...

- అన్ని ప్రభుత్వ విభాగాలు ఈనెల 4వ తేదీలోగా ఐఎఫ్‌ఎంఐఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ బడ్జెట్ ప్రతిపాదనలను ఆయా శాఖలకు పంపాల్సి ఉంటుంది. అదే రోజున ఆయా శాఖాధిపతులు వాటిని పరిశీలించి మార్పులు, చేర్పులు చేసిన అనంతరం ఆర్థిక శాఖకు పంపాల్సి ఉంటుంది.
- ఊహాజనిత అంచనాలకు పోకూడదు. తమకు అవసరమయ్యే వాస్తవిక నిధుల కంటే ఎక్కువ లేదా తక్కువ మొత్తాలను ప్రతిపాదించకూడదు.
- గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దుల కింద చేసే ఖర్చును అన్ని శాఖలు తగ్గించుకోవాలి.
- ప్రతి శాఖ విధిగా వ్యవస్థీకృత వ్యయాన్ని ప్రతిపాదించాలి. ఆఫీసుల నిర్వహణ, వాహనాలు, అద్దెలు, విద్యుత్, తాగునీటి ఖర్చులు, ఔట్‌సోర్సింగ్ సర్వీసులు, సంక్షేమ, సబ్సిడీ పథకాలకు అయ్యే వ్యయ అంచనాలను పంపాల్సి ఉంటుంది.
- డిసెంబర్ 31, 2024 వరకు ఉన్న నికర అప్పుల వివరాలను పంపాలి. ప్రతి శాఖలో ఉన్న శాశ్వత ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగుల వివరాలు పంపాలి.
- అన్ని శాఖలు 2024–25 ఆర్థిక సంవత్సరపు సవరించిన అంచనాలను కూడా పంపాలి. ఆదాయ మార్గాలను పెంచుకునే అవకాశాలను రాబడి శాఖలు ప్రతిపాదించాలి.
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొత్త పథకాలను ప్రారంభించాల్సి ఉంటే అందుకు సంబంధించిన వివరాలు, అయ్యే ఖర్చును విధిగా ప్రతిపాదించాలి.
- ప్రభుత్వ శాఖల్లో అమలు పరిచేందుకు వీలున్న కేంద్ర ప్రాయోజిత పథకాలను (సీఎస్ఎస్) గుర్తించడం ద్వారా కేంద్రం నుంచి ఎక్కువ నిధులు రాబట్టుకునే వీలున్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిష్పత్తిని పేర్కొంటూ ప్రతిపాదనలు పంపాలి.



షార్ సెంచరీ!

జనవరిలోనే 100వ ప్రయోగం
ఇస్రో జీఎస్ఎల్వీ మిషన్‌కు ఏర్పాట్లు

శ్రీహరికోట: శ్రీహరికోటలోని ఇస్రో అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) సెంచరీ కొట్టబోతోంది. సోమవారం షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక ద్వారా పీఎస్ఎల్వీ–సి60 ద్వారా చేసిన స్పేడెక్స్ జంట ఉపగ్రహాలను భూ దిగువ కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడం తెలిసిందే. ఈ కేంద్రం చరిత్రలో అది 99వ ప్రయోగం. జనవరిలో 100వ ప్రయోగం ద్వారా షార్ మరో మైలురాయిని చేరనుంది. జియో సింక్రనస్ లాంచ్ వెహికిల్ (జీఎస్ఎల్వీ) ద్వారా ఎన్వీఎస్–02 ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. 2023 మేలో 2,232 కిలోల ఎన్వీఎస్–02 నావిగేషన్ ఉపగ్రహాన్ని జీఎస్ఎల్వీ రాకెట్ విజయవంతంగా జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీఓ)లోకి ప్రవేశపెట్టింది. స్పేడెక్స్ మిషన్‌లో భాగంగా పీఎస్ఎల్వీ–సి60 ద్వారా ప్రయోగించిన చేజర్, టార్గెట్ జంట ఉపగ్రహాలు 475 కి.మీ. ఎత్తున భూ దిగువ కక్ష్యలో కుదురుకున్నట్టు ఇస్రో వెల్లడించింది. మంగళవారం ఉదయం అవి పరస్పరం సమీపంలో చక్కర్లు కొడుతున్న దృశ్యాలను దక్షిణ అమెరికాకు చెందిన ఒక ట్రాకింగ్ సైట్ రికార్డు చేసింది. వాటిని అనుసంధానించే కీలకమైన డాకింగ్ ప్రక్రియను జనవరి 7న జరపాలని ఇస్రో భావిస్తోంది. అందులో భాగంగా చేజర్ ఉపగ్రహం 20 కి.మీ. దూరం నుంచి నెమ్మదిగా తోటి ఉపగ్రహం చేజర్‌ను సమీపించి దానితో అనుసంధానమవుతుంది. ప్రయోగం పూర్తయిన వెంటనే తిరిగి దాని నుంచి విడిపోతుంది.



గ్రహాల పరేడ్

భూమికి సమీపంగా శుక్రుడు, గురుడు, శని, బృహస్పతి
రెండు వారాల పాటు వినువీధిలో కనువిందు

కొత్త సంవత్సరంలో అరుదైన అంతరిక్ష అద్భుతం అలరించనుంది. బుధవారం నుంచి రెండు వారాల పాటు శుక్రుడు, గురుడు, శని, బృహస్పతి వినువీధిలో కనువిందు చేయనున్నాయి. సూర్యాస్తమయం అనంతరం కాసేపటికి వాటిని టెలిస్కోప్‌తో నిమిత్తం లేకుండా మామూలు కంటితోనే వీక్షించవచ్చు. ఈ నాలుగు గ్రహాలు భూమినుంచి ఇలా ఒకేసారి కనిపించడం అరుదైన విషయం. వాటిలోనూ శుక్రుడు, శని పరస్పరం అత్యంత సమీపంలోకి రానుండటం విశేషం. దాదాపు రెండు వారాల పాటు సూర్యాస్తమయం కాగానే తూర్పున గురు గ్రహం, వినువీధి నట్టనడుమ బృహస్పతి, నైరుతి దిక్కున శుక్రుడు, శని కన్పించనున్నాయి. ముఖ్యంగా గురు గ్రహం గత రెండేళ్లలో ఎన్నడూ లేనంత ప్రకాశవంతంగా కన్పిస్తుంది. అంతరిక్ష ఫొటోగ్రాఫర్లతో పాటు తారలను వీక్షించేందుకు ఆసక్తి చూపేవారికి ఇది చక్కని విందు వంటిదే'' అని ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతరిక్ష పరిభాషలో దీన్ని 'ప్లానెట్ పరేడ్'గా పిలుస్తారని వివరించారు. - సాక్షి, నేషనల్ డెస్క్

నయా సాల్ జోష్



సిడ్నీలో...

ప్రపంచవ్యాప్తంగా న్యూ ఇయర్ సంబరాలు

ముందు కిరిబాటీ, చివరగా న్యూ సమోవా
2025కు వేడుకగా స్వాగతం పలికిన ప్రజలు

న్యూఢిల్లీ: ఆంగ్ల సంవత్సరాది సర్వత్రా నూతనోత్తేజం నింపింది. వేడుకలు, పార్టీలతో ఉత్సవ వాతావరణం నడుమ ప్రపంచవ్యాప్తంగా ప్రజలు న్యూ ఇయర్‌కు స్వాగతం పలికారు. ఏ దేశంలో చూసినా ప్రఖ్యాత పర్యాటక ప్రాంతాలన్నీ భారీ జనసందోహంతో కిటకిటలాడాయి. వాణిజ్య సముదాయాలు, హోటళ్లు తదితరాలు కళకళలాడాయి. ఎప్పట్లాగే క్రిస్మస్ ఐలాండ్‌గా పేరొందిన కిరిబాటీ రిపబ్లిక్ 2025ను స్వాగతించిన తొలి దేశంగా నిలిచింది. ఎంత ముందుగా అంటే, అమెరికా కాలమానం ప్రకారం డిసెంబర్ 31 ఉదయం ఐదింటికే అక్కడ నూతన సంవత్సర వేడుకలు మొదలైపోయాయి! తర్వాత పావు గంటకే పసిఫిక్ మహాసముద్రానికి దక్షిణాన ఉన్న చాదం ఐలాండ్స్‌లో, ఆ వెంటనే న్యూజిలాండ్‌లో న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నాయి. అర్ధరాత్రి క్యాలెండర్ మారి 2024 డిసెంబర్ 31 కాలగర్భంలో కలిసిపోతూనే న్యూజిలాండ్‌లోని ఆక్లండ్ నగరంలో సంబరాలు మిన్నంటాయి. తర్వాత ఆస్ట్రేలియా, జపాన్ తదితర దేశాలూ వేడుకల్లో పాలుపంచుకున్నాయి. ఆస్ట్రేలియాలోని చారిత్రక సిడ్నీ హార్బర్ బ్రిడ్జి బాణసంచా పేలుళ్లు, కళ్లు మిరుమిట్లుగొలిపే లేజర్ షోలతో పట్టపగలును తలపించింది. బ్రెజిల్‌లోని రియోడిజనిరో నగరంలో న్యూ ఇయర్ సంబరాలు మిన్నంటాయి. కోపాచబానా బీచ్ ఏకంగా 12 నిమిషాల పాటు బాణసంచా వెలుగుల్లో తళుకులీనింది. అక్కడి వేడుకల్లో ఏకంగా 20 లక్షల మందికి పైగా పాల్గొన్నారు. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్‌లో వందేళ్ల సంప్రదాయం ప్రకారం బాల్ డ్రాప్ వేడుక జరగనుంది. జోనాస్ బ్రదర్స్, సోఫీ ఎలిస్–బెక్స్టర్, రీటా ఓరా తదితరులు సంగీత ప్రదర్శనలతో అలరించనున్నారు. అమెరికాలోని ఇతర నగరాలూ సంబరాలకు సిద్ధమయ్యాయి. అమెరికన్ సమోవా ప్రజలు ఎప్పట్లాగే అందరికన్నా ఆలస్యంగా న్యూ ఇయర్‌కు స్వాగతం చెప్పనున్నారు. న్యూజిలాండ్‌తో పోలిస్తే ఏకంగా 24 గంటల తర్వాత అక్కడ తేదీ మారుతుంది! యుద్ధాలు, సంక్షోభాలతో సతమతమవుతున్న ఉక్రెయిన్‌తో పాటు పలు పశ్చిమాసియా దేశాల్లో మాత్రం న్యూ ఇయర్ సందడికి బదులు ఎప్పట్లా శ్మశాన నిశ్శబ్దమే తాండవించింది.



తైపీలో

భారత్‌లో సందడి

భారత్‌లో దేశవ్యాప్తంగా న్యూ ఇయర్ వేడుకలు దుమ్మురేపాయి. రాజధాని ఢిల్లీ మొదలుకుని అన్ని ప్రధాన నగరాల్లోనూ పలు కార్యక్రమాలు కన్నులపండువగా జరిగాయి. ప్రజలంతా ఇళ్లను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించుకున్నారు. వేడుకగా కొత్త సంవత్సరాన్ని స్వాగతించారు. ఢిల్లీలోని ఇండియా గేట్, కోల్‌కతాలో విక్టోరియా మెమోరియల్, ముంబైలో గేట్‌వే ఆఫ్ ఇండియా, చెన్నై మెరినా బీచ్, బెంగళూరు బ్రిగేడ్ రోడ్ తదితర చోట్ల జనం ఇసుక వేసినా రాలనంతగా కన్పించారు. ఇక గోవాలోనైతే కొత్త సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ఏ నగరంలో చూసినా క్లబ్బులు, పబ్బులు, హోటళ్లు, రెస్టారెంట్లు, మాల్స్, పార్కులు తదితరాలన్నీ కిటకిటలాడాయి. అవాంఛనీయ ఘటనలను నివారించేందుకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మందుబాబులకు ముకుతాడు వేసేందుకు అన్ని నగరాల్లోనూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. ప్రముఖ పర్యాటక ప్రాంతాలన్నింటికీ తాకిడి విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా గత 50 ఏళ్లలో ఎన్నడూ లేనంతటి హిమపాతంతో తడిసి ముద్దవుతున్న ఉత్తరాఖండ్, కశ్మీర్ తదితర చోట్లకు జనం పోటెత్తారు. ఉత్తరాఖండ్‌లోని హర్షిల్, దయారా, సంక్రి వంటి మారుమూల ప్రాంతాలకు కూడా దేశం నలుమూలల నుంచీ పర్యాటకులు విరగబడ్డారు. చుట్టూ మంచు నడుమ టెంట్లు, క్యాంపుల్లో బస చేశారు. అర్ధరాత్రి కాగానే న్యూ ఇయర్ సంబరాల్లో మునిగిపోయారు. అక్కడి హోటళ్లు, దాబాలు అత్యంత వినూత్నంగా నూతన సంవత్సర వేడుకలు జరిపి ఆకట్టుకున్నాయి. కుంభమేళా నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమంలో కొలువుదీరిన కుంభనగరిలో కూడా న్యూ ఇయర్ వేడుకలు అలరించాయి.

వాట్సాప్ పేమెంట్‌ను ఇక అందరూ వాడొచ్చు

పది కోట్ల మంది యూజర్ల పరిమితిని ఎత్తేసిన ఎన్‌పీసీఐ

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమ యాప్ అయిన వాట్సాప్‌లో ఇంతకాలం కేవలం కొద్ది మందికి మాత్రమే ఇతరులకు నగదు బదిలీ వెసులుబాటు ఉండగా ఇకపై అందరికీ ఆ అవకాశం దక్కనుంది. అతి త్వరలోనే ఈ చెల్లింపుల సదుపాయం దేశవ్యాప్తంగా అందుబాటులోకి రానుంది. టెక్స్ మెసేజ్‌లు, ఫొటోలు, ఆడియోలు, వీడియోలు షేర్‌చేసుకోవడంలో భారత్‌లో అగ్రగామి సోషల్‌మీడియా యాప్‌గా వర్ధిల్లుతున్న వాట్సాప్ ఇకపై పేమెంట్ యాప్‌గానూ ఎదిగే అవకాశాలు మెరుగయ్యాయి. దేశంలో ఆన్‌లైన్ చెల్లింపులపై నియంత్రణ బాధ్యతలు చూసే నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ) గతంలో వాట్సాప్‌కు కేవలం భారత్‌లోని 10 కోట్ల మంది యూజర్లకు మాత్రమే పేమెంట్స్ ఆప్షన్ ఇచ్చారు. తాజాగా ఆ పరిమితిని ఎత్తేశారు. దీంతో ఇకపై యూజర్లు అందరూ వాట్సాప్ ద్వారా నగదు చెల్లింపుల సేవలను వినియోగించుకోవచ్చని 'వాట్సాప్ పే' బహిరంగంగా అధికారికంగా స్మార్ట్‌ఫోన్లలో ఒక నోటిఫికేషన్ ఇచ్చింది. మొదట్నుంచి చూస్తే యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్(యూపీఐ) చెల్లింపుల సేవలు విస్తరించుకోవడంపై వాట్సాప్‌కు ఎన్‌పీసీఐ దశలవారీగా పరిమితిని పెంచుతూ వచ్చింది. 2020 సంవత్సరంలో కేవలం 4 కోట్ల మంది వాట్సాప్ యూజర్లకు మాత్రమే యూపీఐ పేమెంట్స్ ఆప్షన్ ఇచ్చారు. తర్వాత రెండేళ్లకు ఆ పరిమితిని 10 కోట్ల మంది యూజర్లకు అనుమతి మంజూరు చేశారు. భారత్‌లో రోజురోజుకూ విస్తరిస్తున్న డిజిటల్ నగదు చెల్లింపుల వ్యవస్థను దృష్టిలో ఉంచుకుని ఎన్‌పీసీఐ తాజాగా ఈ పరిమితిని ఎత్తేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

13 బిలియన్ల లావాదేవీలు

భారత్‌లో ఇప్పుడు యూపీఐ లావాదేవీలు ఎవరూ ఊహించనంతగా పెరిగిపోయాయి. నెలకు కనీసం 1300 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయి. వీటిలో ప్రధానంగా గూగుల్ పే, ఫోన్‌పే యాప్‌లలోనే దాదాపు 85 శాతం లావాదేవీలను యూజర్లు పూర్తిచేస్తున్నారు. దేశంలో వాట్సాప్ యాప్‌ను ఏకంగా 50 కోట్ల మంది యూజర్లు వాడుతున్నారు. ఇంతపెద్ద సంఖ్యలో యూజర్లు ఉన్న వాట్సాప్ ఇప్పుడు యూపీఐ పేమెంట్స్‌ను విస్తరిస్తే దేశంలోనే అగ్రగామి పేమెంట్ యాప్‌గానూ దూసుకుపోనుందని మార్కెట్ వర్గాలు అంచనావేస్తున్నాయి. దీంతో వాట్సాప్ మాతృసంస్థ మెటాకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఇటీవల మెటా తమ కృత్రిమేధ ఉపకరణం అయిన 'మెటా ఏఐ'ను అందుబాటులోకి తెచ్చింది. దీనికి భారత్‌లో చక్కటి ప్రజాదరణ దక్కింది. గతంలో మాదిరే వాట్సాప్ పే విభాగం యూపీఐ వారి థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్ నిబంధనావళిని పాటించాల్సి ఉంటుంది. భారతీయ రిజర్వ్ బ్యాంక్, భారతీయ బ్యాంక్‌ల సమాఖ్య(ఐబీఏ)లు సంయుక్తంగా యూజర్లు అత్యంత వేగంగా నగదు బదిలీ చేసుకునేందుకు వీలుగా ఎన్‌పీసీఐను ఏర్పాటుచేశాయి. ఎన్‌పీసీఐ ఆధ్వర్యంలోనే యూపీఐ చెల్లింపుల వ్యవస్థ పనిచేస్తోంది.



సామాజిక అసమానతలతో మతిమరుపు

కొత్త విషయం కనుగొన్న శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ: వృద్ధాప్యంతోపాటు సమాజంలో హెచ్చుతగ్గుల కారణంగానూ మెదడులో మార్పులు సంభవిస్తాయని పరిశోధకులు తేల్చారు. రాబోయే కాలంలో దిగువ, మధ్యాదాయ దేశాల్లో మతిమరుపు కేసులు ఎక్కువ అవుతాయన్న గణాంకాల నడుమ ఈ పరిశోధన ఫలితాలు వెలువడటం గమనార్హం. స్థానిక, సామాజిక, ఆర్థిక అంశాలు సమాజంలో మనిషి స్థాయిని మాత్రమే కాదు అతని మెదడు ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని పరిశోధకులు చెబుతున్నారు. మెదడుకు చికిత్స చేస్తే సరిపోదని దాని మూలాలున్న సమాజానికి చికిత్స చేయాలని, సమూల మార్పులు తీసుకురావాలని ఐర్లాండ్‌లోని డబ్లిన్ సిటీలోని ట్రినిటీ కళాశాల పరిశోధకుల బృందం వ్యాఖ్యానించింది. ఏదైనా దేశంలో ఒక సమాజంలో ఒక పౌరుడు ఎదుర్కొనే సామాజిక పరిస్థితులకు తగ్గట్లు అతని మెదడులోని న్యూరాన్ల మధ్య అనుసంధానత, క్షీణత, వృద్ధాప్య ఛాయలు త్వరగా బయటపడటం వంటివి ఉంటాయని తేల్చారు. సంబంధిత పరిశోధన వివరాలు 'నేచర్ ఏజింగ్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. లాటిన్ అమెరికా దేశాలు మొదలు అగ్రరాజ్యం అమెరికా దాకా వేర్వేరు దేశాలకు చెందిన 2,100 మంది వ్యక్తులను పరిశోధనకు ఎంచుకున్నారు. మతిమరుపు, ఆలోచనా శక్తి తగ్గడం వంటి మెదడు సంబంధ సంబంధ సమస్యలు ఉన్న వాళ్లు ఏ ప్రాంతాలకు చెందిన వాళ్లు, అక్కడి సామాజిక స్థితిగతులను ఆరోగ్యవంతమైన వ్యక్తులున్న సమాజాల్లోని పరిస్థితులతో పోల్చి చూశారు. వృద్ధాప్యం, మతిమరుపు, ఆలోచనా సామర్థ్యం తగ్గిపోవడం, జ్ఞాపకశక్తితో సంబంధం ఉండే మెదడులోని అంతర్గత భాగాలు సామాజిక, ఆర్థిక అంశాల ప్రభావానికి లోనవుతున్నాయని పరిశోధనలో వెల్లడైంది. లాటిన్ అమెరికా దేశాల్లో అసమా నతలు ఎక్కువ ఉన్న ప్రాంతాల వ్యక్తుల మెదడు పరిమాణం తగ్గుతోందని, న్యూరాన్లలో క్షీణత కనిపిస్తోందని తేల్చారు. ముఖ్యంగా మెదడు లోని టెంపోరో–సెరిబెల్లార్, ఫ్రంటో– తలామిక్, హిప్పోక్యాంపల్ ప్రాంతాల్లో మార్పు లు చోటుచేసుకుంటున్నాయన్నారు. విద్యా, వయసు, లింగం, ఆలోచనా సామర్థ్యాలతో సంబంధం లేకుండా అదే ధోరణి కనిపించిందని చిలీలోని లాటిన్ అమెరికన్ మెదడు సంబంధ సంస్థ అయిన బ్రెయిన్‌లాట్‌లోని రచయిత అగస్టినా లెగాజ్ చెప్పారు. వృద్ధాప్యం, న్యూరాన్ల క్షీణతకు సామాజిక అసమానతకు మధ్య సంబంధంపై లోతైన పరిశోధనలు చేయాల్సి ఉందన్నారు.

యూన్‌కు అరెస్ట్ వారెంట్

- అభిశంసనకు గురైన అధ్యక్షుడికి దక్షిణ కొరియా కోర్టు జారీ
- ఆయన కార్యాలయంలో సోదాలు చేయాలని ఆదేశం
- పట్టించుకునేది లేదన్న యూన్ లాయర్లు



సియోల్: దక్షిణ కొరియా రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అభిశంసనకు గురైన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు సియోల్‌లోని జిల్లా కోర్టు సోమవారం అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. ఆయన ఆఫీసు, నివాసాల్లో సోదాలు చేపట్టాలని ఆదేశించిందని అవినీతి నిరోధక విభాగం వెల్లడించింది.. అయితే, అధికారికంగా యూన్‌ను పదవి నుంచి తొలగిస్తేనే తప్ప ఆయన నివాసం, కార్యాలయంలో తనిఖీలు చేపట్టేందుకు అవకాశాలు చాలా తక్కువని నిపుణులు అంటున్నారు. యూన్ ఈ సమన్లను పట్టించుకోరని చెబుతున్నారు. ఇప్పటికే విచారణకు రావాలంటూ అందిన సమన్లను ఆయన పక్కనబెట్టేశారని, అధ్యక్షునికి ఉన్న రాజ్యాంగపరమైన రక్షణలను చూపుతూ భద్రతా సిబ్బంది ఇతర దర్యాప్తు అధికారులెవరినీ ఆయన నివాసంలోకి గానీ ఆఫీసులోకి గానీ రానివ్వడం లేదని సమాచారం. యూన్ అత్యవసర పరిస్థితిని ప్రకటించడం తిరుగుబాటు కిందికి వస్తుందా అనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్లు అవినీతి వ్యతిరేక విభాగం తెలపడాన్ని ఆయన లాయర్లు తప్పుబడుతున్నారు. ఈ విభాగం సోమవారం జారీ చేసిన సమన్లకు ఎలాంటి చట్టబద్ధతా లేదని కొట్టిపారేస్తున్నారు. అరెస్ట్‌కు యూన్ అంగీకరిస్తే తప్ప తామేమీ చేయలేమని అవినీతి నిరోధక విభాగం సైతం అంగీకరించింది. అప్పటి వరకు తమ తదుపరి కార్యాచరణ ఏమిటనేది ఇంకా నిర్ధారణ కాలేదని తెలిపింది. అయితే, విచారణకు సహకరించేలా ఆయనపై ఒత్తిడి తెచ్చేందుకు అరెస్ట్ వారెంట్ జారీ చేసినట్లుగా నిపుణులు చెబుతున్నారు. గతంలో, అవినీతి ఆరోపణలెదుర్కొన్న 2017లో మాజీ అధ్యక్షుడు పార్క్ గుయెన్ హే కూడా ఇదే విధంగా విచారణ అధికారులకు సహకరించలేదని గుర్తుచేస్తున్నారు. అవినీతి నిరోధక విభాగం తిరుగుబాటు ఆరోపణలను రుజువు చేయగలిగిన పక్షంలో యూన్‌కు మరణ శిక్ష లేదా జీవితకాల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఇతర నేరారోపణలైతే ఆయనకు అధ్యక్ష హోదా కారణంగా మినహాయింపులు వర్తిస్తాయి. తిరుగుబాటు, దేశద్రోహం వంటి ఆరోపణలు రుజువైతే మాత్రం అధ్యక్షుడికి ఎలాంటి రక్షణలు, మినహాయింపులు ఉండవు. మార్షల్ లా విధించిన ఆరోపణలపై ప్రతిపక్షం మెజారిటీ ఉన్న పార్లమెంట్ డిసెంబర్ 14వ తేదీన యూన్‌ను అభిశంసించింది. అయితే, ఉత్తర కొరియాకు ప్రతిపక్షం అనుకూలంగా మారిందని యూన్ ఆరోపిస్తున్నారు. బడ్జెట్ ప్రతిపాదనలను తిరస్కరిస్తూ, తరచూ ఉన్నతస్థాయి నేతలపై అభిశంసన తీర్మానాలను ప్రవేశపెడుతూ అడ్డుతగులుతోందని ఆయన విమర్శిస్తున్నారు. ఇటువంటి దేశ వ్యతిరేక శక్తులను అదుపు చేసేందుకే మార్షల్ లా పెట్టినట్లు యూన్ వాదనలు వినిపిస్తున్నారు. యూన్ అభిశంసన సరైనదా కాదా అనే అంశంపై దేశ రాజ్యాంగ కోర్టు విచారణ జరుపుతోంది.

ఆ ఇద్దరూ ఎలా బతికారంటే?

సియోల్: దక్షిణ కొరియాలోని ముయాన్ అంతర్జాతీయ విమాన ప్రమాదంలో ఇద్దరు సిబ్బంది మాత్రమే ప్రాణాలతో బయటపడ్డ విషయం తెలిసిందే. వారిద్దరూ బతికిపోవడానికి కారణం కమర్షియల్ ఫ్లైట్‌లో అత్యంత సురక్షితమైన ప్రదేశంగా చెప్పే విమానం తోక విభాగంలో కూర్చోవడమే. కాలిన తోక భాగం నుంచే లీ (32), క్వాన్ (25)లను బయటకు తీశారు. ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. లీకి ఎడమ భుజం, తలకు, క్వాన్‌కు తలకు గాయాలయ్యాయి. చీలమండ విరిగింది. కడుపునొప్పితో బాధపడుతోంది. ప్రమాదంతో ఇద్దరూ షాక్‌కు గురయ్యారు. దాంతో ఏం జరిగిందనే విషయాన్ని మరిచిపోయారు. 'ఏం జరిగింది?', 'నేను ఇక్కడ ఎందుకు ఉన్నాను?' అని లీ పదేపదే అడిగినట్టు కొరియన్ టైమ్స్ తెలిపింది. క్వాన్‌కు కూడా ఏమీ గుర్తుకు లేదు. వారి ప్రాణాలకు ప్రమాదం లేదని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. విమానంలో వెనుక సీట్లు సురక్షితమైనవని పలు అధ్యయనాల్లో తేలింది. ప్రమాదాలు జరిగినప్పుడు వెనుక సీట్లలో మరణాల రేటు 32 శాతం, మిడిల్‌లో 39 శాతం, ముందు వరుసల్లో 38 శాతమని అవి తేల్చాయి.

ప్రజలకు సారీ చెప్పిన మణిపూర్ సీఎం

వైరం మరచి, తప్పులను క్షమించి కలిసి సాగుదామని పిలుపు



న్యూఢిల్లీ/ఇంఫాల్: మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బిరేన్ సింగ్ మంగళవారం ప్రజలకు క్షమాపణ చెప్పారు. రాష్ట్రంలో 2023 నుంచి కొనసాగుతున్న జాతుల వైరంలో 250మందికి పైగా ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చినందుకు క్షమించాలని కోరారు. గత తప్పులను క్షమించి వాటిని మర్చిపోయి నూతన సంవత్సరంలో శాంతిసౌభాగ్యాలతో కలిసి ముందుకు సాగుదామని మీడియా సమక్షంలో పిలుపునిచ్చారు. గడిచిన మూడు నాలుగు నెలలుగా రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొందన్నారు. కొత్త సంవత్సరంలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 'రాష్ట్రంలో జరిగిన పరిణామాలకు క్షమాపణ చెబుతున్నా. ఎందరో అయిన వారిని పోగొట్టుకున్నారు. ప్రాణ భయంతో నివాసాలను వదిలిపెట్టి వెళ్లిపోయారు. ఈ ఘటనలపై పశ్చాత్తాపంతో క్షమాపణ కోరుతున్నా'అని అన్నారు. 2023 మే నుంచి అక్టోబర్ వరకు రాష్ట్రంలో అగ్ని ప్రమాద ఘటనలు 408 నమోదు కాగా, 2023 నవంబర్ నుంచి 2024 ఏప్రిల్ వరకు 345 అగ్ని ప్రమాద ఘటనలు చోటుచేసుకున్నాయని, 2024 మే నుంచి ఇప్పటి వరకు 112 ఘటనలు మాత్రమే జరిగాయని సీఎం వివరించారు. లూటీ అయిన 3,122 ఆయుధాలను తిరిగి పూర్తిగా స్వాధీనం చేసుకున్నామని, 2,511 పేలుడు పదార్థాలను పట్టుకున్నామని చెప్పారు. వివిధ హింసాత్మక ఘటనలకు సంబంధించి 625 మందిని అరెస్ట్ చేసి 12,047 కేసులు నమోదు చేశామని తెలిపారు.

ప్రధాని మోదీ సారీ ఎందుకు చెప్పరు?: కాంగ్రెస్

మణిపూర్‌లో హింసాత్మక ఘటనపై సీఎం బిరేన్ సింగ్ క్షమాపణ చెప్పడంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. జాతుల మధ్య హింసాకాండ మొదలయ్యాక ఇప్పటి వరకు ఆ రాష్ట్రానికి ప్రధాని మోదీ ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించింది. ప్రధాని సైతం రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. దేశంతోపాటు, ఇతర విదేశాల్లో జెట్ విమానంలో ప్రయాణాలు చేస్తున్న ప్రధాని మోదీ ఉద్దేశపూర్వకంగానే మణిపూర్ ప్రజలకు మొహం చాటేస్తున్నారని మండిపడింది.

నితీశ్ రాణే 'మినీ పాకిస్తాన్' వ్యాఖ్యలపై దుమారం

మహారాష్ట్ర మంత్రిని తక్షణమే తొలగించాలన్న కేరళ సీఎం విజయన్

తిరువనంతపురం: బీజేపీకి చెందిన మహారాష్ట్ర మంత్రి నితీశ్ రాణే కేరళ 'మినీ పాకిస్తాన్'గా మారిందంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. వయనాడ్ లోక్‌సభ సీటును గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, తాజాగా ప్రియాంకా గాంధీ విజయం సాధించడాన్ని ప్రస్తావిస్తూ ఆయన..కేరళ 'మినీ పాకిస్తాన్'లా మారిందని, ఉగ్రవాదులంతా గాంధీలకు ఓటేస్తున్నారని రెండు రోజుల క్రితం వ్యాఖ్యానించారు. దీనిపై వివాదం చెలరేగడంతో వివరణ ఇస్తూ రాణే.. ఆ రాష్ట్రంలో హిందువుల మత మార్పిడి, లవ్ జిహాద్ వంటి విషయాలపైనే 'మినీ పాకిస్తాన్'అంటూ పేర్కొన్నట్లు వివరణ ఇచ్చారు. నితీశ్ రాణే వ్యాఖ్యలపై కేరళ సీఎం విజయన్ సీరియస్ అయ్యారు. సంఘ్ పరివార్ అసలు స్వరూపం బయటపడిందంటూ మండిపడ్డారు. రాణే వ్యాఖ్యలు రెచ్చగొట్టేలా ఉన్నాయన్నారు. ఆయన మంత్రి పదవిలో కొనసాగటానికి అర్హుడు కాదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దీనిపై స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని చెప్పారు.

క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడ్డ రష్యా

ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాల్లో పేలుళ్లు

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా ఆ దేశంలోని పలు ప్రాంతాలపై మంగళవారం రష్యా క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడింది. తెల్లవారు జామున 3గంటలు, ఉదయం 8 గంటల సమయంలో రెండు క్షిపణులను కీవ్‌పై ప్రయోగించిందని ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. వీటితో నగరంలో భారీ పేలుళ్లు సంభవించాయంది. ఉత్తరప్రాంత సుమీలోని షోస్ట్కా నగరంపై జరిగిన మరో దాడిలో 12 నివాస భవనాలు, రెండు విద్యా సంస్థలతోపాటు మరికొన్ని మౌలిక వనరులు ధ్వంసమయ్యాయని మేయర్ మికోలా నోహ చెప్పారు. అయితే, అవేమిటో వెల్లడించలేదు. మిగతా చోట్ల కూడా క్షిపణులు, డ్రోన్లతో రష్యా దాడులకు దిగిందని వైమానిక దళం తెలిపింది. ప్రాణనష్టంపై వివరాలను వెల్లడించలేదు. అదేవిధంగా, తర్ఖన్‌కుట్ సమీపంలో రష్యాకు చెందిన ఎంఐ–8 హెలికాప్టర్‌ను తమ మగురా వీ5 నేవీ డ్రోన్ నుంచి ప్రయోగించిన ఆర్–73 మిస్సైల్‌తో కూల్చేసినట్లు ఉక్రెయిన్ మిలటరీ నిఘా విభాగం తెలిపింది. ఇలాంటిది ఇదే మొదటిసారని చెప్పింది. ఇదే దాడిలో రష్యా విమానం మరోటి దెబ్బతిందని, కానీ అది వైమానిక స్థావరానికి చేరుకోగలిగిందని వెల్లడించింది. కాగా, ఉక్రెయిన్‌లోని వైమానిక స్థావరం, గన్ పౌడర్ ఫ్యాక్టరీని తాము విజయవంతంగా ధ్వంసం చేసినట్లు రష్యా రక్షణ శాఖ పేర్కొంది. పలు ప్రాంతాలపైకి ఉక్రెయిన్ ప్రయోగించిన 68 డ్రోన్లతోపాటు నల్ల సముద్రంలో సిబ్బంది లేని 8 పడవలను ధ్వంసం చేసినట్లు తెలిపింది. స్మోలెన్స్క్ ప్రాంతంలో డ్రోన్ శకలాలు పడటంతో ఆయిల్ డిపోకు మంటలంటుకున్నట్లు అధికారులు తెలిపారు. రష్యాతో దాదాపు మూడేళ్లుగా జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌లోని ఇంధన మౌలిక వనరులు సగానికిపైగా భారీగా దెబ్బతిన్నట్లు అంచనా. దీంతో, అక్కడ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు సర్వసాధారణంగా మారాయి.

పాకిస్తాన్ ప్రేమికురాలి కోసం సరిహద్దులు దాటిన యూపీ వాసి

లక్నో: సామాజిక మాధ్యమ వేదిక ఫేస్‌బుక్ ద్వారా పరిచయమయ్యారు. ఆపైన ఇద్దరూ ప్రేమలో పడ్డారు. ప్రియుడు యూపీ వాసి కాగా ప్రియురాలు పాకిస్తానీ. ఆమెను పెళ్లి చేసుకునేందుకు దొంగచాటుగా సరిహద్దులు దాటి పాకిస్తాన్ వెళ్లాడు. ప్రేమికురాలిని కలుసుకున్నాడు. అక్కడి పోలీసులకు దొరికిపోయి జైలు ఊచలు లెక్కిస్తున్నాడు. యూపీలోని అలీగఢ్ జిల్లా నగ్లా ఖట్కారి గ్రామానికి చెందిన ప్రియుడు బాదల్ బాబు(30) కథ ఇది. పాక్ ప్రియురాలి కోసం ఇప్పటికే ఇతడు 2024 జులైలో ఒక పర్యాయం సరిహద్దులు దాటేందుకు ప్రయత్నించాడు. బీఎస్ఎఫ్ జవాన్లు ఖఖర్ పోస్ట్ వద్ద ఇతడిని పట్టుకుని జమ్మూకశ్మీర్ పోలీసులకు అప్పగించారు. దీంతో తిరిగి సొంతింటికే చేరాడు. తాజాగా రెండో ప్రయత్నంలో విజయం సాధించాడు. సరిహద్దులు దాటి పంజాబ్‌లోని మండి బహాఉద్దీన్ నగరంలో ప్రేమికురాలిని కలుసుకున్నాడు. అయితే, ఎలాంటి ప్రయాణ పత్రాలు, వీసా వంటివి లేకపోవడంతో డిసెంబర్ 27వతేదీన అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడిపై ఫారినర్స్ చట్టం కింద కేసు పెట్టారు. కోర్టు ఇతడిని 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది. జనవరి 10వ తేదీన కేసు విచారణకు రానుందని పాక్ అధికారులు వెల్లడించారు.

సాక్షి
హైదరాబాద్

బుధవారం । 1 । జనవరి । 2025





నయా జోష్

మహా నగరం.. మంగళవారం ఎటుచూసినా జోరుగా హుషారుగా కనిపించింది. 2024కు వీడ్కోలు చెబుతూ.. 2025కు సిటీ స్వాగతం పలికింది. ఐటీ కారిడార్‌లో నయా సాల్ జోష్ హోరెత్తింది. డీజేలు, రాక్ బ్యాండ్స్, తళుక్కుమన్న టాలీవుడ్ తారలు న్యూ ఇయర్‌కు వెల్‌కం చెప్పారు. గచ్చిబౌలిలోని బౌల్డర్‌హిల్స్‌లో కార్తీక్ మ్యూజిక్‌తో సంగీత ప్రియులు సేదతీరారు. హైటెక్ ఎరేనాలో న్యూ ఇయర్ బాష్–2025, కొండాపూర్ హార్ట్ కప్‌లో వన్ నైట్–2025, ప్రిజమ్ క్లబ్ అండ్‌కిచెన్‌లో రామిరెడ్డి, దీజే షాడో దుబాయ్, రవిష్ కేక పుట్టించారు. రాయదుర్గంలోని దీఈ–7 బార్‌లో వింటేజ్ న్యూఇయర్ పార్టీలో డీజే తనూ ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఎన్వైఈ–2025 పేరిట నటి శ్రీలీల, డీజే వినీష్ యువతను మత్తెక్కించారు. హైటెక్స్‌లో దీజే అమల్ మాలిక్, డీసే అసీఫ్ ఇక్బాల్, ఆకాంక్షలు హోరెత్తించిన సంగీతంలో యువత తడిసి ముద్దయ్యారు.

– గచ్చిబౌలి



ఎఫ్ఎన్‌సీసీలో..



కంట్రీ క్లబ్‌లో..



హెచ్ఐసీసీలో శ్రీలీల

జూబ్లీహిల్స్ క్లబ్‌లో..

నేటి నుంచి ఎంఎంటీఎస్ కొత్త టైంటేబుల్

సాక్షి, సిటీబ్యూరో: జనవరి 1 నుంచి ఎంఎంటీఎస్ కొత్త టైంటేబుల్ అమల్లోకి రానుందని దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 88 ఎంఎంటీఎస్ సరీ్వసులు నడుస్తున్నాయి. సికింద్రాబాద్– మేడ్చల్, ఫలక్‌నుమా– ఉందానగర్, ఘట్‌కేసర్– లింగంపల్లి మధ్య కొత్తగా ఎంఎంటీఎస్ సేవలు విస్తరించాయి. ఈ మేరకు వివిధ మార్గాల్లో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రైళ్ల వేళల్లో మార్పులు, చేర్పులు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ మార్పులకు సంబంధించిన సమాచారం అన్ని ఎంఎంటీఎస్ స్టేషన్లలో అందుబాటులో ఉంటుందన్నారు. నేషనల్ ట్రైన్ ఎంక్వైరీ సిస్టమ్ ఆధారంగా కూడా తెలుసుకోవచ్చు. సంబంధిత రైల్వే స్టేషన్లలోని స్టేషన్ మేనేజర్, విచారణ కేంద్రాన్ని సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

నగర విస్తరణకు సహకరించాలి మేయర్ విజయలక్ష్మి

సమర్థంగా సేవలందిస్తాం: ఇలంబర్తి

సాక్షి,సిటీబ్యూరో: కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో స్వచ్ఛమైన, సురక్షితమైన, అభివృద్ధి చెందిన నగరంగా పరిధిని విస్తరించేందుకు అందరూ సహకరించాలని విజయలక్ష్మి కోరారు. కొత్త సంవత్సరం అందరికీ కొత్త ఆశయాల కనుగుణంగా అవకాశాలు తీసుకురావాలన్నారు. కొత్త సంవత్సరంలో ప్రజలకు మరింత సమర్థంగా సేవలందిచేందుకు కట్టుబడి ఉన్నామని కమిషనర్ ఇలంబర్తి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ శుభాలతో కొత్త సంవత్సరం ప్రారంభం కావాలని ఆకాంక్షించారు. రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్యం, పచ్చదనం తదితర కార్యక్రమాల్ని విజయవంతంగా అమలు చేసినట్లు మేయర్, కమిషనర్ పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి కూడా నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

సీవరేజీ స్పెషల్ డ్రైవ్.. మరో 90 రోజులు

- 2200 కిలోమీటర్ల మేర పైపులైన్..
- 1.75 లక్షల మ్యాన్‌హోళ్లలో డీ–సిల్టింగ్ పనులు

సాక్షి, సిటీబ్యూరో: సీవరేజీ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీ–హైదరాబాద్, ఇంకుడు గుంతల నిర్మాణమే లక్ష్యంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌ను మరో 90 రోజులు పొడిగిస్తూ జలమండలి నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజు సీఎం చేతుల మీదుగా ప్రారంభించిన స్పెషల్ డ్రైవ్ 90 రోజులు పూర్తి చేసుకుంది. ఇప్పటి వరకు ఈ డ్రైవ్ ద్వారా 17,050 ప్రాంతాల్లో 2,200 కిలో మీటర్ల సీవరేజీ పైపులైన్, 1.75 లక్షల మ్యాన్‌హోళ్లలో డీ–సిల్టింగ్ పనులు పూర్తి చేశారు. స్పెషల్ డ్రైవ్ ఫలితంగా నిత్యం వచ్చే సీవరేజీ ఫిర్యాదులు 30 శాతానికి తగ్గాయి. స్పెషల్ డ్రైవ్ విజయవంతం కావడంతో.. సీఎం రేవంత్ రెడ్డి జలమండలి అధికారులు, సిబ్బందిని అభినందించారు. డ్రైవ్‌ను మరో 90 రోజులు పొడిగించాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా జలమండలి ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. స్పెషల్ డ్రైవ్ విజయవంతం కావడంలో అధికారులు, సిబ్బంది కృషి ఎంతో ఉందని కొనియాడారు.



కొత్తగా రెక్కలొచ్చెనా!

నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ..

- రండి.. జీవితాన్ని వేడుక చేసుకోండి..
- వ్యక్తిత్వం, చదువులు, కెరీర్ నిర్మాణానికి నయా బాటలు
- మొబైల్ మాయాజాలపు ఏకాంత వాసం నుంచి..
- సామాజిక జీవన సమూహంలోకి పయనించండి
- ఆశావహ దృక్పథంతో నూతన పథంలోకి..



సాక్షి, సిటీబ్యూరో: కొత్త సంవత్సరం వచ్చేసింది. నయా జోష్ తెచ్చింది. ఉత్సాహాన్ని ఉరకలెత్తించింది. కానీ.. ఆ ఉత్సాహాన్ని చెక్కుచెదరకుండా కొనసాగించాలంటే ఆశావహ దృక్పథంతో కొత్త సంవత్సరాన్ని ప్రారంభించాలి. సాధారణంగా ప్రతి ఒక్కరూ ఏటా ఏవో కొన్ని కార్యక్రమాలను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంటారు. కానీ.. ఆచరణలో మాత్రం విఫలమవుతారు. అలా విలువైన కాలాన్ని కోల్పోయి మరో ఏడాది గడిచిపోయిందని నిరుత్సాహానికి గురి కాకుండా.. తమ ఆశయాలు, ఆకాంక్షలు, అభిరుచులు, లక్ష్యాలకు అనుగుణంగా జీవన శైలిలోనే మార్పులను తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు. గతకాలపు సమీక్షల్లోనే గడిపేయకుండా ముందడుగు వేస్తే అద్భుతాలు సాధించవచ్చు. జీవితాన్ని ప్రతి నిత్యం వేడుక చేసుకోవచ్చు.

రీల్ లైఫ్ కాదు.. రియల్ లైఫ్ కావాలి..

మొబైల్ మాయాజాలం.. కోరలు సాచి విస్తరించిన సామాజిక మాధ్యమాల వెల్లువ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. యువత ఈ మాయాజాలంలో కొట్టుకుపోతోంది. రీల్ జీవితానికి, రియల్ జీవితానికి తేడాను గుర్తించడం లేదు. ఇప్పుడు ఇదే అతిపెద్ద ముప్పుగా పరిణమించింది. కుటుంబం నుంచి సమాజం నుంచి డిటాచ్ అవుతున్నారు. రీల్ జీవితమే రియల్ జీవితంగా భావిస్తున్నారు. ఈ ప్రమాదం నుంచి బయటపడాలి. కొత్త సంవత్సరం సందర్భంగా వ్యక్తిత్వం, కెరీర్, రిలేషన్స్, ఆర్థిక క్రమశిక్షణపై చక్కటి అవగాహన కలిగి ఉంటే అద్భుతమైన విజయాలను నమోదు చేయవచ్చు.

ఇలా ఉందాం..

- వ్యక్తిత్వం అంటే నడవడిక మాత్రమే కాదు. ఆరోగ్యం. చక్కటి దేహదారుఢ్యం కూడా. ఆరోగ్యం పట్ల శ్రద్ధ, ఫిట్‌నెస్ విషయంలో అలసత్వం లేకుండా కొత్త సంవత్సరాన్ని ఆరంభించాలి.
- చాలామంది చదువు విషయంలో నిర్లక్ష్యం చేస్తూ చివరి నిమిషంలో అంతా ఒకేసారి చదివేయాలని ప్రయత్నిస్తారు. దాంతో తీవ్రమైన ఒత్తిడికి గురై చదువులో వెనకబడిపోతారు. 'టైమ్ కుదిరినప్పుడు' చదువుకోవడం అనే పద్ధతి కాకుండా 'టైమ్ కేటాయించి' చదువుకోవడం మంచిది. దైనందిన జీవితంలో ఎంటర్‌టైన్‌మెంట్‌కు కూడా తప్పనిసరిగా కొంత సమయం ఉండాల్సిందే.

అనుబంధాలను పెనవేసుకుందాం..

మొబైల్ ఫోన్, సోషల్ మీడియా వ్యసనంతో తల్లిదండ్రులకు, తోబుట్టువులకు దూరమైపోతున్నారు. స్నేహితులు, ఇరుగుపొరుగు పరిచయాలు కూడా ఉండడం లేదు. ఒంటరితనం అతి పెద్ద ప్రమాదంగా ముంచుకొస్తోంది. దీని నుంచి బయటపడేందుకు ఈ కొత్త సంవత్సరం ప్రారంభం నుంచే కుటుంబానికి, స్నేహితులకు, మన చుట్టూ ఉన్నవాళ్లకు తప్పనిసరిగా సమయం కేటాయించి వాళ్లతో గడిపేందుకు, సంభాషించేందుకు గట్టి నిర్ణయం తీసుకోవాలి.

ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం..

ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ గేమ్‌లు, బెట్టింగ్‌లు యువతను పట్టి పీడిస్తున్నాయి. ఈ ఆటలు రూ.వందలు, వేలల్లో మొదలై రూ.లక్షల్లోకి చేరుతున్నాయి. డ్రగ్స్ కంటే ప్రమాదకరంగా మారిన ఈ జూదం ఆడేందుకు చాలామంది మైక్రో ఫైనాన్స్ అప్పులు చేసి చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. జీవితంలో ఆర్థిక క్రమశిక్షణ, డబ్బు అవసరాల పట్ల అవగాహన లేకపోతే చాలా కష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఆ క్రమశిక్షణ కొత్త సంవత్సరం ప్రారంభం నుంచే మొదలవ్వాలని నిపుణులు చెబుతున్నారు.

సామాజిక సేవ కూడా ముఖ్యమే..

నూరు శాతం మార్కులు, సింగిల్ డిజిట్ ర్యాంకుల పోటీలో కొట్టుకొనిపోవడం వల్ల చాలామంది సామాజిక జీవితానికి దూరమవుతున్నారు. జీవితంలో చదువు ఎంతో ముఖ్యమైనది. సమాజం కూడా ముఖ్యమైందే. అందుకోసం కొంత సమయాన్ని తప్పనిసరిగా సామాజికసేవకు వినియోగించాలి.

ఏకాకులు కావద్దు..



వాట్సప్, ఫేస్‌బుక్‌లలో చురుగ్గా ఉండే వాళ్లు నిజ జీవితంలో ఏకాకులుగా ఉంటున్నారు. ఎవరితోనూ ఎలాంటి పరిచయం, ప్రేమ, బంధం, అనుబంధం లేకుండా మిగిలిపోతున్నారు. డిప్రెషన్‌కు గురవుతున్నారు. మొబైల్‌తో డిటాచ్ కావాలి. మనుషులతో అటాచ్‌మెంట్ పెంచుకోవాలి. జీవితం పట్ల ప్రగతిశీల దృక్పథాన్ని పెంచుకోవాలి.

– డాక్టర్ సి.వీరేందర్, కౌన్సిలింగ్ సైకాలజిస్ట్

గోల్స్ కాదు.. లైఫ్‌స్టైల్‌లో మార్పు రావాలి



కొత్త సంవత్సరం అనగానే ఏవో పెద్ద గోల్స్ పెట్టుకొని వాటిని సాధించలేక నిరాశా నిస్పృహలకు గురికావడం కంటే మనం ఇప్పుడు ఎలా ఉన్నాం. భవిష్యత్తులో ఎలా ఉండాలని కోరుకుంటున్నామనే విషయం పట్ల స్పష్టమైన అవగాహనతో అన్ని అంశాల్లో జీవన శైలిలోనే మార్పులు అలవర్చుకుంటే చాలు. ఏదో సాధించాలనుకొని, ఏదీ సాధించలేక గిల్టీగా ఫీల్ కావడం మంచిది కాదు.

– చల్లా గీత, మానసిక నిపుణురాలు

పంజగుట్ట ఠాణా.. మరో హైరానా!


- ఇటీవల సీసీఎస్ టీమ్ పట్టుకున్న కేసుతో వెలుగులోకి
- ఎస్సైతో సహా ఆరుగురు బాధ్యుల గుర్తింపు
- వీరిని నిందితులుగా చేరుస్తూ ఉన్నతాధికారుల నిర్ణయం

స్పా సెంటర్ నుంచి నెలవారీ మామూళ్లు వసూలు

సాక్షి, సిటీబ్యూరో: పశ్చిమ మండల పరిధిలోని పంజగుట్ట పోలీసుస్టేషన్ మరో వివాదానికి కేంద్ర బిందువైంది. ఇక్కడ పని చేస్తున్న అధికారులు, సిబ్బంది స్థానికంగా ఉన్న స్పా సెంటర్ నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారని ఉన్నతాధికారులు గుర్తించారు. దాదాపు రెండు నెలల క్రితం సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) అధికారుల దాడితో నమోదైన కేసు దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా ఈ చర్యలు తీసుకున్నారు. ఓ హోంగార్డును అరెస్టు చేయగా... ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లు, మరో ఇద్దరు డ్రైవర్లను ఈ వ్యవహారంలో నిందితులుగా తేల్చి నోటీసులు జారీ చేశారు.

స్పా సెంటర్‌పై సీసీఎస్ టీమ్ దాడి..

నగరంలోని పలు మసాజ్, స్పా సెంటర్లు అసాంఘిక కార్యకలాపాలు అడ్డాగా మారిన విషయం తెలిసిందే. స్థానిక పోలీసులో, ప్రత్యేక విభాగాలో దాడి చేసే వరకు ఈ విషయం గుట్టుగానే ఉంటోంది. ఆయా సెంటర్లను కొందరు పోలీసులు 'ఏటీఎం మిషన్లు'గా వినియోగించుకుంటున్నారనేది బహిరంగ రహస్యమే. నగర సీసీఎస్ అధీనంలోని స్పెషల్ టీమ్స్ ఇటీవల పంజగుట్ట ఠాణా పరిధిలోని ఓ స్పా సెంటర్‌పై దాడి చేశాయి. అందులో క్రాస్ మసాజ్‌తో పాటు వ్యభిచారం నడుస్తున్న ఆరోపణలపై ఈ చర్యలు తీసుకున్నాయి. తదుపరి చర్యల నిమిత్తం కేసును పంజగుట్ట పోలీసులకు అప్పగించాయి. దీనిపై కేసు నమోదు చేసిన ఆ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



రొటీన్‌కు భిన్నంగా వెళ్లిన ఉన్నతాధికారి..

సాధారణంగా ఇలాంటి కేసుల దర్యాప్తు రొటీన్‌గా సాగుతుంది. చిక్కిన నిందితులను అరెస్టు చేయడం, నోటీసులు ఇవ్వడంతో పాటు ఆయా స్పా, మసాజ్ సెంటర్ల యజమానుల్ని నిందితులుగా చేరుస్తూ చార్జ్‌షీట్ దాఖలు చేస్తుంటారు. రైడ్ జరిగిన రెండుమూడు రోజులకు పోలీసులు సహా అంతా ఆ విషయం మర్చిపోతుంటారు. అయితే.. వెస్ట్‌జోన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి మాత్రం సీసీఎస్ దాడి చేసి పట్టుకున్న స్పా విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. చాలాకాలం ఈ స్పా సెంటర్ స్థానిక పోలీసుల కళ్లలో పడకుండా ఎలా కార్యకలాపాలు సాగించిందనే అంశానికి ప్రాధాన్యం ఇస్తూ దర్యాప్తు చేయించారు. ఈ నేపథ్యంలో ఆ సెంటర్ నుంచి స్థానిక పోలీసులకు నెలనెలా మామూళ్లు అందేవని, ఫలితంగానే వాళ్లు మిన్నకుండిపోయి పరోక్షంగా సెంటర్ నిర్వహణకు సహకరించారని తేలింది.

ఆరుగురిపై చర్యలు..

ఈ అంశాన్ని సదరు ఉన్నతాధికారి తీవ్రంగా పరిగణించారు. నిందితుల విచారణ, సాంకేతిక ఆధారాల పరిశీలనతో మరింత లోతుగా ఆరా తీశారు. ఫలితంగా ఓ ప్రత్యేక విభాగంలో డ్రైవర్‌గా పని చేస్తున్న హోంగార్డు పోషించిన కీలకపాత్ర బయటికి రావడంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పంజగుట్ట ఠాణాకు చెందిన ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు, మరో ఇద్దరు డ్రైవర్లకు సంబంధాలు ఉన్నట్లు తేల్చారు. వీరినీ ఆ స్పా సెంటర్ కేసులో నిందితులుగా మార్చిన ఉన్నతాధికారులు భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 35 ప్రకారం నోటీసులు జారీ చేశారు. కొందరికి హెడ్–క్వార్టర్స్‌కు ఎటాచ్ చేసినట్లు సమాచారం. ఈ దందాలో మిగిలిన అధికారులు, సిబ్బంది పాత్ర ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.

వివాదాల సుడిగుండంలో..

పంజగుట్ట పోలీసుస్టేషన్‌కు 2018లో దేశ వ్యాప్తంగా గుర్తింపు వచ్చింది. ఆ ఏడాది ఈ ఠాణా దేశంలోనే రెండో బెస్ట్ పోలీసుస్టేషన్‌గా గుర్తింపు పొందింది. ఇలాంటి మేటి ఠాణా కొందరు అధికారుల వ్యవహార శైలి, సిబ్బంది కక్కుర్తి వెరసీ.. 2024లో వివాదాలకు కేంద్రం బిందువుగా మారింది. బోధన్ షకీల్ కుమారుడు రహీల్ 'రోడ్డు ప్రమాదం–ఎస్కేప్' ఎపిసోడ్, పలు కేసుల్లో అరెస్టు, నోటీసుల జారీ, కోర్టుకు తరలింపు, నాన్ బెయిలబుల్ వారెంట్ల (ఎన్‌బీడబ్ల్యూ) ఎగ్జిక్యూషన్.. ఇలా అనేక అంశాల్లో అవినీతి జరుగుతోందని ఉన్నతాధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే ఒకేసారి 85 మంది సిబ్బందిని బదిలీ చేశారు. వేటు పడిన వారిలో ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఆరుగురు ఎస్సైలు, ఎనిమిది మంది ఏఎస్సైలు, 17 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 54 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు కూడా ఈ ఠాణాలోనే నమోదు కావడం గమనార్హం.

అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం

వంటగ్యాస్ సిలిండర్ లీకేజీతో ఘటన

- మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది
- త్రుటిలో తప్పిన పెను ముప్పు




గచ్చిబౌలి: ఓ స్టవ్‌పై పిండి వంటలు చేస్తూ మరో సిలిండర్‌ను ఓపెన్ చేయడంతో గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. కొండాపూర్‌లోని గెలాక్సీ అపార్ట్‌మెంట్స్ గేటెడ్ కమ్యూనిటీలోని సి బ్లాక్‌లోని 907 ఫ్లాట్‌లో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం.. గెలాక్సీ అపార్ట్‌మెంట్స్‌లోని ఫ్లాట్ నంబర్ 907లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సునీల్, పృథ్వీ దంపతులు, వారి కుమారుడు వెంకట సృజన్‌తో పాటు ఓ వయోధికుడు ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం డిసెంబర్ 31 వేడుకల్లో భాగంగా ఫుడ్‌స్టాల్ పెట్టేందుకు పిండి వంటలు చేస్తున్నారు. ఒక స్టవ్‌పై పృథ్వీ పిండి వంటలు చేస్తోంది. మరో సింగిల్ బర్నర్ స్టవ్‌పై వంటలు చేసేందుకు సిలిండర్ సీల్ తీసింది. ఒక్కసారిగా గ్యాస్‌పైకి ఎగిసిపడటంతో మరో స్టవ్‌కు ఉన్న మంట సిలిండర్‌కు అంటుకుంది. వెంటనే మరో గదిలో ఉన్న భర్త సునీల్‌ను పిలిచింది. ఇద్దరు కలిసి దుస్తులతో మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. అయినా మంటలు ఎగిసిపడటంతో లిఫ్ట్ వద్ద ఉన్న ఫిక్స్ ఫైర్‌తో ఆర్పేందుకు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. ఈ క్రమంలో సునీల్ చేతికి స్వల్పంగా గాయాలయ్యాయి. అప్పటికే సెక్యూరిటీని పిలిచేందుకు కొడుకు సృజన్‌ను కిందికి పంపారు. మరో సీనియర్ సిటిజన్‌ను ఇంటి నుంచి బయటకు పంపించారు. సిలిండర్ కింద పడటంతో మంటలు మరింత ఎక్కువగా ఎగిసిపడ్డాయి. దీంతో భయభ్రాంతులకు గురైన దంపతులు కిందికి పరుగు తీశారు.

కాలిపోయిన ఫ్లాట్, ఇంటి సామగ్రి


అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి దాదాపు గంటకు పైగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇంట్లో రెండు సిలిండర్‌లు ఉండటంతో సునీల్ ఫ్లాట్ పూర్తిగా దగ్ధమైందని అగ్నిమాపక అధికారులు తెలిపారు. నాలుగు సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, బెడ్‌లు, ఏసీలు, ఫ్యాన్లు, రిఫ్రిజిరేటర్‌తో సామగ్రి కాలిబూడిదయ్యాయి. ప్రమాదం జరిగినప్పుడు వివిధ ఫ్లాట్లలో చిక్కుకుపోయిన 10 మందిని రెస్క్యూ చేశామని మాదాపూర్ ఫైర్ ఆఫీసర్ ఎం.డి. అబుధల్ ఫజల్ పేర్కొన్నారు. ప్రమాదం జరగడంతో గెలాక్సీ అపార్ట్‌మెంట్స్ గేటెడ్ కమ్యూనిటీ వాసులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

నిజాయతీకి ఫిదా!

- చార్మినార్‌లో స్కాట్లాండ్ పర్యాటకుడికి వింత అనుభవం
- అవి ప్లాస్టిక్ ముత్యాలని చెప్పిన చిరు వ్యాపారి
- అతడి నిజాయతీకి ముగ్ధుడైన విదేశీయుడు



చిరు వ్యాపారి



స్కాట్లాండ్ దేశస్తుడు హ్యూ

సాక్షి, సిటీబ్యూరో: ఎవరైనా ఏదైనా పర్యాటక ప్రదేశానికి వస్తే చిరు వ్యాపారులు అధిక ధరలు చెబుతారనేది అందరి అభిప్రాయం. మనం వేరే రాష్ట్రాలు లేదా దేశానికి వెళ్లినప్పుడు ఇలాంటి అనుభవం ఒకటి రెండుసార్లు మనకు కూడా బహుశా ఎదురయ్యే ఉంటుంది! అయితే.. మన హైదరాబాద్‌లో కొద్ది రోజులుగా పర్యటిస్తున్న ఓ విదేశీయుడికి భిన్న అనుభవం ఎదురైంది. చార్మినార్‌ను చూసేందుకు స్కాట్లాండ్‌కు చెందిన హ్యూ అనే వ్యక్తి వచ్చాడు. అక్కడ కలియదిరుగుతూ నగర ఆహారపు అలవాట్లు, సంస్కృతీ సంప్రదాయాలు, ఆభరణాలు, మట్టి గాజుల గురించి ఆరా తీస్తూ వస్తున్నాడు. అప్పుడే ఓ చిరు వ్యాపారి ముత్యాల హారాలను అమ్ముతూ కనిపిస్తే వాటి ధర ఎంతో అడిగాడు. అయితే.. అందరిలా అవి ఒరిజినల్ ముత్యాలంటూ మభ్య పెట్టకుండా ప్లాస్టిక్ ముత్యాలని నిజాయతీగా చెప్పాడు. అలాగే.. లైటర్‌తో కాల్చి ఇవి, ఒరిజినల్ కాదని పేర్కొన్నాడు. పైగా ధర కూడా రూ.150 అనడంతో చాలా నిజాయతీపరుడివి అంటూ కితాబిచ్చాడు. తిరిగి పర్యాటకుడి వివరాలను ఆరా తీశాడు. స్కాట్లాండ్ అని సమాధానం చెప్పాడు. వెంటనే పర్యాటకుడిని ఆ చిరు వ్యాపారి ఫ్రెంచ్‌లో పలకరించాడు. ఓ..ఫ్రెంచ్ కూడా వస్తుందా అని అడిగి షాక్ అయ్యాడు. ఇదంతా వీడియో తీసి తన ఇన్‌స్టా ఖాతాలో పోస్టు చేశాడు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. పైగా హైదరాబాద్ పరువు కాపాడావంటూ నెటిజన్లు అతడిని తెగ పొగిడేస్తున్నారు.

మత్తు పదార్థాలపై ఆర్పీఎఫ్ ఉక్కుపాదం

- గంజాయి రవాణాను అడ్డుకునేందుకు ఆపరేషన్ నార్కోస్
- ఏడాదిలో రూ.5.02 లక్షల విలువైన గంజాయి పట్టివేత, 127 మంది అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ప్రయాణికుల భద్రత, రైల్వే ఆస్తుల పరిరక్షణలో దక్షిణ మధ్య రైల్వే ఆర్పీఎఫ్ బలగాలు ముందంజలో నిలిచాయి. వివిధ ప్రాంతాల నడుమ నడిచే రైళ్లలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడే స్మగ్లర్లపైన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఉక్కుపాదం మోపింది. గత ఏడాది 111 కేసుల్లో మొత్తం 127 మంది స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే రూ.5.02 లక్షల విలువైన సుమారు 2,311 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ దక్షిణ మధ్య రైల్వే, ఐ.జి, ప్రిన్సిపాల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమాసింగ్ ఠాకూర్ నేతృత్వంలో రైల్వేల్లో నేర కార్యకలాపాలను అరికట్టేందుకు వివిధ రకాల కార్యక్రమాలను అమలు చేశారు. 'ఆపరేషన్ రైల్ సురక్ష' కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది మొత్తం 367 కేసుల్లో 674 మంది నేరస్తులను అరెస్టు చేసి రూ.83 లక్షల 31 వేల విలువైన రైల్వే ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే రైళ్లలో ఫుట్‌బోర్డులపై ప్రయాణించడం, మహిళలు, దివ్యాంగుల కంపార్ట్‌మెంట్‌లలో ప్రయాణించడం వంటి ఉల్లంఘనలను పాల్పడిన వారిపైన 68,746 కేసులు నమోదు చేసి కోర్టుల ద్వారా మొత్తం రూ.కోటీ 30 లక్షల 77వేల 885 జరిమానా విధించినట్లు అధికారులు పేర్కొన్నారు. రైళ్లలో దొంగతనాలకు పాల్పడే 460 మంది నేరస్తులను అరెస్టు చేసి రూ.3.17 కోట్ల విలువైన సొత్తును తిరిగి స్వాధీనం చేసుకున్నారు. 'ఆపరేషన్ నాన్ హే ఫారిస్తే' కార్యక్రమంలో భాగంగా వివిధ కారణాలతో ఇంటి నుండి తప్పిపోయిన, పారిపోయిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు ఈ సంవత్సరం 1385 మంది పిల్లలను రక్షించినట్లు ఆర్పీఎఫ్ అధికారులు స్పష్టం చేశారు. మరోవైపు మానవ అక్రమరవాణాకు గురైన 476 మంది బాలలను, 15 మంది బాలికలను ఆర్పీఎఫ్ సిబ్బంది రక్షించారు.



తప్పు చేస్తే శిక్ష తప్పదు!

రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

- నేర నిరూపణలో రాచకొండ పోలీస్ టాప్
- రాష్ట్రంలోనే అత్యధికంగా 64 శాతం కన్విక్షన్ రేటు
- వరుసగా ఆరో ఏడాది తొలి స్థానంలో రాచకొండ
- అత్యధికంగా 30 మందికి యావజ్జీవ కారాగారం
- ఒకే హత్య కేసులో 14 మందికి జీవిత ఖైదు



సాక్షి, సిటీబ్యూరో: 'కానూన్ కే హాత్ లంబే హోతే హై'..దీన్నే రాచకొండ పోలీసులు తు.చ. తప్పకుండా అనుసరిస్తున్నారు. అందుకే ఈ కమిషనరేట్ పరిధిలో తప్పు చేసి తప్పించుకోలేరు. నేరస్తులు ఎవరైనా శిక్ష తప్పదనే విధంగా కేసులను సమర్థవంతంగా దర్యాప్తు చేస్తున్నారు. నేరం జరిగిందంటే చాలు అన్ని కోణాల్లో విశ్లేషించి పక్కా సాక్ష్యాధారాలను సేకరిస్తున్నారు. నేరస్తుడు తప్పించుకునే అవకాశమే లేకుండా అన్ని రకాల ఆధారాలను అభియోగపత్రంలో పొందు పరిచి న్యాయస్థానానికి సమర్పిస్తున్నారు. ఫలితంగా రాష్ట్రంలో అత్యధిక నేర నిరూపణ (కన్విక్షన్) రేటు రాచకొండ పోలీసు కమిషనరేట్‌లోనే నమోదయింది. గతేడాది 64 శాతం కన్విక్షన్ రేటుతో వరుసగా ఆరో ఏడాది రాచకొండ తొలి స్థానంలో నిలిచింది.

ఒక్క కేసులో 14 మందికి జీవిత ఖైదు..

2024లో రాచకొండలో 33,084 కేసులు నమోదయ్యాయి. 8,734 కేసులు పరిష్కారం కాగా.. ఇందులో 5,568 కేసుల్లో న్యాయస్థానాలు జైలు శిక్షలు విధిస్తూ తీర్పు వెలువరించాయి. నేరాల్లో నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో రాచకొండ పోలీసులు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచారు. 2024లో 160 మంది నిందితులను కోర్టు బోను ఎక్కించారు. మోటకొండూరు ఠాణా పరిధిలో చేతబడి చేస్తున్నాడనే నెపంతో కొందరు గ్రామస్తులు సీసా యాదగిరి (85)ని క్రూరంగా హత్య చేశారు. పక్కా ఆధారాలను సేకరించిన పోలీసులు బుర్రి రాజేశ్, నరేష్, శ్రవణ్, సత్యనారాయణ, లలిత అంజమ్మలతో సహా 14 మందిని అరెస్టు చేశారు. ఈ కేసులో న్యాయస్థానం 14 మందికి జీవిత ఖైదును విధించింది.

కమిషనర్ ప్రత్యేక పర్యవేక్షణ..

'తప్పు చేసిన వారు తప్పించుకోలేరు. నేరం చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందే' అని రాచకొండ పోలీసు కమిషనర్ జి.సుధీర్ బాబు తన సిబ్బందికి తరుచూ చెబుతుంటారు. నేరం చేసిన వారికి శిక్ష పడేలా చేయడంలో సీపీ ప్రత్యేక చొరవ తీసుకుంటారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్స్, విచారణాధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తుంటారు. చార్జీషీటు దాఖలు చేయడంలో మెళకువలు, సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలను సేకరించి న్యాయస్థానంలో ప్రవేశ పెట్టే అంశాలపై సంబంధిత అధికారులకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తుంటారు. ఫలితంగా నిందితులు తప్పించుకునే అవకాశం లేకుండా అభియోగపత్రాలు దాఖలు చేయడంలో రాచకొండ పోలీసులు సఫలీకృతం అవుతున్నారు.

2024లో రాచకొండలో కన్విక్షన్లు ఇలా:

శిక్ష	ఖైదీల సంఖ్య
యావజ్జీవం	30
20 ఏళ్లు	8
13 ఏళ్లు	1
10 ఏళ్లు	11
7 ఏడేళ్లు	7
6 ఏళ్లు	1
5 ఏళ్లు	15
4 ఏళ్లు	1
3 ఏళ్లు	20
2 ఏళ్లు	24
ఏడాది	22
ఏడాది లోపు	20

2024లో ట్రై కమిషనరేట్లలో కన్విక్షన్ రేటు:
రాచకొండ: 64 శాతం
సైబరాబాద్: 47.62 శాతం
హైదరాబాద్: 42 శాతం

దోషులు తప్పించుకోలేరు



విజుబుల్ పోలీసింగ్, సత్వర స్పందన, సాంకేతికత వినియోగంతో కేసులను దర్యాప్తు చేస్తున్నాం, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను సవాల్‌గా తీసుకొని విచారిస్తున్నాం. పక్కా సాక్ష్యాధారాలను సేకరిస్తున్నందున..నేరగాళ్లు ఇక పోలీసుల కళ్లుగప్పి తప్పించుకోలేరు. శిక్ష అనుభవించి తీరాల్సిందే.
– సుధీర్ బాబు, పోలీసు కమిషనర్, రాచకొండ

క్లుప్తంగా

బంజారా భాషలోకి భగవద్గీత అనువాదం



కేతావత్ సోమ్‌లాల్

హబ్సిగూడ: బ్యాంక్ ఉద్యోగి కేతావత్ సోమ్‌లాల్ భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించడంతో పాటు 15 కోట్ల మందికి అందచేసి రికార్డు సృష్టించారు. హబ్సిగూడ రవీంద్రనగర్ కాలనీలో నివాసం ఉంటున ఆయన భారతీయ స్టేట్ బ్యాంక్‌లో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేసి వీఆర్ఎస్ తీసుకున్నారు. బంజారా జాతిని చైతన్యపరిచి సేవ చేయాలనే లక్ష్యంతో 1979 నుంచి అనేక రచనలు చేశారు. రచనలతో పాటు బంజారా సాహిత్యంపై రేడియో, టీవీలలో అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఆయన సేవలకుగాను పద్మశ్రీ అవార్డు వరించింది. అన్ని విధాలుగా సహకరించిన బంజారాలకు, అభిమానులకు, మిత్రులకు సోమ్‌లాల్ కృతజ్ఞతలు తెలిపారు.

సిటీ రైజింగ్!

– వార్షిక నివేదికలో బల్దియా

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేందుకు ఫ్లై ఓవర్లు, సెంట్రల్ మీడియన్లు, జంక్షన్ల సుందరీకరణల పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.149 కోట్లు మంజూరు చేయగా, 224 పనులు చేపట్టి 15 పనులు పూర్తిచేసినట్లు జీహెచ్ఎంసీ–2024 వార్షిక నివేదికలో పేర్కొంది. జీహెచ్ఎంసీ సిబ్బంది హాజరుకు ఫేషియల్ రికగ్నిషన్‌ను అమల్లోకి తెచ్చినట్లు తెలిపింది. బైరామల్‌గూడ రెండో వరుస ఫ్లై ఓవర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపింది. ఇంకా రెయిన్ వాటర్‌హోల్డింగ్ స్ట్రక్చర్స్, తదితర పనులెన్నో చేపట్టినట్లు పేర్కొంది. అభివృద్ధి పథంలో నగరం రైజింగ్ అవుతోందని పేర్కొంది. ఈ మేరకు ఏడాది ముగిసిన వేళ వివరాలను వెల్లడించారు.

ఆత్మహత్య కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు

జవహర్‌నగర్: వేధింపుల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన కేసులో మేడ్చల్ అదనపు సెషన్స్ కోర్టు ముగ్గురికి మూడేళ్ల జైలు శిక్ష విధించింది. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020 సంవత్సరం, డిసెంబర్ 17న యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండల పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అలకుంట వెంకటేష్ దమ్మాయిగూడ న్యూభవానీ నగర్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే కాలనీకి చెందిన పల్లపు సంతోష, బొంత నర్సింహులు, బొంత ఎల్లమ్మలు దారుణంగా వేధించి, ఆత్మహత్యకు ప్రేరేపించారని బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్ఐ డి.అనిల్ కేసు నమోదు చేశారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుజనా రెడ్డి వాదనలు వినిపించారు. వివరాలను పరిశీలించిన మేడ్చల్ అదనపు సెషన్స్ కోర్టు..నిందితులపై వేధింపుల ఆరోపణ నిజమని తేల్చి మంగళవారం వారికి మూడు సంవత్సరాల జైలు, రూ.500 జరిమాన విధించింది.

ఫ్లైఓవర్‌పై మొరాయించిన షీ టీమ్స్ వాహనం



నాగోలు: 'డిసెంబర్ 31' సందర్భంగా బందోబస్తులో ఉన్న రాచకొండ షీ టీమ్స్ వాహనం మంగళవారం రాత్రి కామినేని ఫ్లైఓవర్‌పై మొరాయించింది. దీంతో షీ టీమ్స్ మహిళా సిబ్బంది వాహనం వదిలి నడుచుకుంటూ వెళ్లారు. ఫ్లై ఓవర్ మూసి వేయడంతో అటు వైపు ఎలాంటి ప్రైవేట్ వాహనాలు సైతం రాకపోవడంతో వారు ఎల్‌బీనగర్ వైపు నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది.

రాచకొండలో 'పోకిరీ' హాట్‌స్పాట్స్

- 271 ప్రాంతాలను గుర్తించిన పోలీసులు
- ఏడాదిలో 2,819 కేసుల్లో 2,654 మంది అరెస్టు
- ఇందులో 1,192 మంది మైనర్లే

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండలో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. కమిషనరేట్ పరిధిలో 271 పోకిరీ హాట్‌స్పాట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 2024లో రాచకొండ షీ టీమ్ పోలీసులు 2,819 కేసుల్లో 2,654 మందిని అరెస్టు చేశారు. ఇందులో 1,192 మంది మైనర్లు కాగా.. 1,462 మంది మేజర్ పోకిరీలు ఉన్నారు. ప్రతి రోజు రాచకొండ షీ టీమ్ పోలీసులు మఫ్టీలో ఆయా ప్రాంతాలపై నిఘా పెడుతుంటారని, మహిళలు, చిన్నారులను వేధించే పోకిరీలను గుర్తించి, ఫొటోలు, వీడియోలు తీసి రహస్యంగా ఆధారాలుగా సేకరించి, న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నారని రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. 2024లో రాచకొండ షీ టీమ్ పోలీసులు 217 ఎఫ్ఐఆర్‌లు, 1,107 ఈ-పెట్టీ కేసులను నమోదు చేశారు. ఏడాది కాలంలో రాచకొండ పరిధిలో 1,495 కౌన్సిలింగ్‌లు, 1,760 అవగాహన సదస్సులను నిర్వహించారు. అలాగే ఏడాది కాలంలో మెట్రో రైళ్లలో 730 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి, మహిళా భోగీలో ప్రయాణిస్తున్న 52 మంది ఈవ్ టీజర్లను పట్టుకున్నారు. ఒకవేళ ఆకతాయి మైనర్ అయితే గనక కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి వదిలేస్తారు. వేధింపులు పునరావృతమైతే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. రాచకొండ షీ టీమ్ వాట్సాప్ నంబరు 8712662111కు బాధితులు ఎవరైనా ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.

శ్రీతేజ్‌ను పరామర్శించిన మంత్రి సీతక్క

రాంగోపాల్‌పేట్: సంధ్య థియేటర్ ఘటనలో తీవ్రంగా గాయపడి కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను మంత్రి సీతక్క పరామర్శించారు. శ్రీతేజ్‌కు చికిత్స అందిస్తున్న డాక్టర్లతో మాట్లాడి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న సీతక్క భావోద్వేగానికి లోనయ్యారు. శ్రీతేజ్ తండ్రికి ఆమె ధైర్యం చెప్పారు. సినిమా విడుదల సందర్భంగా తొక్కిసలాటలో రేవతి మరణించడం అత్యంత దురదృష్టకరమన్నారు. బాలుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి కొంత మెరుగుపడిందని, వెంటిలేటర్ చికిత్స నుంచి బయటకు వచ్చాడన్నారు. శ్రీతేజ్ కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమించి శ్రీతేజ్‌కు అందుతున్న చికిత్సను పర్యవేక్షిస్తున్నామన్నారు. శ్రీతేజ్ త్వరగా కోలుకుని బయటకు రావాలని కోరుకుంటున్నామన్నారు.

డ్రగ్స్ వ్యాపారి అరెస్టు

నాంపల్లి: నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన భారీ డ్రగ్స్ పార్టీని పోలీసులు భగ్నం చేశారు. మాసాబ్‌ట్యాంక్ పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి అమృతవ్యాలీ రోడ్డు నెం–12లో వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మాసాబ్ ట్యాంక్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఓ పేరు మోసిన డ్రగ్స్ వ్యాపారిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని నుంచి 30 గ్రాముల కొకైన్, 6 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. నగరంలో మాదకద్రవ్యాల వ్యాపారాన్ని అరికట్టడానికి పోలీసులు చేసిన ప్రయత్నాలలో ఇదొక పెద్ద విజయం. దీంతో డిసెంబరు 31న రాత్రి జరిగే నూతన సంవత్సర వేడుకల కోసం డ్రగ్స్ వ్యాపారి చేసిన ప్రణాళిక పూర్తిగా విఫలం చేశారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఓయూ పీహెచ్‌డీ విద్యార్థి మృతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎకనామిక్స్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తున్న దేవదాసు (33) బ్రెయిన్ స్ట్రోక్‌తో మంగళవారం మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా రాగపురం గ్రామానికి చెందిన దేవదాసు క్యాంపస్‌లోని ఓల్డ్ పీజీ హాస్టల్‌లో ఉంటూ ప్రొ.సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేస్తున్నాడు. తలనొప్పితో బాధపడుతూ దేవదాస్ ఐదు రోజుల క్రితం గాంధీ, తర్వాత యశోద, చివరిగా నిమ్స్‌లో చేరి చికిత్స పొందుతూ మృతిచెందాడు. డిగ్రీ సిద్దిపేట, ఎంఏ ఎకనామిక్స్ సికింద్రాబాద్ పీజీ కాలేజీలో పూర్తి చేసిన దేవదాసు ఓయూ ఆర్ట్స్ కాలేజీలో పీహెచ్‌డీ చివరి దశలో ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి

పహాడీషరీఫ్: అనుమానాస్పద స్థితిలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం వెలుగుచూసింది. బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన చింతకింది కాసీం(50) ఐదేళ్ల క్రితం మల్లాపూర్‌కు వలస వచ్చి ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం భార్య సొంతూరుకు వెళ్లింది. రాత్రి భోజనం చేశాక నిద్రకు ఉపక్రమించిన కాసీం మంగళవారం ఉదయం ఎంతకూ లేవలేదు. పక్కింటి వారు తలుపులు తట్టి చూడగా ఆయన మృతి చెంది కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ మృతుడి భుజంపై ఘాట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలోంచి గొలుసు చోరీ

పహాడీషరీఫ్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోంచి గుర్తు తెలియని దుండగుడు బంగారు గొలుసును లాక్కొని ఉడాయించాడు. ఈ ఘటన సోమవారం రాత్రి పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. తుక్కుగూడకు చెందిన ముచకాకుల సరస్వతి(56) రాత్రి 9.30గంటల ప్రాంతంలో తన కిరాణ దుకాణానికి తాళం వేసి నడుచుకుంటూ ఇంటికి వెళ్తోంది. ఓ గుర్తు తెలియని యువకుడు ఆమెను అనుసరిస్తూ మూడు తులాల బంగారు గొలుసును తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగిలించిన బైక్‌పై మళ్లీ చోరీకి వెళ్తూ..

- పోలీసులకు చిక్కిన ఇద్దరు నేరస్తులు
- 30 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: ఓ బైక్‌ను దొంగిలించి..అదే బైక్‌పై మరో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసేందుకు వెళ్తూ ఇద్దరు ఘరానా నేరస్తులు మార్గమధ్యలో పోలీసులకు చిక్కారు. వీరు ఇప్పటికే కొట్టేసిన 30 బైక్‌లనూ పోలీసులు స్వాధీనం చేసుకొని, నిందితులను రిమాండ్‌కు తరలించారు. వివరాలను రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు మంగళవారం మీడియాకు వెల్లడించారు.

- గోల్కొండకు చెందిన మహ్మద్ షేక్, మహ్మద్ ఇమ్రాన్, ఇమ్రాన్‌లు స్నేహితులు. మద్యం, సిగరెట్లు వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడిన వీరు ముగ్గురు సులువైన మార్గంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో వాహనాల దొంగతనాలకు పాల్పడటం ప్రారంభించారు. రాచకొండ, సైబరాబాద్, హైదరాబాద్ పోలీ సు కమిషనరేట్లతో పాటు వికారాబాద్, సంగారెడ్డి, నిజామాబాద్‌లలో బైకులను దొంగతనం చేసి, వేర్వేరు ప్రాంతాల్లో తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.
- మహ్మద్ షేక్‌ను జీడిమెట్ల పోలీసులు గతేడాది ఏప్రిల్‌లో బైకు చోరీ కేసులో అరెస్టు చేసి, జైలుకు పంపారు. బెయిల్ మీద నెల రోజుల తర్వాత బయటికి వచ్చిన షేక్..మరో ఇద్దరు స్నేహితులు మహ్మద్ ఇమ్రాన్, ఇమ్రాన్‌లతో కలిసి మళ్లీ దొంగతనాలకు స్కెచ్ వేశారు. ఈమేరకు సోమవారం రాత్రి షేక్, ఇమ్రాన్‌లు ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న వాహనాన్ని దొంగిలించారు. మరో బైక్‌ను చోరీ చేసేందుకు వీరు నాగోల్ నుంచి కొత్తపేట గుండా వెళుతున్నారు. అప్పటికే అక్కడ చైతన్యపురి పీఎస్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.గురుస్వామి, డీఎస్ఐ ఎం.విక్రంరెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీశైలం, ఎస్.అనిల్‌లు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. బైక్ మీద అనుమానాస్పదంగా కన్పించిన వీరిద్దరిని ఆపి ప్రశ్నించగా తడబడ్డారు. దీంతో బైక్‌ను దొంగిలించిన విషయం బయటపడింది. తీగలాగితే డొంక కదిలి..మొత్తం వీరి బాగోతం బయటపడింది.
- రాయల్ ఎన్‌ఫీల్డ్ 12, హోండా యాక్టివా 10, స్ప్లెండర్ 3, హోండా యూనికార్న్ 2, షైన్ 1, బజాజ్ ప్లాటిన 1, బుర్గ్‌మన్ స్కూటీ 1..మొత్తం రూ.46 లక్షలు విలువ చేసే 30 ద్విచక్ర వాహనాలు చోరీ చేశారు. పరారీలో ఉన్న ఇమ్రాన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా ఈ ముగ్గురు నిందితులపై వేర్వేరు ఠాణాల పరిధిలో 24 కేసులు ఉన్నాయి.



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు



స్వాధీనం చేసుకున్న బైకులు

కుటుంబ కలహాలకు గృహిణి బలి


- భార్యను బండరాయితో మోది చంపిన భర్త
- బోడుప్పల్ పరిధిలో ఘటన



నిహారిక (ఫైల్)

మేడిపల్లి: ఇంట్లో జరిగిన గొడవ చినికి చినికి గాలివానలా మారి..ఓ ఇల్లాలి ప్రాణం తీసింది. మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి ప్రతాపసింగారంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌కు చెందిన నిహారిక(35), శ్రీకర్‌రెడ్డి దంపతులు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారంలో నిహారికకు పుట్టింటి వారు ఓ ఇల్లు రాసివ్వగా...వీరు ఆ నివాసంలోనే ఉంటున్నారు. కాగా ఈ ఇల్లు రాసిచ్చిన విషయంలో నిహారిక, శ్రీకర్‌రెడ్డిల మధ్య తరుచు గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలోనే మంగళవారం తెల్లవారు జామున ఇంటి విషయంపై మరోసారి గొడవ జరగడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరగ్గా..తోపులాటలో నిహారిక కింద పడిపోయింది. అప్పటికే ఆవేశంలో ఉన్న శ్రీకర్‌రెడ్డి పక్కనే ఉన్న బండరాయితో తలపై కొట్టడంతో నిహారిక అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మేడిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

సంపులో పడి సెంట్రింగ్ కార్మికుడి మృతి



మృతుడు భాస్కర్ (ఫైల్)

కుషాయిగూడ: ప్రమాదవశాత్తు సంపులోపడి ఓ సెంట్రింగ్ కార్మికుడు మృతిచెందిన సంఘటన మంగళవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ హరీందర్ తెలిపిన వివరాల ప్రకారం..మల్లాపూర్, అశోక్‌నగర్‌కు చెందిన మనిగెల్ల భాస్కర్ (35) సెంట్రింగ్ కార్మికుడు. అశోక్‌నగర్‌లో ఆయన పనిచేసే సైట్‌లో ప్రమాదవశాత్తు సంపులో జారిపడ్డాడు. గమనించిన తోటి కార్మికుడు సంపులోంచి బయటకు లాగి గాయాలపాలైన భాస్కర్‌ను మల్లాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

- కేవలం గజం Rs.6,999/- మాత్రమే, DTCP లేఔట్ @ షాద్‌నగర్, రంగారెడ్డి గూడ, బెంగళూర్ హైవే & గజం Rs. 23,000/- HMDA లేఔట్ @ రుద్రారం, ముంబై హైవే సంప్ర: 7981301969 [H-783651]
- కంపెనీ డైరెక్ట్ 3.6 లక్షలకే 121 గజాలు ప్లాట్, యాదగిరిగుట్ట దగ్గరలో నెమల Village 24 నెలల EMI కలదు. Ph: 7842408719 [HA-8204]

TO-LET

- మియాపూర్, మయూరినగర్‌లో 2BHK, 1150-Sft, సెమీఫర్నిషెడ్ & విండోస్ విత్ మెష్ ఇల్లు అద్దెకు ఇవ్వబడును. Ph: 9963999252 [SCA24000952]

Services

BUSINESS SERVICE

- మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్.9100329739 [H-800520]

BUSINESS OFFER

- మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర।। 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6124]

PERSONAL CARE

CHANGE OF NAME

- I, Siddi Jagan Mohan Rao R/o : E 104, Mayflower Grande Apartments, Mallapur, Hyderabad -500076 changed my daughter name from SIDDI SHRUTHI to SIDDI SRUTHI [HA-1264]
- I, Rambabu Thammisetty S/o. Thirupathaiah, Passport No-T2505226 Dt: 6/02/2019 Changed my Wife name Venkata Girija Kalyani Thammisetty to Venkata Girija Kalyani Gunji for Passport purpose affidavit no 3816389 dated 09/2023. [HA-07442]
- I, Sandeep Saraf R/o. 506, Sathyasai Residency, Botanical Garden Road, Near Masjid Banda Kondapur, 500084 have changed my minor daughter's name from Kierra Saraf to Kierra Bhat Saraf. [HA-40218]
- I Tellapuram Tulasi Priya D/o, Nidumukkala Venkateswara Rao R/o H No 6-4-289, phase 4, mig 38, tv Colny, Vanasthalipuram 500070 have changed my name to Nidumukkala Tulasi Priya. [HA-40214]
- I, Gssvb Mohan Sarath S/o. G Krishna R/o. Flat 102, Plot 19 & 20, Sai Maruthi Lake View Apartments, Lake View Colony Road, Pragati Nagar, Nizampet, Hyderabad Pin: 500090 have changed my name to Mohan Sarath Gangadharuni. [HA-40226]

LOST

- I, P.Harshita W/o. Dr.P. Bhageerath Reddy, R/o. H.No.17-1-391/T/136, Saraswathi Nagar, Saidabad, Hyd-59. My Plot No.88, admeasuring 258.33 sq.yards in Sy. No. 302 to 399 situated at Nallagandla(v), Sherilingampally (M), Rangareddy (D) Gift Deed No.7926/2023, above said open plot link sale deed No.574/2001, has lost. ifany found pls Call: 9848672250 [SCA24001020]

OLD AGE HOME

- వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచాన నున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. ఫోన్ 7981467036, 9391039990. [H-783366]

TOURS & TRAVELS

- 8/5 చార్ధాంయాత్ర, సరస్వతి పుష్కరాలు. జూన్‌లో యమునోత్రి, గంగోత్రి, కేదార్, బద్రీనాథ్, జూలైలో పవిత్రకాశ్మీర్, అమర్నాథ్ యాత్ర.ఫోన్ 9849747093, 8121682275 [SCA24000980]
- రామేశ్వరం యాత్ర– 05 Feb 10 రోజులు, 30 క్షేత్రాలు, బ+వ+బో SV టూర్స్ & ట్రావెల్స్ Call: 8074512593/ 7660890099. [SCA24000988]
- మహాకుంభమేళ-18Jan 6జ్యోతిర్లింగాలు 3శక్తిపీఠాలు అయోధ్య నైమీషారణ్యం 11రోజులు వ+భో+బ SV టూర్స్ & ట్రావెల్స్. ఫోన్ 8074512593, 7660890099 [HA-1188]

Wanted

- డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కావలెను. 30 స్పీడ్ కలిగి ఉండాలి. జీతం అనుభవాన్ని బట్టి 12000 to 15000 ఇవ్వబడును. ఫోన్ : 9000697232 [SCA24001005]
- లేడీ టి,కా,,డే, ఎంట్రీ, (హోంబేస్డ్) DTP, వీ।। ఎడిటర్లు కలెక్షన్స్, ఆ-బాయ్స్, యాంకర్స్, డ్రై, సూ।।వై, హెల్పర్స్, జీ: 10-18K ఫ్రీ హాస్టల్+ట్రైనింగ్, Ph: 7780468727 [SCA24001004]
- క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటో నగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పని చేయుటకు 10th ఆపై చదివి 30 సం।। లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: Ph No: 87901 91999 [B-2]
- Wanted Lady promoters part time jobs. Timing 6AM - 10AM (4hrs Duty) Ph. 9912328814 / 9849814833 [SCA24001019]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్స్), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : జీఎస్టీ మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

క్లుప్తంగా...

సన్మానం



దేశాయి ప్రకాష్‌రెడ్డిని సన్మానిస్తున్న వాకిటి శ్రీహరి తదితరులు

లిబర్టీ: మాజీ అడ్వొకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డిని పలువురు నాయకులు ఆత్మీయ సత్కారం చేశారు. అందరికి న్యాయం అందించేందుకు అనేకేళ్లుగా అందిస్తున్న ప్రకాష్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శాసన సభ్యుడు వాకిటి శ్రీహరి, టీపీసీసీ గీత సెల్ రాష్ట్ర చైర్మన్ కేశవ నాగరాజ్‌గౌడ్‌లు సత్కరించి అభినందించారు. ప్రభుత్వ పక్షాన అడ్వొకేట్ జనరల్‌గా అనేకేళ్లుగా పనిచేస్తూ ఎన్నో కేసులను వాదించి విజయం సాధించారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. దేశాయి ప్రకాష్‌రెడ్డి న్యాయరంగంలో అపారమైన అనుభవం ఉందని శ్రీహరి నాగరాజుగౌడ్ తెలిపారు.

టీటీడీ దేవాలయం వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

- కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



ఏర్పాట్లను సమీక్షిస్తున్న వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని తొలిరోజు భక్తులు పెద్ద సంఖ్యలో రానున్న దృష్ట్యా జూబ్లీహిల్స్ టీటీడీ దేవాలయం వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, టీటీడీ సభ్యులు భోజిరెడ్డిలు జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఆలయం బయట మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా చూడాలని జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులను కోరారు. అనంతరం కార్పొరేటర్ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మెడికల్ ఆఫీసర్ భార్గవ్, శానిటేషన్ సూపర్‌వైజర్ అమిత్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో తస్కరించి... జార్ఖండ్‌లో విక్రయం

- సెల్‌ఫోన్ చోరీ ముఠా సభ్యుల అరెస్ట్
- రూ. 25 లక్షల విలువ చేసే 58 సెల్‌ఫోన్లు స్వాధీనం
- ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిందితులను పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సంజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తదితరులు

ఖైరతాబాద్: పథకం ప్రకారం నగరంలో సెల్‌ఫోన్లను తస్కరించి జార్ఖండ్‌లో విక్రయిస్తున్న సెల్‌ఫోన్ ముఠా సభ్యులను ఖైరతాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.25 లక్షల విలువ చేసే 58 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. మంగళవారం ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ ఏసీపీ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. డిసెంబర్ 30వ తేదీ రాత్రి 11 గంటల ప్రాంతంలో చింతలబస్తీ ప్రేమ్‌నగర్ ప్రాంతంలో ఫోన్ మాట్లాడుకుంటూ వెళ్తున్న మహేందర్‌రెడ్డి వద్ద నుంచి ముగ్గురు వ్యక్తులు ఫోన్ లాక్కొని పారిపోవడంతో వారిని వెంబడించి ఆ తరువాత ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజశేఖర్, డీఐ సైదులు నేతృత్వంలో ఎస్ఐ ఆర్. నాగరాజు ఏరియాలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి అనుమానంతో ముగ్గురిని తనిఖీలు చేయగా వారి గదిలో 58 ఫోన్లు గుర్తించి వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. దీపక్ కుమార్ (21), గోబింద్ కుమార్ (23), రాహుల్ నోయా (27) వీరంతా జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వారు కాగా, వీరితో పాటు మరో ముగ్గురు ప్రేమ్‌నగర్‌లో గది అద్దెకు తీసుకొని నివాసముంటూ సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడుతున్నారు. వీరందరికి మాస్టర్ మైండ్ పింకు మెహతా (30) జార్ఖండ్‌లో వీరందర్నీ ఎంపిక చేసి ఇక్కడికి తీసుకువచ్చి సెల్‌ఫోన్ చోరీలు చేయిస్తూ తిరిగి సెల్‌ఫోన్లను జార్ఖండ్‌కు తీసుకువెళ్లి అక్కడ సేల్ చేస్తుంటారు. డిసెంబర్ 24న మరో ఇద్దరితో కలిసి పింకు మెహతా జార్ఖండ్‌కు వెళ్లింది. వీరుకూడా మరో రెండు మూడు రోజుల్లో చోరీ చేసిన సెల్‌ఫోన్లతో జార్ఖండ్ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇంతలోనే వీరు పోలీసులకు చిక్కారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లలో ఐ ఫోన్లు 6, వన్ ప్లస్ ఫోన్లు 9, ఒప్పో 9, శాంసంగ్ 9, రెడ్‌మీ 7, వివో 8, మోటరోలా 3, ఐక్యూ 2, పికో 3, రియల్‌మీ 2 మొత్తంగా 58 ఫోన్లు ఉన్నాయి. ఖైరతాబా ద్, మొఘల్‌పురా, సైఫాబాద్, ఎస్ఆర్‌నగర్, చిక్కడపల్లి, మియాపూర్, మాదన్నపేట్ పో లీస్‌స్టేషన్ పరిధిలో చోరీ కేసులు నమోదైన ఫోన్లు రికవరీ అయినట్లు ఏసీపీ తెలిపారు. మిగతా వాటిని ఐఎంఈఐ నెంబర్ల ఆధారంగా బాధితులను గుర్తించి అందజేస్తామని తెలిపారు. ఈ మేరకు ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించి నిందితులను పట్టుకున్నందుకు ఏసీపీ అభినందించారు.

మీ సేవలు ఎప్పటికీ మరువలేనివి



ఉద్యోగ విరమణ పొందిన వారిని సత్కరిస్తున్న విక్రంసింగ్‌మాన్ తదితరులు

- ఇన్‌చార్జి సీపీ, అడిషనల్ సీపీ విక్రంసింగ్‌మాన్

బంజారాహిల్స్: ఉద్యోగ సమయంలో పోలీ సుశాఖకు అందించిన సేవలు మరువలేనివని ఇన్‌చార్జి సీపీ, అడిషనల్ సీపీ విక్రంసింగ్‌మాన్ అన్నారు. హైదరాబాద్ నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించిన ఇద్దరు ఎస్ఐలు, తొమ్మిది మంది ఏఎస్ఐలు, ఒక హెడ్‌కానిస్టేబుల్, ఒక ఎల్‌జీఎస్‌లు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని సిటీ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అడిషనల్ సీపీ విక్రంసింగ్‌మాన్ ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యకరమైన, సంతృప్తికరమైన జీవితాన్ని గడపాలన్నారు. ప్రతిరోజూ ఏదో ఒక పని చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామన్నారు. శేష జీవితం కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీనివాస్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు సముచిత గౌరవం



మాట్లాడుతున్న హబీబా సుల్తానా

రహమత్‌నగర్: రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో క్రైస్తవులకు అన్ని విధాలా సముచిత గౌరవం లభిస్తున్నదని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సతీమణి హబీబా సుల్తానా అన్నారు. డివిజన్‌లోని లివింగ్ షారోన్ చర్చిలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన క్రిస్మస్ ప్రేమవిందులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా హ బీబాసుల్తానా మాట్లాడుతూ క్రైస్తవుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కోఆర్డినేటర్ జేసుదాసు మాలాకీ, కవిత, కృష్ణవేణి, రెవరెండ్ కృపా సన్నిధి పాస్టర్లు అంద్రుపాల్, ప్రభుదాస్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ మహోత్సవం

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ ఫేజ్-1 అయ్యప్పస్వామి ఆలయంలో 36వ పడి పూజ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన పడి పూజా మహోత్సవంలో భక్తుల పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎత్తరి అంతయ్య మాట్లాడుతూ దినసరి కూలీలు అత్యధికంగా నివాసముండే ఈ ప్రాంతంలో స్వామివారి కృపతో అయ్యప్పస్వామి ఆలయం ఏర్పాటు చేయడమే కాకుండా, ప్రతి సంవత్సరం మాల ధారణ వేసే భక్తుల సంఖ్య పెరుగుతుండటం అభినందనీయమన్నారు. మణి గురుస్వామి భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న టీజీహెచ్‌సీఎల్ ఎండీ గౌతమ్

బంజారాహిల్స్: తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీహెచ్‌సీఎల్) ఎండీ, ఐఏఎస్ అధికారి వీపీ గౌతమ్ మంగళవారం బంజారాహిల్స్ డివిజన్‌లో జరిగే ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ప్రేమ్‌నగర్, ఎన్‌బీటీనగర్‌లలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఏవిధంగా జరుగుతుందో దగ్గరుండి పర్యవేక్షించారు. ఫొటోలను ఏవిధంగా అప్‌లోడ్ చేస్తున్నారు, అర్హుల ఎంపిక విషయంలో ఏయే అంశాలను పరిగణలోనికి తీసుకుంటున్నారనే అంశాలను పరిశీలించారు. ఆయనతో పాటు జూబ్లీహిల్స్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి కూడా ఉన్నారు.

నిమ్స్ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎనలేనిది

- ఉద్యోగ విరమణ పొందినవారిని సత్కరించిన డైరెక్టర్ బీరప్ప

లక్డీకాపూల్: నిమ్స్ అభివృద్ధిలో ఉద్యోగుల కృషి ఎంతో ఉందని నిమ్స్ డైరెక్టర్, ప్రొఫెసర్ నగరి బీరప్ప పేర్కొన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగులు ఎనలేని సేవలను అందిస్తున్నారన్నారు. నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో మంగళవారం జరిగిన ఉద్యోగుల ఉద్యోగ విరమణ వీడ్కోలు సభలో ఆయన పాల్గొని ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ పొందుతున్న సీనియర్ అసిస్టెంట్ ఎం. అరుణ, ప్లంబర్ గులాం వార్సీల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డా. శాంతివీర్, అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డా. ఎన్.లక్ష్మీ భాస్కర్, నిమ్స్ ఫైనాన్స్ కంట్రోలర్ మోహన్, ప్లానింగ్ విభాగం అధికారులు సుజాత, జ్యోతి శైలజా, నిమ్స్ మీడియా ఇంచార్జి సత్యాగౌడ్, పారా మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి భూషణ్‌రాజు, మాజీ ప్రధాన కార్యదర్శి శిరందాస్ శ్రీనివాస్ తదితర ఉద్యోగ సంఘం నాయకులు, సీనియర్ అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యోగ విరమణ చేస్తున్న తోటి ఉద్యోగులను ఘనంగా సన్మానించారు.



శుభ్ కలాష్ బంపర్ లక్కీ డ్రా విజేత పద్మభల్లా

బంజారాహిల్స్: పంజగుట్టలోని శుభ్ కలాష్ జ్యువెలర్స్‌లో బంపర్ లక్కీ డ్రా కార్యక్రమాన్ని మంగళవారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ లక్కీ డ్రాలో సైనిక్‌పురికి చెందిన పద్మభల్లా లక్కీ డ్రా విజేతగా నిలవగా ఆమె హోండా యాక్టివా బైక్ గెలుపొందింది. మొత్తం 200లకుపైగా ఎంట్రీ కూపన్ల నుంచి ఇన్‌ఫ్లూయెన్సర్ అపర్ణారెడ్డి లక్కీ డ్రా విజేతను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శుభ్ కలాష్ జ్యువెలర్స్ వ్యవస్థాపకుడు ధైర్యగోయెల్, కౌశిక్ చౌదరిలు మాట్లాడుతూ లక్కీ డ్రా కార్యక్రమాన్ని తాము ప్రతియేటా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. గత ఏడాది 1.2 లక్షల విలువైన హారాన్ని అందించడం జరిగిందన్నారు. ఈఏడాది హోండా యాక్టివా బైక్‌ను అందించామన్నారు. అనేక రకాల డిజైన్లలతో బంగారు, వెండి ఆభరణాలను అందిస్తూ కస్టమర్ల ఆదరణను చూరగొంటుమన్నారు.

వేడుకల్లో నిబంధనలు తప్పనిసరి

బంజారాహిల్స్: నిబంధనలు పాటిస్తూ నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర సూచించారు. మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో ప్రజలకు ఆయన పలు సూచనలు చేశారు. మద్యం సేవించి ట్రిపుల్ రైడింగ్ చేసి వాహనం నడపరాదన్నారు. గుంపులు గుంపులుగా చేరి నడిరోడ్డుపై కేక్‌లు కట్ చేసి అల్లర్లు చేయకూడదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై రూ.15 వేల జరిమానాతో పాటు వాహనం సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్ తీసి వేసి అధిక శబ్దాలతో హోరెత్తించడం, అతి వేగంతో రోడ్లపై తిరగడం, వాహనాలు నడుపుతూ విన్యాసాలు ప్రదర్శించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరైనా అత్యవసరం అయితే వెంటనే డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్ వినియోగానికి పూర్తిగా దూరంగా ఉండి నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకోవలన్నారు.

ఘనంగా ప్రేమ విందు

ఫిలింనగర్: క్రైస్తవులకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఇచ్చే ప్రేమవిందు కార్యక్రమం మంగళవారం జూబ్లీహిల్స్ డివిజన్‌లోని పటేల్‌నగర్ చర్చి వద్ద ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ క్రిస్మస్ కేక్ కట్ చేయడంతో పాటు ప్రేమ విందును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి ఏసుక్రీస్తు శాంతి, ప్రేమను ప్రబోధించారన్నారు. అనంతరం చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాస్టర్లు పీటర్, కృపారావు, నేతలు ఆంటోని, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

యువకుడి అదృశ్యం



కరీముల్లా

ఫిలింనగర్: గ్రానైట్ పనుల నిమిత్తం నగరానికి వచ్చిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా తాళ్లూరుకు చెందిన షేక్ జానీ మరో 10 మందితో కలిసి గ్రానైట్ పనులు నిమిత్తం నగరానికి వచ్చి షేక్‌పేట ఆదిత్య విల్లాస్‌లో నివాసముంటున్నారు. డిసెంబర్ 27వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో 10 మంది కలిసి భోజనాలు చేసి నిద్రపోయేందుకు వెళ్లారు. అందులో ఒకరైన తాళ్లూరు గ్రామానికే చెందిన పఠాన్ కరీముల్లా (19) ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో సహచరులు పలుచోట్ల గాలించినా ప్రయోజనం లేకుండాపోవడంతో షేక్‌జానీ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవ పడి.. ఇంటి నుంచి వెళ్లిపోయిన భర్త



మహేందర్‌రెడ్డి

ఫిలింనగర్: భార్యాభర్తల మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా భర్త ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఫిలింనగర్ బీజేఆర్‌నగర్‌కు చెందిన ఆర్. మహేందర్‌రెడ్డి, రాజశ్రీలకు 2011లో వివాహం జరిగింది. వీరికి ఆరాధ్య, అక్షయ అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. మహేందర్‌రెడ్డి డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. డిసెంబర్ 17వ తేదీన భార్యాభర్తల మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా గొడవ పడ్డారు. ఆ సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహేందర్‌రెడ్డి మళ్లీ తిరిగి రాలేదు. అతడి భార్య రాజశ్రీ పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో తన భర్త ఆచూకీ కనుగొనాలని ఫిలింనగర్ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త సంవత్సరంలో అందరికీ శుభాలు కలగాలి

లిబర్టీ: కొత్త సంవత్సరంలో అందరికీ శుభాలే కలగాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు కొత్త సంవత్సరంలో తమ కలలను నెరవేర్చుకోవాలన్నారు. మంగళవారం దళ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అనంత కాలగమనములో అప్పుడే ఏడాది పూర్తయిందని అన్నారు. గత సంవత్సరం అనుభవాలను జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ 2025వ సంవత్సరంలో ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తూ ప్రజలు విజయాలు సాధించాలని ఆయన కోరారు.

పార్క్ చేసిన ఆటో విడి భాగాలు చోరీ


బంజారాహిల్స్: పార్కింగ్ చేసిన ఆటో విడి భాగాలను చోరీ చేసిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని సయ్యద్‌నగర్‌కు చెందిన దైనంపల్లి కిరణ్‌కుమార్ (38) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. రోజూ మాదిరిగా ఆటో నడిపిన కిరణ్‌కుమార్ ఈ నెల 27న రాత్రి 8 గంటల సమయంలో తన ఆటో (టీఎస్ 03 టీ 0834)ను రోడ్డునెంబర్-12 ఎమ్మెల్యే కాలనీ లేన్‌నెంబర్-11లో పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు ఉదయం 7గంటలకు ఆటో వద్దకు వెళ్లి చూడగా ముందు, వెనుక టైర్లు, సైడ్ మిర్రర్లు, హెడ్‌లైట్లు, ఫ్రేమ్, బ్యాటరీ కనిపించలేదు. సమీపంలో పార్కింగ్ స్థలాల వద్ద వెతికినా వాటి జాడ దొరకలేదు. దీంతో దొంగతనానికి గురైనట్లు గుర్తించి బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు గాజులు మాయం

బంజారాహిల్స్: హ్యాండ్‌బ్యాగ్‌లో ఉంచిన ఆరు బంగారు గాజులు మాయమయ్యాయని ఇంటి యజమానురాలి ఫిర్యాదు చేసిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లో నివసించే రోయా రోజాటి (65) వృత్తిరీత్యా వైద్యురాలు. ఈ నెల 29న ఆరు తులాల బంగారు గాజులు ఉన్న హ్యాండ్‌బ్యాగ్‌ను వంట గదిలో పెట్టి ఉదయం 11 గంటల సమయంలో షాపింగ్‌కు వెళ్లింది. ఇంటికి తిరిగి వచ్చిన ఆమె హ్యాండ్‌బ్యాగ్ చూసుకోగా అందులో ఉంచిన ఆరు బంగారు గాజులు కనిపించలేదు. అయితే పని మనిషి అస్మా తీసి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు అస్మాపై బీఎన్ఎస్ 306 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

ఓయూ ఇంజినీరింగ్ పీజీ కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ పీజీ కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ ప్రొ.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఇండస్ట్రియల్ డ్రైవ్స్ అండ్ కంట్రోల్, పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో డిజిటల్ సిస్టమ్స్‌కు ఎన్‌బీఏ గుర్తింపు లభించినట్లు చెప్పారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 2027 జూన్ వరకు గుర్తింపు కొనసాగుతుందన్నారు. నవంబర్ 20, 30, డిసెంబర్ ఒకటో తేదీ వరకు మూడు రోజులపాటు ఎన్‌బీఏ నిపుణుల కమిటీ ఇంజినీరింగ్ కాలేజీని సందర్శించి అన్ని సౌకర్యాలను పరిశీలించి గుర్తింపు ఇచ్చినట్లు చెప్పారు. సహకరించిన అధ్యాపకులు, ఉద్యోగులకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

కొంగర జగ్గయ్య తెలుగు సినిమాకు వరం

ప్రతిభాపురస్కారాల ప్రదానోత్సవంలో వక్తలు



కిషోర్‌కుమార్, శ్రీనివాస్, సురేంద్రనాథ్‌లకు పురస్కారాలు బహూకరిస్తున్న స్వామి

చిక్కడపల్లి: వాచకంలో స్పష్టత గళంలో గాంభీర్యం నటనలో సహజత్వం ఉట్టి పడే ప్రముఖ నటుడు కొంగర జగ్గయ్య తెలుగు సినిమాకు వరం అని వక్తలు కొనియాడారు. మంగళవారం త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదికపై మానస ఆర్ట్స్ థియేటర్స్, త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో కొంగర జగ్గయ్య 89వ జయంతి సందర్భంగా ఆయన పేరిట ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. శ్రీకృష్ణ రాయబారం నాటకంలో శయదృశ్యం ప్రదర్శనలో నటించిన కిషోర్‌కుమార్, శ్రీనివాస్, సురేంద్రనాథ్‌లకు ప్రతిభా పురస్కారాలను ప్రముఖ కవి టీవీ స్వామి బహూకరించారు. పౌరాణిక, పద్యనాటకాలు తెలుగు సంస్కృతికి సంపద అని అన్నారు. సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు అధ్యక్షత వహించిన సభలో సంస్థ అధ్యక్షుడు రామచంద్రరావు, కవి రాఘశ్రీ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల వెలుగులో అంత్యక్రియలు



సెల్‌ఫోన్ టార్చ్‌ల వెలుతురులో అంత్యక్రియలు

లంగర్‌హౌస్: మృత్యువు అనేది అందరి కుటుంబాల్లో విషాదాన్ని మిగిలిస్తుంది. ఈ క్రమంలో అంత్యక్రియలకు వెళ్లినవారికి శ్మశానంలో చేదు అనుభవం ఎదురైతే.. ఇక ఆ బాధ వర్ణనాతీతం. ఇలాంటి సంఘటనే మంగళవారంరాత్రి లంగర్‌హౌస్‌లో చోటుచేసుకుంది. పేరుకే గొప్పదయిన దక్షిణ కాశీగా పిలవబడుతూ, ప్రముఖుల అస్థికలను నిమజ్జనం చేసే బాపుఘాట్ త్రివేణి సంగం శ్మశానవాటికలో కనీసం విద్యుత్ దీపాలు కూడా లేవు. మంగళవారం రాత్రి బీజేపీ నేత గడ్డి చంద్రశేఖర్ తల్లి అంత్యక్రియలను సెల్‌ఫోన్ల టార్చ్‌లైట్‌ల వెలుగులో పూర్తి చేయాల్సి వచ్చింది. అందరికి సహాయం చేసే ఆయన తల్లి అంత్యక్రియలు ఇలా చేయాల్సి రావడంతో బంధుమిత్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుద్దీపాల కోసం కొద్ది నెలలుగా అధికారులకు ఫిర్యాదు చేసినా వారు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని నాయకులు ఇంద్రసేనారెడ్డి, నాగేంద్రప్రకాష్ రెడ్డి, పాండుకుమార్ మండిపడ్డారు. ఇకనైనా అధికారులు కళ్లు తెరిచి ఈ శ్మశాన వాటికలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళా మేళా ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

వలస కూలీలపై 'బుల్డోజర్'!

భగీరథమ్మ, తౌతాని కుంటల్లో హైడ్రా ఆపరేషన్



- బఫర్ జోన్లలోఉన్నాయంటూ పలు షెడ్ల కూల్చివేత
- వీటిల్లో అద్దెకుంటున్న వలసకూలీలు రోడ్డున పడ్డారు..
- నోటీసులు ఇచ్చే చర్యలు తీసుకున్నామన్న హైడ్రా
- పదెకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నామని వెల్లడి



ఖాజాగూడ భగీరథమ్మ చెరువు బఫర్ జోన్‌లో రేకుల గదులు, షెడ్లను కూల్చివేసిన హైడ్రా అధికారులు



తలదాచుకునేందుకు దిక్కులేక రోడ్డుపైనే సామగ్రి పెట్టుకున్న వలస కూలీలు

సాక్షి, సిటీబ్యూరో/గచ్చిబౌలి: బుల్డోజర్ దూసుకు వచ్చింది. వలస కూలీలు రోడ్డున పడ్డారు. కూలీల నివాసాలు కూలిపోయాయి. తలదాచుకోవడానికి ఏ దిక్కూలేక ఐటీ కారిడార్‌లోని ఖాజాగూడ–నానక్‌రామ్‌గూడ ప్రధాన రహదారి వెంట నిరాశ్రయులుగా మిగిలిపోయి తల్లడిల్లుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న భగీరథమ్మ, తౌతానికుంట చెరువుల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను, రేకుల షెడ్లను హైడ్రా, రెవెన్యూ అధికారులు మంగళవారం తొలగించారు. రేకుల షెడ్లలో నివసిస్తున్న పలువురు వలసకూలీలు తమ సామగ్రితో రోడ్డు పక్కన దీనంగా ఉండిపోయారు. ఈ రెండు జలవనరుల సమీపంలో రేకుల గదులున్నాయి. వీటిలో కొన్నాళ్లుగా పలువురు వలసకూలీలు నివసిస్తున్నారు. ఆయా నిర్మాణాలు బఫర్ జోన్లలోకి వస్తాయని అధికారులు తేల్చారు. వీటిని ఖాళీ చేయాలంటూ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు హైడ్రా కమిషనర్ పేరిట వీరికి నోటీసులు అందించారు. మంగళవారం తెల్లవారుజామున ఐదు గంటలకు ఐదు యంత్రాలు వాటి వద్దకు రాగా, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కూల్చివేతలు జరిపారు. ఖాజాగూడ సర్వే నెంబర్ 18లో మల్లారెడ్డికి మూడెకరాల ఐదు గుంటలు, కావలి పోచయ్యకు మూడు ఎకరాల ఒక గుంట, మేకల అంజయ్యకు మూడు ఎకరాల గుంట కలిపి మొత్తం తొమ్మిది ఎకరాల ఏడు గుంటల భూమి ఉంది. భగీరథమ్మ చెరువును ఆనుకొని ఉన్న ఆ భూమిని కేవలం వ్యవసాయ అవసరాలకు మాత్రమే వాడాలి. అయితే యజమానులు వాటిలో ఎనిమిది రేకుల షెడ్లు, తొమ్మిది రేకుల గదులు నిర్మించి వలసకూలీలకు అద్దెకు ఇచ్చారు. దీంతో బఫర్ జోన్లలో వాణిజ్య కార్యకలాపాలు జరుగుతున్నట్లు అయింది. ఈ నేపథ్యంలోనే మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి హైడ్రా కూల్చేసింది.

వైన్‌షాపులకేమో గడువు ఇచ్చి..



మేం ఉంటున్నది బఫర్ జోన్ అని చెప్పారు. కేవలం 24 గంటల సమయం ఇచ్చి కూల్చివేశారు. చాలాకాలంగా ఇక్కడ ఉంటున్న మా స్థలాలను లాక్కోవడం ఎంత వరకు న్యాయమనేది అధికారులే చెప్పాలి. ఇదే సర్వే నెంబర్‌లో నాలాను ఆనుకొని ఉన్న వైన్‌షాపులకు మాత్రం నెల రోజులు గడువు ఎలా ఇస్తారు? ఇలా కూల్చేయడంతో వాటిలో ఉంటున్న కూలీలంతా సామగ్రితో రోడ్డు పైకి వచ్చారు. – మేకల అంజయ్య

సామగ్రి తీయకముందే కూల్చారు..



నోటీసులు ఇచ్చినోళ్లు సమయం కూడా ఇస్తే మేమే వెళ్లిపోతాం. సామగ్రి తీయకముందే జేసీబీలతో కూల్చివేతలు ప్రారంభించారు. రేకులు ఒక్కసారిగా కూలడంతో లోపలికి వెళ్లలేక పోయాం. కొంత సామగ్రి గదిలోనే ఉండిపోయింది. ఆరేళ్ల నుంచి కిరాణం సామగ్రి విక్రయిస్తూ పూట గడుపుకుంటున్నాం. సోమవారం సాయంత్రం 4 గంటలకు నోటీసు ఇచ్చి ఉదయాన్నే కూలగొట్టారు. – ధర్మేందర్

50 ఏళ్ల క్రితమే కొన్నాం



ఇక్కడ 50 ఏళ్ల క్రితం స్థలాన్ని కొనుగోలు చేశాం. అప్పటి నుంచి గేదెల దొడ్డి వేసుకొని ఉంటున్నాం. ఆరేళ్ల క్రితం రేకుల గదులు నిర్మించి అద్దెకు ఇచ్చాం. స్లాబ్‌లు కూడా వేయలేదు. ఉన్నట్టుండి బఫర్ జోన్ అని కూల్చివేస్తే మేం ఏమైపోవాలో అధికారులు సమాధానం చెప్పాలి. పెద్దల పట్ల ఒక విధంగా, పేదల పట్ల మరో విధంగా వ్యవహరించడం తగదు. – కావలి లక్ష్మణ్

స్థానికుల ఫిర్యాదు మేరకే చర్యలు

ఆ రెండు జలవనరులకు సంబంధించిన బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలు వెలిశాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. వీటి ఆధారంగా గత వారం క్షేత్రస్థాయిలో పర్యటించిన కమిషనర్ ఏవీ రంగనాథ్ వాస్తవాలు పరిశీలించారు. ఆయా చెరువుల ఫుల్ ట్యాంక్ లెవెల్, బఫర్ జోన్లలో ఆక్రమణలు జరిగినట్టు నిర్ధారించారు. రేకుల షెడ్లతోపాటు రేకుల ప్రహరీ నిర్మించి ఆక్రమించినట్లు గుర్తించాం. సంబంధీకులకు నోటీసులు ఇచ్చిన తర్వాత కూల్చివేతలు చేపట్టాం. మొత్తం పది 10 ఎకరాల ప్రభుత్వ, చెరువు భూముల స్వాధీనం చేసుకున్నాం. – హైడ్రా

బల్దియా కమిషనర్ రాజీనామా చేయాలి

బీజేపీ కార్పొరేటర్ల ఆందోళన.. అరెస్ట్ చేసిన పోలీసులు

లక్డీకాపూల్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వీధిదీపాల ఏర్పాటులో జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారంటూ బీజేపీ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం కార్పొరేటర్లు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గ్రేటర్ పరిధిలో అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ ఇలంబర్తి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బల్దియా అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి ఆందోళన కారులు, కార్పొరేటర్లను అరెస్ట్ చేశారు.

మార్చి 8, 9 తేదీల్లో పద్మశాలి మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న కందగట్ల స్వామి

కాచిగూడ: అఖిల భారత పద్మశాలి సంఘం 17వ మహాసభ, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం 8వ మహాసభలను మార్చి 8, 9 తేదీల్లో నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి తెలిపారు. మంగళవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి అధ్యక్షతన మహాసభల సన్నాహక సమావేశం జరిగింది. పద్మశాలీలు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేసే విధంగా సంఘ ప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి గడ్డం జగన్నాథం, మహిళా సంఘం జాతీయ అధ్యక్షురాలు వనం దుశ్యంతల, నాయకులు మాచర్ల రామచంద్రరావు, బొమ్మ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

14 వేల భవనాలకు అనుమతులు

- ఆదాయం రూ.815 కోట్లు
- గత ఏడాది కంటే తగ్గిన టౌన్‌ప్లానింగ్ ఆదాయం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం 2024లో 14,043 భవన నిర్మాణాలకు అనుమతులు జారీ చేసింది. వాటి ద్వారా జీహెచ్‌ఎంసీ ఖజానాకు రూ.815.76 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల వల్ల ఆదాయం తగ్గిందని భావించారు. ఈ సంవత్సరం లోక్‌సభ ఎన్నికలతో పాటు హైడ్రా భయాల వల్ల కూడా ఆదాయం తగ్గినట్లు చెబుతున్నారు. అయితే.. గత రెండేళ్లుగా జీహెచ్‌ఎంసీ పరిధిలో నివాస భవనాలు, సామాన్య మధ్యతరగతి వారు నిర్మించే భవనాలే ఎక్కువ నిర్మాణం జరిగాయని, వ్యాపార భవనాలు పెద్దగా నిర్మాణాలు కాలేదని అధికారులు చెబుతున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఖాళీస్థలాలు లేకపోవడం వల్ల కూడా బహుళ అంతస్తుల నిర్మాణాలు తగ్గినట్లు భావిస్తున్నారు.

భూసేకరణే లక్ష్యం

2025లో హైసిటీ ప్రాజెక్టులు, మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా రహదారుల విస్తరణలకు ఎక్కువ ఆస్తులు సేకరించాల్సి ఉందని టౌన్‌ప్లానింగ్ విభాగం పేర్కొంది. 2024లో రహదారుల విస్తరణకు ప్రభుత్వం రూ. 200 కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో ఆ పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు పేర్కొంది. అలాంటి వాటిల్లో డబీర్‌పురా పీఎస్– నాగబౌలి, షేక్ ఫైజ్‌ఖాన్–డబీర్‌పురా ఫ్లై ఓవర్, బడాబజార్– భవానీనగర్, శాస్త్రిపురం జంక్షన్– ఫలక్‌నుమా బస్‌డిపో మార్గాలున్నట్లు తెలిపింది. జంక్షన్ల అభివృద్ధిలో భాగంగా 90 జంక్షన్ల విస్తరణ కోసం పోలీసుశాఖతో కలిసి జరిపిన క్షేత్రస్థాయి సర్వేల మేరకు సదరు ప్రాంతాల్లో భూసేకరణకు రూ.233 కోట్లు అవసరమవుతాయని పేర్కొంది.

సేవలతోనే ఉద్యోగికి గుర్తింపు: ఇలంబర్తి

పదవీ విరమణ పొందిన 14 మంది జీహెచ్‌ఎంసీ ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు



జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ దేవానంద్‌ను సత్కరిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

లక్డీకాపూల్: విధి నిర్వహణలో భాగంగా అందించిన సేవలతోనే ప్రతి ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని వివిధ కేటగిరీలకు చెందిన 14 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం వారికి వీడ్కోలు సభను నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇలంబర్తి మాట్లాడుతూ తాజాగా పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తమ ఉద్యోగ జీవితంలో ఎంతో నిబద్ధత, అంకితభావంతో సంస్థకు సేవలందించారన్నారు. వారి కృషి, అందించిన సేవలు సహచర ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. రిటైర్మెంట్ అనేది జీవితంలో కొత్త అధ్యాయం లాంటిదని, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ముున్ముందు జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ చెందిన వారిలో ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజనీర్ ఎం.దేవానంద్ తదితరులున్నారు.

ఫిబ్రవరి 26, 27 తేదీల్లో ఉర్దూ సోషల్ సైన్స్ కాంగ్రెస్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలో ఉర్దూ సోషల్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని 'మనూ'స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ షాహిదా మంగళవారం తెలిపారు. సెంటర్ ఫర్ విమెన్ స్టడీస్, స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్, ఉర్దూ విశ్వవిద్యాలయంలోని అల్ మెరూని సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఇన్‌క్లూజన్ సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 26, 27 తేదీల్లో అంతర్జాతీయ ఉర్దూ సోషల్ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో పాల్గొనేవారు తమ సారాంశ పత్రాలను జనవరి 20 వరకు సమర్పించాలని సూచించారు. జనవరి 25వ తేదీలోపు నిర్వాహకులు వాటికి అంగీకారం తెలపనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి పత్ర సమర్పణకు గడువు ఫిబ్రవరి 15 తేదీ అని తెలిపారు. ఇందుకు ఎలాంటి రిజిస్ట్రేషన్ ఫీజు ఉండదని, పేపర్లు ఉర్దూలో మాత్రమే రాయాలని అన్నారు. మరిన్ని వివరాలకు కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ సయ్యద్ నజీవుల్లా (ఫోన్ నెంబర్ 97057 04939)ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కవాడిగూడ: ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) నూతన సంవత్సర డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ డీఏలు, కాంట్రాక్టు ఉద్యోగుల పేస్కేలు ఇవ్వాలని కోరారు. విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయించి, ప్రాథమిక పాఠశాలను బలోపేతం చేయాలన్నారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలని టీఎస్‌యూటీఎఫ్ తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 28, 29, 30 తేదీలలో నల్లగొండ పట్టణంలో జరిగిన 6వ రాష్ట్ర మహాసభల్లో నూతన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీని, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులుగా చావ రవి, ప్రధాన కార్యదర్శిగా ఎ.వెంకట్, ఉపాధ్యక్షులుగా కె.జంగయ్య, సీహెచ్ దుర్గాభవాని, కోశాధికారిగా టి.లక్ష్మారెడ్డి, 16 మంది కార్యదర్శులు, 21 మందితో కలిపి రాష్ట్ర ఆఫీస్ బేరర్‌లు, ఏడుగురితో రాష్ట్ర ఆడిట్ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. కుటుంబ సంక్షేమ నిధి (ఎస్‌డబ్ల్యూఎఫ్) చైర్మన్‌గా ఎం.రాజశేఖర్‌రెడ్డి, సెక్రెటరీగా జీవీ నాగేశ్వర్‌రావు, కోశాధికారిగా వై.సైదులుతోపాటు 18 మందితో రాష్ట్ర కమిటీని ఎన్నికున్నట్లుగా వెల్లడించారు.

కేలండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: నూతన సంవత్సరంలో శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ నాగదేవత ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం నిజాంపేట్‌లోని శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ నాగదేవత దేవాలయం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం కేలండర్‌ను ఆలయ ధర్మకర్త మేకల నాగేష్ రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవాలయ చరిత్ర పుస్తకాన్ని మంత్రికి అందజేశారు.

కార్గిల్ వీరుడికి గౌరవం



కామేశ్వరరావుకు మూవీ ఫైట్ మాస్టర్స్ అసోసియేషన్ సభ్యత్వాన్ని ఇస్తున్న రామకృష్ణగౌడ్

కుత్బుల్లాపూర్: వివిధ పాఠశాలల విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్న కార్గిల్ యుద్ధవీరుడు పి.కామేశ్వరరావు (బుడికై కరాటే 5వ డిగ్రీ బ్లాక్‌బెల్ట్ ఎన్‌ఎస్‌జీ)కు తెలంగాణ మూవీ ఫైట్ మాస్టర్స్ అసోసియేషన్ తరపున అరుదైన గౌరవం దక్కింది. మంగళవారం అసోసియేషన్ తరపున నిర్మాత ప్రతాని రామకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో కామేశ్వరరావుకు మూవీ ఫైట్ మాస్టర్స్ అసోసియేషన్ సభ్యత్వాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అవమానించిన అమిత్ షా

నల్ల రాధాకృష్ణ



నిరసన వ్యక్తం చేస్తున్న డీఎస్‌ఎస్ నాయకులు

జవహర్‌నగర్: బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాని వెంటనే బీజేపీ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని బీఆర్‌అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘర్షణ సమితి (డీఎస్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్‌ఎస్ నేషనల్ కో–ఆర్డినేటర్ నల్ల రాధాకృష్ణ మాట్లాడుతూ అంబేడ్కర్‌ని అనడమంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొల్లా పద్మారావు, జిల్లా సెక్రటరీ నగేష్, జవహర్‌నగర్ యూత్ అధ్యక్షుడు మామిడిపల్లి పరమేష్‌చారి, సెక్రటరీ నాగరాజు, సభ్యులు నాగేశ్వర్‌రావు, విష్ణు, ఉపేందర్, శాంతారామ్, మహేష్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు వెళ్తే ఊరుకోం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



గుజ్జ సత్యంను సత్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: బీసీలరిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే రాష్ట్రంలో అగ్గి రాజేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం హెచ్చరించారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో కాచిగూడలో జరిగిన సమావేశంలో గుజ్జ సత్యంను జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య గజమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రావాల్సిన వాటా బీసీలకు దక్కాలని, 60 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. దీని కోసం అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్షాలను ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరారు. కేవలం 6 శాతం ఉన్న వారికి పదవులు ఇచ్చి 60 శాతానికి పైగా ఉన్న వాళ్లను అణగదొక్కాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో కులగణన సర్వే సంపూర్ణంగా జరగలేదని ఆరోపించారు. హైదరాబాద్ నగరంలో అద్దెకు ఉంటున్న వారి ఇళ్లల్లో సర్వే చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరిగిన కులగణనపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బాధితుడికి 'ప్రజావాణి' వీల్‌చైర్





శేఖర్‌కు వీల్‌చైర్ అందించిన చిన్నారెడ్డి, అర్జీలు స్వీకరిస్తున్న దృశ్యం

- మొత్తం 1554 అర్జీల నమోదు
- స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య

లక్డీకాపూల్: పక్షవాతం వచ్చి కాలు, చేయి పనిచేయకుండా పోయిన ఓ వ్యక్తికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ ఘటన మంగళవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో చోటుచేసుకుంది. నగరంలోని కాటేదాన్ టీఎంజీ కాలానికి చెందిన ఎస్.శేఖర్ ప్రైవేట్ కంపెనీలో వాచ్‌మెన్. అనారోగ్య సమస్యల కారణంగా అతడికి పక్షవాతం రావడంతో కుడికాలు, కుడి చేయి పనిచేయడంలేదు. తన సమస్యను విన్నవించుకునేందుకు శేఖర్ మంగళవారం ప్రజావాణికి వచ్చారు. అతడి పరిస్థితిని గమనించిన చిన్నారెడ్డి ప్రజావాణి ద్వారా వీల్‌చైర్‌ను అందజేశారు. దీంతో శేఖర్ సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఈ కార్యక్రమంలో ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్ రెడ్డి, అధికారులు జగన్, సాయి, సహదేవ్, శేషు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల కోసం 1,200 దరఖాస్తులు

ప్రజావాణి కార్యక్రమంలో 1,554 అర్జీలు నమోదయ్యాయి. అందులో 1,200 మంది డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించి 141 అర్జీలు, విద్యుత్ శాఖ 71, రెవెన్యూ శాఖ 42, ఇతర శాఖలకు సంబంధించి వంద అర్జీలు అందాయి. ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కొన్ని అర్జీలను సంబంధిత అధికారులకు సిఫారసు చేశారు.

బాలాజీ దర్శనానికి పోటెత్తనున్న భక్తులు

ఆలయంలో పూర్తయిన ఏర్పాట్లు





బాలాజీ దేవాలయం, భక్తుల క్యూలైన్ల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు

మొయినాబాద్: నూతన సంవత్సరం మొదటి రోజు సందర్భంగా బుధవారం చిలుకూరు బాలాజీ దేవాలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ అర్చకులు, గ్రామ పంచాయతీ, పోలీస్ శాఖ తగిన ఏర్పాట్లు చేశారు. వాహనాల పార్కింగ్, భక్తులు ఇబ్బందులు పడకుండా క్యూలైన్లు సిద్ధం చేశారు. ఆర్టీసీ బస్సులు ఆలయానికి కిలోమీటర్ దూరం నుంచే వెనక్కి వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. అక్కడి నుంచే భక్తులు కాలినడకన ఆలయానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఆలయ ప్రాంగణంతోపాటు బయట కూడా క్యూలైన్లకోసం బారికేడ్లు రెడీ చేశారు. భక్తులందరికీ మహాద్వార దర్శనం ఉంటుంది. బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉంది. ఆర్టీసీ అదనపు బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. బుధవారం అదనంగా మరో 10 బస్సులను 70 ట్రిప్పులు నడుపుతామని మెహిదీపట్నం డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 1, జనవరి, 2025

క్రికెట్ ఈ మాట చెప్పగానే మనలో చాలా మందికి పూనకాలు వచ్చేస్తాయి.. చూసేవాళ్లకే ఆ రేంజ్‌లో పూనకాలొస్తే.. ఆడేవాళ్ల పరిస్థితి ఏంటి? ఆ మాట అన్నంత ఈజీకాదు ఆడటం.. పైగా గల్లీ టీమ్‌లో ఆడటం ఒకెత్తయితే.. అండర్ -19 జట్టులో ఆడటం మరో ఎత్తు.. అందునా ఓ మహిళ క్రికెట్ టీమ్‌కి సెలక్ట్ కావడం అంటే అదో గొప్ప సక్సెస్‌గానే చెప్పాలి.. అలా క్రికెట్ పట్ల ఎంతో ఆసక్తితో, కఠోరమైన సాధనతో ఐసీసీ అండర్-19 ప్రపంచ మహిళా జట్టుకు ఎంపికైంది రామంతాపూర్‌కు చెందిన కేసరి ధ్రితి.. ఈ నేపథ్యంలో ఆమె గురించిన మరికొన్ని విశేషాలు.. - రామంతాపూర్



ఇంటి పేరు కేసరి..
ఆటలో నేర్పరి..





115 క్రికెట్ మ్యాచ్‌లలో 695 పరుగులు, 155 వికెట్లు	ఐసీసీ అండర్-19 ప్రపంచ మహిళా క్రికెట్ పోటీలకు ఎంపిక
ఆడిన ప్రతి మ్యాచ్‌లో అద్భుత మైన ప్రదర్శనతో	రామంతాపూర్ వాసి కేసరి ధ్రితి ప్రతిభ

క్రీడల్లో పాల్గొనాలని ఆసక్తి, మక్కువ ఉంటే సరిపోదు.. ఆ క్రీడపై పట్టు సాధించడానికి నిత్యం సాధన చేస్తే ఎటువంటి లక్ష్యాన్ని అయినా చేరుకోవచ్చని నిరూపించింది క్రికెటర్ ధ్రితి. తన 13వ ఏట నుంచే మాదాపూర్‌లోని రామానాయుడు క్రికెట్ అకాడమీలో ప్రముఖ క్రికెటర్ చాముండేశ్వరీనాథ్ పర్యవేక్షణలో కఠోర శిక్షణ తీసుకుంటూ పలు క్రికెట్ పోటీల్లో తన ప్రతిభను చూపుతోంది ధ్రితి. రామంతాపూర్‌కు చెందిన 18 ఏళ్ల ధ్రితి కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో క్రికెట్ మ్యాచ్‌లు ఆడుతూ తనలోని ప్రతిభను చాటుకుంటోంది. ప్రస్తుతం డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న ధ్రితి ప్రతి మ్యాచ్‌లో చిచ్చర పిడుగులా చెలరేగుతూ సునామీల పరుగులు తీస్తూ వికెట్లు తీస్తూ ప్రతిభ చూపుతోంది.

తండ్రి శ్రీకాంత్ ప్రోత్సాహంతో..

హైదరాబాద్ క్రికెట్ క్రీడాకారుడైన తన తండ్రి కేసరి శ్రీకాంత్ ఇచ్చిన ప్రోత్సాహంతో ఆయనను స్ఫూర్తిగా తీసుకొని క్రికెట్‌లో ముందుకు కదిలింది. దీంతోపాటు తల్లి సహకారం ధ్రితికి ఎంతో మేలు చేసింది. వృత్తిరీత్యా న్యూట్రిషనిస్ట్ అయిన తన తల్లి లావణ్య కేసరి ఆహార నియమాలు, సలహాలు ఫిట్‌గా ఉండటానికి దోహదపడ్డాయి. మాజీ క్రికెటర్ పరమేశ్వర్ భవనాక్ వ్యక్తిత్వ వికాస సూచనలు క్రికెట్‌లో ధ్రితి సంచలనాలను సృష్టించేలా చేస్తోంది. ఇప్పటి వరకూ ధ్రితి ఆడిన 115 లీగ్, జాతీయ, అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లో 695 పరుగులు, అదే విధంగా ఆఫ్ బ్రేక్ బౌలర్‌గా 155 వికెట్లు తీసి ఆల్‌రౌండర్ ప్రదర్శనతో తన సత్తా చాటుతోంది ధ్రితి.

క్రికెట్ మ్యాచ్‌లు..

ధ్రితి అండర్-19, అండర్-23 వంటి క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొంది. అండర్-19 ఛాలెంజర్ ట్రోఫీ ట్రీ సిరీస్ క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొంది. మలేషియాలో జరిగిన అండర్-19 ఆసియా కప్ పోటీల్లో భారత జట్టులో పాల్గొంది. ఈ పోటీలో భారత్ విజయం సాధించింది. అదే విధంగా జాతీయ క్రికెట్ అకాడమీ దేశంలోని 25 మంది అగ్రశ్రేణి క్రికెట్ క్రీడాకారులతో నిర్వహించిన శిక్షణా శిబిరంలో పాల్గొని శిక్షణలో సీనియర్ల నుంచి క్రికెట్‌లోని మెళకువలు నేర్చుకుంది.

సీనియర్ మహిళా టీమ్‌లో స్థానమే లక్ష్యంగా..

భారత సీనియర్ మహిళల క్రికెట్ టీమ్ స్థానం సంపాదించి దేశం తరపున పలు అంతర్జాతీయ క్రికెట్‌లో పాల్గొని అత్యుత్తమ ఆల్ రౌండర్ క్రీడాకారిణిగా నిలబడటమే నా లక్ష్యం. క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఆడటానికి కారణం ప్రముఖ క్రికెటర్ చాముండేశ్వరీనాథ్ పర్యవేక్షణలో క్రమశిక్షణతో తన స్థానాన్ని పదిలపరుచుకుంది. ఆయన నాకు క్రికెట్‌లో మెళకువలతోపాటు క్రీడలో ఉన్నప్పుడు ఏ విధంగా మనో నిబ్బరంతో మసలుకోవాలనే ఆదేశాలు, సూచనలు నా ఉన్నత స్థానానికి కారణాలు. - కేసరి ధ్రితి



అవార్డులు..

పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న ధ్రితికి పలు మ్యాచ్‌లలో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది బౌలర్ అవార్డులు లభించాయి.
- ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ మహిళా పోటీలకు కేసరి ధ్రితి మలేషియా వేదికగా 2025 జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకూ నిర్వహించే అండర్-19 మహిళా టీ 20 ప్రపంచ కప్ పోటీలకు నగరం నుంచి కేసరి ధ్రితిని బీసీసీఐ సెలక్ట్ కమిటీ ఎంపిక చేసింది. మలేషియా కౌలాలంపూర్‌లో బయు మస్ ఓవల్‌లో భారత జట్టు (డిపెండింగ్ ఛాంపియన్) అదిత్య మలేషియా, వెస్టిండీస్, శ్రీలంక జట్లు గ్రూప్ ఏలో ఉన్నాయి.



డ్రగ్స్ అవసరమా డార్లింగ్..

ప్రభాస్ ప్రచార చిత్రం విడుదల

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన యాంటీ డ్రగ్స్ అవగాహనా కార్యక్రమానికి రెబల్ స్టార్ ప్రభాస్ మద్దతు ప్రకటించారు. డ్రగ్స్ వినియోగం వద్దనే సందేశాన్ని అందించే ప్రచార చిత్రాన్ని మంగళవారం విడుదల చేశారు. 'జీవితంలో మనకు బోలెడన్ని సంతోషాలు ఉంటాయి. కావాల్సినంత ఆనందం ఉంది. మనల్ని ప్రేమించే మనుషులు, మన కోసం బతికే మనవాళ్లు ఉన్నప్పుడు.. ఈ డ్రగ్స్ అవసరమా డార్లింగ్స్. ఈ రోజు నుంచే డ్రగ్స్ వదిలేయండి. మీకు తెలిసి ఎవరైనా డ్రగ్స్ బానిసలుగా మారితే టోల్ ఫ్రీ నెంబర్ 8712671111కు కాల్ చేయండి. వారు పూర్తిగా కోలుకునే విధంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు.

నేడు మహేశ్వరీ, చందేరీ ఫెస్టివల్ ప్రారంభం

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ ఆడిటోరియంలో మహేశ్వరీ, చందేరీ ఫెస్టివల్ బుధవారం ఏర్పాటు చేయనున్నారు. ఈఫెస్టివల్ ఈనెల 14 వరకూ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బ్లాక్‌ప్రింట్ చీరలు, సాంప్రదాయ దుస్తులు, చందేరీ, మహేశ్వరీ, కోస సిల్క్ చీరలు, బెడ్ కవర్స్, బాతిక్, బాగ్, కెమికల్ ప్రింట్, డ్రెస్ మెటీరియల్, దుప్పట తదితర ఉత్పత్తులు అందుబాటులో ఉండనున్నాయి. ఈ ఉత్పత్తులపై 20 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎన్నో ఆశలతో, మరెన్నో లక్ష్యాలతో ఒక కొత్త సంవత్సరాన్ని ప్రారంభిస్తాం. ఒకానొక రోజు ఆ ఏడాది సైతం ముగుస్తుంది.. మళ్లీ కొంగొత్త ఆశలతో, మరిన్ని లక్ష్యాలతో నూతన ఏడాదిలోకి అడుగు పెడతాం. ఇదే జీవన ప్రమాణంగా మొదలు-చివర అనే రెండు రోజుల మధ్య వేడుకలు జరుపుకుంటాం. ఇలాంటి ఇయర్ ఎండ్ వేడుకలకు హైదరాబాద్ నగరం హాట్ స్పాట్ అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ నేపథ్యంలో సౌత్, నార్త్ అని తేడా లేకుండా దేశవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రముఖ డీజేలు, బాలీవుడ్ సింగర్లు నగరంలో సందడి చేశారు. జూబ్లీహిల్స్, గచ్చిబౌలీ, బంజారాహిల్స్ వంటి ప్రాంతాల్లో ప్రత్యేక న్యూ ఇయర్ ఈవెంట్లలో నగరవాసులు పాల్గొని లైవ్ మ్యూజిక్, హిప్ హాప్‌స్టెప్స్ వేస్తూ కొత్త ఏడాదికి ఆహ్వానం పలికారు. - సాక్షి, సిటీబ్యూరో

నాద వినోదం.. నాట్య విలాసం..

అలిండియా క్రాఫ్ట్ మేళా ముగింపులో అలరించిన కూచిపూడి, కథక్



మాదాపూర్: మాదాపూర్ శిల్పారామంలో నిర్వహిస్తున్న అలిండియా క్రాఫ్ మేళా మంగళవారంతో ముగిసింది. చివరి రోజు కావడంతో సందర్శకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చివరిరోజు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా కూచిపూడి, కథక్ నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. ప్రముఖ నాట్య గురువు సంజయ్ జోషీ శిష్య బృందంచే కథక్ నృత్యప్రదర్శన అలరించింది. కృష్ణ థాట్, కృష్ణవందన, వసంత్‌రాస్, సూర్‌దాస్ భజన, తరణ, తాల్‌తీన్‌తాల్, తదితర అంశాలను సంజయ్‌జోషీ, అనుష్క, అత్రేయి, నేహ, ప్రేమ, ఆర్య, అదితి, మధుమితలు ప్రదర్శించారు. కూచిపూడి నాట్య గురువు బిందు అభినయ్ శిష్య బృందం మోదమున, జతిస్వరం, ఆనందతాండవం. రామాయణశబ్దం, మండూకశబ్దం, తక్కువేమి మనకు వంటి అంశాలను యామిని, గార్గేయి, జగతి, మోక్ష, ఉదయశ్రీ, రజిత, ప్రీతి, శ్రీహిత ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు.

- నగరంలో అంబరాన్నంటిన సంబరాలు..
- ఈ సారి లైవ్ డీజే ప్లేయర్లదే హవా..
- సౌత్-నార్త్ నుంచి నగరానికి తరలి వచ్చిన కళాకారులు
- సందడి చేసిన టాలీవుడ్ టాప్ సింగర్లు..
- అంతగా కనిపించని సినీ సెలిబ్రిటీలు..
- మైమరిపించే ఈవెంట్లలో మునిగితేలిన యువత



నూతనం.. వినూత్నం

ప్రైవేటు పార్టీల్లో సెలబ్స్..

ఈ మధ్య నగరంలో నెలకొన్న కొన్ని పరిస్థితుల దృష్ట్యా ఈ సారి వేడుకల్లో టాప్ సెలిబ్రిటీల సందడి అంతగా కనిపించలేదు. దీంతో సెలిబ్రిటీలు ప్రైవేట్ పార్టీలకే పరిమితమయ్యారు. న్యూ ఇయర్ గ్రాండ్ ఈవెంట్లలో లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌లలో మాత్రం టాప్ సింగర్లు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో కొన్ని ఫ్యాషన్ షోలలో మాత్రం టాప్ మోడల్స్ తమ క్యాట్‌వాక్‌తో ఆకట్టుకున్నారు.

ట్రా'వెల్' అండ్ గుడ్..

వేడుకల నేపథ్యంలో నగరంలో ఆన్‌లైన్ ట్రాన్‌పోర్ట్ బుకింగ్స్ రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. నగరంలో నిర్వహించిన పలు పార్టీల్లో లిక్కర్ కూడా ఉండటంతో పోలీసుల డ్రంకన్ అండ్ డ్రైవ్ చెకింగ్‌కు చెక్ పెట్టడానికి ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి మొబైల్ యాప్‌లలో వాహనాలను బుక్ చేసుకున్నారు పలువురు ఔత్సాహికులు. మరో వైపు నగరంలో మెట్రో ట్రైన్ సేవలు కూడా అర్ధరాత్రి వరకూ పొడిగించారు.

ఓపెన్ గ్రౌండ్స్‌లో..

ఓపెన్ గ్రౌండ్ ఈవెంట్లు, లైవ్ కాన్సర్ట్‌లలో యువత అధిక సంఖ్యలో పాల్గొనగా.. రెస్టారెంట్లు, రెస్టోబార్లు, క్లబ్‌లలో కుటుంబ సమేతంగా పాల్గొని డిసెంబర్ 31 వేడుకలను ఆస్వాదించారు. ఇందులో భాగంగా హైటెక్ సిటీ, గచ్చిబౌలీ, జూబ్లీహిల్స్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో రెస్టారెంట్లు, క్లబ్‌లు నగరవాసులతో కిటకిటలాడాయని నిర్వాహకులు పేర్కొన్నారు.







గతంలో విభిన్న వేదికల్లో.. వినూత్నంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించే వారు. కానీ ఈ సారి మాత్రం డీజేలదే హవా.. ఎక్కడ చూసినా లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్స్, ప్రముఖ సింగర్లతో సింగింగ్ ఈవెంట్లతో నగరమంతా మ్యూజిక్‌తో నిండిపోయింది. ఇందులో భాగంగా అటు బాలీవుడ్ ఇటు టాలీవుడ్ సింగర్లు తమ పాటలతో అలరించారు. నగరంలో జరిగిన పలు ఈవెంట్లలో ప్రముఖ టాలీవుడ్ సింగర్లు సునీత, కార్తీక్, మంగ్లీ, రామ్ మిరియాల, సింహా వంటి వారితో పాటు అంజాద్ అలీ ఖాన్ వంటి బాలీవుడ్ సింగర్లు హోరెత్తించే పాటలతో అలరించారు. హైటెక్స్‌లోని హెచ్ఐసీసీ నోవోటెల్‌లో నిర్వహించిన వేడుకల్లో టాలీవుడ్ గ్లామర్ క్వీన్ శ్రీలీల పాల్గొని మరింత గ్లామర్ పెంచారు.

మైమరిపించే ఈవెంట్లు..

ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన ఈవెంట్లలో నగరవాసులు తమను తాము మైమరచిపోయి ఆస్వాదించారు. విభిన్న ఆహార రుచులు, డ్రింక్స్‌తో పాటు ఈ సారి వేడుకల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టాటూ పాయింట్స్ సెల్ఫీ బూత్‌లలో కొత్త సంవత్సర వేడుకలను మరింత గ్రాండ్‌గా చేసుకున్నారు. నగరంలోని జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్, ఎఫ్ఎన్‌సీసీ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్, నోవోటెల్ నై 2024, కంట్రీ క్లబ్, ప్రిసమ్ ది ప్రిజమ్ సర్కస్ 4.0, బేగంపేట్ హాకీ గ్రౌండ్స్ ఆసియా బిగ్గెస్ట్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్, బౌండర్ హిల్స్ క్లబ్ మ్యూజిక్ నైట్, క్షత్రియా హోటల్ వన్ లాస్ట్ నైట్, హైటెక్స్ ఎరీనా హైదరాబాద్ బిగ్గెస్ట్ న్యూ ఇయర్ బాష్, న్యూ ఇయర్ బీచ్ ఈవెంట్స్ వంటివి ఈవెంట్స్ విశేషంగా అలరించాయి.

కుటుంబంతో కలిసి..

ఏడాదంతా స్నేహితులతో కలిసే ఎంజాయ్ చేస్తాం. కానీ ఈ ఏడాదిని నా కుటుంబంతో కలిసి ముగించాలనుకున్నాను. అందుకే ప్రత్యేకంగా మేమంతా రెస్టారెంట్‌లో వేడుకలను ప్లాన్ చేసుకున్నాం. నచ్చిన ఆహారం తింటూ.. కేక్ కట్ చేసి నూతన ఏడాదికి కుటుంబ సమేతంగా ఆహ్వానం పలికాం.
- విహాన్ చక్రవర్తి, గచ్చిబౌలి

రెండు వారాల ముందే..

ఏడాదంతా సంతోషాలు, బాధలు ఆశలు ఆశయాలతో జీవితాన్ని నెట్టుకొస్తాం. అవన్నీ మర్చిపోడానికి, మరో నూతన ఏడాదికి వెలకమ్ చెప్పడం మనలో మరో నూతన ఉత్సాహాన్ని పెంపొందిస్తుంది. దీని కోసమే రెండు వారాల ముందే హైటెక్స్ వేదికగా నిర్వహించిన మ్యూజిక్ కాన్సర్ట్ కోసం పాస్‌లను స్నేహితులతో కలిసి బుక్ చేసుకున్నాం. జీవితం ముందుకు సాగుతూనే ఉంటుంది.. ఎప్పటికప్పుడు దానిని ఆస్వాదించడం ఒక కళే.
- సాత్విక, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

స్విమ్మింగ్ మంచి వ్యాయామం

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్-2024 స్విమ్మింగ్ మొదటిరోజు ప్రారంభమయ్యాయి. స్విమ్మింగ్ మంచి వ్యాయామమని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి స్విమ్మింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ ఎలాంటి ఆర్భాటాలు లేకుండా స్విమ్మింగ్ పోటీలు కొనసాగుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 36 క్రీడాంశాలు సాగుతున్న ఈ పోటీల్లో క్రీడాకారులకు ఎటువంటి ఇబ్బందీ రాకుండా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అన్ని వసతులనూ సమకూర్చిందన్నారు. రేపు ఎల్లుండి గచ్చిబౌలి స్టేడియంలో పారా క్రీడాంశాలు ప్రారంభం కానున్నాయని మొట్ట మొదటిసారి సీఎం కప్ పోటీల్లో పారా క్రీడాంశాలను నిర్వహిస్తూ, వివక్షతకు తావులేదని నిరూపించామన్నారు. గ్రామీణ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న దాదాపు రెండులక్షల మంది క్రీడాకారుల సమగ్ర సమాచారం గేమ్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా నిక్షిప్తం చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి ఉమేష్, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు ప్రసాద్, పలువురు క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు

క్లుప్తంగా...

విషాదంలో వియత్నాం పర్యటనా?

రాహుల్ గాంధీపై కేటీఆర్ ధ్వజం



సాక్షి, హైదరాబాద్: 'మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల దేశం మొత్తం విషాదంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వియత్నాం పర్యటన చేయడంలో ఆశ్చర్యం ఏం లేదు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. పార్టీ కోసం, దేశం కోసం జీవితాంతం సర్వస్వం ధారపోసిన నాయకులను అవమానపరచడం కాంగ్రెస్ పార్టీ డీఎన్ఏలోనే ఉందని, కాంగ్రెస్ పార్టీ అంటేనే మహనీయులను అవమానపరచడమని ఆయన 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు కాంగ్రెస్ పార్టీ చేసిన అవమానాన్ని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని చెప్పారు.

శాసనమండలిని చిన్నచూపు చూడొద్దు

సీఎంకు మధుసూదనాచారి లేఖ



సాక్షి, హైదరాబాద్: దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల సంతాపం తెలిపే అవకాశాన్ని శాసనమండలికి కల్పించకపోవడాన్ని మండలిలో ప్రతిపక్ష నేత, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి ప్రశ్నించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి మంగళవారం బహిరంగలేఖ రాశారు. వివిధ హోదాల్లో దేశానికి విశిష్ట సేవలు అందించి, సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతిని కొత్త మార్గంలో నడిపిన మన్మోహన్‌కు నివాళి అర్పించేందుకు శాసన మండలిని సమావేశపరచకపోవడం బాధాకరమని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంటు ఎగువ సభగా పిలిచే రాజ్యసభకు సుదీర్ఘకాలం ప్రాతినిధ్యం వహించిన మన్మోహన్‌సింగ్‌కు అసెంబ్లీ ఎగువ సభగా పేర్కొనే శాసనమండలి సంతాపాన్ని తెలపడం సముచితంగా, సంస్కారవంతంగా ఉంటుందనేది తన వ్యక్తిగత అభిప్రాయమని మధుసూదనాచారి అన్నారు. ఇది కేవలం తన అభిప్రాయం కాదని, శాసనమండలి హృదయ వేదన అని పేర్కొన్నారు. శాసన మండలిని చిన్నచూపు చూడటం సరికాదని, భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కావద్దని సీఎం రేవంత్‌కు రాసిన లేఖలో మధుసూదనాచారి స్పష్టం చేశారు.

మరో కేసులో 'పట్నం'కు నోటీసులు

రేపు బొంరాస్‌పేట పీఎస్‌లో విచారణ



బొంరాస్‌పేట: 'లగచర్ల' ఘటనలో హైకోర్టు షరతులతో కూడిన ముందస్తు బెయిల్‌పై బయటకు వచ్చిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి మరో కేసులో గురువారం విచారణకు హాజరవ్వాలని పోలీసులు నోటీసులు ఇచ్చారు. దుద్యాల మండలం లగచర్లకు కూత వేటు దూరంలో ఉన్న రోటిబండ తండాలో అక్టోబర్ 25న కాంగ్రెస్ దుద్యాల మండలం మండలాధ్యక్షుడు ఆవుటి శేఖరయ్యపై ఫార్మా, భూమి విషయంలోనే తండావాసులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో తండావాసుల నిర్బంధంలో ఉన్న శేఖరయ్యను పోలీసులు తీసుకువచ్చి రక్షణ కల్పించారు. ఇదే కేసులో పట్నం నరేందర్‌రెడ్డితోపాటు పలువురు నిందితులుగా ఉన్నట్లు తెలిసింది.

రేపు విచారణకు రావాలి

ఆవుటి శేఖరయ్యపై దాడి ఘటన కేసు విచారణకు హాజరు కావాలని స్థానిక ఎస్సై ఎండీ రవూఫ్ నరేందర్‌రెడ్డితో పాటు పలువురు నిందితులకు సోమవారం రాత్రి నోటీసులు ఇచ్చారు. జనవరి 2న బొంరాస్‌పేట ఠాణాకు వచ్చి కేసు విచారణలో తమకు సహకరించాలని నరేందర్‌రెడ్డికి విచారణాధికారి నోటీసులు ఇచ్చారు. దీంతో నరేందర్‌రెడ్డి బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్‌కు వెళ్లనున్నట్లు తెలిసింది.

సూడాన్ శిశువుకు పునర్జన్మ

- తొలుత కార్పొరేట్ హాస్పిటల్‌లో చికిత్స
- డబ్బులు అయిపోవడంతో దంపతులను నిలోఫర్‌కు పంపించిన ఆస్పత్రి వర్గాలు
- చిన్నారికి ఉచిత చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన నిలోఫర్ వైద్యులు

సాక్షి, హైదరాబాద్/ నాంపల్లి: సూడాన్ దేశానికి చెందిన ఓ శిశువుకు హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రి వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. అత్యంత విషమ పరిస్థితుల్లో ఉన్న శిశువుకు సుమారు నెల రోజులపాటు నిలోఫర్‌లో పూర్తి ఉచితంగా వైద్యం అందించారు. సూడాన్ దేశానికి చెందిన దంపతులు ఐవీఎఫ్ ద్వారా బిడ్డను కనేందుకు ఏడాది క్రితం హైదరాబాద్‌కు వచ్చారు. ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో సయాదా అబ్దుల్ వాహెద్ అనే మహిళ ఐవీఎఫ్ చేయించుకుని నెలరోజుల క్రితం మగ పిల్లాడికి జన్మనిచ్చింది. శిశువుకు పుట్టుకతోనే బ్లడ్ ఇన్ఫెక్షన్, బ్రెయిన్ ఇన్ఫెక్షన్, ఊపిరితిత్తుల్లో సమస్య ఉన్నట్టుగా గుర్తించారు. శిశువు పరిస్థితి విషమంగా ఉండటంతో ఆరు రోజులపాటు కార్పొరేట్ ఆసుపత్రి ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. ఈ క్రమంలో సూడాన్ దంపతుల వద్ద డబ్బులు పూర్తిగా అయిపోవడంతో శిశువును నిలోఫర్‌కు రిఫర్ చేశారు. ఆ శిశువును అడ్మిట్ చేసుకున్న నిలోఫర్ డాక్టర్లు నెల రోజులపాటు పూర్తి ఉచితంగా చికిత్స అందించారు. శిశువు తల్లిదండ్రులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. శిశువు పూర్తిగా కోలుకోవడంతో, మంగళవారం డిశ్చార్జ్ చేశామని చికిత్స చేసిన నియోనాటాలజిస్ట్ డాక్టర్ స్వప్న తెలిపారు. తన బిడ్డను బతికించిన డాక్టర్లకు ఆ తల్లి (43 ఏళ్లు) కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు ఇప్పటికే ఐదుసార్లు అబార్షన్ అయిందని, ఎన్నో ఏళ్లుగా పిల్లల కోసం తపించామని ఆమె తెలిపారు. చావుబతుకుల్లో ఉన్న తన బిడ్డకు నిలోఫర్ వైద్యులు పునర్జన్మను ప్రసాదించారన్నారు. విషమ పరిస్థితిలో ఉన్న శిశువుకు ట్రీట్‌మెంట్ అందించిన డాక్టర్ల బృందాన్ని, హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అభినందించారు.



శిశువు ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్న డాక్టర్ రవికుమార్

సంక్రాంతికే భరోసా!

▶ మొదటి పేజీ తరువాయి

లెక్కగట్టనున్నారు. అలాగే వ్యవసాయాధికారి ఇచ్చే పంటల విస్తీర్ణంతో రైతు నుంచి తీసుకున్న 'సెల్ఫ్ డిక్లరేషన్'ను సరిపోల్చుకున్న తర్వాతే పెట్టుబడి సాయాన్ని రైతు ఖాతాలో జమ చేస్తారు. రైతే స్వయంగా తన పేరిట ఉన్న భూమి, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను తెలియజేయడంతో పాటు తాను ఎంత విస్తీర్ణంలో ఏ పంట వేస్తున్నాననే విషయాన్ని ప్రకటించేలా చూడటం ద్వారా రైతుల్లో జవాబుదారీతనాన్ని పెంచవచ్చనేది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. తద్వారా ప్రభుత్వ సొమ్ము దారిమళ్లకుండా రైతు సాగు చేసిన భూమికే కచ్చితంగా పెట్టుబడి సాయం అందుతుందని భావిస్తోంది.

సాగు విస్తీర్ణంలో కచ్చితత్వం కోసమే అంటున్న సర్కారు

రైతు అందించే సెల్ఫ్ డిక్లరేషన్ వల్ల ఒక గ్రామంలో ఉన్న పట్టా భూమి ఎంత? అందులో సాగవుతున్న విస్తీర్ణం ఎంతో తెలియడమే కాకుండా రాష్ట్రంలో సాగవుతున్న పంటల వివరాలు కూడా కచ్చితంగా తెలుస్తాయని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతి సీజన్‌లో ఇచ్చే పంటల సాగు విస్తీర్ణం లెక్కల్లో కచ్చితత్వం ఉండడం లేదని భావిస్తున్న ప్రభుత్వం.. రైతు భరోసా పథకం ద్వారా ఈ వివరాలను కూడా తెలుసుకోవాలని నిర్ణయించింది. ఉదాహరణకు ఈ యాసంగిలో పంటల సాధారణ సాగు విస్తీర్ణం 63.54 లక్షల ఎకరాలు కాగా, రైతులు ఏకంగా 79.40 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ లెక్కలు వేసింది. ఇందులో వరి 63.20 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 7.18 లక్షల ఎకరాల్లో సాగవుతుందంటూ ప్రతిపాదనలు రూపొందించింది. అయితే ఇప్పుడు రైతు భరోసాకు రైతు సెల్ఫ్ డిక్లరేషన్ నిబంధన వల్ల ఈ పంటలకు సంబంధించి కచ్చితమైన వివరాలు తెలిసే అవకాశం ఉందని, అలాగే ఏ పంటల లోటు ఎంత ఉందో తెలుసుకుని తదనుగుణంగా ఆయా పంటల విస్తీర్ణం పెంచే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే పంట సాగు చేస్తేనే పెట్టుబడి సాయం అందుతుందనే నిబంధన వల్ల..గతంలో వానాకాలంలో మాత్రమే సాగు చేసే రైతు యాసంగిలో కూడా తప్పకుండా ఏదో ఒక పంట పండించేందుకు ఆసక్తి చూపుతారని, తద్వారా యాసంగిలోనూ సాగు విస్తీర్ణం పెరుగుతుందని మంత్రివర్గ ఉప సంఘం అభిప్రాయపడింది.

ఎంత పెద్ద రైతుకైనా భరోసా ఖాయం!

రైతుభరోసా కింద ఒక్కో సీజన్‌లో ఎకరాకు రూ.7,500 చొప్పున చెల్లించాలని భావిస్తున్నప్పటికీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో దీనిని ఎంతకు పరిమితం చేయాలనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. జనవరి 2 లేదా 3వ తేదీన ఉపసంఘం మరోసారి సమావేశమై దీనిపై చర్చించే అవకాశం ఉంది. అదే సమయంలో ఒక్కో రైతుకు ఎన్ని ఎకరాలకు రైతు భరోసా ఇవ్వాలనే అంశాన్ని కూడా ఖరారు చేయనున్నట్లు సమాచారం. అయితే ఎంత పెద్ద రైతైనా నిర్దేశిత సీలింగ్ పరిధికి లోబడి సాగు చేసిన భూమికి రైతు భరోసా ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించారు. పీఎం కిసాన్ పథకంలో ఐదెకరాలు పైనున్న భూ యజమానికి పెట్టుబడి సాయం అందని విషయం విదితమే. రైతు భరోసాకు సంబంధించిన విధివిధానాలతో కూడిన నివేదికను మంత్రివర్గ ఉప సంఘం 3వ తేదీలోపు ప్రభుత్వానికి అందజేస్తే 4వ తేదీన జరిగే కేబినెట్ భేటీలో ఆమోదముద్ర పడే అవకాశం ఉంది.

రైతు భరోసాపై అపోహలు వద్దు

కేబినెట్ సబ్‌కమిటీలో చర్చ మాత్రమే జరిగింది: తుమ్మల



సత్తుపల్లి: రైతు భరోసాపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదని, నిబంధనలపై ఆలోచన కూడా చేయనందున ప్రతిపక్షాలు రైతుల్లో అనవసర అపోహలు సృష్టించొద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంట వేసిన రైతులకే రైతు భరోసా ఇవ్వాలని, నిబంధనల పేరుతో తగ్గించాలనే ఆలోచన ప్రభుత్వం చేస్తోందంటూ అనవసర ప్రచారం చేయొద్దని హితవు పలికారు. కేబినెట్ సబ్ కమిటీలో కేవలం రైతు భరోసాపై చర్చ జరిగిందని, పంట వేసిన ప్రతి రైతుకూ సాయం అందించాలన్నదే ప్రభుత్వ నిర్ణయమని తెలిపారు. ఈ అంశంపై కేబినెట్‌లో కూలంకశంగా చర్చించాక తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయ మంత్రిగా ప్రతి రైతుకూ కోత లేకుండా పంట సాయం చేయాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయమని, అయినా కేబినెట్‌లో తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందేనని అన్నారు. ఇప్పటికే రైతుల సంక్షేమానికి రూ.30 వేల కోట్లు ప్రభుత్వం వెచ్చించిందని, ఇంకా శక్తి మేర సాయం చేయాలన్నది లక్ష్యమని తుమ్మల తెలిపారు.

వసతులు ఎలా ఉన్నాయి?

టీచర్లు పాఠాలు బాగా చెబుతున్నారా? విద్యార్థులతో మంత్రి ఉత్తమ్ ముఖాముఖి



నారాయణపురం ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

చిలుకూరు: నూతన సంవత్సర ప్రారంభం సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో గడపాలని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్ణయించుకున్నారు. ఈ మేరకు మంగళవారం రాత్రి సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిధిలోని నారాయణపురం ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలకు వెళ్లిన మంత్రి.. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పలువురు తల్లిదండ్రులతో కూడా మాట్లాడారు. విద్యార్థుల పేర్లు, వారు చదువుతున్న తరగతి, తల్లిదండ్రుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయు లు పాఠాలు సరిగా బోధిస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. పాఠశాలలో వసతులు ఎలా ఉన్నాయంటూ అడిగారు. ఇబ్బందులేమైనా ఉంటే చెప్పాలని కోరారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థి తల్లి విజయనిర్మలతో మాట్లాడిన ఉత్తమ్..ఆమె పిల్లలు ఎలా చదువుతున్నారంటూ ఆరా తీశారు. హాస్టల్లో వసతులు బాగున్నాయని, తమ పిల్లలు బాగా చదువుతున్నారంటూ ఆమె జవాబిచ్చారు. వసతులు బాగానే ఉన్నాయని, పాఠాలు బాగానే చెబుతున్నారని విద్యార్థులు చెప్పారు. పోటీ పరీక్షల పుస్తకాలు, ఇంటర్ విద్యార్థులకు ఐఐటీ పుస్తకాలు కావాలని హెచ్‌ఎం వెంకటేశ్వర్లు కోరారు. బెంచీలు, కుర్చీలు కావాలని అడగ్గా..పుస్తకాలకు రూ.5 లక్షలు, ఫర్నిచర్‌కు రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఉత్తమ్ ప్రకటించారు. పాఠశాలకు రోడ్డు సౌకర్యం కోసం మరో రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌కు పాస్ మార్కులు కూడా రాలే!

- కాంగ్రెస్ ఏడాది పాలన బోనస్ హామీలు.. బోగస్ మాటలు
- అయితే లూటీలు.. లేదంటే లాఠీలు అన్నట్లుగా పనితీరు
- బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్ /సిద్దిపేట అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనపై ఎన్ని సంస్థలు సర్వేలు చేసినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాస్ మార్కులు కూడా రావడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. గ్యారంటీల అమలుకు బదులుగా ప్రభుత్వం గారడీ విన్యాసా లు చేస్తోందని మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 'డిక్లరేషన్ల అమలుకు బదులుగా డైవర్షన్ రాజకీయాలు చేస్తూ, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారు. పంటలకు బోనస్ అంటూ ఇప్పుడు బోగస్ మాటలు చెప్తున్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ఇస్తున్న చెక్కులు బౌన్స్ అవుతున్నాయి. బీఆర్ఎస్ నేతలపై క్షణాల్లో కేసులు నమోదు చేస్తూ, కాంగ్రెస్ నేతలపై వచ్చే ఫిర్యాదులను పట్టించుకోవడం లేదు. విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా సీఎం ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారు. ప్రభుత్వ వ్యవస్థలను వక్ర మార్గం పట్టిస్తూ.. అయితే లూటీ లేకుంటే లాఠీ అన్నట్లుగా సీఎం వ్యవహరిస్తున్నారు. ఏడాదిలో కాంగ్రెస్, బీజేపీ స్నేహం మరింత బలపడింది' అని హరీశ్‌రావు విమర్శించారు. పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ఆరు వేల మంది రిసోర్స్ పర్సన్లకు ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదని మండిపడ్డారు. వారి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు బట్టలు కూడా ఇవ్వలేదు

కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు తీసుకొని అమలు చేయలేక విఫలమవుతోందని హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లిలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో మంగళవారం ఆయన విద్యార్థులకు దుప్పట్లు, టీషర్టులు పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మెనూకు.. హాస్టళ్లలో అమలవుతున్న మెనూకు సంబంధమే లేదని అన్నారు. పిల్లలకు ఇప్పటివరకు కనీసం బట్టలు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రభుత్వంతో మాట్లాడి పెండింగ్ మెస్ బిల్లులు, కాస్మొటిక్ ఛార్జీలు ఇప్పిస్తానని, మంచిగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించినవారికి తన సొంత ఖర్చులతో ఐప్యాడ్‌లు అందజేస్తానని, మెడిసిన్ చదివిస్తానని హామీ ఇచ్చారు.

తుది తీర్పు వరకు కేటీఆర్ అరెస్టు వద్దు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేటీఆర్‌పై ఏసీబీ డిసెంబర్ 19న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఏ-1గా కేటీఆర్, ఏ-2గా నాటి స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్, ఏ-3గా హెచ్‌ఎండీఏ నాటి చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి పేరును చేర్చారు. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. ఏసీబీ తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, దానకిశోర్ తరఫున సీవీ మోహన్‌రెడ్డి, కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపించారు. వాదనలు ముగియడంతో న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేశారు. తుది తీర్పు వెల్లడించేవరకు కేటీఆర్‌ను అరెస్టు చేయరాదని ఆదేశించారు.

అవినీతి లేనప్పుడు సెక్షన్లు ఎలా పెడతారు?

అవినీతే లేనప్పుడు కేసు ఎలా నమోదుచేస్తారని కేటీఆర్ తరఫు న్యాయవాది సిద్ధార్థ దవే వాదించారు. 'ఫార్ములా-ఈ రేసు నిర్వహణ ఒప్పందంలో ముందుగా పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సంతకం చేశారు. అనంతరం కేటీఆర్ నోట్ ఫైల్‌పై సంతకం చేశారు. ఆ శాఖ మంత్రిగా ఉన్నంత మాత్రాన కేటీఆర్‌ను నిందితుడిగా చేర్చడం సరికాదు. ఈ చెల్లింపుల్లో అవినీతి జరిగినట్లు గానీ, వ్యక్తిగతంగా కేటీఆర్ లబ్ధి పొందినట్లుగానీ ఏసీబీ పేర్కొనలేదు. అందుకు ఎలాంటి ఆధారాలు లేవు. అలాంటప్పుడు అవినీతి నిరోధక (పీసీ) చట్టంలోని సెక్షన్ 13(ఎ), 13(2) కింద కేసు పెట్టడం చెల్లదు. ఇది సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధం. లబ్ధి చేకూర్చినట్లు చెబుతున్న సంస్థపై కేసు పెట్టలేదు. నగదు చెల్లింపు బ్యాంక్ ద్వారానే జరిగింది. బిజినెస్ రూల్స్ ఉల్లంఘించారని చెబుతున్నా.. చట్టప్రకారం ప్రతి ఉల్లంఘన క్రిమినల్ నేరం కిందకు రాదు. ఎన్నికల కోడ్ సమయంలో పాలసీ నిర్ణయాలు తీసుకోకూడదు. కానీ, ముందే ఉన్న ఒప్పందాన్ని అమలు చేయవచ్చు. డిసెంబర్ 18న ఫిర్యాదు చేస్తే 19న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలి' అని విజ్ఞప్తి చేశారు.

ప్రజా ప్రతినిధులకూ సెక్షన్ 405 వర్తిస్తుంది..

సిద్ధార్థ దవే వాదనను ఏజీ సుదర్శన్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. '2023, అక్టోబర్ 30న సీజన్ 10కి సంబంధించి రెండో ఒప్పందం జరిగింది. కానీ, అక్టోబర్ 3న రూ.22,69,63,125 (పన్నులు అదనం), 11న రూ.23,01,97,500 (పన్నులు అదనం) చెల్లించారు. అంటే ఒప్పందానికి ముందే మొత్తం రూ.54,88,87,043 చెల్లింపులు చేశారు. ఫార్ములా ఈ రేసు ఆపరేషన్స్ (ఎఫ్ఈవో), మున్సిపల్ శాఖ మధ్య 2023, అక్టోబర్‌లో ఒప్పందం కుదిరింది. విదేశీ మారక ద్రవ్యం (పౌండ్) రూపంలో చెల్లింపులకు ఆర్‌బీఐ నిబంధనలు, బిజినెస్ రూల్స్‌ను తప్పకుండా పాటించాలి. కానీ పాటించలేదు. హెచ్‌ఎండీఏ నుంచి రూ.10 కోట్లకు మించి ఎలాంటి చెల్లింపులు జరిపినా ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలి. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రిగా కేటీఆర్ నోట్ ఫైల్‌కు ఆమోదం తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే ఫార్ములా-ఈ రేసు ఒప్పందం చేసుకున్నారు. ఎఫ్ఈవోకు డబ్బులు చెల్లించాల్సిన బాధ్యత రేసు ప్రమోటర్ ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్‌ది. ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే కోర్టులను ఆశ్రయించవచ్చు. కానీ, ప్రమోటర్‌ను రక్షించడం కోసమే చెల్లింపులు జరిపినట్లుగా ఉంది. నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు జరిగినందునే ఈడీ కూడా కేసు నమోదు చేసింది. ఐపీసీ సెక్షన్లు 405, 409 ప్రజా ప్రతినిధులకు కూడా వర్తిస్తాయి. చంద్రబాబునాయుడు వర్సెస్ ఏపీ కేసులో సుప్రీంకోర్టు ఇదే విషయాన్ని చెప్పింది. అందువల్ల ఈ పిటిషన్‌ను కొట్టివేయండి' అని ధర్మాసనాన్ని కోరారు. సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'ఈ లావాదేవీల్లో అవినీతి జరిగిందా? డబ్బులు ఎలా వెళ్లాయి? మళ్లీ వచ్చాయా.. లేదా? అనేది విచారణలో తేలుతుంది. నిబంధనలు ఉల్లంఘన జరిగినప్పుడు దర్యాప్తు చేపట్టే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ నగదు చెల్లింపులో ఉల్లంఘన జరిగితే సెక్షన్ 405 వర్తిస్తుంది. మంత్రి ఆదేశాలతోనే చెల్లింపులు జరిగాయి' అని వాదించారు.

న్యాయమూర్తి ప్రశ్నలు.. ఏజీ సమాధానాలు

నిందితుడిపై ఉన్న ఆరోపణలు ఏంటి?
గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా నగదు చెల్లింపులకు పాల్పడ్డారు. అవినీతి నిరోధక చట్టం, నేరపూరిత కుట్ర సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశాం.

'ఫార్ములా- ఈ' ప్రమోటర్ సంస్థను నిందితుల జాబితాలో చేర్చారా?
లేదు. దర్యాప్తులో భాగంగా నిందితులను చేర్చడం, తొలగించడం జరుగుతుంది.

దర్యాప్తు ఏ దశలో ఉంది? ఎంత మంది స్టేట్‌మెంట్ రికార్డు చేశారు?
దర్యాప్తు ప్రాథమిక దశలో ఉంది. వీలైనంత త్వరగా ఆధారాలు సేకరించే పనిలో ఉన్నారు. ఫిర్యాదుదారు దానకిశోర్ స్టేట్‌మెంట్ రికార్డు చేశాం. నిందితుల స్టేట్‌మెంట్ రికార్డు చేయాల్సి ఉంది.

ఇతర నిందితులు ఏమైనా పిటిషన్లు దాఖలు చేశారా?
ఇప్పటివరకు ఎలాంటి పిటిషన్లు వేయలేదు. ఎవరినీ అరెస్టు చేయలేదు. గవర్నర్ అనుమతి తర్వాతే ఎఫ్ఐఆర్ నమోదు చేశాం.

ప్రమోటర్ గ్యారంటీ సమర్పించారా? దాన్ని క్యాష్ చేసుకున్నారా?
దర్యాప్తులో ఆ వివరాలు సేకరించాల్సి ఉంది.

15 రోజుల్లో ఇరిగేషన్ ఇంజనీర్లకు ప్రమోషన్లు

- నీటిపారుదల శాఖలో మరో 1,300 ఉద్యోగాల భర్తీ
- ఇంజనీర్లు కచ్చితంగా పని ప్రదేశాల్లోనే నివసించాలి
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఇరిగేషన్‌ను బీఆర్ఎస్ సర్కారు అస్తవ్యస్తం చేసిందని ఆగ్రహం
- ఆర్ఆర్ఆర్‌ను గాడిలోకి తెచ్చింది నేనే: మంత్రి కోమటిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖలోని అన్ని స్థాయిల ఇంజనీర్లకు 15 రోజుల్లోగా పదోన్నతులు, బదిలీలు చేపడుతామని ఆ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇంజనీర్లు పనిచేసే ప్రాంతంలోనే నివాసం ఉండాలని స్పష్టంచేశారు. బాధ్యతలను విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులపై మంగళవారం జలసౌధలో జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బి.లక్ష్మారెడ్డి ఫిర్యాదు ఆధారంగా మిర్యాలగూడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను మంత్రి సస్పెండ్ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.

మరో 1,300 మంది నియామకం

ఇరిగేషన్ శాఖను గాడిలో పెట్టేందుకు 700 మందికి పైగా ఏఈఈలను నియమించామని, అందులో దాదాపు 100 మంది ఐఐటీ, ఎన్ఐటీల గ్రాడ్యుయేట్లు ఉన్నారని మంత్రి ఉత్తమ్ తెలిపారు. కాల్వలపై పర్యవేక్షణకు 1,800 మంది లష్కర్లను నియమిస్తున్నామని చెప్పారు. నీటిపారుదల శాఖలో మరో 1,300 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని టీజీపీఎస్సీకి లేఖ రాసినట్లు వెల్లడించారు. ఉమ్మడి ఏపీకి ఉన్న 811 టీఎంసీల కృష్ణా జలాల వాటా నుంచి రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలను కేటాయించడాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రాతపూర్వకంగా సమ్మతించిందని తప్పుబట్టారు. తెలంగాణకు 550 టీఎంసీలు కేటాయించాలని కృష్ణా ట్రిబ్యునల్-2 ఎదుట వాదనలు వినిపిస్తున్నామని, ఆరు నెలల్లో సానుకూల తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అప్పుల చెల్లింపులకే సగం నిధులు

బీఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ల పాలనలో నీటిపారుదల శాఖ అస్తవ్యస్తంగా మారిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కాల్వల నిర్వహణను నాడు పూర్తిగా గాలికి వదిలేశారని మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి బీఆర్ఎస్ సర్కారు రూ.1.81 లక్షల కోట్లు అప్పు చేసినా ఆయకట్టు మాత్రం అభివృద్ధి కాలేదని అన్నారు. ఈ అప్పులభారం నీటిపారుదల శాఖపై తీవ్రంగా పడిందని తెలిపారు. బడ్జెట్‌లో ఈ శాఖకు రూ.22 వేల కోట్లు కేటాయిస్తే, రూ.11 వేల కోట్లు అప్పుల చెల్లింపులకే పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులను పునర్వ్యవస్థీకరించి, వడ్డీలను తగ్గించడంతో పాటు కాలపరిమితి పెంచడం ద్వారా శాఖపై భారం తగ్గించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కేటీఆర్‌ను ప్రశాంతంగా వేడుకలు చేసుకోనీయండి: కోమటిరెడ్డి

ఫార్ములా- ఈ రేసు కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ కేసు గురించి మీడియా ప్రశ్నించగా.. కొత్త సంవత్సరం సందర్భంగా కేటీఆర్‌ను రెండుమూడు రోజులు ప్రశాంతంగా వేడుకలు చేసుకోనీయండి అని సెటైర్ వేశారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) కోసం బీఆర్ఎస్ హయాంలోనే 70 శాతం భూసేకరణ పూర్తిచేశామన్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రకటనను కోమటిరెడ్డి కొట్టిపారేశారు. గత ప్రభుత్వం యుటిలిటీ చార్జీలు కట్టకపోతే ప్రాజెక్టు నిలిచిపోగా, తాను కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి ప్రాజెక్టును రివైవ్ చేయించినట్టు తెలిపారు. సమీక్షలో ఎమ్మెల్యేలు మందుల సామేలు, లక్ష్మారెడ్డి, బాలూనాయక్, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్‌లో నిర్మించినట్లు ఆధారాలున్నాయా?

ఖాజాగూడ కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం

- వెంటనే ఆపమని హైడ్రా అధికారులకు చెప్పండి
- లేదంటే చట్టపరంగా తీవ్ర చర్యలు ఎదుర్కొంటారని హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ పరిధిలోని ఖాజాగూడ భగీరథమ్మ చెరువులోని నిర్మాణాల తొలగింపులో హైడ్రా తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలో నిర్మించారో లేదో ఆధారాలు సేకరించకుండానే కూల్చివేతలు ఎలా చేపడతారని ప్రశ్నించింది. పిటిషనర్ల వద్ద విద్యుత్ బిల్లు, ఆస్తి పన్ను రసీదు ఇలా అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని పేర్కొంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ధారణ చేశారా అని నిలదీసింది. ఇష్టం వచ్చినట్లు కూల్చివేతలు చేపడితే న్యాయస్థానం చూస్తూ ఊరుకోదని హెచ్చరించింది. మరోసారి ఇలాగే జరిగితే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై తీవ్ర చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తేల్చిచెప్పింది. జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా పిటిషనర్లు కూడా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆదేశించింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించారంటూ ఖాజాగూడ భగీరథమ్మ చెరువులోని నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. అక్రమ ఫెన్సింగ్‌లను, 20కిపైగా దుకాణాలను తొలగించారు. నోటీసులు ఇచ్చిన 24 గంటల్లోనే దుకాణాలను కూల్చివేయడాన్ని సవాల్ చేస్తూ కొందరు హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ మధ్యాహ్నం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కూల్చివేతలు వెంటనే ఆపమని కమిషనర్‌కు చెప్పాలని న్యాయవాదిని ఆదేశించారు. లేదంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పిటిషనర్లు కూడా అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని, తాత్కాలిక ఫెన్సింగ్‌ను 24 గంటల్లో తొలగించాలని సూచించారు.

'ఫార్ములా' కేసులో రేపటి నుంచి ఈడీ విచారణ

రేపు ఈడీ ముందుకు హెచ్‌ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డి, 3న ఐఏఎస్ అర్విండ్‌కుమార్, 7న మాజీ మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా-ఈ రేసు కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ గురువారం (జనవరి 2) నుంచి ప్రారంభం కానుంది. ఈ కేసులో ఇప్పటికే మున్సిపల్‌శాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, హెచ్‌ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డిలకు సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. జనవరి 2న బీఎల్ఎన్ రెడ్డి, 3న అర్వింద్‌కుమార్, 7న కేటీఆర్‌ను విచారణకు హాజరు కావాలని ఈడీ గతంలోనే ఆదేశించింది. పీఎంఎల్ఏ చట్టం కింద ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్) నమోదు చేసింది. ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, హెచ్‌ఎండీఏ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు, తమ దర్యాప్తులో గుర్తించిన పలు డాక్యుమెంట్ల ఆధారంగా గురువారం బీఎల్ఎన్‌రెడ్డిని ప్రశ్నించనున్నట్లు సమాచారం. ఉదయం 10.30 గంటలకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయంలో ఈడీ జాయింట్ డైరెక్టర్ రోహిత్ ఆనంద్ నేతృత్వంలోని అధికారుల బృందం బీఎల్ఎన్ రెడ్డిని ప్రశ్నించనున్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా- ఈ కార్ రేసుకు సంబంధించి హెచ్‌ఎండీఏ నుంచి విదేశీ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా నిధులు మళ్లించారన్నది ఈ కేసులో ప్రధాన ఆరోపణ. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను బీఎల్ఎన్ రెడ్డి పూర్తి చేశారు. ఇదే అంశంపై ఆయనను ప్రధానంగా ప్రశ్నించే అవకాశం ఉంది.



2025 హ్యాపీ న్యూ ఇయర్



కొంచెం కొత్తగా ఉందాం

**క్యాలెండర్ మారితే సంతోషపడటం కాదు.
మనం ఏం మారామనేది ముఖ్యం.
అవే పాత అలవాట్లు.. పాత తలపోతలు
పాత బలహీనతలు.. పాత అనవసర భారాలు...
వాటిని మోస్తూనే కొత్త సంవత్సరంలో
అడుగు పెడితే మీరు అదే పాత మనిషి అవుతారు.
కొత్తగా ఉండటం చాలా ముఖ్యం.
మీ చుట్టూ మిమ్మల్ని మబ్బులో పెట్టి
పబ్బం గడిపే వారుంటారు.
మబ్బు వీడండి..
కొత్త మనిషిగా ముందుకు అడుగు వేయండి.
హ్యాపీ న్యూ ఇయర్.**

రొటీన్‌లో ఉండే పెద్ద ప్రమాదం ఏమిటంటే... మనం సత్యాన్ని కనుగొనలేము. అవే రక్తసంబంధాలు, బంధువులు, స్నేహితులు... మన చుట్టూ ఉంటారు. రొటీన్‌లో ఉంచుతారు. వారు చేసే మంచి, చెడు... మనం క్షమించుకుంటూ, బాధపడుతూ ముందుకెళ్లిపోతూ ఉంటాం. కాని ఆగాలి. దూరంగా జరగాలి. కొన్నాళ్లు కలవకుండా ఉండి, స్థిమితంగా ఆలోచించి, వీరిలో నిజంగా మీకు సంతోష ఆనందాలు ఇస్తున్నది ఎవరు, మీ అభిమానాన్ని ప్రేమని దుర్వినియోగం చేయకుండా ఉన్నది ఎవరు, మీకు అపకారం లేదా అవమానం చేస్తున్నది ఎవరు... అనేది మీరు గమనించి చూసుకుంటే, కాస్త కఠినంగా మారి, వీరితో ఎడంగా ఉండాలని ఈ సంవత్సరం మీరు నిశ్చయించుకుంటే మీరు కొత్త మనిషిగా కొత్త సంవత్సరంలో అడుగు పెడతారు.

- మంచి అలవాట్లు చేసుకోవడం తర్వాత. కొన్ని చెడు అలవాట్లు ఉంటాయి. అవి మనకు తెలుసు. వాటి వల్ల ప్రమాదమూ తెలుసు. గిల్ట్ అనిపించడమూ తెలుసు. వాటిని వదిలించుకోవాలి. మీ ఎంపికే మీ ఫలితం. మీరు చెడు అలవాటు ఎంచుకుంటే చెడు ఫలితం వస్తుంది. దానిని వదిలించుకుంటే చెడు వదిలిపోతుంది. గట్టిగా నిశ్చయించుకుంటే మీరు కొత్త మనిషిగా మారతారు.
- వాయిదా వేయడం వల్లే మనిషి జీవితంలో మంచి వాయిదా పడుతూ ఉంటుంది. రేపు చేద్దాం, తొందరేముందిలే, ఇవాళ బద్ధకం అంటూ మీరు పోస్ట్‌పోన్ చేసిన ప్రతిదీ మీకు సరైన సమయంలో సరైన రైలు అందకుండా చేస్తుంది. రైలు మిస్సయ్యాక మరో రైలు కోసం స్టేషన్‌లో పడి ఉండే ధోరణి మీలో ఉన్నంత కాలం మీరు కొత్త మనిషిగా మారలేరు... ఎన్ని కొత్త సంవత్సరాలు వచ్చినా. రోజూ ఉదయం ఇవాళ చేయాల్సిన పనులు అని రాసుకోవడం... చేశాకే నిద్రపోవడం మీకో కొత్త జీవితాన్ని తప్పక ఇస్తుంది.
- మీ భౌతిక, మానసిక ఎదుగుదల గత సంవత్సరం ఎలా సాగింది? ప్రశ్నించుకోండి. మీ మేధస్సు, మానసిక ప్రశాంతత, ఆరోగ్యం వీటిని ఎంతమేరకు పెంచుకున్నారో చూసుకోండి. చిల్లర విషయాలకు నెలలు నెలలు ఎలా తగలెట్టారో మీకే తెలుసు. మంచి పుస్తకాలు, సంగీతం, మంచి సినిమాలు, ఆధ్యాత్మికత, విహారం, కొత్త ప్రాంతాల... మనుషుల సాంగత్యం... ఇవి మిమ్మల్ని నిత్యనూతనంగా ఉంచుతాయి. డిసెంబర్ 31 పార్టీ చేసుకుని మళ్లీ డిసెంబర్ 31 పార్టీ మధ్యలో గతంలోలా ఉంటే న్యూ ఇయర్ రావడం ఎందుకు? పార్టీ చేసుకోవడం ఎందుకు?
- కుటుంబ సభ్యులను చూసుకోవడం వేరు. వారిని 'తెలుసుకోవడం' వేరు. వారి మనసుల్లో ఏముంది, ఆకాంక్షలు ఏమిటి, ఒకరితో మరొకరికి ఉన్న అభ్యంతరాలు ఏమిటి, ప్రేమాభిమానాల కొలమానం ఎలా ఉంది... సరిగ్గా సమయం గడిపితే తెలుస్తుంది. షేర్లు, బంగారం పెరుగుదల తెలుసుకోవడం కంటే కూడా ఒక కుటుంబ సభ్యుడి మనసు తెలుసుకోవడం కుటుంబ వికాసానికి ముఖ్యం.
- చట్టాన్ని, నియమ నిబంధలను, పౌర బాధ్యతను, కాలుష్యం పట్ల చైతన్యాన్ని కలిగి ఉంటే రుతువులు గతి తప్పవు. ఎండా వానల వెర్రి ఇంట్లో జొరబడదు.

కొత్త అంటే పాతను, పాతలోని చెడును తొలగించుకోవడమే.



జ్ఞాపకాల పునాదిపై స్వప్నాల మేడ

గతం అనేది జ్ఞాపకం. అలాగే భవిష్యత్ అనేది స్వప్నం. జీవితం ఎప్పుడూ జ్ఞాపకాలకు, స్వప్నాలకు మధ్యలో ఉంటుంది. ప్రతి పనిని శ్రద్ధతో, నిజాయితీతో చేయాలి. గతానికీ, భవిష్యత్‌కు మధ్యలో ఉండేదే మన జీవితం. అయితే గతాల పునాదిపై భవిష్యత్ భవనాన్ని కట్టుకోవాలి. జ్ఞాపకాల పునాదిపైన స్వప్నాల మేడ నిర్మించుకోవాలి. జ్ఞాపకాలను కేవలం పునాదిలాగా మాత్రమే వాడుకోవాలి. పునాది ఎప్పుడూ మేడ కాదు.. పునాది ఎప్పుడూ భవనం కాదు. కాకపోతే ఆ భవనం పటిష్ఠంగా ఉండాలనే పునాది మాత్ర గట్టిగా ఉండాలి. అంటే గతమనేది గట్టిగా ఉండాలి. గతంలోని మంచి విషయాలు, మంచి ఆలోచనలు, మంచి భావాలన్నింటిని కూడా పోగుచేస్తేనే భవిష్యత్ భవనం పటిష్ఠంగా ఉంటుంది. చాలా కాలం నిలిచి ఉంటుంది. మనల్ని నిలబెడుతుంది. అయితే ఒక్క విషయం ఏంటంటే.. ఆత్రేయగారు ఒకమాట చెప్పారు. 'వచ్చునప్పుడు కొత్తవే వచ్చురాలు.. పాతబడిపోవు మన పాత పనుల వలన' అన్నారు. అంటే కొత్త సంవత్సరం వచ్చినప్పుడు కొత్తగానే ఉంటుంది. కానీ, మనం చేసే పాత పనుల వల్ల ఆ కొత్త సంవత్సరం కాస్తా పాతబడిపోతుంది. మనం కొత్త పనులు చేయాలి.. కొత్త ఆలోచనలు చేసుకోవాలి. కొత్త లక్ష్యాలు, కొత్త గమ్యాలు, కొత్త ధ్యేయాలను మనం పెట్టుకొని ముందుకెళ్లాలి. ముఖ్యంగా ఆ రోజుల్లోనే మంచిది, మా చిన్నప్పుడు బాగుండేది అంటూ గతంతో ఎప్పుడూ కాలయాపన చేయకూడదు. కొత్త విషయాలు ఏంటి? కొత్త పరిజ్ఞానం ఏంటి? కొత్త సాంకేతికత ఏంటి... వంటి వాటిని ఆమోదించాలి, ఆహ్వానించాలి, అర్థం చేసుకోవాలి, ఆచరించాలి. దాని ద్వారా మనం సంపూర్ణ ప్రయోజనాన్ని పొందే ప్రయత్నం చేయాలి. అంతేకానీ కేవలం మనం గతాన్ని పొగుడుతూ.. ఈ తరాన్ని, ఈ కాలాన్ని నిందించకూడదు, నిరసన తెలియచేయకూడదు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో, కొత్త ఆలోచనలతో, కొత్త తరాన్ని అర్థం చేసుకుంటేనే మనం ఎప్పుడూ విజేతలం కాగలం. ముందు ఆ విషయాన్ని మనం ఆమోదించాలి. అప్పుడే దానిద్వారా మనం ముందుకెళ్లేలా నిచ్చెనలాగా, వారధిలాగా పనికొస్తుంది. అప్పుడే జీవితం కొత్తగా ఉంటుంది. కొత్త నిర్ణయాలు తీసుకోవచ్చు.. కొత్త లక్ష్యాలు ఏర్పరచుకోవచ్చు. కొత్తగా మనం జీవితాన్ని మలచుకొనే అవకాశం ఉంటుంది. కొత్త తరాన్ని, కొత్త భావజాలాన్ని మనం అర్థం చేసుకుని ఆమోదిస్తే గనక ఏ గొడవా ఉండదు, ఏ పేచీ ఉండదు.. చక్కగా ముందుకు వెళ్లొచ్చు.

- ప్రతి పనిని చిత్తశుద్ధితో, శ్రద్ధతో, నిజాయితీతో చేయాలి. అట్లాగే... ఆనందాన్ని, సంతోషాన్ని అనుభవించే కోణంలో నాదొక సూచన ఏంటంటే... నేడు పొందే ఆనందం.. రేపటి ఆనందాన్ని హరించకూడదు. ఈ రోజు ఎంత ఆనందాన్నైతే అనుభవిస్తున్నామో... ఈ ఆనందం వల్ల..రేపటి ఆ ఆనందానికి అది హాని కలుగ చేయకూడదు. రేపటి ఆనందానికి ఏ రకంగానూ ప్రభావం చూపకూడదు. రేపటి ఆనందాన్ని అనుభవించగలిగేలాగే ఉండాలి ఈ రోజుటి ఆనందం. అంటే ఓ హద్దులో.. పరిమితిలో.. ప్రతిరోజూ మనం పని చేస్తూ, ఆనందాన్ని అనుభవిస్తుంటే గనక రేపటి ని మరింత ఆనందంగా గడిపే అవకాశం ఉంటుంది. సంపాదన కోసం కొంత సమయం, సమాజం కోసం కొంత సమయం, నీ శరీరం కోసం కొంత సమయం, నీ సొంత కుటుంబం కోసం కొంత సమయం... ఇంతే..!

- చంద్రబోస్

**వ్యక్తిగత జీవితం నుంచి
వృత్తిజీవితం వరకు
గుర్తుంచుకోదగిన జ్ఞాపకాలు,
నేర్చుకున్న పాఠాలు,
కొత్త సంవత్సర లక్ష్యాలు
మన వెండి తెర వెలుగుల
మాటల్లో...**

సభ్యులకు, ఏజెంట్లకు
మరియు శ్రేయోభిలాషులకు
నూతన సంవత్సర
శుభాకాంక్షలు
KAPIL
కపిల్ చిట్స్
visit us:
www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం



స్ట్రాంగ్‌గా... పాజిటివ్‌గా...



మన ఎదుగుదలకు ఓ కారణం 'సెల్ఫ్ లవ్'. ముందు మనల్ని మనం ఇష్టపడాలి... గౌరవించుకోవాలి. 2025 సౌండింగ్ చాలా బాగుంది. ఏదో పాజిటివిటీ కనబడుతోంది. ఓ పాజిటివ్ ఫీలింగ్‌తో ఈ ఇయర్‌లో మనం హ్యాపీగా, హెల్దీగా, పాజిటివ్‌గా ముందుకు సాగుదాం. మన ఆరోగ్యం బాగుంటేనే మనం ఏమైనా చేయగలం. అందుకని ఆరోగ్యం మీద దృష్టి పెట్టాలి. యోగా చేయాలి... రోజూ కొంచెం సేపు ధ్యానానికి కేటాయించాలి. ఆరోగ్యంగా ఉండాలి... కష్టపడి పని చేయాలి. ఆత్మవిశ్వాసంతో బతకాలి.

నాకు డైరీ రాసే అలవాటు ఉంది. 2024లో పుషప్స్, పులప్స్, హ్యాండ్‌స్ట్రెంగ్త్‌పై దృష్టి పెట్టాలనుకున్నాను. కాని అది అవ్వలేదు. ఒక లవ్‌స్టోరీలో నటించాలనుకున్నాను. అఫ్‌కోర్స్ అది మన చేతుల్లో లేదనుకోండి. ఈ కొత్త సంవత్సరంలో నేను అనుకున్నవి ఫలించాలని కోరుకుంటున్నాను.

ప్రొఫెషన్ విషయానికి వస్తే... ఈ సంవత్సరం నాలుగు సినిమాల్లో నటించాను. హిందీ సినిమాలు చేయబోతున్నాను. ఇక పర్సనల్ విషయానికి వస్తే టఫ్ పరిస్థితులను ఎదుర్కొన్నాను. వాటి నుంచి బయట పడగలిగాను. టఫ్ పరిస్థితులు ఎదురైనప్పుడు ఎమోషనల్‌గా ఇతరుల మీద ఆధారపడకుండా వాటి నుంచి ఎలా బయటపడాలి అనేది నేర్చుకున్నాను. ఒంటరితనంగా అనిపించే పరిస్థితులు కూడా వస్తుంటాయి. వాటి నుంచి ఎలా బయటపడాలో తెలుసుకున్నాను.

కొత్త సంవత్సరం తీర్మానాల విషయానికి వస్తే... కొత్త స్కిల్స్ నేర్చుకోవాలనుకుంటున్నాను. యోగాను మరింత ప్రాక్టీస్ చేయాలనుకుంటున్నాను. జిమ్నాస్టిక్స్ చేయాలనుకుంటున్నాను. 2023 చివరిలో కూడా కొత్త సంవత్సరం రిజల్యూషన్స్ తీసుకున్నాను. వాటిలో చాలా వరకు ఈ సంవత్సరం పూర్తి చేశాను.

ఆడియెన్స్ సినిమాను ఎలా చూస్తున్నారు, సినిమాల రిజల్ట్ నుంచి సినిమా మేకింగ్ ప్రాసెస్ వరకు ఎన్నో పాఠాలు నేర్చుకున్నాను. ప్రతి సంవత్సరం మెంటల్‌గా, ఎమోషనల్‌గా స్ట్రాంగ్‌గా ఉండాలనుకుంటాను.

- అనన్య నాగళ్ల



హెల్త్... హార్డ్‌వర్క్

మనం ప్రతి ఒక్కరం కెరీర్ కోసం చాలా కష్టపడతాం. హార్డ్‌వర్క్ చేస్తాం. ఆ కష్టం వృథా కాదు. మన కష్టమే మనల్ని ఓ స్థాయికి చేర్చుతుంది. అందుకే కొత్త సంవత్సరంలో ఇంకా కష్టపడి పని చేద్దాం... అయితే కెరీర్ గ్రోత్ మాత్రమే కాదు... మన వ్యక్తిగత ఆనందానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. హార్డ్ వర్క్... హెల్త్... హ్యాపీనెస్... ఈ మూడూ ముఖ్యం. వీటికి అనుగుణంగా లైఫ్‌ని ప్లాన్ చేసుకుని పాజిటివ్‌గా ముందుకెళ్లడమే. కెరీర్ కోసం హ్యాపీగా కష్టపడదాం... మంచి అలవాట్లతో ఆరోగ్యంగా ఉండి... హ్యాపీగా ఉందాం.

2024 గురించి చెప్పుకోవాలంటే... నేను ఎంత గ్రాండ్ సక్సెస్ సాధించానన్నది పక్కన పెడితే, నాకు తెలియనివి అన్నీ నేర్చుకునేందుకు సహకరించిన సంవత్సరంగా అనిపించింది. సినిమా ఇండస్ట్రీలో సహనమే కీలకం అనే విషయాన్ని నాకు నేర్పించింది. అంతేకాదు నేను గమనించిన మరో ముఖ్య విషయం ఏమిటంటే... ఎన్ని సినిమాలు చేశాం, నా తరువాత సినిమా ఏంటి, ఎప్పుడు అని ఎదురు చూడటం కన్నా, సెట్స్‌లో ఎంత క్రమశిక్షణగా ఉన్నాం, షూటింగ్‌లో ఎంత సక్సెస్‌పుల్‌గా .. ఎంత టీమ్ స్పిరిట్‌తో.. ఎంత ఎఫర్ట్‌ఫుల్‌గా పనిచేశామన్నది ముఖ్యం.


రేటింగ్ విషయానికొస్తే... 1 నుంచి పది పాయింట్లలో నేను 2024కు 6 పాయింట్లు ఇస్తాను. ఎందుకంటే, 2024 నాకెంతో నేర్పించింది. దాంతోపాటు అనేక సవాళ్లను కూడా ఇచ్చింది మరి!

2024లో నాకు సంతోషం కలిగించిన విషయాలు... మొదటిసారిగా నేను నా ఫ్యామిలీతో యూఎస్ ట్రిప్‌కు వెళ్లడం, ఉత్తమ నటుడిగా అవార్డు అందుకోగలగడం.

2025 మీద నా అంచనాలు: షూటింగ్‌లతో బిజీగా ఉండటం, చాలా ఎగ్జైటింగ్ స్టోరీస్, అద్భుతమైన టీమ్ నా చేతిలో ఉన్నాయి. వాటితో కనీసం రెండు మూవీస్ అయినా 2025లో రిలీజ్ కావాలి. ఇంకా కష్టపడటం, పూర్తి స్థాయిలో శక్తి వంచన లేకుండా పనిచేయడం, నా గోల్స్.

- ఆనంద్ దేవరకొండ

ప్రశాంతతకు ప్రాధాన్యం



రోజు రోజుకీ నెగటివిటీ పెరిగిపోతోంది. అందుకే కొంచెం పాజిటివిటీ పెంచుకోవాలి. కెరీర్ కోసం పరుగులు... డబ్బు కోసం పరుగులు... ఈ పరుగులో ప్రశాంతత ఉందా? అని ఆగి ఆలోచించుకోవాలి. లేనట్లు అనిపిస్తే పరుగు కాస్త తగ్గించి ప్రశాంతతకి ప్రాధాన్యం ఇవ్వాలి. ఏం చేసినా కుటుంబం కోసమే కాబట్టి... కుటుంబంతో గడపడానికి వీలు లేనంత బిజీ అయిపోవడం సరి కాదు. అందుకే ఫ్యామిలీకి తగిన సమయం వెచ్చించండి... పాజిటివిటీకి ప్రాధాన్యం ఇవ్వండి... ప్రశాంతంగా ఉండండి.

ప్రొఫెషన్‌గా, కెరీర్‌పరంగా కూడా 2024 నాకు చాలా మంచి సంవత్సరం అనే చెబుతాను నేను. అందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి నా పెళ్లి, రెండు నా సినిమా గ్రాండ్ సక్సెస్ కావడం. ఐదు సంవత్సరాలుగా రిలేషన్‌లో ఉన్న మా ప్రేమ కాస్తా పెళ్లి పట్టాలెక్కింది 2024లోనే. సంవత్సరమున్నరపాటు నేను, మా టీమ్ అంతా ఎంతో హార్డ్‌వర్క్ చేసిన నా సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలవడం నా కెరీర్‌లో మెమరబుల్ మూమెంట్‌గా చెప్పుకుంటాను. 1 నుంచి 10 పాయింట్లలో 2024 కు నేను 9 పాయింట్లు ఇస్తాను. నా పెళ్లి చాలా గ్రాండ్‌గా జరగటం, ఆ పెళ్లికి పిలవడం కోసం చాలాకాలం నుంచి దూరంగా ఉన్న మా బంధువులందరినీ కలవడం, వారితో సంబంధాలు కలుపుకోవడం, అందరూ పెళ్లికి రావటం, అందరితో హ్యాపీగా టైమ్ స్పెండ్ చేయగలగటం చాలా సంతోషాన్నిచ్చింది. ఇంకో విశేషం ఏంటంటే, మా పెళ్లి తర్వాత మా ఊళ్లో మేము ఆంజనేయస్వామి తిరునాళ్ల చేసుకున్నాం. అది మాకు చాలా ప్రత్యేకం. మా చిన్నప్పుడెప్పుడో చేశాం అది. దాదాపు పాతికేళ్ల తర్వాత ఇప్పుడు చేశాం.

ఇంక న్యూ ఇయర్ రెజల్యూషన్ అంటారా.. బీ గుడ్ టు అదర్స్. అంటే అందరితో ఇంకా మంచిగా ఉండటం. దాంతోపాటు 2024లో నేను రెండు సినిమాలు హిట్ కొట్టాలనుకున్నాను. అయితే అది చేయలేకపోయాను. 2025లో కచ్చితంగా రెండు మంచి సినిమాలు అందించాలి. ఎంటర్‌టైన్ చేయాలి అనుకుంటున్నాను. అదే నా గోల్. ఇంకా.. పర్సనల్ లైఫ్ విషయానికొస్తే.. మ్యారేజ్ తర్వాత ఇది మా ఫస్ట్ న్యూ ఇయర్. మేము ఐదేళ్లుగా ఒకరికొకరం తెలుసు. ఇప్పుడు కొత్తగా ఏం చేయలేకపోయినా, కనీసం అదే రిలేషన్‌షిప్ మెయిన్‌టెయిన్ చేయాలనుకుంటున్నాం.

- కిరణ్ అబ్బవరం

ప్రతి టైమ్ మంచిదే

జీవితంలో మనకు దక్కిన 'మంచి'ని గ్రహించాలి. ఆ మంచికి కృతజ్ఞతగా ఉండాలి. మన ఉరుకు పరుగుల జీవితంలో మనకు జరిగే మంచిని పట్టించుకునే స్థితిలో కూడా కొందరం ఉండము. జరిగే చెడు విషయాల గురించి అదే పనిగా ఆలోచించుకుని బాధపడుతుంటాం. అయితే మంచిని గ్రహించి, పాజిటివ్‌గా ముందుకెళ్లాలి. అప్పుడు జీవితం బాగుంటుంది. ఈ కొత్త సంవత్సరం సందర్భంగా ఒక్కసారి మనకు దక్కిన మంచి విషయాలను గుర్తు చేసుకుని, ఆనందంగా ముందుకెళదాం.

2024లో మొత్తం చూస్తే నేను చాలా హార్డ్ వర్క్ చేశాను. వాటి ఫలితాలు 2025 అందుకోబోతున్నాను. 2024లో వ్యక్తిగతంగా, ప్రొఫెషనల్‌గా ఏ అంచనాలు పెట్టుకోకుండా సహనంతో వర్క్ చేశాను. నా వరకు బెస్ట్ ఫెర్ఫార్మెన్స్‌ని ఇచ్చాను. ప్రతి టైమ్ మంచిదే. ప్రతి సందర్భం నాకు విలువైన బెస్ట్ మూమెంట్‌ని ఇచ్చింది. ఏడాది మొత్తంలో చాలా గుడ్ మూమెంట్స్ ఉన్నాయి. నా బెస్ట్ మూమెంట్ ఏంటంటే నా మూవీస్‌కు డబుల్ షిఫ్ట్స్‌లో వర్క్ చేశాను. హార్డ్ వర్క్ ఉన్న ఆ రోజులన్నీ చాలా గొప్పవి. 2025లో కూడా బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ చేయదగిన వర్క్స్ వస్తాయని ఆశిస్తున్నాను. ఈ కొత్త సంవత్సరంలోనూ ఎలాంటి బ్రేక్ తీసుకోకుండా వర్క్ చేయాలనుకుంటున్నాను.

- నిధీ అగర్వాల్



వరుణ్ వీరోచిత సెంచరీ


వరుణ్

82 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 109 నాటౌట్

- తిలక్ వర్మ 99 అవుట్
- కర్ణాటకపై హైదరాబాద్ గెలుపు
- మయాంక్ అగర్వాల్ శతకం వృథా

అహ్మదాబాద్: భారీ లక్ష్యం ముందున్నా... ఆందోళన చెందకుండా సంయమనంతో ఆడిన హైదరాబాద్ జట్టు విజయ్ హజారే ట్రోఫీ దేశవాళీ వన్డే క్రికెట్ టోర్నీలో కర్ణాటక జట్టుపై మూడు వికెట్ల తేడాతో అద్భుత విజయం అందుకుంది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో హైదరాబాద్ రెండు బంతులు మిగిలి ఉండగా లక్ష్యాన్ని ఛేదించింది. వరుణ్ గౌడ్ (82 బంతుల్లో 109 నాటౌట్; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ శతకంతో హైదరాబాద్ జట్టును గెలిపించాడు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న కర్ణాటక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 320 పరుగులు చేసింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (112 బంతుల్లో 124; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) మరో సెంచరీతో చెలరేగగా... స్మరణ్ (75 బంతుల్లో 83; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. హైదరాబాద్ బౌలర్లలో చామా మిలింద్ 3 వికెట్లు పడగొట్టగా... అనికేత్ రెడ్డి 2 వికెట్లు తీశాడు. ముదస్సిర్, రోహిత్ రాయుడులకు ఒక్కో వికెట్ లభించింది. లక్ష్యఛేదనలో హైదరాబాద్ 49.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 322 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ తిలక్ వర్మ (106 బంతుల్లో 99; 7 ఫోర్లు, 1 సిక్స్) పరుగు తేడాతో శతకం చేజార్చుకోగా... వరుణ్ గౌడ్ వీరవిహారం చేశాడు. తిలక్, వరుణ్ ఐదో వికెట్‌కు 112 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కబెట్టారు. కీలక సమయంలో తిలక్ వెనుదిరిగినా... చివరి వరకు క్రీజులో నిలిచిన వరుణ్ గౌడ్ భారీ షాట్లతో విరుచుకుపడి జట్టును గెలిపించాడు. తనయ్ త్యాగరాజన్ (17 బంతుల్లో 25; 3 ఫోర్లు, 1 సిక్స్), వరుణ్ ఏడో వికెట్‌కు 71 పరుగులు జోడించారు. చివరి ఓవర్ తొలి బంతికి తనయ్ అవుటైనా... చామా మిలింద్ (4 నాటౌట్)తో కలిసి వరుణ్ హైదరాబాద్‌ను విజయతీరాలకు చేర్చాడు. కర్ణాటక బౌలర్లలో ప్రవీణ్ దూబే, నికిన్ జోస్ చెరో రెండు వికెట్లు తీశారు. వరుణ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. తమ తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం పంజాబ్‌తో హైదరాబాద్ ఆడుతుంది.

పశ్చిమ బెంగాల్ 33వసారి...

- సంతోష్ ట్రోఫీ టైటిల్ సొంతం
- ఫైనల్లో కేరళపై విజయం

సాక్షి, హైదరాబాద్: జాతీయ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ సంతోష్ ట్రోఫీలో 33వసారి పశ్చిమ బెంగాల్ జట్టు చాంపియన్‌గా అవతరించింది. మంగళవారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో హోరాహోరీగా సాగిన తుదిపోరులో పశ్చిమ బెంగాల్ జట్టు 1–0 గోల్ తేడాతో కేరళ జట్టుపై విజయం సాధించింది. పశ్చిమ బెంగాల్ తరఫున రోబీ హన్స్‌దా (90+4వ నిమిషంలో) ఏకైక గోల్ చేసి జట్టుకు టైటిల్ అందించాడు. ఆదిత్య థాపా కొట్టిన హెడర్‌ను బాక్స్‌కు సమీపంలో అందుకున్న రోబీ... సునాయాసంగా ప్రత్యర్థి పోస్ట్‌లోకి పంపాడు. ఆ తర్వాత స్కోరు సమం చేసేందుకు కేరళ జట్టు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గ్రూప్ దశలో అత్యుత్తమ ప్రదర్శనతో పరాజయం ఎరగకుండా ఫైనల్‌కు చేరిన ఇరుజట్ల మధ్య ఉత్కంఠ భరిత సమరం జరగగా... చివరకు పశ్చిమ బెంగాల్‌నే విజయం వరించింది.



మహిళల విభాగంలో అగ్ర స్థానంతో నాకౌట్‌కు అర్హత

- హంపి చేజారిన అవకాశం
- వరల్డ్ చెస్ 'బ్లిట్జ్' చాంపియన్‌షిప్

వారెవ్వా వైశాలి

న్యూయార్క్: భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్ బాబు 'ఫిడే' వరల్డ్ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. టోర్నీ తొలి రోజు మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ దశలో 11 గేమ్‌లలో కలిపి ఆమె మొత్తం 9.5 పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. 8 గేమ్‌లు గెలిచిన వైశాలి 3 గేమ్‌లను 'డ్రా' చేసుకుంది. తొలి నాలుగు గేమ్‌లను వరుసగా గెలుచుకొని 23 ఏళ్ల వైశాలి శుభారంభం చేసింది. ఐదో గేమ్‌లో ఆమెకు రష్యాకు చెందిన మాజీ బ్లిట్జ్ వరల్డ్ చాంపియన్ కేటరీనా లాగ్నోతో గట్టి పోటీ ఎదురైంది. హోరాహోరీ సమరం తర్వాత ఈ గేమ్ 'డ్రా'గా ముగిసింది. ఆ తర్వాత వైశాలి వరుసగా ఆరు, ఏడు, ఎనిమిదో గేమ్‌లలో విజయాలు సొంతం చేసుకుంది. ఎనిమిదో రౌండ్‌లో ప్రస్తుత వరల్డ్ బ్లిట్జ్ చాంపియన్ వలెంటినా గునీనా (రష్యా)పై గెలవడం ఆమె ముందంజ వేయడంలో కీలకంగా మారింది. 9వ రౌండ్‌ను 'డ్రా'గా ముగించుకున్న అనంతరం పదో గేమ్‌లో పొలినా షువలోవా (రష్యా)ను ఓడించడంతో వైశాలికి అగ్ర స్థానం ఖాయమైంది. దాంతో అమెరికాకు చెందిన కారిసా ఇప్‌తో జరిగిన 11వ గేమ్‌ను చకచకా 9 ఎత్తుల్లోనే 'డ్రా' చేసుకొని వైశాలి క్వాలిఫయింగ్ దశలో నంబర్‌వన్‌గా నిలిచింది. మొత్తం 8 మంది ప్లేయర్లు క్వార్టర్ ఫైనల్ (నాకౌట్) దశకు అర్హత సాధించారు. క్వార్టర్ ఫైనల్లో జు జినర్ (చైనా)తో వైశాలి తలపడుతుంది. మరోవైపు వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కోనేరు హంపి నాకౌట్‌కు చేరలేకపోయింది. 11 రౌండ్‌ల తర్వాత మొత్తం 8 పాయింట్లతో ఆమె 9వ స్థానంతో ముగించింది. 8 గేమ్‌లను గెలిచిన హంపి...మరో 3 గేమ్‌లలో పరాజయం పాలైంది. ఎనిమిదో రౌండ్‌లో మరో భారత ప్లేయర్ దివ్య దేశ్‌ముఖ్ చేతిలో అనూహ్యంగా ఓడటం హంపి అవకాశాలను దెబ్బ తీసింది. ఇతర భారత క్రీడాకారిణులు దివ్య దేశ్‌ముఖ్ (7 పాయింట్లు) 18వ ర్యాంక్‌లో, వంతిక అగర్వాల్ (7 పాయింట్లు) 19వ ర్యాంక్‌లో, ద్రోణవల్లి హారిక (7 పాయింట్లు) 22వ ర్యాంక్‌లో, నూతక్కి ప్రియాంక (5 పాయింట్లు) 70వ ర్యాంక్‌లో, పద్మిని రౌత్ (5 పాయింట్లు) 71వ ర్యాంక్‌లో, సాహితి వర్షిణి (4.5 పాయింట్లు) 76వ ర్యాంక్‌లో నిలిచారు. పాయింట్లు సమంగా ఉన్నపుడు మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరిస్తారు.

అర్జున్‌కు నిరాశ...

పురుషుల (ఓపెన్) విభాగంలో భారత ఆటగాళ్లలో ఎవరూ క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయారు. మొత్తం 13 రౌండ్‌ల తర్వాత భారత్ నుంచి అత్యుత్తమంగా ఆర్.ప్రజ్ఞానంద 8.5 పాయింట్లతో 23వ స్థానంతో ముగించగా, రౌనక్ సాధ్వానికి 35వ స్థానం (8 పాయింట్లు) దక్కింది. తెలంగాణకు చెందిన అర్జున్ ఇరిగేశి 7 పాయింట్లు మాత్రమే సాధించి 64వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. తొలి 5 గేమ్‌లలో గెలిచి అగ్రస్థానంతో ముందుకు దూసుకుపోయిన అర్జున్‌కు ఆ తర్వాత అనూహ్య ఫలితాలు ఎదురయ్యాయి. తర్వాతి 5 రౌండ్‌లలో 2 ఓడి, 2 'డ్రా' చేసుకున్న అతను ఒకటే గేమ్ గెలవగలిగాడు. ఆఖరి 3 రౌండ్‌లలో వరుసగా అనీశ్ గిరి (నెదర్లాండ్స్), డెనిస్ లజావిక్ (రష్యా), కజిబెక్ నాగర్‌బెక్ (కజకిస్తాన్)ల చేతుల్లో ఓడటంతో రేసులో అర్జున్ పూర్తిగా వెనుకబడిపోయాడు.

శ్రీకర్ భరత్, అశ్విన్ అజేయ సెంచరీలు


అశ్విన్ శ్రీకర్ భరత్

- మేఘాలయపై 10 వికెట్లతో ఆంధ్ర ఘనవిజయం
- 5 వికెట్లు పడగొట్టిన సందీప్
- విజయ్ హజారే ట్రోఫీ టోర్నీ


సందీప్

ముంబై: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో ఆంధ్ర జట్టు జోరు కొనసాగుతోంది. గ్రూప్ 'బి'లో భాగంగా ఆంధ్ర జట్టు నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరిగిన పోరులో ఆంధ్ర 10 వికెట్ల తేడాతో మేఘాలయను మట్టికరిపించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ జట్టు 48.2 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ నిశాంత చక్రవర్తి (108 బంతుల్లో 101; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా... అర్పిత్ (90 బంతుల్లో 66; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో రాణించాడు. దీంతో ఒకదశలో మేఘాలయ జట్టు 182/1తో పటిష్ట స్థితిలో కనిపించింది. అయితే ఆ తర్వాత ఆంధ్ర బౌలర్లు విజృంభించి వరుస విరామాల్లో వికెట్లు పడగొట్టారు. దీంతో మేఘాలయ బ్యాటర్లు ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆంధ్ర బౌలర్లలో యారా సందీప్ 28 పరుగులిచ్చి 5 వికెట్లతో అదరగొట్టగా... ఆంజనేయులు, మహీప్ కుమార్ రెండేసి వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆంధ్ర 29.3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 228 పరుగులు చేసింది. ఆంధ్ర కెప్టెన్ శ్రీకర్ భరత్ (81 బంతుల్లో 107 నాటౌట్; 9 ఫోర్లు, 7 సిక్స్‌లు) సెంచరీతో విజృంభించాడు. మరో ఓపెనర్ అశ్విన్ హెబర్ (96 బంతుల్లో 108 నాటౌట్; 13 ఫోర్లు, 1 సిక్స్) కూడా 'శత'క్కొట్టడంతో ఆంధ్ర జట్టు ఆడుతూ పాడుతూ లక్ష్యాన్ని ఛేదించింది. మేఘాలయ బౌలింగ్‌ను ఓ ఆటాడుకున్న భరత్... సిక్స్‌లతో చెలరేగిపోతే అశ్విన్ బౌండరీలతో హోరెత్తించాడు. వీరిద్దరూ పోటీపడి పరుగులు రాబట్టడంతో లక్ష్యం చిన్నబోయింది. గత మ్యాచ్‌లో సర్వీసెస్‌పై అజేయ అర్ధశతకాలతో వికెట్ నష్టపోకుండానే జట్టును గెలిపించిన భరత్, అశ్విన్... ఈసారి కూడా దాన్ని పునరావృతం చేశారు. 5 వికెట్లు తీసిన సందీప్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. గ్రూప్‌లో ఇప్పటి వరకు 5 మ్యాచ్‌లాడిన ఆంధ్ర జట్టు 4 విజయాలు, ఒక పరాజయంతో 16 పాయింట్లు ఖాతాలో వేసుకొని రెండో స్థానంలో కొనసాగుతోంది. తదుపరి మ్యాచ్‌లో శుక్రవారం మహారాష్ట్రతో ఆంధ్ర జట్టు తలపడుతుంది.

2025 స్పోర్ట్స్ క్యాలెండర్
మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా


● ఎన్టీఆర్ ● ప్రభాస్ ● మహేశ్ బాబు

విదేశాల్లో 2025

2024కి బై చెప్పి... 2025కి వెల్‌కమ్ చెప్పడానికి అందరూ సెలబ్రేషన్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. కొందరు స్టార్స్ అయితే కొత్త సంవత్సరం జరుపుకోవడానికి విదేశాలు వెళ్లారు. షూటింగ్స్‌కి కాస్త విరామం దొరకడంతో వెకేషన్ ప్లాన్ చేసుకునే అవకాశం ఈ స్టార్స్‌కి దక్కింది. వారి ఈ వెకేషన్ గురించి తెలుసుకుందాం...


● కుటుంబ సభ్యులతో ఎన్టీఆర్

ఈ ఏడాది మహేశ్‌బాబు ఇప్పటికే రెండుసార్లు జర్మనీ వెళ్లొచ్చారు. అయితే ఇది హాలిడే ట్రిప్ కాదు. రాజమౌళి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా ప్రిపరేషన్‌లో భాగంగా జర్మనీ వెళ్లారని చెప్పుకోవచ్చు. అయితే ప్రతి ఏడాది మహేశ్‌బాబు న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ ఫారిన్‌లో జరుగుతుంటాయి. ఈ ఏడాది కూడా ఫారిన్‌లోనే మహేశ్‌బాబు ప్లాన్ చేశారని సమాచారం. మహేశ్‌బాబు మోస్ట్‌లీ యూరప్‌కు వెళ్లనున్నారట.

ఇక ప్రభాస్ ఆల్రెడీ యూరప్‌లో ఉన్నారని తెలిసింది. ఇటీవల ఓ సినిమా చిత్రీకరణలో భాగంగా ప్రభాస్ కాలికి గాయమైంది. వైద్యుల సూచనల మేరకు ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. యూరప్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్నారని, ప్రభాస్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ అక్కడే అని టాక్. విదేశాల నుంచి తిరిగొచ్చిన తర్వాత 'రాజా సాబ్, ఫౌజి' చిత్రీకరణలో పాల్గొంటారు ప్రభాస్. ఈ సినిమాల చిత్రీకరణలు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత 'అర్జున్ రెడ్డి' ఫేమ్ సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' చిత్రాన్ని ఆరంభిస్తారు ప్రభాస్. ఇక 'దేవర' సక్సెస్ జోష్‌లో ఉన్నారు ఎన్టీఆర్. ప్రస్తుతం ఎన్టీఆర్ హిందీలో స్ట్రయిట్ ఫిల్మ్ 'వార్ 2' (ఈ చిత్రంలో హృతిక్ రోషన్ మరో హీరో) లో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాకు చెందిన ఓ లెంగ్తీ షూట్‌ను పూర్తి చేశారు. ఆ తర్వాత ఫ్యామిలీతో కలిసి లండన్ వెళ్లారని తెలిసింది. సో... ఎన్టీఆర్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ లండన్‌లోనే అని ఊహించవచ్చు. లండన్ నుంచి తిరిగొచ్చిన తర్వాత ప్రశాంత్ నీల్ దర్శకత్వంలోని 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) షూటింగ్‌తో ఎన్టీఆర్ బిజీ అవుతారట. ఇంకా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం హీరోయిన్ పూజా హెగ్డే స్పెయిన్ వెళ్లారు. రష్మికా మందన్నా ఆల్రెడీ ఫారిన్‌లోనే ఉన్నారని తెలిసింది. హీరోయిన్ తమన్నా, ఫరియా అబ్దుల్లా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ను అమెరికాలో ప్లాన్ చేశారని తెలిసింది. వీరితో పాటు మరి కొందరు టాలీవుడ్ యాక్టర్స్ గోవా, మాల్దీవ్స్‌లో వేడుకలు ప్లాన్ చేశారని సమాచారం.


● సరిత, నయనతార, విఘ్నేశ్, మాధవన్

భర్త విఘ్నేష్ శివన్‌తో నయనతార దుబాయ్ వెళ్లారు. అక్కడే మాధవన్, ఆయన భార్య సరిత కూడా ఉన్నారు. సో... ఈ రెండు ఫ్యామిలీస్ ఒకే చోట వేడుక చేసుకోనున్నారు. కలిసి ఉన్న ఫొటోను కూడా షేర్ చేశారు. అలాగే బాలీవుడ్ స్టార్ట్ హీరో హృతిక్ రోషన్ కూడా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ స్పాట్‌గా దుబాయ్‌నే ఎంచుకున్నారు. ఇంకా ఫ్యామిలీతో కలిసి దియా మీర్జా శ్రీలంక వెళ్లారు. అర్జున్ రాంపాల్ సెలబ్రేషన్స్ గోవాలో జరుతాయని సమాచారం. ఫ్యామిలీతో కలిసి కరీనా కపూర్ స్విట్జర్లాండ్‌లో, శిల్పాశెట్టి లండన్‌లో, భర్త జహీర్ ఇక్బాల్‌తో కలిసి హీరోయిన్ సోనాక్షీ సిన్హా ఆస్ట్రేలియాలో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ జరుపుకోనున్నారు. 'యానిమల్' ఫేమ్ త్రిప్తీ దిమ్రీ ఫిన్‌ల్యాండ్ వెళ్లారు.

ఓ వెన్నెల...

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రముఖ దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ హీరోయిన్. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించారు. ఈ నెల 3న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా 'భైరవం' మూవీ నుంచి 'ఓ వెన్నెల..' అంటూ సాగే పాటని రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించి, కొత్త పోస్టర్‌ని రిలీజ్ చేశారు. ''యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న చిత్రం 'భైరవం'. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ఫస్ట్ లుక్ పోస్టర్స్ మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి'' అని చిత్రబృందం పేర్కొంది.


● సాయి శ్రీనివాస్, అదితీ శంకర్

2024ని మంచి సినిమాతో ముగించాను

- జాన్వీ కపూర్



''అమరన్' సినిమాని కాస్త ఆలస్యంగా చూశాను. అయితే 2024 సంవత్సరాన్ని ఇలాంటి ఒక అద్భుతమైన, ఒక మంచి సినిమా చూసి ముగించినందుకు చాలా సంతోషంగా ఉంది'' అని హీరోయిన్ జాన్వీ కపూర్ అన్నారు. శివ కార్తికేయన్, సాయిపల్లవి జోడీగా నటించిన ద్విభాషా చిత్రం (తమిళ్, తెలుగు) 'అమరన్'. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహించారు. 2014లో జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అసువులు బాసిన మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. దీపావళి కానుకగా 2024 అక్టోబరు 31న విడుదలైంది. ఈ మూవీ తెలుగు, తమిళ భాషల్లో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. ఈ చిత్రంపై ఇప్పటికే ఎంతోమంది స్టార్స్ కూడా ప్రశంసలు కురిపించారు. తాజాగా జాన్వీ కపూర్ కూడా 'అమరన్' మూవీపై తన ఇన్‌స్టాగామ్ ద్వారా ప్రశంసలు కురిపించారు. ''అమరన్' సినిమాని నేను చూడడం ఆలస్యమైంది. కానీ, ఎంతో అద్భుతమైన సినిమా. ప్రతి సన్నివేశం చాలా భావోద్వేగంతో నిండిపోయింది. ఈ ఏడాదికి 'అమరన్' బెస్ట్ మూవీ. ఈ చిత్రం నా హృదయాన్ని కదిలించింది. ఈ సినిమాలోని సన్నివేశాలు నా హృదయాన్ని బరువెక్కించాయి. ఓ ప్రేక్షకురాలిగా 2024ని ఇలాంటి ఒక మంచి సినిమాతో ముగించడం సంతోషంగా ఉంది'' అని పోస్ట్ చేశారామె. కాగా ఎన్టీఆర్ 'దేవర' మూవీతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీ ప్రస్తుతం రామ్‌చరణ్‌కి జోడీగా నటిస్తున్నారు.

గుండె జారిపోయిందే!

వరుణ్ రాజ్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'పోకిరి'. వికాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమత హీరోయిన్. ప్రమోద్ రాజు సమర్పణలో రాజా మూవీస్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. కాగా వరుణ్ రాజ్ పుట్టినరోజు సందర్భంగా 'పోకిరి' నుంచి 'గుండె జారిపోయిందే..'. అంటూ సాగే మొదటి పాటని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో–నిర్మాత వరుణ్ రాజ్ మాట్లాడుతూ– ''పోకిరి' టైటిల్‌లోనే దమ్ముంది. ఈ సినిమాతో హిట్ సాధిస్తామనే నమ్మకం ఉంది. 'పోకిరి' సినిమాకి ఓనర్ మహేశ్‌బాబుగారే. మేమంతా ఆయన అభిమానులం అంతే'' అన్నారు. ''ఈ మూవీ స్టోరీ లైన్ రాసుకున్నప్పటి నుంచి 'పోకిరి' అనే టైటిల్ అనుకున్నాం'' అని వికాస్ చెప్పారు. ''పోకిరి' నా తొలి సినిమా'' అని పేర్కొన్నారు మమత. సంగీత దర్శకుడు ఉదయ్ కిరణ్ మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: వెంకీ–వంశీ.


● వరుణ్ రాజ్, మమత

ఓటీటీ — ఇది చూడొచ్చు

సీక్రెట్స్ ఆఫ్ ఆర్ఆర్ఆర్ బై రాజమౌళి

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో ఆర్ఆర్ఆర్ - బిహైండ్ అండ్ బియాండ్ ఒకటి. ఈ డాక్యుమెంటరీ గురించి తెలుసుకుందాం.



తన ఉనికిని తెలిపేందుకు ఓ గదిలో నలుగురు ముందు చప్పట్లు కొడితే ఆ నలుగురికి తన విషయం తెలియవచ్చు. కానీ అదే ఉనికి ప్రపంచానికి తెలియాలంటే సరిగ్గా రాజమౌళిలా ఆలోచించాలి. భారత దేశానికి ఒకప్పుడు సినిమా ప్రమోషన్‌ను ఓ వినూత్న పంథాలో పరిచయం చేసిన బాలీవుడ్ దిగ్గజం అమిర్ ఖాన్ కూడా తాను ఈ విషయంలో రాజమౌళినే ఫాలో అవుతాననడం దీనికి ఓ నిదర్శనం. చరిత్ర అనేది రాజమౌళి ముందు ఉన్నది తరువాత ఉంటుంది, కానీ ఆ చరిత్రలో రాజమౌళికి ఓ చెరగని పేజీ ఉంటుందనేది మాత్రం నిర్వివాదాంశం. తెలుగు సినిమా వైభవాన్ని ఎన్నో అంతర్జాతీయ వేదికలపైన నిలిపిన శిల్పి రాజమౌళి. మరీ ముఖ్యంగా తెలుగు సినిమాకి ఆస్కారమే లేదన్న ఆస్కార్ పురస్కారాన్ని అద్భుతంగా అందించిన అత్యున్నత దర్శకులు రాజమౌళి. తన సినిమా అంటేనే ఓ సంచలనం. మరి... ఆ సంచలనం వెనకున్న సీక్రెట్ తెలుసుకోవాలని ప్రతి దర్శకుడితో పాటు సామాన్య ప్రేక్షకుడికి కూడా ఆసక్తి ఉంటుంది. ఆ కోవలోనే రాజమౌళి తీసిన 'ఆర్ఆర్ఆర్' సినిమాకి సంబంధించిన తన కష్టాన్ని ఓ చక్కటి డాక్యుమెంటరీ రూపంలో 'ఆర్ఆర్ఆర్ – బిహైండ్ అండ్ బియాండ్' పేరిట నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులో ఉంచారు. దాదాపు రెండున్నర గంటల పై నిడివి ఉన్న 'ఆర్ఆర్ఆర్' సినిమాను నాలుగేళ్ల పాటు తీశారు. ఈ డాక్యుమెంటరీలో ఆ సినిమా మొత్తాన్ని ఎలా తీశారో రాజమౌళి వ్యాఖ్యానంతో పాటు సినిమాలోని నటీనటులు టెక్నీషియన్స్ కూడా వివరిస్తూ చూపించడం ఎంతో బాగుంది. తన ఈ 'ఆర్ఆర్ఆర్' ప్రయాణానికి సంబంధించి ఎన్నో తెలియని, చూడని అద్భుత విషయాలను ప్రేక్షకులకు అందంగా అందించారు. ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి... ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన ఫుటేజ్ కొన్ని గంటల రూపంలో ఉంటే దానిని ఎడిట్ చేసి, గంటన్నర నిడివితో అందించారట. ఈ సమాజమనేది ఓ సృష్టి. ప్రతిరోజూ మన మనుగడ ఈ సృష్టికి అనుగుణంగానే ఉంటుంది. ఓ రకంగా సినిమా అన్నది కూడా ఓ సృష్టి. ఓ దర్శకుడి ఆలోచనకు ప్రతిరూపమే సినిమా అన్న ఓ అద్భుత సృష్టి, కానీ ఈ సినిమా సృష్టిలో ఎంతోమంది కష్టం ఉంటుంది. మరి... అటువంటి సినిమాను ఏ విధంగా రూపొందించారో ఆ రహస్యాలు మీరు కూడా తెలుసుకోవాలంటే నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'ఆర్ఆర్ఆర్ – బిహైండ్ అండ్ బియాండ్'ని చూసేయండి. వర్త్ టు వాచ్ అండ్ ప్రిజర్వ్ ద డాక్యుమెంటరీ ఫర్ ది ఫ్యూచర్ కిడ్స్.

– ఇంటూరు హరికృష్ణ

ఈ మూవీ రివ్యూ వీడియో రూపంలో చూడాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ
109	0
78,139	23,645

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	19,332	▽	154
డోజోన్స్	42,476	▽	106
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,173	△	52
డాక్స్ (సోమవారం ముగింపు)	19,109	▽	75
షాంఘై	3,352	△	56
నికాయ్ (సోమవారం ముగింపు)	39,895	△	387

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)	76,162	▽	32
బంగారం (22 క్యారట్)	75,857	▽	32
వెండి (కిలో)	86,017	▽	1,158

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.99	87.10
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.36	109.63
€	యూరో	ఎస్‌బీఐ	87.24	91.09
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	43.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.04	55.16
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.93	65.00
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.93	23.44
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.43	24.15
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.97	12.56

నవంబర్‌లో 'మౌలికం' నెమ్మది

వృద్ధి రేటు 4.3 శాతానికి డౌన్ ● 2023 ఇదే నెల్లో పురోగతి 7.9 %

న్యూఢిల్లీ: ఎనిమిది ప్రధాన మౌలిక రంగాల గ్రూప్ ఉత్పత్తి వృద్ధి రేటు నవంబర్‌లో 4.3 శాతంగా నమోదయ్యింది. గత సంవత్సరం ఇదే నెలలో నమోదైన 7.9 శాతం వృద్ధితో పోలిస్తే ఈ రేటు తగ్గుదల నమోదుకావడం గమనార్హం. అయితే 2024 అక్టోబర్ 3.7 శాతం వృద్ధితో పోలిస్తే ఇది మెరుగైన ఫలితం. సిమెంట్ మినహా (13 శాతం వృద్ధి), బొగ్గు (7.5 శాతం), రిఫైనరీ ప్రొడక్టులు (2.9 శాతం), ఎరువులు (2.0 శాతం), ఉక్కు (4.8 శాతం), విద్యుత్ (3.8 శాతం) రంగాలు 2023 నవంబర్‌తో పోల్చితే వృద్ధి రేట్లు తగ్గాయి. చమురు, సహజవాయువు రంగాల్లో వృద్ధి లేకపోగా క్షీణరేట్లు నమోదయ్యాయి.



ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య..

ఆర్థిక సంవత్సరం ఎనిమిది నెలల్లో (2024 ఏప్రిల్–నవంబర్) మౌలిక రంగం గ్రూప్ వృద్ధి రేటు 4.2 శాతంగా నమోదయ్యింది. 2023 ఇదే కాలంతో పోల్చితే (8.7 శాతం) వృద్ధి రేటు సగానికి పైగా పడిపోవడం గమనార్హం. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిసూచీ (ఐఐపీ)లో ఈ ఎనిమిది రంగాల వాటా 40.27 శాతం కావడం గమనార్హం.

నష్టాలతో వీడ్కోలు



ముంబై: 2024 ఏడాది ఆఖరి ట్రేడింగ్ సెషన్‌లో స్టాక్ సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఇంట్రాడే కనిష్టాల నుంచి దాదాపు కోలుకున్నప్పటికీ.., లాభాల్లోకి రాలేకపోయాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు మంగళవారం ఉదయం బలహీనంగా మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే 687 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 109 పాయింట్లు నష్టపోయి 78,139 వద్ద స్థిరపడింది. నిఫ్టీ మార్పు లేకుండా సోమవారం ముగింపు 23,645 వద్దే ముగిసింది. కనిష్ట స్థాయిల వద్ద చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్లకు మద్దతు లభించడంతో బీఎస్‌ఈ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు 0.71 %, 0.13% చొప్పున పెరిగాయి. ఐటీ, రియల్టీ, ఫైనాన్స్ సర్వీసెస్ షేర్లలో లాభాల స్వీకరణ జరిగింది. క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్స్, ఇంధన, మెటల్, విద్యుత్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సంవత్సరాంతం కావడంతో అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

యూనిమెక్ ఏరోస్పేస్

యూనిమెక్ ఏరోస్పేస్ షేరు బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.785)తో పోలిస్తే 90% ప్రీమియంతో **రూ.1,491 వద్ద లిస్టయ్యింది.** గరిష్టాల్లో లాభాల స్వీకరణతో చివరికి **75% లాభంతో రూ.1,373** వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ **రూ.6,984 కోట్లుగా నమోదైంది.**

ఆటో దిగ్గజాల జత.. సక్సెస్ మంత్ర..!

- తాజాగా జట్టు కట్టిన హోండా, నిస్సాన్
- చైనా పోటీకి చెక్ పెట్టే ప్రణాళికలు
- 9 ఏళ్ల తదుపరి విడిపోయిన డైమ్లర్ క్రిస్లర్
- 2008 సంక్షోభంతో టాటాల చేతికి జేఎల్‌ఆర్

ఆటోరంగం ప్రపంచవ్యాప్తంగా కొంతకాలంగా ఒక కొత్త ఒత్తిడిని ఎదుర్కొంటోంది. వేగంగా దూసుకొస్తున్న ఎలక్ట్రిక్ కార్లు ఒకవైపు, ఆర్టిఫిషియల్ టెక్నాలజీతో నడిచే డ్రైవర్ లెస్ కార్లు రోబో ట్యాక్సీలు మరోవైపు ఆటో కంపెనీలకు ఆర్థిక భారాన్ని పెడుతున్నాయి.. అమెరికా కార్ల దిగ్గజం టెస్లా ఎలక్ట్రిక్ కార్లతో ఆధిపత్యం చెలాయిస్తుంటే, చైనా కంపెనీలు బీవైడీ, నియో, గ్రేట్‌వాల్ మోటార్స్ తక్కువ ధరకే ఈవీలను రోడ్లపైకి తెస్తూ చైనాకు చెక్ పెడుతున్నాయి. కొత్తగా ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి, అనేక దేశాల్లో ఆటో కంపెనీలు తమ పోటీ కంపెనీలతోనే పొత్తుకు దిగుతున్నాయి. ప్రత్యర్థి కంపెనీలతోనే చేతులు కలుపుతున్నాయి. కార్ల తయారీ నుంచి మార్కెటింగ్ దాకా పలు విభాగాల్లో భాగస్వామ్యం కుదుర్చుకుంటున్నాయి. కొన్ని కంపెనీలు పూర్తిగా విలీనం బాట పట్టి ఇతర మార్కెట్లకు విస్తరిస్తుంటే మరికొన్ని టెక్నాలజీని షేర్ చేసుకుంటూ కొత్త మోడళ్ల అభివృద్ధి వ్యయాలు తగ్గించుకుంటున్నాయి. తాజాగా జపనీస్ కంపెనీలు నిస్సాన్, హోండా కూడా విలీనానికి చేతులు కలపడం ఆటో రంగంలో ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే కొన్నాళ్లుగా ఈ ట్రెండ్ కొనసాగుతున్నా విలీనాలు, భాగస్వామ్యాలతో ఏ కంపెనీ ఎక్కువ లాభపడినట్లు గణాంకాలు వెల్లడించడం లేదు. వివరాలు చూద్దాం.

– సాక్షి, బిజినెస్ డెస్క్



భాగస్వామ్యాల తీరిదీ..

- ఎలక్ట్రిక్ వాహనాలు, అటానమస్ డ్రైవింగ్ సాంకేతికతల కోసం ఫోర్డ్ మోటార్, ఫోక్స్‌వేగన్ చేతులు కలిపాయి. అయితే సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల బిజినెస్‌ను మూసివేయగా.. కొంతమేర లబ్ధి పొందాయి.
- జనరల్ మోటార్స్‌తో హోండా జత కలిసింది. జీఎం తయారు చేసే 2 ఈవీ కార్లను హోండా విక్రయిస్తోంది. ఈ రెండింటికి మాత్రమే ఈ భాగస్వామ్యం పరిమితం.
- ఫ్రాన్స్ ప్యూజో, ఫియట్ క్రిస్లర్ జట్టు కట్టడం ద్వారా 2021లో స్టెల్లాంటిస్‌కు ఊపిరిపోశాయి. అయితే ఫ్యాక్టరీలు మూసివేత బాటలో ఉన్నట్లు తెలుస్తోంది.
- రేనాల్ట్‌తో నిస్సాన్ జత కలిసింది. దీంతో నిస్సాన్ నిలదొక్కుకుంది. అయితే దీర్ఘకాలికంగా చూస్తే అంత విజయవంతంకాలేదు.
- అందుబాటు ధరల కార్ల తయారీకి వీలుగా లగ్జరీ కార్ల కంపెనీ డైమ్లర్‌తో, క్రిస్లర్ విలీనమైనప్పటికీ 9 ఏళ్ల తదుపరి 2007లో విడిపోయాయి.

హోండా - నిస్సాన్ విలీనం.. మూడో పెద్ద కంపెనీ

జపనీస్ దిగ్గజాలు హోండా, నిస్సాన్ తాజాగా విలీనానికి అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. దీంతో అమ్మకాలరీత్యా ప్రపంచంలోనే మూడో పెద్ద కంపెనీ ఆవిర్భావానికి తెరతీయనున్నాయి. మిత్సుబిషీ సైతం వీటితో కలవనున్నట్లు తెలుస్తోంది. కొత్తగా ఏర్పడే విలీన కంపెనీ టయోటా, ఫోక్స్‌వ్యాగన్‌తో పోటీ పడనుంది. ఇప్పటికే నిస్సాన్, హోండా, మిత్సుబిషీ సంయుక్తంగా ఈవీల కోసం బ్యాటరీలు తదితర విడిభాగాల తయారీ టెక్నాలజీని పంచుకోనున్నట్లు ప్రకటించాయి. అంతేకాకుండా అటానమస్ డ్రైవింగ్‌కు వీలుగా సాఫ్ట్ వేర్‌పై పరిశోధనలు సైతం చేపట్టనున్నట్లు తెలియజేశాయి.

దేశీయంగా..

టయోటా మోటార్, సుజుకీ మోటార్ కార్పొరేషన్ 2016లోనే భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. 2019 ఆగస్ట్‌లో దీర్ఘకాలిక సహకారంలో భాగంగా ఈవీ టెక్నాలజీ, అటానమస్ డ్రైవింగ్‌పై కన్నేశాయి. ఈ బాటలో దేశీయంగా మారుతీ సుజుకీ బ్రాండ్ ద్వారా కార్ల అమ్మకాలు పెంచుకునే ప్రణాళికలు వేశాయి. మరోపక్క మారుతీ సియాజ్, ఎర్టిగా ప్లాట్‌ఫామ్ ద్వారా అభివృద్ధి చేసిన వాహనాలను సరఫరా చేయనుంది. ఇదేవిధంగా సీవిభాగంలోని ఎంపీవీ, టయోటా కరోలా సెడాన్, విటారా బ్రెజ్జా తదితర ప్లాట్‌ఫామ్‌లను పరస్పరం అభివృద్ధి చేయనున్నాయి.

టాటా చేతికి జేఎల్‌ఆర్

2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం తదుపరి జాగ్వార్–ల్యాండ్‌రోవర్(జేఎల్‌ఆర్), మజ్దా, వోల్వో విభాగాలను ఫోర్డ్ మోటార్ కంపెనీ విక్రయించింది. ఆర్థిక మందగమన పరిస్థితుల్లోనూ భారీ నష్టాలలో ఉన్న బ్రిటిష్ లగ్జరీ కార్ల విభాగం జేఎల్‌ఆర్‌ను దేశీ కార్పొరేట్ దిగ్గజం టాటా మోటార్స్ కొనుగోలు చేసింది. తదుపరి కార్పొరేట్ దిగ్గజం రతన్ టాటా అధ్యక్షతన నష్టాలను వీడి లాభాల బాట పట్టిన సంగతి తెలిసిందే.

ఆర్‌ఐఎల్- టెస్లా

టెస్లా దేశీయంగా రిలయన్స్‌తో భాగస్వామ్యానికి చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. తద్వారా స్థానికంగా టెస్లా ఎలక్ట్రిక్ కార్ల తయారీ ప్లాంటును ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం. ఇప్పటికే వాణిజ్య వాహనాల కంపెనీ అశోక్ లేలాండ్‌తో భాగస్వామ్యం ద్వారా రిలయన్స్ దేశీయంగా తొలి హైడ్రోజన్ ఐసీఈ ఇంజిన్‌తో నడిచే హెవీడ్యూటీ ట్రక్‌ను 2023లో ఆవిష్కరించింది.

జేఎస్‌డబ్ల్యూ- చైనీస్

ఎలక్ట్రిక్ కార్ల తయారీకి జిందాల్ గ్రూప్ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ సైతం చైనీస్ దిగ్గజాలు బీవైడీ, జీలీ తదితరాలతో చర్చలు. జరుపుతోంది. లైసెన్సింగ్ ఒప్పందం, టెక్నాలజీ బదిలీ తదితరాలకు ఒప్పందాలు కుదుర్చుకునే సన్నాహాల్లో ఉంది. వోల్వో కార్ల కంపెనీగా జీలీ ఇప్పటికే పరోక్షంగా కార్యకలాపాలు కలిగి ఉంది. దేశీయంగా 2024 తొలి 11 నెలల్లో 18.7 లక్షల ఎలక్ట్రిక్ కార్లు విక్రయంకావడంతో పలు దిగ్గజాలు ఈవీ మార్కెట్‌పై ఆసక్తి చూపుతున్నాయి.

2024లో సెన్సెక్స్ 8% ర్యాలీ



సెన్సెక్స్ 2024లో 5,899 పాయింట్లు(8%) ర్యాలీ చేసింది. సెప్టెంబర్ 27న 85,978 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేశాయి. బీఎస్‌ఈలో స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 29%, 26 శాతం రాణించాయి. ఇన్వెస్టర్ల సంపద రూ.77.66 లక్షల కోట్లు పెరిగి రూ.441.95 లక్షల కోట్లకు చేరింది. నిఫ్టీ 1,913 పాయింట్లు(9%) పెరిగింది. సెప్టెంబర్ 27న 26,277 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. ఇరు సూచీలు వరుసగా తొమ్మిదో సంవత్సరమూ లాభాల ర్యాలీ కొనసాగించడం విశేషం.

కొత్త కనిష్టానికి రూపాయి



డాలర్ మారకంలో రూపాయి విలువ 12 పైసలు క్షీణించి 85.64 వద్ద తాజా జీవితకాల కనిష్ట స్థాయి వద్ద ముగిసింది. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలతో 2024 మొత్తంగా రూపాయి 3% మేర కరిగిపోయింది. 2023 ఏడాది ట్రేడింగ్ చివరి రోజు(డిసెంబర్ 29)న 83.16 వద్ద ముగిసింది. 2024 అక్టోబర్ 10న కీలకమైన 84 స్థాయిని, డిసెంబర్ 19న 85 స్థాయిని కోల్పోయింది. డిసెంబర్ 27న 85.80 వద్ద ఇంట్రాడే జీవితకాల కనిష్టాన్ని నమోదు చేసింది.

మంచి స్కోరు రావాలంటే కష్టమే..

వరల్డ్ బ్యాంక్ అంచనాలకు దూరంగా భారత్ ● జీటీఆర్‌ఐ నివేదిక



న్యూఢిల్లీ: వివిధ దేశాల్లో వ్యాపారాలకు అనువైన పరిస్థితుల ఆధారంగా ప్రపంచ బ్యాంకు రూపొందించే బీ–రెడీ రిపోర్ట్‌లో మంచి స్కోరు దక్కించుకోవాలంటే భారత్‌కి కాస్త సవాలుతో కూడుకున్న వ్యవహారమేనని మేధావుల సంఘం జీటీఆర్‌ఐ ఒక నివేదికలో పేర్కొంది. బిజినెస్ ఎంట్రీ, కార్మిక చట్టాలు, అంతర్జాతీయ వాణిజ్యం తదితర అంశాల విషయంలో ప్రపంచ బ్యాంకు అంచనాలకు భారత్ దూరంగా ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో బీ–రెడీలో (బిజినెస్ రెడీ) చోటు కోసం భారత్, ప్రధానంగా దేశీయంగా సంస్కరణలతో పాటు అంతర్జాతీయంగా అమలవుతున్న ఉత్తమ విధానాలను కూడా అధ్యయనం చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని జీటీఆర్‌ఐ తెలిపింది. సాధారణంగా డూయింగ్ బిజినెస్ రిపోర్ట్ పేరిట వివిధ దేశాల్లో వ్యాపారాలకు అనువైన పరిస్థితులపై ప్రపంచ బ్యాంక్ గ్రూప్ .. ర్యాంకింగ్‌లు ఇస్తూ వస్తోంది. కానీ, దీని రూపకల్పనలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు రావడంతో 2020 నుంచి దాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. దాని స్థానంలో కొత్త విధానాలతో బీ–రెడీ రిపోర్ట్‌ను రూపొందిస్తోంది. వ్యాపారాల విషయంలో అవరోధాలు ఈ రిపోర్ట్‌లో ప్రధాన అంశాలుగా ఉంటాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఐపీవోకు ఎనిమిది కంపెనీలు రెడీ
చిన్న పొదుపు పథకాల్లో వడ్డీరేట్లు యథాతథం

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ
» టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- భౌతికశాస్త్రం
» బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- కంప్యూటర్ అవేర్‌నెస్



ఆర్‌ఆర్‌బీలో 32,000 గ్రూప్-డి పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్‌ఆర్‌బీ) దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే జోన్లలో గ్రూప్–డి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 32,000.
» **ఆర్‌ఆర్‌బీ రీజియన్లు:** అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గోరఖ్‌పూర్, గువాహటి, కోల్‌కతా, మాల్దా, ముంబై, పాట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్.
» **పోస్టులు:** పాయింట్స్‌మన్, అసిస్టెంట్, ట్రాక్ మెయింటెయినర్, అసిస్టెంట్, అసిస్టెంట్ లోకోషెడ్, అసిస్టెంట్ ఆపరేషన్స్ మొదలైనవి.
» **విభాగాలు:** ట్రాఫిక్, ఇంజనీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్ మొదలైనవి.
» **అర్హత:** పదో తరగతి, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 01.07.2025 నాటికి 18 నుంచి 36 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ,ఓబీసీ, పీహెచ్ అభ్యర్థులకు వయో సడలింపు ఉంటుంది.
» **ప్రారంభ వేతనం:** నెలకు రూ.18,000.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 23.01.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.02.2025
» **వెబ్‌సైట్:** https://indianrailways.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 1267 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

బ్యాంక్ ఆఫ్ బరోడాలోని వివిధ విభాగాల్లో ఒప్పంద ప్రాతిపదికన స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1267.
» **విభాగాలు:** రూరల్–అగ్రి బ్యాంకింగ్, రిటైల్ లయబిలిటీస్, ఎంఎస్‌ఎంఈ బ్యాంకింగ్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, కార్పొరేట్ –ఇన్‌స్టిట్యూషనల్ క్రెడిట్, ఫైనాన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎంటర్‌ప్రైజ్ డేటా మేనేజ్‌మెంట్ ఆఫీస్. » **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ డిగ్రీ, డిప్లొమా, పీహెచ్‌డీ, సీఏ/సీఎంఏ/సీఎస్/సీఎఫ్ఏ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్,ఇంటర్వ్యూ ఆధారంగా.
» **పరీక్ష విధానం:** మొత్తం 225 మార్కులకు 150 ప్రశ్నలు ఉంటాయి. రీజనింగ్(25 ప్రశ్నలు–25 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్(25 ప్రశ్నలు–25 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(25 ప్రశ్నలు–25 మార్కులు), ప్రొఫెషనల్ నాలెడ్జ్ (75 ప్రశ్నలు–150 మార్కులు). పరీక్ష సమయం 150 నిమిషాలు.
» **దరఖాస్తులకు చివరితేది:** 17.01.2025.
» **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 62 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ)లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 62.
» **పోస్టుల వివరాలు:** డేటా ఇంజనీర్/అనలిస్ట్–03, డేటా సైంటిస్ట్–02, డేటా–ఆర్కిటెక్ట్/క్లౌడ్ ఆర్కిటెక్ట్/డిజైనర్/మోడలర్–02, ఎంఎల్ ఓపీఎస్ ఇంజనీర్–02, జనరల్ ఏఐ ఎక్స్‌పర్ట్(లార్జ్ లాంగ్వేజ్ మోడల్)–02, క్యాంపెయిన్ మేనేజర్ (ఎస్‌ఈఎం–ఎస్‌ఎంఎం)–01, ఎస్‌ఈవో స్పెషలిస్ట్–01, గ్రాఫిక్ డిజైనర్ అండ్ వీడియో ఎడిటర్–01, కంటెంట్ రైటర్(డిజిటల్ మార్కెటింగ్)–01, ఎంఏఆర్ టెక్ స్పెషలిస్ట్–01, నియో సపోర్ట్ రిక్వైర్‌మెంట్–ఎల్2–06, నియో సపోర్ట్ రిక్వైర్‌మెంట్–ఎల్1–10, ప్రొడక్షన్ సపోర్ట్/టెక్నికల్ సపోర్ట్ ఇంజనీర్–10, డిజిటల్ పేమెంట్ అప్లికేషన్ సపోర్ట్ ఇంజనీర్–10, డెవలపర్/డేటా సపోర్ట్ ఇంజనీర్–10.
» **అర్హత:** బీఈ, బీటెక్(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్/డేటా సైన్స్) ఎంసీఏ/ఎంఎస్సీ(కంప్యూటర్) ఉత్తీర్ణతతో పాటు కనీసం ఆరేళ్ల పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30 ఏళ్ల నుంచి 38 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష లేదు. అర్హులైన అభ్యర్థులను ఇంటర్వ్యూ ఆధారంగా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 12.01.2025.
» **ఇంటర్వ్యూ తేదీలు:**2025 జనవరి నాలుగో వారం
» **వెబ్‌సైట్:** www.centralbankofindia.co.in

అవుతారా.. ఆతిథ్య నిపుణులు

జాతీయంగా, అంతర్జాతీయంగా టూరిజం, హాస్పిటాలిటీలకు ఆదరణ పెరుగుతోంది! దీంతో దేశంలో హోటల్ మేనేజ్‌మెంట్ విభాగం వేగంగా వృద్ధి బాటలో పయనిస్తోంది. ఫలితంగా ఈ విభాగంలో యువతకు ఉపాధి అవకాశాలు విస్తృతమవుతున్నాయి. హాస్పిటాలిటీ, హోటల్‌మేనేజ్‌మెంట్‌లో కెరీర్ కోరుకునే వారికి చక్కటి మార్గం.. ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ (నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్.. జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్)!! తాజాగా.. ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ-2025 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఈ పరీక్షతో ప్రయోజనాలు. దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం, కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..

» ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ-2025 నోటిఫికేషన్ విడుదల
» హోటల్ అడ్మినిస్ట్రేషన్‌లో బీఎస్సీకి ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ
» కోర్సు పూర్తి చేసుకుంటే.. విస్తృత కొలువులు
» ఇంటర్మీడియెట్‌తోనే ఉజ్వల భవిష్యత్ దిశగా అడుగులు

ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్ తదితర కోర్సులకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్‌ఈఆర్‌లు వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు ఏర్పాటైన సంగతి తెలిసిందే. వాటి ద్వారా విద్యార్థులను ఆయా రంగాల్లో నిపుణులుగా తీర్చిదిద్దుతున్నారు. అదే విధంగా.. హోటల్ మేనేజ్‌మెంట్ విభాగంలోనూ నిపుణులైన మానవ వనరులను తీర్చిదిద్దే ఉద్దేశంతో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన విద్యాసంస్థలే.. ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లు. ఇవి అందించే బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈ. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఈ పరీక్ష జరుగుతుంది.

అర్హతలు

ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి. చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

13 వేలకు పైగా సీట్లు

ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈలో స్కోర్ ఆధారంగా జాతీయ స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లోని 79 హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో 13,148 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో 21 ఇన్‌స్టిట్యూట్‌లు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 30 ఇన్‌స్టిట్యూట్‌లు, 24 ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లు, ఒక పీఎస్‌యూ ఇన్‌స్టిట్యూట్, 2 పీపీపీ మోడల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో బీఎస్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు అందుబాటులో ఉంది. వీటన్నింటి పర్యవేక్షణకు జాతీయ స్థాయిలో ప్రత్యేకంగా నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ కేటరింగ్ టెక్నాలజీ సంస్థను పర్యాటక శాఖ ఏర్పాటు చేసింది.

ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ ఇలా

ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈ పరీక్ష మొత్తం అయిదు విభాగాల్లో 200 మార్కులకు జరుగుతుంది. ఇందులో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్ 30 ప్రశ్నలు, రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్ 30 ప్రశ్నలు, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ 30 ప్రశ్నలు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 60 ప్రశ్నలు, ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ 50 ప్రశ్నలకు ఉంటాయి. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో ఈ పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు. మెరిట్ జాబితాను రూపొందించే క్రమంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో అత్యధిక మార్కులు పొందిన వారిని ముందుగా పరిగణనలోకి తీసుకుంటారు.

ప్రవేశాలకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్

ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈ స్కోర్ ఆధారంగా ఆన్‌లైన్ విధానంలో ఉమ్మడి కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ఎంట్రన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకుని.. తమ ఇన్‌స్టిట్యూట్ ప్రాథమ్యాలతో ఛాయిస్ ఫిల్లింగ్ పూర్తిచేయాలి. అనంతరం అందుబాటులో ఉన్న సీట్లు, ఎంట్రన్స్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకొని ప్రవేశం ఖరారు చేస్తారు.

లభించే కొలువులు

బీఎస్సీ హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు పూర్తి చేసిన వారికి.. గెస్ట్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్స్, ఫ్రంట్ డెస్క్ మేనేజర్, క్రూయిజ్ మేనేజర్, కిచెన్ ఎగ్జిక్యూటివ్, మార్కెటింగ్ మేనేజర్, సర్వీస్ ఎగ్జిక్యూటివ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ట్రిప్ అడ్వైజర్, బ్యాక్ ఎండ్ ఎగ్జిక్యూటివ్స్, చెఫ్స్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి. ప్రారంభంలో సగటున రూ.4లక్షల నుంచి రూ.5లక్షల వార్షిక వేతనాన్ని సంస్థలు అందిస్తున్నాయి.



ఎన్‌సీహెచ్‌ఎం-జేఈఈ-2025

రాత పరీక్షలో రాణించేలా

న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్

అభ్యర్థులకు మ్యాథమెటిక్స్‌లో ఉన్న బేసిక్ నైపుణ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో రాణించేందుకు హైస్కూల్ స్థాయిలోని మ్యాథమెటిక్స్ అంశాల్లో అవగాహన ఏర్పరచుకోవాలి. వీటిలోనూ ముఖ్యంగా శాతాలు, లాభ నష్టాలు, నెంబర్ సిస్టమ్, సగటు, కాలం–పని, సాధారణ వడ్డీ, బారు వడ్డీ, కాలం–వేగం–దూరం, నిష్పత్తులు, జామెట్రీ వంటి అంశాల్లో మరింత పట్టు సాధించాలి. అనలిటికల్ ఆప్టిట్యూడ్ కోసం నిర్దిష్టంగా డేటాను విశ్లేషించగలిగే సామర్థ్యం, డేటాలోని ముఖ్య సమాచారాన్ని క్రోడీకరించి ఇచ్చిన ప్రశ్నకు సరైన సమాధానం గుర్తించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి. ఇందుకోసం గ్రాఫ్‌లు, పై చార్ట్‌లు, ఫ్లో చార్ట్‌లు వంటి వాటిని ప్రాక్టీస్ చేయాలి.

రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్

అభ్యర్థుల్లోని సునిశిత పరిశీలన, తార్కిక విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షించే విభాగమిది. ఇందులో మెరుగైన ప్రతిభ కనబర్చాలంటే.. మ్యాథమెటికల్ ఆపరేషన్స్, కోడింగ్– డీకోడింగ్, నంబర్ సిరీస్, బ్లడ్ రిలేషన్ వంటి రీజనింగ్ ఆధారిత అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం ప్రిపరేషన్ సమయంలో ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా డేటా సఫీషియన్సీ, వెన్ డయాగ్రమ్స్ ప్రాక్టీస్ చేయడం ప్రయోజనకరంగా ఉంటుంది.

జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్

ఈ విభాగంలో మంచి మార్కులు పొందాలంటే.. హైస్కూల్ స్థాయిలోని చరిత్ర, రాజ్యాంగం, జాగ్రఫీ, ఎకనామిక్స్ పాఠ్యాంశాలు చదవాలి. హిస్టరీకి సంబంధించి ముఖ్యమైన యుద్ధాలు–పరిణామాలు–పర్యవసానాలు, స్వాతంత్ర్యోద్యమం వంటి అంశాలపై అవగాహన లాభిస్తుంది. జాగ్రఫీలో దేశంలోని ముఖ్యమైన ప్రదేశాలు, ఖనిజ వనరులు –అవి ఎక్కువగా లభించే ప్రాంతాలు, నదులు, సరస్సులు, పర్వతాల గురించి క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి ముఖ్యమైన సదస్సులు, సమావేశాలు, వార్తల్లోని వ్యక్తులు, అంతర్జాతీయంగా ప్రాముఖ్యం సంతరించుకున్న అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ర్యాంకుల పరిగణనలో, తుది జాబితా రూపకల్పనలో కీలకమైన విభాగం.. ఇంగ్లిష్ లాంగ్వేజ్. ఇందులో రాణించడానికి అభ్యర్థులు గ్రామర్‌ను ఔపోసన పట్టాలి. టెన్సెస్, ప్రిపోజిషన్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, యాంటానిమ్స్, సినానిమ్స్, సెంటెన్స్ ఫార్మేషన్, స్పాటింగ్ ద ఎర్రర్స్, సీక్వెన్స్ ఆఫ్ వర్డ్స్‌పై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి. దీనికోసం బేసిక్ గ్రామర్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. న్యూస్ పేపర్లను చదవడం, వాటిలోని కొత్త పదాలను తెలుసుకోవడం, ఆ పదాలను వినియోగించిన తీరుపై అవగాహన పెంచుకోవడం వంటివి లాభిస్తాయి. పదో తరగతి స్థాయి ఇంగ్లిష్ పుస్తకాలను చదవాలి.

ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్

ఎన్‌సీహెచ్‌ఎం జేఈఈలో ప్రత్యేకమైన విభాగంగా ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్‌ను పేర్కొనొచ్చు. ఇందులో ప్రధానంగా అభ్యర్థికి ఆతిథ్య, పర్యాటక రంగాలపై ఉన్న ఆసక్తి, దృక్పథాన్ని పరీక్షించే ప్రశ్నలు ఉంటాయి. వాస్తవ సంఘటన లేదా అంశం ఇచ్చి దానికి ఎలా స్పందిస్తారు? అనే తరహా ప్రశ్నలు అడుగుతారు. ఈ ప్రశ్నలు అభ్యర్థుల్లో ఎదుటి వారిని మెప్పించే తీరు, సందర్భానికి తగినట్లు వ్యవహరించే శైలికి సంబంధించి ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 2025, ఫిబ్రవరి 15
- **దరఖాస్తు సవరణ అవకాశం:** 2025, ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు
- **ఎన్‌సీహెచ్‌ఎం–జేఈఈ పరీక్ష తేదీ:** 2025, ఏప్రిల్ 27
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/NCHM

బిజినెస్‌మెన్ బి అలర్ట్!



సామాన్యులకు కీలక సూచనలు..

వ్యాపార సంస్థలపై సైబర్ నేరగాళ్ల పంజా

హ్యాకింగ్ ద్వారా వ్యాపారుల సర్వర్లలోకి చొరబాటు	డేటా చౌర్యంతో పాటు ర్యాన్సమ్ వేర్ ఎటాక్స్ సైతం	రక్షణపై కీలక సూచనలు చేసిన హైదరాబాద్ పోలీసులు

సైబర్ నేరగాళ్లు సామాన్యులనే కాదు.. వ్యాపారవేత్తలు, సంస్థలను కూడా తరచూ టార్గెట్ చేస్తున్నారు. వారి సర్వర్లలోకి చొరబడి విలువైన డేటాను తస్కరించడంతోపాటు ర్యాన్సమ్‌వేర్ ఎటాక్స్‌తో అందినకాడికి దోచుకుంటున్నారు. బిజినెస్ ఈ–మెయిల్స్‌ను కాంప్రమైజ్ (బీఈసీ) చేయడం ద్వారా ఈ నేరాలకు బీజం పడుతోందని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. ఈ నేరాలను ఎలా కనిపెట్టాలనే అంశంపై కీలక సూచనలు చేస్తూ మంగళవారం బుక్‌లెట్‌ను విడుదల చేశారు.

సాక్షి, హైదరాబాద్



బీఈసీ సంకేతాలు ఏంటి?

- కొత్త ఈ–మెయిల్ ఐడీ నుంచి మెయిల్స్ రావడం.
- బిజినెస్ ఈ–మెయిల్స్ పాస్‌వర్డ్స్ వ్యాపారులు, ఆయా సంస్థల ప్రమేయం లేకుండా మారిపోవడం.
- అనుమానిత సమయాలు, అనుమానాస్పద ప్రాంతాల నుంచి బిజినెస్ ఈ–మెయిల్స్‌లోకి లాగిన్ కావడానికి ప్రయత్నాలు జరగడం.
- గుర్తుతెలియని వ్యక్తులు కంపెనీ డేటాను యాక్సెస్ చేయడానికి ప్రయత్నించడం.

? ఈ–మెయిల్స్ కాంప్రమైజ్ అయినట్లు గుర్తించడం ఎలా

సాధారణంగా బీఈసీ కోసం వాడే వైరస్‌తో ఈ–మెయిల్స్‌ను నేరగాళ్లు అర్ధరాత్రి దాటిన తర్వాత, తెల్లవారుజామున(ఆడ్ అవర్స్) పంపిస్తూ ఉంటారు. ఆయా వేళల్లో అసాధారణ ఈ–మెయిల్ ఐడీల నుంచి మెయిల్స్ వస్తే అనుమానించాల్సిందే.

ఒకేసారి కొత్త ఈ–మెయిల్ ఐడీలకు భారీగా డేటా బదిలీ కావడం, సున్నిత అంశాలతో కూడిన ఫైల్స్ వేళకాని వేళల్లో అధికారిక మెయిల్ ద్వారా బయటకు వెళితే అనుమానించాలి.

1 ఇటీవల పలువురికి సైబర్ నేరగాళ్ల నుంచి ఐవీఆర్‌ఎస్ కాల్స్ వస్తున్నాయి. ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నట్లు చెప్తున్న సైబర్ నేరగాళ్లు.. అసాంఘిక కార్యకలాపాల్లో మీ పేరుతో ఉన్న నంబర్ల వినియోగం జరిగిందని? కొన్ని గంటల్లోనే అన్ని నంబర్లు బ్లాక్ చేస్తున్నామని చెప్తున్నారు.

ఆయా సెల్‌ఫోన్ నంబర్లు, హ్యాండ్ సెట్‌లకు సంబంధించిన ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిఫికేషన్ (ఐఎంఈఐ) నంబర్లను పోలీసులు, దర్యాప్తు ఏజెన్సీల సూచనలతో బ్లాక్ చేస్తుంటారు. ఈ పని ట్రాయ్ చేయదు.. ఆయా సర్వీస్ ప్రొవైడర్లు చేస్తుంటారు.

2 కస్టమ్స్, కొరియర్ సంస్థల పేరుతోనూ ఫోన్లు వస్తున్నాయి. మీ పేరుతో వస్తున్న పార్శిల్‌లో నిషేధిత వస్తువులు, డ్రగ్స్ ఉన్నాయని.. వెంటనే నిర్దిత మొత్తం చెల్లించకుంటే కేసు అవుతుందని బెదిరిస్తున్నారు.

మీరు ఏ వస్తువునూ ఎక్కడకీ పంపనప్పుడు భయపడాల్సిన పని లేదు. నిషేధిత వస్తువులు, డ్రగ్స్‌తో ముడిపడి ఉన్న కేసుల్లో జరిమానా చెల్లిస్తే బయటపడటం జరగదు. కస్టమ్స్ సహా ఏ ఏజెన్సీ కూడా ఇలా ఫోన్లు చేసి డబ్బు డిమాండ్ చేయదు.

3 మీ బంధువులు మనీ లాండరింగ్, డ్రగ్స్ కేసుల్లో చిక్కుకున్నారని, వారిని అరెస్టు చేస్తున్నామని ఫోన్లు చేస్తున్న సైబర్ నేరగాళ్లు.. డబ్బు డిమాండ్ చేస్తున్నారు. వీడియో కాల్ చేసి, ఆ మొత్తం చెల్లించే వరకు డిజిటల్ అరెస్టు చేస్తున్నట్లు చెప్తుంటారు.

దేశంలోని ఏ పోలీసు, ఏజెన్సీ డిజిటల్ అరెస్టు చేయదు. ఇప్పటివరకు అమలులోకి వచ్చిన, అమలులో ఉన్న ఏ చట్టంలోనూ దీని ప్రస్తావన లేదు. ఇలాంటి కాల్స్ వస్తే నమ్మొద్దు.

4 బ్యాంకు అధికారులు, ఏజెంట్లుగా చెప్పుకుంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేస్తున్నారు. కేవైసీ అప్‌డేట్, రివార్డ్ పాయింట్స్ రిడీమ్ అంటూ వ్యక్తిగత వివరాలు తీసుకుని బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తుంటారు.

బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఫోన్లు చేసి కేవైసీలు అడగవు. వ్యక్తిగతంగా సంబంధిత శాఖకు వచ్చి ఇవ్వమని చెప్తారు.

పరిశీలించాల్సిన అంశాలు ఏంటి?

✓ ఒకేసారి హఠాత్తుగా పెద్ద సంఖ్యలో ఈ–మెయిల్స్ వస్తుంటే బీఈసీని అనుమానించాల్సిందే. ఆ ఈ–మెయిల్స్‌లోని ప్రతి అక్షరాన్నీ నిశితంగా పరిశీలించాలి.

✓ 'వైర్ ట్రాన్స్‌ఫర్', 'అర్జెంట్ పేమెంట్', 'బ్యాంక్ అకౌంట్ చేంజ్' తదితర పదాలతో వచ్చే ఈ–మెయిల్స్ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. వ్యాపారుల ఖాతాలకు బదులు తమ బ్యాంకు ఖాతాల వివరాలు పంపే సైబర్ నేరగాళ్లు చేసే ఈ నేరాలను అకౌంట్ టేకోవర్ ఫ్రాడ్స్ అంటారు.

కంప్యూటర్లలో బీఈసీ జరిగితే ఏం చేయాలి?

✓ మాల్‌వేర్, వైరస్‌తో కూడిన ఈ–మెయిల్ ద్వారా బీఈసీ అయిన కంప్యూటర్‌ను ఇంటర్నల్ ల్యాన్ లేదా వీపీఎన్ నుంచి డిస్‌కనెక్ట్ చేయాలి.

✓ అనుమానాస్పద ఐడీ అడ్రస్‌లు, ఈ–మెయిల్ ఐడీలను తక్షణం బ్లాక్ చేయాలి. కాంప్రమైజ్ అయినట్లు అనుమానిస్తున్న ఈ–మెయిల్ ఖాతాలను డిజేబుల్ చేయాలి. యాక్సెస్ కంట్రోల్స్‌ను పెంచడంతో పాటు ఫోరెన్సిక్ ఆధారాల కోసం సదరు కంప్యూటర్, ఈ–మెయిల్‌లోని ఆధారాలను భద్రపరచాలి.

నూతన సంవత్సర శుభాకాంక్షల పేరిట సైబర్ వల

లింకులపై క్లిక్ చేయవద్దని పోలీసుల సూచన

సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకల వేళ సైబర్ నేరగాళ్లు కొత్త మోసానికి తెరతీశారు. ఏపీకే ఫైల్ రకం మాల్వేర్ లింక్ కలిగి ఉన్న మెసేజ్‌ను వాట్సాప్‌కి హ్యాపీ న్యూ ఇయర్ గ్రీటింగ్‌లుగా పంపుతున్నట్టు పోలీసులు తెలిపారు. 'మీ పేరు మీద..మీ స్నేహితులకు నూతన సంవత్సర శుభాకాంక్షల కార్డులు పంపవచ్చు. కార్డును పొందేందుకు ఈ మెసేజ్‌లో ఉన్న లింక్‌పై క్లిక్ చేయండి' అని ఆ వాట్సాప్ మెసేజ్‌లో పేర్కొంటున్నట్టు తెలిపారు. ఆ లింకులను ఓపెన్ చేస్తే వెంటనే మీ ఫోన్ సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేస్తారని, ఫోన్ యాక్సెస్ వారికి వెళ్తుందని వెల్లడించారు. తర్వాత మీ మొబైల్ డేటా, మీ గ్యాలరీ, ఫోన్ నంబర్లు సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లే ప్రమాదం ఉందని, ఆ తర్వాత వాటి ఆధారంగా మోసాలకు తెరతీస్తారని హెచ్చరించారు. హ్యాపీ న్యూ ఇయర్ రెడీమేడ్ గ్రీటింగ్ పేరిట వచ్చే సందేశాల్లోని లింకులపై క్లిక్ చేయవద్దని పోలీసులు సూచించారు.

152 కేసులు.. 223 మంది అరెస్టు

- ఏసీబీ వార్షిక నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) 2024 సంవత్సరంలో 152 కేసులు నమోదు చేసి, 223 మంది నిందితులను అరెస్టు చేసింది. ఇందులో 129 ట్రాప్ కేసులు ఉన్నాయి. ట్రాప్ కేసుల్లో లంచం తీసుకుంటూ పట్టుబడిన 159 మంది ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులు సహా మొత్తం 200 మందిని అరెస్టు చేశారు. ఏసీబీ డీజీ విజయ్‌కుమార్ మంగళవారం విడుదల చేసిన తెలంగాణ ఏసీబీ – 2024 రౌండప్ నివేదికలో ఈ వివరాలు వెల్లడించారు.

- 2024లో ఏసీబీ అన్ని రకాలు కలిపి 152 కేసులు నమోదు చేసింది. ఈ కేసుల్లో 223 మంది నిందితులను అరెస్టు చేశారు.
- 129 ఏసీబీ ట్రాప్ కేసుల్లో 159 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 41 మంది ప్రైవేటు వ్యక్తులను అరెస్టు చేశారు. ● ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు 11 నమోదయ్యాయి. ● 12 క్రిమినల్ మిస్‌కండక్ట్ కేసులు నమోదు చేశారు. ఇందులో 18 మందిని అరెస్టు చేశారు.
- అవినీతి ఆరోపణలకు సంబంధించి 11 రెగ్యులర్ ఎంక్వైరీలతోపాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో 29 ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రభుత్వానికి నివేదికలు అందించారు.
- 105 కేసుల్లో చార్జిషీట్లు నమోదు చేసింది. ● ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించిన 11 కేసుల్లో రూ.97,42,67,000 అటాచ్ చేశారు.

రాజస్తాన్‌లో అంతర్రాష్ట్ర సైబర్ ముఠా అరెస్టు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరస్తులకు మ్యూల్ బ్యాంకు ఖాతాలు సరఫరా చేస్తున్న ఏడుగురు సైబర్ నేరగాళ్ల ముఠాను టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) అధికారులు రాజస్తాన్‌లోని జైపూర్, పాలి జిల్లాలో అరెస్టు చేశారు. టీజీసీఎస్‌బీ చేపట్టిన రెండో అంతర్రాష్ట్ర ఆపరేషన్ ఇది. ఏడుగురు నిందితుల వద్ద నుంచి తొమ్మిది సెల్‌ఫోన్‌లు, ఒక ల్యాప్‌టాప్, థార్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేరగాళ్లకు తెలంగాణలో 189 కేసుల్లో ప్రమేయం ఉందని, రూ. 9 కోట్లు కొల్లగొట్టినట్టు తెలిపారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా 2,223 కేసులతో సంబంధం ఉన్నట్టు తెలిపారు. అరెస్టు చేసిన నిందితులను ట్రాన్సిట్ వారెంట్లపై తెలంగాణకు తీసుకొచ్చామని చెప్పారు. ఈ అంతర్రాష్ట్ర ఆపరేషన్ ఇన్‌చార్జి డీఎస్పీ కేవీ సూర్యప్రకాశ్, డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్‌తోపాటు హెడ్‌క్వార్టర్స్ టెక్నికల్ బృందాన్ని శిఖా గోయల్ అభినందించారు.

స్లో.. & స్టడీ

'స్లో ట్రావెలింగ్' పేరుతో పర్యాటక ఉద్యమం

- ప్రపంచ పర్యాటకంలో కొత్త ఒరవడి
- ఎక్కువ ప్రాంతాలను చుట్టిరావడం కంటే ఒకే గమ్యస్థానాన్ని సంపూర్ణంగా అన్వేషించేందుకు ఆసక్తి
- ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు స్లో ట్రావెలింగ్ వైపు మొగ్గు
- ప్రకృతి ఒడిలో మమేకమవడం ఓ చికిత్సగా అభివర్ణిస్తున్న నిపుణులు
- 2025లో భారత్‌లో 'స్లో ట్రావెల్'లో 10 శాతం వృద్ధి రేటు అంచనా
- దేశంలో స్లో ట్రావెలింగ్‌లో అహ్మదాబాద్‌కు అగ్రస్థానం

సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా పర్యాటక ట్రెండ్ మారుతోంది. ఉరుకుల పరుగుల ప్రయాణాలకు బదులు స్థిర అన్వేషణల వైపు గమ్యం సాగుతోంది. స్థానిక సంస్కృతి, ఆచార వ్యవహారాలను సంపూర్ణంగా అర్థం చేసుకునేలా 'స్లో ట్రావెల్' పేరుతో పర్యాటక ఉద్యమం ఊపందుకుంటోంది. స్లో ట్రావెల్‌లో పర్యాటక ప్రదేశాల పరిమాణం కంటే.. అందులోని నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గజిబిజి జీవితాలను పూర్తిగా స్విచ్ ఆఫ్ చేసుకుని ప్రకృతి ఒడిలో మునిగిపోయేలా ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే 2025 సంవత్సరం 'స్లో ట్రావెల్' ఇయర్‌గా మారుతుందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



రైళ్లకు జై కొడుతున్నారు

2024లో 81శాతం మంది విశ్రాంతి కోసం, రోజువారీ ఒత్తిళ్ల నుంచి బయట పడేందుకు స్లో వెకేషన్లకు వెళ్లినట్టు 'ట్రావెల్ అండ్ టూర్ వరల్డ్' పేర్కొంది. ఇందులో మూడొంతుల మంది సాంస్కృతిక, చారిత్రక అన్వేషణ, వారసత్వ ప్రదేశాల సందర్శనలకు విలువ ఇస్తున్నట్టు గుర్తించింది. స్లో ట్రావెల్‌లో భాగంగా అధిక శాతం మంది రైలు ప్రయాణాలకు జైకొడుతున్నట్టు తేలింది. సుదూర గమ్యస్థానాలకు విమాన, కారు ప్రయాణాలకు ఖర్చుతో కూడుకోవడం, ఒక్కోసారి రిమోట్ గమ్యస్థానాలను చేరుకోలేకపోవడంతో రైలు మార్గాలను ఎంచుకుంటున్నారు. ముఖ్యంగా యువత సైక్లింగ్, బైక్ రైడ్‌లలో సోలోగా స్లో ట్రావెల్‌కు వెళ్తున్నారు. ఇటీవల కాలం నదీ అందాలను ఆస్వాదించేందకు క్రూయిజ్‌ల ప్రయాణాలను ఎంపికలు పెరిగాయి.

అహ్మదాబాద్.. అగ్రస్థానం

భారతదేశంలో అహ్మదాబాద్ నగరం సుదీర్ఘ సందర్శనలలో పాల్గొనే వారికి అగ్ర ఎంపికగా ఉద్భవించింది. గోవా, అయోధ్య తరువాత ఈ ప్రాంతంలో ఎక్కువగా గడిపేందుకు ప్రసిద్ధి చెందింది. విదేశాలకు వెళ్లే భారతీయ ప్రయాణికులు ముఖ్యంగా ఆసియాలో థాయ్‌లాండ్‌లోని ఖావో లాక్, జపాన్‌లోని టోక్యో, దక్షిణ కొరియాలోని సియోల్, మలేషియాలోని పెర్హెన్టియన్ దీవులు, వియత్నాంలోని హోచిమిన్ సిటీకి ఎక్కువగా ఆకర్షితులవుతున్నట్టు డిజిటల్ ట్రావెల్ ప్లాట్‌ఫామ్ అగోడా ప్రకటించింది.

భారత్‌లో 10% వృద్ధి అంచనా

నిత్యం పని జీవితంలో ఒత్తిళ్లు తారస్థాయికి చేరుకోవడంతో సెలవులు తీసుకోవడం గతంతో పోలిస్తే విలువైనది మారింది. ఆఫ్‌బీట్ వెకేషన్లు, కొత్త అన్వేషణల గమ్యస్థానాలకు ప్రయాణించడం మానసిక చికిత్సగా భావిస్తున్నారు. 2025లో అత్యధికులు 'స్లో ట్రావెల్'కు జైకొడుతున్నారు. ఇది 2025లో 10 శాతం వార్షిక వృద్ధి రేటుతో అభివృద్ధి చెందుతుందని ట్రావెల్ కంపెనీలు అంచనా వేస్తున్నాయి. చాలామంది పర్యాటకులు గమ్యస్థానాలను పూర్తిగా అస్వాదించలేకపోతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఎక్కువ ప్రదేశాలను చుట్టిరావడం కంటే స్థానిక సంస్కృతిలో లీనమవ్వడం, మరింత అర్థవంతంగా ప్రయాణాన్ని మార్చుకోవడమే ప్రధాన ఉద్దేశంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రజలు నిత్యం పిల్లలను పెంచడం, ఆఫీస్ సమావేశాలు, కుటుంబ కార్యక్రమాలంటూ బిజీ షెడ్యూల్‌లో మునిగిపోతున్నారు. ఇలాంటి తరుణంలో మానసిక విశ్రాంతి, ఆహ్లాదాన్ని పొందేందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. కొత్త ఆహారాన్ని రుచి చూడటం, కొత్త దృశ్యాలను కళ్లతో బంధిస్తూ విశ్రాంతిని పొందే ప్రదేశాలను కోరుకుంటున్నట్టు ట్రావెల్ సంస్థలు చెబుతున్నాయి.

మత్స్యావతారంలో భద్రాద్రి రామయ్య

ముక్కోటి అధ్యయనోత్సవాలు ప్రారంభం



భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రామయ్య తొలిరోజు మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. స్వామివారిని ఈ రూపంలో అలంకరించి బేడా మండపం వేదికపై ఆళ్వార్లతో కలిపి ఆసీనులను చేశారు. అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యావచనంతో ప్రత్యేక ఆరాధన గావించారు. అనంతరం మేళతాళాలు, కోలాటాల నడుమ మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై భక్తుల సందర్శనార్థం కొలువుదీర్చారు.

సంక్రాంతికి 6,432 ప్రత్యేక బస్సులు



సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి రద్దీ నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను తిప్పుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు సహా ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలకు కలిపి 6,432 ప్రత్యేక బస్సులను తిప్పనున్నట్టు సంస్థ మంగళవారం రాత్రి ప్రకటించింది. వీటిలో 557 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ వసతి కల్పించింది. గత సంక్రాంతికి 4,484 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయగా, రద్దీకి సరిపోకపోవడంతో 5,246 సర్వీసులు తిప్పింది. ఆ అనుభవం దృష్ట్యా ఈసారి ఎక్కువ సర్వీసులను ఏర్పాటు చేసింది. జనవరి 9 నుంచి 15 వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్‌రోడ్డు, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ఇవి నడుస్తాయి. కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ నుంచి ఎలక్ట్రిక్ బస్సులను కూడా తిప్పనున్నారు. ఇతర వివరాలకు 040-69440000, 040-23450033 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని చెప్పారు. ఈ ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీ వసూలు చేసే అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

నేటి నుంచి రైలు వేళల్లో మార్పులు

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో నడిచే పలు రైళ్ల వేళలను స్వల్పంగా సవరించారు. కొత్త వేళలు జనవరి 1 నుంచి అమలులోకి రాబోతున్నాయి. కొత్త వేళలను ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, ప్రయాణికులు బయలుదేరే ముందు వెబ్‌సైట్‌ను సందర్శించి రైలు కొత్త వేళలను సరిచూసుకోవాలని అధికారులు సూచించారు. స్టేషన్‌లలో కూడా కొత్త వేళలను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు.




'విహార' పర్యాటకులే ఎక్కువ


భారతదేశానికి వచ్చే పర్యాటకుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వస్తోంది. ఫలితంగా జీడీపీలో పర్యాటక రంగం వాటా 5 శాతానికిపైగా ఉంది.

విభాగం	పర్యాటకుల శాతం
సెలవులు, విహారం	46.2
విదేశాల్లోని భారతీయులు	26.9
వ్యాపారం, వృత్తి	10.3
వైద్యం	6.9
విద్యార్థులు	0.5
ఇతరులు	9.2

ఆధారం: కేంద్ర పర్యాటక శాఖ, బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్

టుడేస్ గ్రాఫిక్







పెట్రోలింగ్ పోలీసులు.. చిరుత

హైవేపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి.. నేనున్నాను అంటూ తారసపడింది ఓ చిరుత పులి. ఈ ఘటన నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగింది. చిరుతను చూసి షాక్ అయిన పెట్రోలింగ్ పోలీసులు వాహనం ఆపి.. సెల్‌ఫోన్‌తో వీడియో తీశారు. మండలంలోని సిర్గాపూర్–న్యూలోలం గ్రామాల నడుమ ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ స్వాగత తోరణానికి సమీపంలో 61వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి దాటాక చిరుత పులి రోడ్డుపైకి వచ్చింది. అప్పుడే దిలావర్‌పూర్ పోలీసు సిబ్బంది రామకృష్ణ, మంగల్‌సింగ్ పెట్రోలింగ్‌లో భాగంగా కాల్వ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వెళ్లి తిరిగి జాతీయ రహదారి పైకి వస్తుండగా అక్కడ అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న నిర్మల్ వ్యాపారి గోశాల సమీపాన రోడ్డుపై చిరుత కనిపించింది. రోడ్డుపైకి వచ్చిన చిరుతను వారు వీడియో తీశారు. పోలీసు ఉన్నతాధికారులు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. చిరుత పులి కాల్వ అటవీ ప్రాంతం నుంచి న్యూలోలం గ్రామానికి చెందిన వ్యవసాయ భూముల వైపునకు వెళ్లింది. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, అటవీశాఖ అధికారులు సూచించారు.

దిలావర్‌పూర్:



వానరానికి వర్ధంతి

ఏడాది క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందిన వానరం ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కిన ఒక కోతి విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. అప్పట్లోనే హమాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. సమీపంలో రేకుల షెడ్డు నిర్మించి కోతి విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంగళవారం హమాలీ కార్మిక సంఘం సభ్యులు వానరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జూలపల్లి(పెద్దపల్లి)



మంచుటౌన్‌లో అడవి పందుల వేట

పాత వీడియో అని పోలీసుల స్పష్టీకరణ

సినీ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబంలో ఇంట్లో వివాదాలు సద్దుమణగక ముందే.. అడవి పందుల వేటకు సంబంధించిన ఒక వీడియో తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇంట్లో పని మనుషుల మధ్య మొదలైన గొడవతో డిసెంబర్ 8న మోహన్‌బాబు చిన్న కుమారుడు మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే. అప్పటి నుంచి అన్నదమ్ములు, తండ్రీకొడుకుల మధ్య పరస్పర ఫిర్యాదులు, ఆరోపణలు కొనసాగుతూనే ఉన్నాయి. జల్‌పల్లిలోని గరిగుట్ట అటవీ ప్రాంతంలో అడవి పందిని వేటాడి ముగ్గురు యువకులు మంచుటౌన్‌లోకి తీసుకొస్తున్న వీడియో మంగళవారం వైరల్‌గా మారింది. విష్ణు మేనేజర్ కిరణ్, ఎలక్ట్రీషియన్ దేవేంద్ర ప్రసాద్ ఈ వీడియోలో ఉన్నట్టు తెలుస్తోంది. పందులను వేటాడవద్దని మనోజ్ హెచ్చరించినా వారు వినిపించుకోలేదు. కాగా ఈ వీడియో పాతదని పహాడీషరీఫ్ పోలీసులు స్పష్టం చేశారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. వీడియో బయటికి రావడం వెనుక మనోజ్ హస్తం ఉండొచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పహాడీషరీఫ్ (హైదరాబాద్)

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

డాక్టర్ 'గూగుల్'!



తలనొప్పి నుంచి పెద్దజబ్బుల దాకా సోషల్ మీడియాలో శోధన..
సామాజిక మాధ్యమాల్లో వర్టిగోపై అత్యధిక సెర్చింగ్
ఆన్‌లైన్ వైద్య పరిష్కారాలు మంచిది కాదంటున్న వైద్యులు

సాక్షి, హైదరాబాద్: ఏ సమస్యకైనా వెనకాముందూ ఆలోచించడం లేదు.. పరిష్కారం కావాలంటే.. గూగుల్ అన్వేషిస్తున్నారు. ఎలాంటి జబ్బుకైనా చికిత్స విధానాల కోసం ఆన్‌లైన్‌లో అన్వేషిస్తున్న వారి సంఖ్య పెరిగింది. ప్రముఖ సెర్చ్ ఇంజిన్ గూగుల్‌తో పాటు వివిధ సామాజిక మాధ్యమాల ప్రాధాన్యం రోజురోజుకు పెరిగిపోతోంది. అదెంతవరకు పోయిందంటే.. తలనొప్పి, పంటి నొప్పి వంటి చిన్న అనారోగ్యాలు మొదలుకుని పెద్ద పెద్ద జబ్బుల దాకా ఆన్‌లైన్‌లో శోధించడం చాలా మందికి ఒక అలవాటుగా మారిపోయింది.

దేనికైనా గూగుల్ ఉందిగా..

సాధారణంగా మొబైల్ ఫోన్, టీవీ, వాషింగ్ మెషీన్, డెస్కటాప్ కంప్యూటర్, లాప్‌టాప్‌లు మొదలుకుని కార్లు, ఇతర పరికరాలు, మెషీన్లలో ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలు ఎదురుకావడం తెలిసిందే. కానీ ఇళ్లలో ఇలాంటి సమస్యలు తలెత్తగానే.. వాటిపై అవగాహన ఉన్నవారు, నిపుణులను సంప్రదించడానికి ముందే వెంటనే గూగుల్‌లోనో, యూ–ట్యూబ్‌లోనో, మరే ఇతర సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌పైనో శోధించడం ఇప్పుడు సాధారణమైపోయింది. ఇలా ఇంటర్నెట్, వివిధ సామాజిక మాధ్యమాలు అనేవి పలురకాల సమాచారం, వివరాల సేకరణకు చిరునామాగా మారిపోయాయి. అన్ని వర్గాల వారు వివిధ అంశాలపై తరచూ సోషల్‌మీడియాను ఆశ్రయించడం ఇటీవల మరింతగా పెరిగిపోయింది. మిగతా విషయాలు ఎలా ఉన్నా.. ఆరోగ్యంతో ముడిపడిన విషయాలు, చికిత్స విధానాలు, అనారోగ్య సమస్యల పరిష్కారం వంటి వాటికి కూడా గూగుల్, వివిధ సామాజిక మాధ్యమాల్లో శోధిస్తున్నారు. ఏ అనారోగ్య సమస్య తలెత్తినా.. ఏ మందు వేసుకోవాలి, చికిత్సకు ఏం చేయాలి అనేది కూడా ఆన్‌లైన్‌లో తెలుసుకోవడం ఆందోళనకు కారణమౌతోంది. ఈ ధోరణి మరింత పెరగడంతో.. ఇతరులకు వైద్యపరమైన సలహాలు గట్రా అందజేస్తున్నవారు క్రమంగా 'గూగుల్ డాక్టర్లు'గా చెలామణి అవుతున్నారు. ముందుగా ఏదైనా అనారోగ్య సమస్య లక్షణాలను, దానికి సంబంధించిన చికిత్స పద్ధతుల గురించి గూగుల్‌లో శోధించి, ఆ తర్వాత సంబంధిత స్పెషలిస్ట్ వైద్యులను సంప్రదించడం ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయినట్టు తెలుస్తోంది. ఎవరైనా రోగులు తమకు కలిగిన చిన్న సమస్యకు సైతం.. అతిగా భయపడిపోయి ఆన్‌లైన్‌లో వాటికి చికిత్స లేదా పరిష్కారాలు కనుక్కునే ప్రయత్నాలు మంచిది కాదని వైద్యులు, వైద్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆరోగ్యానికి చేటు..

ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరికీ అత్యంత ప్రధానమైందన్న విషయం నిర్వివాదాంశం. కానీ పలువురు రోగులు ఇంటర్నెట్, సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్‌పై అధికంగా ఆధారపడడం మంచితో పాటు ఆరోగ్యపరంగా నష్టం కలిగేందుకు కారణమవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏదైనా అనారోగ్య సమస్య వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురైనపుడు ఆన్‌లైన్‌లో సందేహాలు నివృత్తి అయితే.. సామాజిక మాధ్యమాలు బాగా ఉపయోగపడుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమౌతోంది.

వెర్టిగో.. పెనుసమస్యే..

ఇటీవల కాలంలో 'వెర్టిగో'తో బాధపడుతున్న వారు అధికంగా సోషల్‌మీడియాలో దీనికి సంబంధించిన సమాచారం, చికిత్స విధానం తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్టు తాజా అధ్యయనంలో వెల్లడైంది. 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ క్లినికల్ స్కిల్స్'లో ప్రచురితమైన ఈ పరిశీలనలో వెర్టిగో చికిత్సకు అందుబాటులో ఉన్న పద్ధతులు, విధానాలను తెలుసుకునేందుకు 51 శాతం 'వెర్టిగో' రోగులు మైక్రో బ్లాగింగ్ సైట్ ఎక్స్‌ను ఆశ్రయించినట్టు తెలుస్తోంది. పరిసరాలు తిరుగుతున్నట్టు, కళ్లు తిరిగి పడిపోతున్నట్టు, ఒకచోట నిలబడలేక పడిపోతున్న భావనకు గురికావడం, విడవకుండా తలనొప్పి రావడం, నడిచేటప్పుడు ఇబ్బంది ఎదురుకావడం, శరీర బరువులో మార్పులు రావడం, వణుకుతున్న భావన కలగడం, స్వల్పకాలానికే కొన్ని విషయాల్లో మరుపు వంటివి 'వెర్టిగో' లక్షణాలని వైద్యులు చెబుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో దీనికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునేందుకు మధ్యవయసు వారు (54 శాతం), పిల్లలు (27 శాతం), పెద్దవయసు వారు (19 శాతం) ప్రయత్నించినట్టు ఈ సర్వేలో వెల్లడైంది. అన్ని వయసుల వారిని కలుపుకొంటే.. వారిలో 65 శాతం మంది మహిళలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ అధ్యయనంలో భాగంగా పరిశోధకులు బ్రాండ్‌వాచ్ (ఎంటర్‌ప్రైజ్–గ్రేడ్ సోషల్ లిసనింగ్ టూల్) అనేదాన్ని వినియోగించారు. దీనిద్వారా ట్విటర్ (ఎక్స్), యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, మెడికల్ ఫోరమ్స్, బ్లాగ్‌లు, ఈ–కామర్స్ సమీక్షలను పరిశీలించారు. ప్రధానంగా వీరంతా కూడా వివిధ సాధనాల ద్వారా వెర్టిగో సమస్యకు సమర్థవంతంగా ఎలా చికిత్స చేయాలి?, అందుకు నిపుణులైన వైద్యులెవరనే అంశంపై దృష్టి పెట్టారు.



సోషల్ మీడియా.. రెండంచుల కత్తి

ఈ అధ్యయనం ద్వారా చివరకు తేల్చింది ఏమిటంటే.. సామాజిక మాధ్యమం రెండంచుల కత్తి లాంటిదని, ఏదైనా విషయమై సమాచారాన్ని తెలుసుకునేందుకు ఇవి దోహదం చేయడమేకాక, ఆయా అంశాలపై సమాచారం తెలుసుకోవడంలో అంతరాలు ఏర్పడి కొన్ని తప్పుడు భావనలు, అభిప్రాయాలు, సూత్రీకరణలు చేసేందుకు కూడా దారి తీస్తున్నట్టు పేర్కొన్నారు. అందువల్ల ఈ విషయంలోనూ ప్రజలను చైతన్యపరిచేందుకు సోషల్‌మీడియాను వైద్యులు, నిపుణులు ఉపయోగించుకోవలసిన ఆవశ్యకత పెరిగిందంటున్నారు. ఈ మాధ్యమాల్లో ట్రెండింగ్‌గా మారుతున్న అంశాలను పరిశీలించి.. ఏవైనా తప్పుడు భావనలు, అభిప్రాయాలు వ్యక్తమైతే వాటిని దూరం చేసేందుకు చర్యలు తీసుకోవాలంటున్నారు. ఇన్‌స్టాగామ్ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో వైద్యులు ఆయా ముఖ్యమైన అంశాలకు సంబంధించిన చిన్నచిన్న వీడియోలను పెట్టడం ద్వారా.. లక్షలాది మందిలో చైతన్యాన్ని కలిగించి, చికిత్సా పద్ధతులపై విశ్వాసాన్ని కలిగిస్తున్నాయని ఒక వైద్యుడు పేర్కొన్నారు.





హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో హెచ్ సీఏఏ క్యాలెండర్‌ని ఆవిష్కరిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాదే. చిత్రంలో హెచ్ సీఏఏ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు దీప్తి, కార్యదర్శులు శాంతిభూషణ్ రావు, సంజీవ్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ నవీన్ కుమార్ తదితరులు

పల్లెల్లో ప్రభుత్వ విధ్వంసం: 'కాసం'



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పల్లెలను కాంగ్రెస్ సర్కార్ విధ్వంసానికి గురిచేస్తోందని బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు యాదవ్ ధ్వజమెత్తారు. ఇప్పటివరకు రిజర్వేషన్లు ఖరారు చేయకుండా.. స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పార్లమెంటుకు ఎంత అధికారం ఉందో.. గ్రామ పంచాయతీలకూ అంతే అధికారం ఉందని దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అన్నారని గుర్తు చేశారు. గడువు తీరినా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపకుండా స్పెషల్ ఆఫీసర్లను నియమించారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులకు రెండు, మూడు గ్రామాల బాధ్యతలు అప్పగించడంతో వాటి నిర్వహణ అగమ్యగోచరంగా మారిందని విమర్శించారు. బీసీల కోసం దీక్ష చేస్తానంటున్న ఎమ్మెల్సీ కవిత.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని బీసీలకు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని 'కాసం' ప్రశ్నించారు.



కొత్త స్వాగతం

2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. 2025కి స్వాగతం తెలుపుతూ హైదరాబాద్‌లోని చార్మినార్ వద్ద టెడ్డీబేర్ వేషధారణలో ఓ యువకుడు..



సాంధ్యరాగం.. పక్షులగానం..

సంధ్యాసమయం.. పక్షులు గూటికి చేరుకునే ముందు ఏదో సమావేశం పెట్టినట్లుగా ఒక్కదగ్గరికి చేరుకున్నాయి. ఏ చిన్న అలికిడి అయినా ఒక అలలాగా ఎగిరిపోతున్నాయి. హనుమకొండ కాజీపేట దర్గా సమీపంలోని చెట్లపై సోమవారం సాయంత్రం సూర్యాస్తమయం సమయంలో పక్షులు ఇలా సందడి చేస్తూ కనిపించాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ



బీరు సీసాలు కట్టి.. ధాన్యం ఆరబెట్టి..

వరి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఒక రైతు వినూత్నంగా ఆలోచించాడు. మహబూబాబాద్ జిల్లా గార్లలోని జీవంజీపల్లి గ్రామానికి చెందిన వెంకన్న అనే రైతు తన కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ఆరబెట్టేందుకు ఒక కర్రకు 3 బీరు సీసాలు కట్టి తిప్పుతున్నాడు. దున్నకం మాదిరిగా రోజుకు 3 సార్లు నేర్పితే.. ధాన్యం త్వరగా ఆరిపోతుందని, తేమశాతం 17 శాతం వస్తుందని రైతు స్పష్టం చేశాడు. ఇందువల్ల వెంటనే కాంటాలు పెట్టి అమ్ముకోవచ్చని తెలిపాడు.

– గార్ల

నిర్లక్ష్యంలో చాలా 'స్మార్ట్'

- నత్తనడకన స్మార్ట్‌సిటీ పనులు
- ఇప్పటికే రెండుసార్లు గడువు పొడిగించిన కేంద్రం
- 71 నగరాల్లో అసంపూర్తి.. లక్ష్యానికి దూరంగా 16 సిటీలు
- 60 శాతంలోనే వరంగల్, కరీంనగర్
- 2025 మార్చి నాటికి లక్ష్యం పూర్తయ్యేనా?

స్మార్ట్‌సిటీ మిషన్ వివరాలు..

స్మార్ట్‌సిటీ మిషన్ (ఎస్‌సీఎం)కు శ్రీకారం: 2015 ఆగస్టు 27

దేశంలో ఎంపిక చేసిన నగరాల సంఖ్య: 100 (మొదట 98 నగరాలు.. ఆ తర్వాత కరీంనగర్, వరంగల్)

ఎస్‌సీఎం కింద విడుదలైన నిధులు: రూ.1,64,669 కోట్లు

ప్రతిపాదన చేసిన ప్రాజెక్టుల వర్క్ఆర్డర్లు: 8,066

నూరు శాతం ప్రాజెక్టులు పూర్తి చేసిన నగరాలు: 13

90 శాతంలో ఆగిన నగరాలు : 48

75 శాతం వరకు పూర్తి చేసినవి : 23

నత్తనడకన రూ.17,303 కోట్ల విలువైన 714 ప్రాజెక్టులు

సాక్షి ప్రతినిధి, వరంగల్: స్మార్ట్‌సిటీ మిషన్ (ఎస్‌సీఎం) కింద చేపట్టిన పనులు పలు నగరాల్లో నత్తనడకన సాగుతున్నాయి. దేశంలోని 100 నగరాలను ఎస్‌సీఎం ద్వారా 'సుందర నగరాలు'గా తీర్చిద్దాలన్న లక్ష్యం నెరవేరడం లేదు. పనులు పూర్తి చేసేందుకు లక్ష్యాలు నిర్దేశించుకున్నా.. వాయిదాల మీద వాయిదాలు వేస్తున్నారు. వాస్తవానికి 2023 జూన్‌లోనే.. దేశంలోని వంద నగరాల్లో చేపట్టిన స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు పూర్తి కావాలి. ఇప్పటికి రెండు పర్యాయాలు స్మార్ట్‌సిటీ మిషన్ గడువు పొడిగించినా ఫలితం లేదు. పనుల తీరు చూస్తే 2025 మార్చి 31 నాటికైనా పూర్తవుతాయా? అన్న సందేహాలు కలుగుతున్నాయి.

తొమ్మిదేళ్లుగా సా..గుతున్న పనులు

దేశంలోని 29 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని నగరాలను ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వం .. 2015 ఆగస్టు 27న స్మార్ట్‌సిటీ మిషన్‌కు శ్రీకారం చుట్టింది. దేశంలోని 100 నగరాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ఆర్థిక వృద్ధిని పెంచడం దీని లక్ష్యం. మొదటి విడత 98 నగరాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. ఆ తర్వాత వరంగల్, కరీంనగర్‌ను కూడా స్మార్ట్‌సిటీ జాబితాలో చేర్చింది. సుమారు తొమ్మిదేళ్ల వ్యవధిలో వంద నగరాల కోసం 8,066 ప్రాజెక్టుల వర్క్ ఆర్డర్లను జారీ చేసి రూ.1,64,669 కోట్లు ఖర్చు చేయాలని అంచనా వేసింది. ఈ మేరకు 2024 నవంబర్ 28 వరకు 7,352 ప్రాజెక్టుల వర్క్ ఆర్డర్లపై రూ.1,47,366 కోట్లు ఖర్చు చేసింది. ఈ విషయాన్ని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాలశాఖ మంత్రి తోఖన్ సాహు వెల్లడించారు. ఇన్ని నిధులు ఖర్చయినా.. అన్ని ప్రాజెక్టులను 13 నగరాలు మాత్రమే పూర్తి చేశాయి. ఆ తర్వాత 48 నగరాల్లో 90 శాతం, 23 నగరాల్లో 75 శాతం పూర్తయ్యాయి. 16 నగరాల్లో స్మార్ట్‌సిటీ మిషన్ ప్రాజెక్టులు అసంపూర్తిగానే ఉండగా.. రూ.17,303 కోట్ల విలువైన 714 ప్రాజెక్టులు ఇంకా అమలు దశలోనే ఉన్నాయి.



ఆ 13 నగరాలు భేష్..

నూరు శాతం స్మార్ట్‌సిటీ మిషన్‌లో చేపట్టి ప్రాజెక్టులు పూర్తి చేసిన నగరాల్లో గుజరాత్ రాష్ట్రంలో సూరత్, జార్ఖండ్‌లో రాంచీ, కర్ణాటకలో తుమకూరు, లక్ష్యదీప్‌లో కవరాట్టి, మధ్యప్రదేశ్‌లో జబల్‌పూర్, మహారాష్ట్రలో పుణె, రాజస్థాన్‌లో ఉదయ్‌పూర్, తమిళనాడులో కోయంబత్తూర్, మధురై, సాలెం, ఉత్తరప్రదేశ్‌లో ఆగ్రా, బరేలీ ఉన్నాయి.

60 శాతంలోనే వరంగల్, కరీంనగర్..

గ్రేటర్ వరంగల్, కరీంనగర్ స్మార్ట్‌సిటీల్లో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆ రెండు నగరాలకు కేటాయించిన నిధులు, ఖర్చయిన నిధులు, పూర్తయిన ప్రాజెక్టులను పరిశీలిస్తే.. ఇంకా 58 శాతంలోనే ఉన్నాయి. ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాకపోగా.. తుది గడువైన 2025 మార్చి 31 నాటికి పూర్తవడం ప్రశ్నార్థకంగా ఉంది. 2017–18లో కరీంనగర్, గ్రేటర్ వరంగల్‌ను కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీలుగా ప్రకటించిన తర్వాత.. ఆ రెండు నగరాల్లో రూ.1,879 కోట్లతో రహదారులు, నాలాలు, కమ్యూనిటీ హాళ్లు, పార్కులు తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందించింది. క్షేత్రస్థాయి అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించి పురపాలకశాఖ అధికారులు ప్రతిపాదించగా.. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆమోద ముద్ర వేసింది. స్మార్ట్ సిటీలుగా ప్రకటించి ఆరేళ్లు దాటినా ఆ రెండు నగరాల్లో పనులు 60 శాతం దాటలేదు. నవంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు.. గ్రేటర్ వరంగల్‌లో రూ.179 కోట్లు, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.102 కోట్లు అందుబాటులో ఉన్నా పనులు చేయించడంలో అధికారులు అలసత్వం చేశారనే ఫిర్యాదులున్నాయి.

పలు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి.. అందుకే గడువు పొడిగింపు..

ఉత్తరప్రదేశ్‌లోని 10 నగరాల్లో రూ.21,115.53 కోట్లతో 889 ప్రాజెక్టులు చేపట్టగా.. రూ.864.4 కోట్ల విలువైన 39 ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. మధ్యప్రదేశ్‌లోని ఏడు నగరాల్లో 788 ప్రాజెక్టుల కోసం రూ.15,078.54 కోట్లు అంచనా కాగా.. 748 ప్రాజెక్టులను రూ.14,192.23 కోట్లతో పూర్తి చేయగా, 40 ఇంకా అసంపూర్తిగా ఉన్నాయి. తెలంగాణలోని రెండు నగరాల్లో రూ.2,817.65 కోట్ల విలువైన 169 ప్రాజెక్టుల్లో 97 పూర్తి కాగా, రూ.794.74 కోట్ల విలువైన 72 ప్రాజెక్టులు ముందుకు సాగడం లేదు. తమిళనాడులోని 11 నగరాల్లో రూ.17,983.63 కోట్ల విలువైన 733 ప్రాజెక్టుల్లో రూ.513.54 కోట్లతో చేపట్టిన 25 పూర్తి కావలసి ఉంది. రాజస్తాన్‌లోని అజ్మీర్, జైపూర్, కోట, ఉదయ్‌పూర్ నగరాల్లో రూ.8639.95 కోట్ల ఖర్చు కాగల 579 ప్రాజెక్టుల్లో 561 పూర్తి కాగా, రూ.324.73 కోట్లతో నడుస్తున్న 18 పెండింగ్‌లో ఉన్నాయి. ఇలా ఆంధ్రప్రదేశ్‌లో 47, ఛత్తీస్‌గఢ్‌లో 41, హిమాచల్‌ప్రదేశ్‌లో 32, బిహార్‌లో 30, జమ్ము కశ్మీర్‌లో 30, మహారాష్ట్రలో 29, కేరళలో 27, కర్ణాటకలో 26, హరియాణాలో 26 ప్రాజెక్టులు.. మొత్తం 714 పెండింగ్‌లో ఉన్నాయి.

స్మార్ట్‌సిటీలతో ప్రయోజనాలు..

- సమర్థవంతమైన పబ్లిక్ రవాణా వ్యవస్థ
- వ్యర్థ నీటి రీసైక్లింగ్
- నీటి వృథాను అరికట్టే సెన్సార్స్, యాజమాన్యం, గ్రీన్ స్పేసెస్
- భౌతిక, సాంఘిక అవస్థాపనా సౌకర్యాల కల్పన
- ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటుతో ఉపాధి వస్తు, సేవల లభ్యత
- ప్రజల జీవన ప్రమాణాల్లో పెరుగుదల
- సహజ వనరుల సమర్థ వినియోగం
- గవర్నెన్స్‌లో పౌరుల భాగస్వామ్యం
- పర్యావరణ పరిరక్షణ–యాజమాన్యం
- 'స్మార్ట్' పట్టణాభివృద్ధి సాధన.. సుస్థిర వృద్ధి
- గ్లోబల్ నెట్ వర్కింగ్
- సృజనాత్మక పరిశ్రమ
- ఆధునిక సమాచార వ్యవస్థ అందుబాటులోకి
- ఈ–అర్బన్ గవర్నెన్స్..
- పారిశ్రామికీకరణ
- భద్రతా వ్యవస్థ ఆధునికీకరణ.. ఇలా అనేక ప్రయోజనాలు కలుగుతాయి.

క్లుప్తంగా...

ఫార్మేటివ్ పరీక్షల బ్లూప్రింట్ విడుదల చేయాలి

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యాశాఖ కొత్తగా ప్రవేశపెట్టిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులకు అనుగుణంగా మార్చిన ఫార్మేటివ్ పరీక్షల నాలుగు సామర్థ్యాల మార్కుల విధానం బ్లూ ప్రింట్ విడుదల చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీవీ ప్రసాద్, రాధాకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రశ్నల వర్గీకరణ ప్రశ్నపత్రాన్ని విడుదల చేయాలని కోరారు. జనవరిలో జరిగే ఫార్మేటివ్ పరీక్షలపై ముందస్తుగా విద్యార్థులను చైతన్యం చేసేందుకు వీలుగా వీటిని విడుదల చేయాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాల వారీగా వెయిటేజీ ప్రకటించాలని పేర్కొన్నారు.

అనారోగ్యంతో నెమలి మృతి



పులివెందుల రూరల్: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలం పార్నపల్లె గ్రామంలో ఓ వ్యక్తి జాతీయ పక్షి నెమలిని పెంచుకుంటున్నాడు. నెమలికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఫారెస్ట్ అధికారులకు అప్పగించాడు. వారు లింగాల మండలంలోని పశువైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో నెమలిని పులివెందుల ఆస్పత్రికి తీసుకొస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. దీంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహబూబ్ బాషా పులివెందులలోని నగరవనం వద్ద నెమలిని పడేసి వెళ్లిపోయారు. విషయం ఫారెస్ట్ ఉన్నతాధికారులకు తెలియడంతో పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పోస్టుమార్టం నిర్వహించాక పూర్తి వివరాలు తెలియజేస్తామని తెలిపారు.

లోకాయుక్తలో క్యాలెండర్ ఆవిష్కరణ



కర్నూలు(సెంట్రల్): లోకాయుక్త నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజని ఆవిష్కరించారు. మంగళవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె క్యాలెండర్‌ను ఆవిష్కరించి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాదిలో ప్రజలకు సంతోషాలు కలగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. రిజిస్ట్రార్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులాలకు టీచర్ల డిప్యుటేషన్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమ్మె నేపథ్యంలో ఆశ్రమ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై వేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రిటైర్డ్ ఐపీఎస్‌లకు సత్కారం

సాక్షి, అమరావతి: ఉద్యోగ విరమణ చేసిన రహదారి భద్రత విభాగం డైరెక్టర్ జనరల్ అంజనా సిన్హా, పోలీస్ ట్రైనింగ్ ఐజీ పి.వెంకటరామిరెడ్డిలను డీజీపీ సీహెచ్. ద్వారకా తిరుమలరావు సత్కరించారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వారికి జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు డీజీలు, అదనపు డీజీలు, డీఐజీలు పాల్గొన్నారు.

రూ.54 లక్షలు కొట్టేశారు
సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ భార్యకు మస్కా కొట్టిన సైబర్ నేరగాళ్లు

తిరుపతి రూరల్: పార్ట్ టైం జాబ్ పేరుతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ భార్యకు మస్కా కొట్టి సైబర్ నేరగాళ్లు రూ.54 లక్షలు నేరగాళ్లు కొట్టేసిన ఘటన తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురంలో చోటుచేసుకుంది. రూరల్ సీఐ చిన్న గోవిందు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయతీ సరస్వతి నగర్‌కు చెందిన సుజాత గృహిణి. ఆమె భర్త సింగపూర్ లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. డిసెంబర్ 14న సుజాతకు గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్ నెంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. పార్ట్ టైం జాబ్ అవకాశం ఉందని లింకులు క్లిక్ చేసి రేటింగ్ ఇవ్వాలని తెలిపారు. నమ్మకంతో ఆమె టెలిగ్రామ్ గ్రూపులో చేరారు. వారిచ్చిన 13 బ్యాంకు ఖాతాలకు ఈనెల 14 నుంచి 24వ తేదీ వరకు మొత్తం రూ.54 లక్షలు పంపించారు. అదనంగా మరో రూ.30 లక్షలు డిమాండ్ చేయడంతో ఆమె మోసపోయినట్లు గుర్తించి తల్లిదండ్రులకు తెలిపారు. 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయడంతో అకౌంట్ ఫ్రీజ్ చేసి రూ.7 లక్షలు హోల్డ్ చేశారు. అనంతరం బాధితురాలు తిరుపతి రూరల్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ చిన్న గోవిందు తెలిపారు.

కోటి ఆశలతో కొత్త ఏడాదిలోకి..











పుస్తక ప్రియుల నెత్తిన ధరల పిడుగు

బుక్ పోస్ట్ సర్వీసు పేరు మార్చిన తపాలా శాఖ

సేవల ధర భారీగా పెంచిన వైనం.. ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం

అనంతపురం సిటీ: కేంద్రం తీసుకున్న నిర్ణయం పుస్తక ప్రియుల పాలిట శరాఘాతంగా మారింది. తపాలాశాఖకు చెందిన 'బుక్ పోస్ట్ సర్వీసు'ను 'బుక్ పోస్టు'గా పేరు మార్చిన మోదీ సర్కార్ ధరల మోత మోగించింది. ఈ నిర్ణయం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. ఉత్తరాలు, మనీయార్డర్ల బట్వాడా నుంచి బ్యాంకింగ్ సేవల వరకు దశల వారీగా విస్తరిస్తూ వచ్చిన తపాలా శాఖ.. తాజాగా వినియోగదారులకు భారీగా షాక్ ఇచ్చింది. బుక్ పోస్ట్ సర్వీసు పేరుతో అతి తక్కువ ధరకే సేవలందిస్తూ వచ్చిన ఆ శాఖ.. ఇప్పుడు చార్జీలను భారీగా వడ్డిస్తోంది. మూడు రకాల బుక్ పోస్ట్ సేవలను ఒకే విభాగం కిందకు తెస్తూ రిజిస్టర్ ప్రింటెడ్ బుక్ పోస్టును 'బుక్ పోస్టు'గా మార్చి భారీగా చార్జీలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. నాలుగు రకాలుగా ఉన్న పోస్ట్‌కార్డులను కూడా ఒకే విభాగం కిందకు తెచ్చింది. రిజిస్టర్ బుక్ పోస్ట్ కాలమ్‌ను ఈనెల 18 నుంచి ఏకంగా సాఫ్ట్‌వేర్ నుంచి రహస్యంగా తొలగించడం తపాలా ఉద్యోగులతో పాటు అందరినీ షాక్‌కు గురి చేసింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పుస్తకాలతో పాటు దిన, వార, పక్ష పత్రికల బట్వాడాపైనా తీవ్ర ప్రభావం చూపనుంది.



అనంతపురంలోని ప్రధాన తపాలా కార్యాలయం

ప్రచురణ రంగంలో ప్రకంపనలు

కేంద్రం నిర్ణయం ప్రచురణ రంగంలో ప్రకంపనలు సృష్టిస్తోంది. రిజిస్టర్ బుక్ పోస్టు ద్వారా 200 పేజీల పుస్తకాన్ని జీఎస్టీతో కలుపుకొని రూ.25కు పంపేవారు. ఇప్పుడు ఆ సర్వీసును తపాల శాఖ రద్దు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పుస్తకాన్ని రిజిస్టర్డ్ పార్శిల్‌లో మాత్రమే పంపాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రూ.100 విలువ చేసే పుస్తకాన్ని పాఠకుడెవరైనా పోస్టల్‌లో తెప్పించుకోవాలంటే పుస్తక వెల రూ.100తో పాటు మరో రూ.80 పోస్టల్ చార్జీల కింద భరించాల్సి ఉంటుంది. ఇంత భారం భరించి పుస్తకాలను తెప్పించుకునే వారెవరుంటారు? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

పెరిగిన ధరలు ఇలా..

బుక్ పోస్ట్ బరువు (గ్రాముల్లో)	పాత ధర (రూ.)	కొత్త ధర (రూ.)
100	22.00	28.00
1000	27.00	92.00
2000	43.50	163.00
3000	56.40	234.00
4000	67.00	304.00
5000	79.00	365.00

బాదుడే.. బాదుడు

దేశంలో ఏ మారుమూల ప్రాంతం నుంచైనా పుస్తకాలు, వార, పక్ష పత్రికలు తెప్పించుకోవాలంటే ఐదు కిలోల బరువున్న పార్శిల్‌కు గతంలో రూ.80 చార్జీ చెల్లించేవారమని వినియోగదారులు గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు అదే బరువు కలిగిన పార్శిల్‌కు రూ.365 చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

కొరియర్ సేవలతో పోల్చితే..

ప్రైవేటు కొరియర్ సర్వీసులతో పోల్చితే తపాలా శాఖ చాలా తక్కువ చార్జీతో ఎక్కువ సేవలు అందిస్తోంది. అయితే ఇదంతా గతం. ఇప్పుడు కేంద్ర సర్కారు కఠిన నిర్ణయాలతో కొరియర్ సేవలే మేలనే పరిస్థితి వచ్చిందంటున్నారు వినియోగదారులు. తాము ఫోన్ చేస్తే చాలు పబ్లిషర్లు ఇంటికే పుస్తకాలు పంపుతున్నారని గుర్తు చేసుకుంటున్నారు.

పుస్తకాలపై 5 శాతం దిగుమతి సుంకం..

కేంద్రం తీసుకున్న మరో నిర్ణయంపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శాంపిల్ పుస్తకాలపై 5 శాతం దిగుమతి సుంకం విధించడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. మన పుస్తకాలను విదేశీ భాషల్లోకి అనువాదం చేసి ప్రచురిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో విదేశీ పబ్లిషర్లు ఆ పుస్తకాల కాంప్లిమెంటరీ కాపీలను మనకు పంపుతుంటారు. ఇలా విదేశాల నుంచి వచ్చే పుస్తకాలపైనా తొలిసారి కేంద్రం దిగుమతి సుంకం విధించింది. వాణిజ్య ప్రయోజనాలతో విక్రయించేందుకు ఉద్దేశించిన పుస్తకాల మీద దిగుమతి సుంకం విధించడం సమర్థనీయమే అయినా.. కాంప్లిమెంటరీగా పంపే పుస్తకాలపైనా సుంకం పేరిట అదనపు భారం మోపడం దుర్మార్గమేనన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

పుస్తక పఠనానికి దూరం చేయడమే



కేంద్రం తీసుకున్న నిర్ణయంతో పాఠకులు పుస్తకపఠనానికి దూరమవుతారు. ఇది సరైన నిర్ణయం కాదు. మరిన్ని రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాల్సిందిపోయి.. ధరలు పెంచితే పుస్తకాలు కొనేదెవరు? తెప్పించుకునేదెవరు? చదివేదెవరు? ఇప్పటికైనా కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.– కొండసాని రజిత, కవయిత్రి

సహ నిందితుని వాంగ్మూలం చెల్లదని తెలియదా?

- సహ నిందితుని వాంగ్మూలం ఆధారంగా నిందితునిగా ఎలా చేరుస్తారు?
- వాట్సాప్‌లో మెసేజ్‌లు అందుకున్నా కూడా కేసులు పెడతారా?
- రోశయ్య, మరో 8 మందికి ముందస్తు బెయిల్ మంజూరు

సాక్షి, అమరావతి: 'సహ నిందితుల వాంగ్మూలం ఆధారంగా ఎలా నిందితునిగా చేరుస్తారు? ఆ వాంగ్మూలాలకు చట్ట ప్రకారం ఎలాంటి విలువ లేదని తెలియదా? వాట్సాప్‌లో ఎవరో మెసేజ్‌లు పెడితే, వాటిని అందుకున్న వారు ఎలా నేరం చేసినవారు అవుతారు..?' అని పోలీసులను హైకోర్టు ప్రశ్నించింది. గోపీలాల్ షేక్ అనే వ్యక్తి వాట్సాప్ గ్రూపులో తన కుమార్తె వ్యక్తిగత ఫొటోలను ఫార్వర్డ్ చేశారని, అలాగే అప్పటి ఎమ్మెల్యే కిలారి రోశయ్య అడ్మిన్‌గా ఉన్న గ్రూపుల్లో కూడా పోస్టులు ఉన్నాయంటూ పొన్నూరు ప్రస్తుత ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర సతీమణి జ్యోతిర్మయి 2020 జనవరి 22న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు గోపీలాల్ షేక్‌పై కేసు నమోదు చేశారు. అయితే 2024లో కిలారి రోశయ్యను కూడా నిందితునిగా చేర్చారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రోశయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. రోశయ్య తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ప్రభుత్వం మారడంతో రాజకీయ కారణాల వల్ల రోశయ్యపై పోలీసులు కేసు పెట్టారని తెలిపారు. ఫోర్జరీ కింద రోశయ్యపై కేసు పెట్టారని, వాట్సాప్ గ్రూపులో మెసేజ్‌లు పెట్టడం ఫోర్జరీ కిందకు ఎలా వస్తుందో అర్థం కావడం లేదన్నారు. వాట్సాప్ గ్రూపులో ఓ సభ్యుడు చేసే మెసేజ్‌లకు ఆ గ్రూపు అడ్మిన్‌ది ఎలాంటి బాధ్యత ఉండదన్నారు. పోలీసుల తరఫున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. వాట్సాప్ గ్రూపుల్లో ఫిర్యాదుదారు కుమార్తె ఫొటోలను కిలారి రోశయ్యే పోస్టు చేశారన్నారు. అందుకు ఆధారాలు ఏమున్నాయని న్యాయమూర్తి ప్రశ్నించారు. కిలారి రోశయ్యే పోస్టులు పెట్టారా? లేక ఇతరులు పెట్టారా? అని కూడా ప్రశ్నించారు. ఇతరులు పెట్టారని, అయితే సోషల్ మీడియాలో 'కె' అన్న పేరుతో ఉన్న అక్షరంతో రోశయ్య పోస్టులు పెట్టారని పీపీ చెప్పారు. 'కె' అన్న అక్షరం ఉంటే అది పిటిషనరే అని ఎలా చెబుతారని న్యాయమూర్తి ప్రశ్నించారు. సహ నిందితుల వాంగ్మూలం తప్ప, ఇతర ఆధారాలేవీ లేవన్నారు. సహ నిందితుల వాంగ్మూలాన్ని పరిగణనలోకి తీసుకోలేమన్న న్యాయమూర్తి పిటిషనర్ రోశయ్యకు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై నమోదు చేసిన కేసులో దర్యాప్తు కొనసాగించుకోవచ్చని పోలీసులకు స్పష్టంచేశారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న మరో 8 మందికి కూడా హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

హలో.. నా పేరు డైరీ..

హలో.. నా పేరు డైరీ. కొందరు దైనందిని అంటారు. ఇప్పటితరానికి నా గురించి అంతగా పరిచయం ఉండకపోవచ్చు. పాత తరానికి నేను ఆత్మీయ నేస్తాన్ని. నిత్యం నన్ను దసూర్తితో స్పృశించేవారు. ఏడాదిలో 365 రోజులూ (లీప్ సంవత్సరం వస్తే 366 రోజులు పాటు) తమ అనుభవాలు, అనుభూతులు, ఆలోచనలు, లెక్కలు, ఖర్చులు, ప్రణాళికలు.. ఇలా ఒకటేమిటి వారి అంతరంగమంతా నాపై అక్షరాలుగా పరిచేవారు. అవసరమైనప్పుడు, పాత రోజుల్లోకి వెళ్లాలనుకున్నప్పుడు నాలోని పేజీలు తిరగేస్తే గడిచిన కాలం మళ్లీ కళ్లముందు కదలాడేది. సందర్భం, అందులోని విషయం ఆధారంగా వారి ముఖంలో దాదాపు నవరసాలు ప్రస్ఫుటమయ్యేవి. కొత్త ఏడాది వస్తుందంటే నన్ను సమకూర్చుకునేందుకు చాలామంది ఆరాటపడేవారు. నాలోని రోజుకో పేజీని కేటాయించేవారు. కొందరైతే ఏం చేయాలి, ఎలా ముందుకెళ్లాలంటూ భవిష్యత్తుపై ఆశావహ దృక్పథంతో ప్రణాళిక చే(రా)సుకునేవారు. ఇంకొందరు తమ రాతలను పునఃశ్చరణ చేసుకొని లోటుపాట్లను అధిగమించే ప్రయత్నం చేసేవారు. చాలామంది నాలోని రాతలను నిజం చేసుకొని ఉన్నత స్థానాలకు వెళ్లి దశాబ్దాల కాలం పాటు తాము సాధించిన విజయాన్ని చిరస్మరణీయంగా భద్రపర్చుకునేవారు. సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతూ సామాజిక మాధ్యమాలు, బ్లాగుల్లో సందేశాలు, అభిప్రాయాలు పంచుకుంటున్నా.. నా పేజీలో రాసిన అక్షర సత్యం ఇచ్చే సంతృప్తి ఇవ్వదన్నది చాలామంది నోట వినిపిస్తోంది. యవ్వనంలో మీరు నింపిన నా పేజీలను మీ పిల్లలకు చూపిస్తే ఆ కిక్కేవేరన్నది మీకు తెలియని కాదు. ఆ రోజులు ఎలా ఉండేవి.. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకునే సూచనలను ప్రత్యేకంగా పిల్లలకు చెప్పాల్సిన పని ఉండదు. ఆ రోజు రానే వచ్చింది. నన్ను మరోసారి గుర్తుచేసుకుంటారని ఆశిస్తూ
మీ ఆత్మీయ డైరీని.

– విజయనగరం

ఓపెన్ స్కూల్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పెంపు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష సాధారణ ఫీజు గడువును జనవరి 6వ తేదీ వరకు పొడిగించినట్లు ఏపీ ఓపెన్ స్కూల్ డైరెక్టర్ ఆర్.నరసింహారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్జెక్టుకు రూ.25 అపరాధ రుసుంతో జనవరి 8వ తేదీ వరకు, రూ.50 అపరాధ రుసుంతో 9వ తేదీ వరకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. తత్కాల్ ఫీజుతో వచ్చే నెల 10వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

'ఉపాధి' పనుల ఆకస్మిక తనిఖీలు
పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు

సాక్షి, అమరావతి: క్షేత్రస్థాయిలో పటిష్టంగా ఉపాధి హామీ పథకం అమలు చేసేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఆకస్మిక తనిఖీల కోసం ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటుపై విధివిధానాలను ఖరారు చేస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు వీఆర్ కృష్ణతేజ్ మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. ఒక్కో ఫ్లైయింగ్ స్క్వాడ్‌లో 6 నుంచి 8 మంది చొప్పున ఉంటారని.. అన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో ఉండే చీఫ్ విజిలెన్స్ అధికారి పర్యవేక్షణలో పనిచేస్తాయని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి అందే పిర్యాదుల ఆధారంగా కమిషనర్ ఫ్లైయింగ్ స్క్వాడ్ పర్యటించే ప్రాంతాలను నిర్ధారిస్తారని పేర్కొన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు అందజేసే నివేదికలపై చీఫ్ విజిలెన్స్ అధికారి చర్యలు తీసుకుంటారని తెలిపారు.

మంత్రి సుభాష్‌కు హైకోర్టులో ఊరట
రెండు కేసుల్లో చర్యలు నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు హైకోర్టు ఊరటనిచ్చింది. ఆయనపై డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మేజిస్ట్రేట్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న రెండు కేసుల్లో తదుపరి చర్యలన్నింటినీ 12 వారాల పాటు హైకోర్టు నిలిపేసింది. విచారణను ఫిబ్రవరి 25కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. తమ విధులకు ఆటంకం కలిగించారంటూ అమలాపురం పట్టణ పోలీస్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు 2015 ఫిబ్రవరి 24న వాసంశెట్టి సుభాష్‌తో పాటు పలువురిపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అలాగే మానవహక్కుల సంఘంలో ఉద్యోగాల పేరుతో పలువురిని వాసంశెట్టి సుభాష్ మోసం చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల్లో పోలీసులు దాఖలు చేసిన చార్జిషీట్‌లను కొట్టేయాలని కోరుతూ సుభాష్ ఇటీవల హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.

చంద్రబాబు ట్రిక్కులు ఇక చెల్లవ్
సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: చంద్రబాబు ట్రిక్కులు 2000లో చెల్లాయని.. మళ్లీ ఆ ట్రిక్కులనే ఇప్పుడు ప్రదర్శిస్తున్నారని, ఆ రోజులు ఇప్పుడు చెల్లవని.. ప్రజలు నమ్మే స్థితిలో లేరని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. నెల్లూరులో ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు నిర్వహించే సీపీఎం రాష్ట్ర మహాసభల లోగోను విజయవాడలో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నూతన ఆర్థిక సంవత్సరంలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటామని, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో ప్రజలెవరు సంతోషంగా లేరన్నారు. ఆదాయం పెంచుకోవడం కోసం ప్రజల నుంచి రూ.వేల కోట్లను పిండటానికి టీడీపీ కూటమి ప్రభుత్వం యత్నిస్తోందని విమర్శించారు.

సాక్షి ప్లస్
బుధవారం ॥ 1-1-2025



పత్తి పండు!

కొత్త పంట



అవును. దీని పేరు పత్తి పండే! వేసవి తాపాన్ని తీర్చే అద్భుతమైన తినదగిన పత్తి పండు ఇది. మధ్యకు కోస్తే దీంట్లో తెల్లని దూది మాదిరిగా కనిపించే గుజ్జు ఉంటుంది. విలక్షణమైన ఈ పండుకు 'సెంతొల్', 'కాటన్ ఫ్రూట్'తో పాటు చాలా మారు పేర్లున్నాయి. కెచపి, లాల్లీ ఫ్రూట్, వైల్డ్ మాంగోస్టీన్, రెడ్ సెంతొల్, సెంతల్, సయో, వైసయన్.. ఇలా అనేక పేర్లతో పిలుస్తారు.

ఆగ్నేయాసియా ప్రాంతమే పత్తి పండు పుట్టిల్లు. దీని శాస్త్రీయ నామం 'సండోరికం కోయెట్జాపే'. మెనియాసీ లేదా మహోగని కుటుంబానికి చెందినది. ఈ పండు గుజ్జు తీపి, వగరు కలిసిన చిత్రమైన రుచి కలిగి ఉంటుంది. ఆగ్నేసియా దేశాల్లోని ఉష్ణమండల లోతట్టు భూముల్లో విస్తృతంగా సాగవుతున్న పండ్ల చెట్టు ఇది. తాజా పండ్ల వాడకమే ఎక్కువ.

సంతొల్ చెట్లు లోయర్ ఆల్టిట్యూడ్ ప్రాంతాల్లో చాలా ఎత్తుగా, వేగంగా పెరుగుతాయి. సాధారణంగా 15–40 మీటర్ల ఎత్తు పెరుగుతాయి. ఆకులు ముదురు ఆకుపచ్చగా 4–10 అంగుళాల పొడవు పెరుగుతాయి. పూలు 1 సెం.మీ. పొడవున ఆకుపచ్చ, పసుపు, గులాబీ రంగుల్లో ఉంటాయి.

పత్తి పండు గుండ్రంగా, ఆపిల్ సైజులో ఉంటుంది. పండు లోపల రసంతో కూడిన ఐదు దూది తొనల మాదిరిగా ఉంటాయి. 3–4 విత్తనాలుంటాయి. దీని గుజ్జు వగరగా ఉంటుంది. పండు పండిన తర్వాత తియ్యగా మారుతుంది. కొన్ని రకాల సంతొల్ పండ్లు తక్కువ తీపిగా, మరికొన్ని రకాలు మరింత తీపిగా ఉంటాయి. బాగా తియ్యగా ఉండే పండ్లు ఆపిల్ రుచికి దగ్గరగా ఉంటాయి.

రెండు రకాలు

సంతొల్ పండుకు సంబంధించి ప్రధానంగా రెండు వంగడాలు ఎరుపు (ఎస్.కోయెట్జాపే), పసుపు (ఎస్. నెర్వోసమ్) రంగుల్లో ఉంటాయి. ఎరుపు రంగులో ఉండే రకం పత్తి పండ్లను రైతులు ఎక్కువగా పండిస్తున్నారు. మార్కెట్లలో ఇవే ఎక్కువగా కనిపిస్తాయి. కొమ్మకు కాయకు మధ్య ఉండే కాడలు, తొక్క, పండు రుచిలో ఈ రెండు రకాల పండ్లకు స్పష్టమైన వ్యత్యాసం ఉంటుంది.

పసుపు సంతొల్ పండు తొడిమెలు 15 సెం.మీ. పొడవున ఉంటాయి. పండు కోతకు వచ్చే సమయానికి తొడిమలు కూడా పసుపు రంగులోకి మారతాయి. ఎరుపు సంతొల్ పండ్ల తొడిమెలు 30 సెం.మీ. వరకు పెరిగి, ఎరుపుగా మారతాయి. పసుపు పండు తొక్క పల్చగా, రుచి తియ్యగా ఉంటుంది. ఎర్ర పండు తొక్క మందంగా, రుచి కొంచెం వగరుగా ఉంటుంది.

ఆరోగ్య ప్రయోజనాలు

1. కేన్సర్ నివారణ

సంతొల్ పండులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కేన్సర్ కణాల వ్యాప్తిని ఇవి అరికడతాయి. ఈ పండు నుంచి సంగ్రహించే సెకోట్రిటెర్పెన్, కోయెట్జాపిక్ ఆసిడ్ అనే రెండు బయోయాక్టివ్ కెమికల్స్ కేన్సర్ కణాలపై సైటోటాక్సిక్ ప్రభావం చూపుతాయని పరిశోధనల్లో వెల్లడైంది. ఎలుకల స్తన గ్రంథుల్లో గడ్డల సైజును, సంఖ్యను తగ్గించగలిగాయి. మనుషుల్లో కేన్సర్ కణాలను ఇవి హరిస్తాయని పరిశోధనల్లో వెల్లడైంది.

2. ఆరోగ్యకరమైన దంతాలు

పత్తి పండ్లు లాలాజలానికి సంబంధించిన గ్రంథులను ఉత్తేజపరచటం ద్వారా మరింత లాలాజలాన్ని ఉత్పత్తి చేస్తాయి. నోట్లో హానికారక క్రిములను నశింపజేయటం ద్వారా దంతాల ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.

3. ఎల్‌డిఎల్‌ను తగ్గిస్తాయి

సంతొల్ పండులో పెక్టిన్ అనే జీర్ణమయ్యే పీచు ఉంటుంది. లో డెన్సిటీ లిపోప్రొటీన్ (ఎల్‌డీఎల్) రక్తంలో ఎక్కువగా ఉంటే రక్తపోటు, గుండెపోటు తదితర గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. పెక్టిన్, హెచ్‌డిఎల్‌లు కలసి ఎల్‌డిఎల్‌ను రక్త ప్రసరణ వ్యవస్థలోకి చేరకుండా చూస్తాయి. తద్వారా సంతొల్ పండు గుండె జబ్బుల్ని నివారిస్తుంది.



4. బరువు తగ్గిస్తుంది

శరీరపు అధిక బరువు గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం, హార్మోన్ అసమతుల్యత వంటి అనేక సమస్యలకు కారణం. ఈ పండ్లలో జీర్ణమయ్యే, కాని పీచు పదార్థాలు ఉంటాయి. తిండి యావ తగ్గించటం ద్వారా ఊబకాయం తగ్గటానికి, ఆరోగ్యం మెరుగుపడడానికి దోహదం చేస్తుంది.

5. రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది

పత్తి పండులోని క్వెర్సెటిన్ అనే యాంటాఆక్సిడెంట్ రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. కణాలను బాగు చేయటం ద్వారా రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. ఇందులోని పీచు పదార్థం ప్రోబయాటిక్ మైక్రోఆర్గానిజమ్స్‌ని ఉత్తేజపరచి రోగనిరోధక శక్తిని ఇనుమడింపజేస్తుంది. విటమిన్ సి కూడా పుష్కలంగా ఉంటుంది.

6. రక్తహీనత, అల్జిమర్స్‌ను తగ్గిస్తుంది

దేహంలో సరిపోయినంతగా ఆరోగ్యకరమైన ఎర్ర రక్తకణాలు లేకపోతే రక్తహీనత కలుగుతుంది. రక్తంలో ఆక్సిజన్ చలనానికి ఐరన్ అవసరం. ఈ పండ్లలోని విటమిన్ సి వల్ల ఐరన్‌ను ఇముడ్చుకోగల శక్తిని జీర్ణవ్యవస్థ పెంచుకుంటుంది. ఇందులో పుష్కలంగా ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు మెదడును ఆరోగ్యంగా ఉంచుతూ అల్జిమర్స్ ముప్పు నుంచి తప్పిస్తాయి.

7. రక్తంలో చక్కెర నియంత్రణ

ఈ పండు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ. కాబట్టి గ్లూకోజ్‌ను నెమ్మదిగా రక్తంలో కలిసేందుకు దోహదం చేస్తుంది. తద్వారా బ్లడ్ సుగర్ స్థాయి నియంత్రణలో ఉంటుంది.

100 గ్రాములు పత్తి పండులో పోషక విలువలు

పోషకం	పసుపురంగు పండు	ఎరుపు పండు
ప్రొటీన్	0.118 గ్రా.	0.89 %
కొవ్వు	0.10 గ్రా.	1.43 %
పీచు	0.1 గ్రా.	2.30 %
ఐరన్	0.42 ఎం.జి.	0.002 %
కాల్షియం	4.3 ఎం.జి.	0.01 %
ఫాస్ఫరస్	17.4 ఎం.జి.	0.03 %
థయామిన్	0.045 ఎం.జి.	0.037 ఎం.జి.
నియాసిన్	0.741 ఎం.జి.	0.016 ఎం.జి.
ఆస్కార్బిక్ ఆసిడ్	86.0 ఎం.జి.	0.78 ఎం.జి.
పెక్టిన్	14.9 ఎం.జి.	17.1 ఎం.జి.
బూడిద	0.31 గ్రా.	0.65-0.88 %
తేమ	87.0 గ్రా.	85.0%

8. చర్మ సౌందర్యం

చర్మంలోని కణాల మధ్య కండరాలను ఆరోగ్యంగా ఉంచడానికి కొల్లాజెన్ ఉపయోగపడుతుంది. ఇది ఏర్పరడడానికి ఈ పండ్లలోని విటమిన్ సి దోహదపడుతుంది. ఈ పండ్లలోని శాంగ్రోనిక్ ఆసిడ్, బ్రయోనోటికాసిడ్‌లు అలెర్జీలను నివారిస్తాయి.

చర్మంపై పొక్కులు, సోరియాసిస్, ఇతర చర్మ సంబంధమైన సమస్యలకు చేసే చికిత్సలో ఈ పండ్లలోని సహజ స్టెరాయిడల్ సపోజెనిన్, అల్కలాయిడ్స్ ఉపయోగపడతాయి. ఈ చెట్టు బెరడులో సపోజెనిన్ ఉంటుంది. తామర, తదితర ఫంగల్ ఇన్ఫెక్షన్లను తగ్గించే చికిత్సకు ఇది ఉపకరిస్తుంది. ఈ చెట్టు బెరడు పొడిని చర్మంపై లేపనం చేస్తే ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి.

9. స్త్రీ వ్యాధుల్ని తగ్గిస్తుంది

స్త్రీ జననాంగంలో ఇన్ఫెక్షన్ల చికిత్సకు ఈ పండుతో పాటు చెట్టు బెరడు కూడా ఉపయోగపడుతుంది. ఈ బెరడు వేసి ఉడికించిన కషాయంతో యోనిని రోజూ శుభ్రం చేసుకుంటే ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి.

విలువ ఆధారిత ఉత్పత్తులు...

థాయ్ వంటకాల్లో, సలాడ్లలో సంతొల్ పండ్ల ముక్కలను వాడుతుంటారు. ఈ పండ్లతో తయారు చేసే సోం టామ్ అనే ఉత్పత్తిని రొయ్యల కూరల్లో వాడతారు. ఈ పండ్ల తరుగుతో తయారు చేసే సినటొలన్ అప్పెటైజర్‌గా వాడతారు. అనేక వంటకాల్లో వగరు రుచి కోసం కూడా పత్తి పండు తరుగును వాడుతూ ఉంటారు.

సాగుబడి
మూల కార్తె : డిసెంబర్ 29 వరకు
పూర్వాషాఢ : డిసెంబర్ 30 నుంచి

క్లైమెట్ మర్మాలు

రిసైలియన్స్



రిసైలియన్స్ అనే పదానికి ఖచ్చితమైన అనువాదం స్థితిస్థాపకత. మామూలు మాటల్లో చెప్పాలంటే.. వాతావరణ మార్పుల్ని దీటుగా తట్టుకునే సామర్థ్యం. శీతోష్ణస్థితి స్థితిస్థాపకత అనేది వాతావరణ ప్రతికూల ప్రభావాలను అంచనా వేయడానికి, వాటి నష్టాన్ని తగ్గించడానికి ఉపయోగపడుతుంది. భూతాపోన్నతి వల్ల కలిగే తుపాన్లు, తీవ్ర వడగాలులు వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఒక జనసమూహం లేదా పర్యావరణ వ్యవస్థ ఆ షాక్ నుంచి కోలుకోవడానికి, మార్పు చెందడానికి గల సామర్థ్యం ఎంత అనేది ముఖ్యం.

వాతావరణ మార్పుల వల్ల అనివార్యంగా ఎదురయ్యే కష్టనష్టాలను ఎదుర్కొని పర్యావరణాన్ని, ఆర్థిక వ్యవస్థను రక్షించడానికి ప్రజలు, సమూహాలు, ప్రభుత్వాలు సన్నద్ధం కావాలి. కొత్త నైపుణ్యాలను పొందడానికి, కొత్త రకాల ఆదాయ వనరులను అందిపుచ్చుకోవటానికి ప్రజలకు శిక్షణ ఇవ్వడం.. విపత్తులకు మరింత బలంగా ప్రతిస్పందించే, పునరుద్ధరణ సామర్థ్యాలను పెంపొందించటం.. వాతావరణ సమాచారం, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను మెరుగుపరచడం, దీర్ఘకాలిక ప్రణాళికతో పనిచేయడం ద్వారా వాతావరణ మార్పుల్ని దీటుగా ఎదుర్కొనే సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చు.నిజానికి సమాజం వాతావరణపరంగా స్థిరత్వాన్ని పొందాలంటే శిలాజ ఇంధనాల వినియోగం తగ్గించటం ముఖ్యమైనది. కర్బన ఉద్గారాలను విడుదల చేసే పనులను భారీగా తగ్గించటమే భవిష్యత్తులో వాతావరణ ప్రభావాలను తగ్గించే ఉత్తమ మార్గం. ఎక్కువ కాలుష్యానికి కారణమయ్యే దేశాలు వాతావరణ మార్పుల ప్రభావాలకు ఎక్కువగా గురయ్యే సమాజాలకు, వ్యక్తులకు మద్దతుగా నిలవటంలోనే వాటిని తట్టుకునే శక్తి సామర్థ్యాలు పెంపొందుతాయి.

ఇంటి పంట

ఇంటిపంటల సాగుకు ఏడు సూత్రాలు!

'సాక్షి' ప్రారంభించిన 'ఇంటి పంట' కాలమ్ తెలుగు రాష్ట్రాల్లో వేలాది మందిలో స్ఫూర్తిని రగిలించి 'ఇంటిపంట'ల సాగుకు ఉపక్రమింపజేసింది. నివసించే ఇంటి వద్ద ఉన్న తక్కువ స్థలంలోనే కూరగాయలు, ఆకుకూరలు సేంద్రియ పద్ధతిలో పండించుకుంటూ ఆరోగ్యవంతమైన జీవనం గడుపుతున్నారు. అటువంటి సహజాహార ప్రేమికుల్లో డా. వసంత శ్రీనివాసరావు ఒకరు. కొత్తగా ఇంటి పంటల సాగు ప్రారంభించిన వారికి తరచూ ఎదురయ్యే సందేహాల నివృత్తి కోసం.. కొన్ని పద్ధతులు, సూచనలను స్వీయానుభవంతో ఆయన మీ ముందుంచుతున్నారు.

1 ఘన జీవామృతం



కావలసిన పదార్థాలు...
తాజా ఆవు పేడ 2 కేజీలు, బెల్లం పావు కేజీ, ఏదైనా పప్పుల పిండి పావు కేజీ, ఆవు పంచకం తగినంత (100 మిల్లీలీటర్లు మించకుండా).

తయారీ విధానం: తురిమిన బెల్లం, పిండి, ఆవుపేడ.. ఈ మూడిటిని బల్లపరుపుగా పరచిన ప్లాస్టిక్ షీట్ లేదా గోనె సంచిపై వేసి చేతితో బాగా కలిపి.. ఉండలు తయారు చేసుకోవడానికి వీలుగా తగినంత ఆవు పంచకం కలపాలి. ఈ మిశ్రమాన్ని ఉండల్లా చుట్టి, నీడలోనే ఆరబెట్టాలి. నీడలో పూర్తిగా ఎండిన ఈ ఉండల్ని పొడి చేసుకొని ఒక గోనె సంచిలో నిల్వ ఉంచి సంవత్సరమంతా వాడుకోవచ్చు.

వాడే విధానం...
ఘన జీవామృతాన్ని మొక్క మొదట్లో గుప్పెడు చొప్పున ప్రతి 10 నుంచి 15 రోజులకోసారి వేసుకోవాలి. ఇందులో నిద్రావస్థలో ఉండే మేలుచేసే సూక్ష్మజీవులు నీరు తగిలినప్పుడు మేలుకుంటాయి. వీటి ద్వారా మొక్కలకు మంచి పోషకాలు అందుతాయి.

2 జీవామృతం



కావలసిన పదార్థాలు...
తాజా(పది రోజుల్లోపు) నాటు లేదా దేశీ ఆవు పేడ 2 కేజీలు, నాటు ఆవు పంచకం ఒకటిన్నర లీటర్లు, బెల్లం (సేంద్రియ బెల్లం ఉత్తమం) అర కేజీ, ఏదైనా పప్పుల(కంది/శనగ/మినుము/పెసర..) పిండి అర కేజీ, బాగా పండిన అరటి పండ్లు 2 లేదా 3, చెట్ల కింద మట్టి 2 గుప్పిళ్లు, 30 – 35 లీటర్ల నీరు, 50 లీటర్ల డ్రమ్ము.


తయారీ విధానం...
పేడ, తురుముకున్న బెల్లం, పప్పుల పిండి, మట్టి, అరటి పండ్ల గుజ్జు.. వీటిని చేతితో బాగా కలపాలి. ఆ తరువాత ఈ మిశ్రమంలో ఆవు పంచకం వేసి మళ్లీ కలపాలి. ఇలా తయారు చేసుకున్న మిశ్రమాన్ని 50 లీటర్లు పట్టే డ్రమ్ములో వేసుకొని 30 నుంచి 35 లీటర్ల నీటిని పోయాలి. ఇలా తయారు చేసుకున్న ద్రావణాన్ని నీడలో పెట్టుకోవాలి. ఇలా భద్రపరచుకున్న ద్రావణాన్ని ఉదయం, సాయంత్రం పూటల్లో వేప కర్రతో ఒక నిమిషం పాటు కుడి చేతి వైపు తిప్పుతూ మొదట 3 రోజులు కలుపుకోవాలి. నాలుగో రోజు నుంచి వాడుకోవడానికి జీవామృతం మంచి బ్యాక్టీరియాతో తయారవుతుంది.

వాడే విధానం: ఇలా తయారైన జీవామృతాన్ని 1:10 నిష్పత్తిలో మొక్కలు, చెట్ల పాదుల్లో పోయవచ్చు. వాటిపైన పిచికారీ చేయొచ్చు. ఇలా తయారుచేసుకున్న జీవామృతాన్ని 7–10 రోజుల్లోపు వినియోగించాలి.

3 బూడిద+ పసుపు మిశ్రమం

కావలసిన పదార్థాలు...
దేశీ/నాటు ఆవు పేడతో చేసిన పిడకలు, పసుపు

తయారీ పద్ధతి... పిడకలను కాల్చి బూడిద చేసుకోవాలి.



తర్వాత ఆ బూడిదను మట్టి కుండలో నిల్వ చేసుకోవాలి. ఇలా నిల్వ చేసుకున్న బూడిద తగినంత తీసుకొని.. అంతే పరిమాణంలో పసుపు కలపాలి. ఈ మిశ్రమాన్ని తీగ జాతి మొక్కలపై చల్లితే పూత రాలడం తగ్గుతుంది.

4 కీటకాల నివారిణి (మల్టీ పెస్ట్ కంట్రోలర్)



కావలసిన పదార్థాలు...
పావు కేజీ చొప్పున జిల్లేడు, మారేడు, వేప, కానుగ, ఉమ్మెత్త, సీతాఫలం, గన్నేరు ఆకులతోపాటు దేశీ ఆవు పంచకం
(డ్రమ్ములో వేసిన ఈ ఆకుల మిశ్రమం పూర్తిగా మునగడానికి) తగినంత.

తయారీ విధానం: పైన చెప్పిన అన్ని రకాల ఆకులను మెత్తగా నూరుకొని.. ఏదైనా ఒక ప్లాస్టిక్ పాత్రలో పెట్టి ఆకుల మిశ్రమం పూర్తిగా మునిగే వరకు ఆవు మూత్రం పోయాలి. ఈ మిశ్రమాన్ని 15 రోజులు మురగబెట్టాలి. ఆ తర్వాత వడకట్టుకొని ఒక సీసాలో నిల్వ చేసుకోవాలి. కషాయాన్ని 1:30 నిష్పత్తిలో నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేసుకోవాలి. ఇది ఎన్ని రోజులు నిల్వ ఉన్నదైతే అంత ఎక్కువ ప్రభావశీలంగా పనిచేస్తుంది.

5 ఆచ్ఛాదన (మల్చింగ్)

కుండీల్లోని మట్టిని నిత్యం తేమగా ఉంచడానికి ఆచ్ఛాదన(మల్చింగ్) పద్ధతి బాగా సహకరిస్తుంది. ఈ ఆచ్ఛాదన ఎండిపోయిన ఆకులతోను, ఎండు వరిగడ్డితోను చేసుకోవచ్చు. ఈ ఆచ్ఛాదన 7 నుంచి 10 అంగుళాల మందాన వేయాలి. తద్వారా కుండీల్లో ఉన్న మట్టి తేమను పట్టిఉంచగలుగుతుంది. తద్వారా మట్టిలో ఉన్న వానపాములు మట్టి పైభాగానికి రావడానికి అనువైన వాతావరణం అక్కడ ఏర్పడుతుంది. వాటితోపాటుగా కింది మట్టిలోని పోషకాలను మొక్కల వేళ్లకు అందుబాటులోకి తెస్తుంది. మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి.



6 వేప కషాయం



కావలసిన పదార్థాలు...
తాజా వేపాకులు అర కేజీ, తాజా దేశీ ఆవు పేడ అర కేజీ, దేశీ ఆవు పంచకం అర లీటరు.

తయారీ విధానం: మెత్తగా నూరిన వేపాకు మిశ్రమానికి ఆవు పేడ, ఆవు పంచకం చేతితో కలుపుకోవాలి. ఈ రకంగా కలుపుకున్న వేప కషాయాన్ని 3 రోజులు పులియబెట్టాలి. నాలుగో రోజున ఈ మిశ్రమాన్ని గుడ్డతో వడబోసి దాచుకోవాలి. 1:10 నిష్పత్తిలో వేప కషాయం, నీరు కలిపి ప్రతి పది నుంచి పదిహేను రోజులకొకసారి మొక్కలపై పిచికారీ చేసుకోవాలి.

7 ఎగ్ అమైనో ఆమ్లం (ముట్టగయం)



కావలసిన పదార్థాలు:
నాటు కోడిగుడ్లు 2 లేక 3, మూత ఉన్న గాజు సీసా(లీటరు ద్రవం పట్టే అంతది), నాటు కోడిగుడ్లు మునగడానికి కావలసినంత తాజా నిమ్మరసం, బెల్లం (సేంద్రియ బెల్లం ఉత్తమం) పావు కేజీ.

తయారీ విధానం: గాజు సీసాలో నాటు కోడిగుడ్లను (పగలగొట్టకుండా, పెంకు తీయకుండా) ఉంచాలి. గుడ్లు మునిగేంత వరకు తాజా నిమ్మరసం పోయాలి. మూత గట్టిగా పెట్టి 18 రోజులు వేడి తగలని ప్రదేశంలో ఉంచుకోవాలి. 18వ రోజున దీనిలో తురిమిన బెల్లాన్ని వేసి బాగా కలిపి ఆ రోజు నుంచి మళ్లీ పది రోజుల వరకు వేడి తగలని నీడ ప్రదేశంలో భద్రపరచాలి. మొత్తం 28 రోజుల్లో పిచికారీకి సిద్ధమవుతుందన్నమాట.

పిచికారీ విధానం: సిద్ధమైన ఎగ్ అమైనో ఆమ్లంను ఒక లీటరు నీటికి 2 మిల్లీలీటర్లు కలిపి మొక్కలపై పిచికారీ చేసుకోవాలి. పిచికారీలో మరోపద్ధతి: 900 మిల్లీలీటర్ల నీటికి 100 మిల్లీలీటర్ల జీవామృతం, 2 మిల్లీలీటర్ల ఎగ్ అమైనో ఆసిడ్ కలిపి కూడా మొక్కలపై పిచికారీ చేసుకోవచ్చు. పూత పుష్కలంగా వస్తుంది. పూత రాలకుండా ఉండడానికి ఇది ఉపయోగపడుతుంది.

యాంథెమ్ బయోసైన్సెస్ రూ. 3,395 కోట్ల ఐపీవో

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

సీఆర్‌డీఎం సేవల సంస్థ యాంథెమ్ బయోసైన్సెస్ తాజాగా ఐపీవో ద్వారా రూ. 3,395 కోట్లు సమీకరించనుంది. దీనికి సంబంధించిన ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఉండనుంది. ప్రమోటర్లు గణేష్ సాంబశివం, రవీంద్ర చంద్రప్పతో పాటు ఇతర ఇన్వెస్టర్లు, వాటాదారులు షేర్లను విక్రయించనున్నారు. ఇష్యూ పూర్తిగా ఓఎఫ్ఎస్ విధానంలో ఉంటుంది కాబట్టి సమీకరించిన నిధులన్నీ విక్రయదార్లకు దఖలుపడతాయి. 2006లో ఏర్పాటైన యాంథెమ్ సంస్థ బెంగళూరు కేంద్రంగా కాంట్రాక్ట్ రీసెర్చ్, డెవలప్‌మెంట్, తయారీ సంస్థగా (సీఆర్‌డీఎంవో) కార్యకలాపాలు సాగిస్తోంది. కర్ణాటకలో రెండు ప్లాంట్లు ఉన్నాయి. నిర్మాణంలో ఉన్న మూడో యూనిట్ 2025 ప్రథమార్ధంలో అందుబాటులోకి రానుంది. కంపెనీ గత ఆర్థిక సంవత్సరం రూ. 1,419 కోట్ల ఆదాయంపై రూ. 367 కోట్ల లాభం నమోదు చేసింది.



ఐపీవోకు 8 కంపెనీలు రెడీ

ఏడు ఆఫర్లకు సెబీ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా ఎనిమిది కంపెనీల లిస్టింగ్ ప్రణాళికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జాబితాలో లీలా ప్యాలస్ మాతృ సంస్థ ష్లాస్ బెంగళూరు, ఎలక్ట్రిక్ వాహన సంస్థ ఏథర్ ఎనర్జీ, మోనోబ్లాక్ పంపుల తయారీ కంపెనీ ఓస్వాల్ పంప్స్ తదితరాలున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 10–23 మధ్య కాలంలో ఇవి సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేశాయి. ఈ నెలాఖరుకల్లా అనుమతులు పొందాయి. ఐపీవోకు అనుమతి లభించిన ఇతర కంపెనీలలో ఐవేల్యూ ఇన్ఫోసొల్యూషన్స్, క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్స్, ఫ్యాబ్‌టెక్ టెక్నాలజీస్ సైతం చేరాయి. వివరాలు చూద్దాం..

హోటల్ లీలా



లీలా ప్యాలసెస్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ నిర్వాహక కంపెనీ ష్లాస్ బెంగళూరు ఐపీవో ద్వారా రూ. 5,000 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. దీనిలో భాగంగా రూ. 3,000 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 2,000 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ సంస్థ ప్రాజెక్ట్ బాలెట్ బెంగళూరు హోల్డింగ్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఆఫర్ చేయనుంది. వెరసి దేశీయంగా అతిపెద్ద ఆతిథ్య రంగ ఐపీవోగా నిలవనుంది. బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్‌కు పెట్టుబడులున్న కంపెనీ ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థల రుణ చెల్లింపులతోపాటు.. సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. 10 ప్రాంతాలలోని 12 హోటళ్ల ద్వారా 3,382 గదులను నిర్వహిస్తోంది.





ఏథర్ ఎనర్జీ

ద్విచక్ర ఈవీ తయారీ కంపెనీ ఏథర్ ఎనర్జీ ఐపీవోలో భాగంగా రూ. 3,100 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 2.2 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను మహారాష్ట్రలో ఈవీ ప్లాంటు ఏర్పాటుకు, ఆర్అండ్‌డీకి, రుణ చెల్లింపులకు, మార్కెటింగ్ వ్యయాలకు వెచ్చించనుంది. ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ తదుపరి రెండో ఈవీ కంపెనీగా లిస్ట్‌కానుంది.

ఓస్వాల్ పంప్స్

తక్కువ, అధిక వేగంగల(లోస్పీడ్, హైస్పీడ్) మోనోబ్లాక్ పంపుల తయారీ కంపెనీ ఓస్వాల్ పంప్స్ ఐపీవోలో భాగంగా రూ. 1,000 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.13 కోట్ల షేర్లను ప్రమోటర్ వివేక్ గుప్తా ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను పెట్టుబడి వ్యయాలకు, సొంత అనుబంధ సంస్థ ఓస్వాల్ సోలార్‌లో పెట్టుబడులకు వినియోగించనుంది. ఈ బాటలో హర్యానాలోని కర్నాల్‌లో కొత్త యూనిట్లను నెలకొల్పేందుకు, రుణ చెల్లింపులకు సైతం వెచ్చించనుంది.

Fabtech Technologies Private Limited

ఫ్యాబ్ టెక్నాలజీస్

ఫార్మా, బయోటెక్, హెల్త్‌కేర్ పరిశ్రమలలో టర్న్‌కీ ఇంజనీరింగ్ సొల్యూషన్లు అందించే ఫ్యాబ్ టెక్నాలజీస్ ఐపీవోలో భాగంగా 1.2 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఆయా విభాగాలలో కంపెనీ సమీకృత సొల్యూషన్లు సమకూర్చుతోంది. వీటిలో డిజైనింగ్, ప్రొక్యూర్‌మెంట్, ఇన్‌స్టాలేషన్, టెస్టింగ్ తదితర సేవలున్నాయి.

ఐవేల్యూ ఇన్ఫో

పీఈ సంస్థ క్రియేడర్‌కు పెట్టుబడులున్న ఐవేల్యూ ఇన్ఫోసొల్యూషన్స్ ఐపీవోలో భాగంగా 1.87 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు. క్రియేడర్ 1.11 కోట్ల షేర్లను విక్రయించనుంది. కంపెనీ ప్రధానంగా డిజిటల్ అప్లికేషన్ల మేనేజింగ్, డేటా నిర్వహణలో సమీకృత ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ సొల్యూషన్లు అందిస్తోంది.





జనవరి 6న స్టాండర్డ్ గ్లాస్ ఆఫర్

ఫార్మా రంగానికి ప్రత్యేక పరికరాల తయారీలో ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఐపీవో జనవరి 6న ప్రారంభం కానుంది. జనవరి 8న ఆఫర్ ముగియనుంది. ప్రైస్ బ్యాండ్ రూ. 133–140గా నిర్ణయించారు. కనీసం 107 షేర్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఐపీవోలో భాగంగా రూ.250 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేస్తారు. అలాగే రూ.350 కోట్ల వరకు విలువైన 1.84 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ కింద ప్రమోటర్లు విక్రయిస్తారు. షేర్లను బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్ చేస్తారు. ఈ ఆఫర్‌తో తమ హోల్డింగ్స్‌లో కొంత భాగాన్ని కంపెనీ ప్రమోటర్లు ఎస్2 ఇంజనీరింగ్, కందుల రామకృష్ణ, కందుల కృష్ణ వేణి, నాగేశ్వర్ రావు కందుల విక్రయించనున్నారు.



క్వాలిటీ పవర్

ఎనర్జీ ట్రాన్స్‌మిషన్, పవర్ టెక్నాలజీల కంపెనీ క్వాలిటీ పవర్ ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్స్ ఐపీవోలో భాగంగా రూ. 225 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.2 కోట్ల షేర్లను ప్రమోటర్ చిత్రా పాండ్యన్ ఆఫర్ చేయనున్నారు. ప్రస్తుతం కంపెనీలో పాండ్యన్ కుటుంబానికి 100 శాతం వాటా ఉంది.

అమల్లోకి భారతీయ వాయుయాన్ అధినియం



న్యూఢిల్లీ: దేశీయంగా విమానాల డిజైనింగ్, తయారీని మరింతగా ప్రోత్సహించే దిశగా కొత్త ఏవియేషన్ చట్టం 'భారతీయ వాయుయాన్ అధినియం 2024' జనవరి 1 నుంచి అమల్లోకి వస్తుందని ప్రభుత్వం ఒక నోటిఫికేషన్‌లో తెలిపింది. 90 ఏళ్ల నాటి ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం స్థానంలో దీన్ని పార్లమెంటు ఇటీవలే ఆమోదించింది. ఏవియేషన్ రంగంలో వ్యాపార కార్యకలాపాలను సులభతరం చేసేందుకు కూడా ఇది తోడ్పడనుంది. అలాగే విమానాల డిజైన్, తయారీ, నిర్వహణ, వినియోగం, విక్రయం, ఎగుమతి, దిగుమతి మొదలైన అంశాలన్నింటిని నియంత్రించేందుకు కొత్త చట్టం ఉపయోగపడుతుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్ / 100కు రూ.లలో)

1-1-2025

విశాఖ	545–00
చిత్తూరు	563–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540–00
విజయవాడ	545–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	520–00
వరంగల్	522–00
రిటైల్ ధర	7.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	293	2.84
ONGC	239	2.73
KOTAKBANK	1,785.00	2.54
TRENT	7,108.45	2.22
COALINDIA	384.4	1.72

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,530.00	-2.41
TECHM	1,705.00	-2.06
TCS	4,106.00	-1.27
INFY	1,885.65	-1.07
SBILIFE	1,391.00	-0.92

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,263
ఎన్ఎస్ఈ	83.253
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,36,423
ఎఫ్ఐఐ	- 4,645
డీఐఐ	+ 4,547

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.82 (రాత్రి 11.30కు)	$ 70.99 (క్రితం ముగింపు)
బ్రెంట్	74.70 (రాత్రి 11.30కు)	$ 73.99 (క్రితం ముగింపు)

చిన్న పొదుపు పథకాల్లో

వడ్డీరేట్లు యథాతథం

- జనవరి–మార్చి త్రైమాసికానికి లేని మార్పు

న్యూఢిల్లీ: పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)సహా వివిధ చిన్న పొదుపు పథకాలపై 2025 జనవరి 1 నుండి ప్రారంభమయ్యే నాలుగవ త్రైమాసికానికి (జనవరి–మార్చి) వడ్డీ రేట్లను ప్రభుత్వం యథాపూర్వం కొనసాగించింది.వడ్డీ రేట్లు గత నాలుగు త్రైమాసికాలుగా మార్పులు లేకుండా కొనసాగుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో నాల్గవ త్రైమాసికానికి కొన్ని పథకాలలో ప్రభుత్వం చివరిసారి మార్పులు చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికం (అక్టోబర్ 2024 నుండి డిసెంబర్ 2024 వరకు) కోసం నోటిఫై చేసిన రేట్లను మార్పు లేకుండా కొనసాగిస్తున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజా నోటిఫికేషన్ పేర్కొంది.పోస్టాఫీసులు, బ్యాంకులు నిర్వహించే స్మాల్ సేవింగ్స్ పథకాలనుపై వడ్డీ రేట్లను ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ప్రతి త్రైమాసికం ఆర్థికశాఖ నోటిఫై చేసే సంగతి తెలిసిందే. తాజా నోటిఫికేషన్ ప్రకారం వడ్డీరేట్లు...


పథకం	రేటు(%)
సుకన్య సమృద్ధి	8.2
మూడేళ్ల టర్మ్ డిపాజిట్	7.1
పీపీఎఫ్	7.1
పోస్టాఫీ సేవింగ్స్ డిపాజిట్	4.0
కిసాన్ వికాస్ పత్ర	7.5
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్	7.7
మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్	7.4



52.5 శాతానికి ద్రవ్యలోటు

నవంబర్ చివరకు రూ.8.47 లక్షల కోట్లకు అప్

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నవంబర్ ముగిసేనాటికి లక్ష్యంలో 52.5 శాతానికి చేరింది. ఏప్రిల్‌తో ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024–25) ద్రవ్యలోటు రూ.16,13,312 కోట్లుగా ఉండాలని బడ్జెట్ నిర్దేశించింది. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) అంచనాల్లో ఇది 4.9 శాతం. అయితే నవంబర్ ముగిసే సరికి లోటు 8.47 లక్షల కోట్లకు చేరినట్లు కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) తాజాగా పేర్కొంది.



కొలువులకు కొత్త టెక్నాలజీల దన్ను

- 2025లో వృద్ధి బాటలోనే దేశీ ఐటీ
- 20 శాతం పెరగనున్న ఉద్యోగాలు
- ఫస్ట్‌మెరీడియన్ బిజినెస్ సర్వీసెస్ సీఈవో నెహ్రా వెల్లడి

ముంబై: కొత్త సాంకేతికతల దన్నుతో దేశీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం నూతన సంవత్సరంలోనూ జోరుగా వృద్ధి బాటలో ముందుకు సాగనుంది. 2025లో కొత్త ఉద్యోగాల కల్పన 20 శాతం పెరగనుంది. మానవ వనరుల సేవల సంస్థ ఫస్ట్‌మెరీడియన్ బిజినెస్ సర్వీసెస్ సీఈవో (ఐటీ స్టాఫింగ్) సునీల్ నెహ్రా ఈ విషయాలు తెలిపారు. డిజిటల్ పరివర్తన వేగవంతం కావడం, కొత్త సాంకేతికతల్లో నైపుణ్యాలున్న వారికి డిమాండ్ పెరగడం వంటి అంశాల కారణంగా 2024లో దేశీ ఐటీ, టెక్ రంగాల్లో కొత్త ఉద్యోగావకాశాలు 17 శాతం పెరిగినట్లు చెప్పారు. కొత్త సంవత్సరంలోనూ పరిశ్రమ వృద్ధి మరింత పుంజుకోగలదని పేర్కొన్నారు. అప్లికేషన్ డెవలపర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డెవాప్స్ ఇంజినీర్లు, ఏఐ, ఎంఎల్, సైబర్ సెక్యూరిటీ వంటి విభాగాల్లో నిపుణులకు ఉద్యోగావకాశాలు బాగుంటాయని నెహ్రా చెప్పారు. 2024లో ప్రధాన ట్రెండ్‌గా నిల్చిన కృత్రిమ మేథ (ఏఐ) 2025లో కూడా మరింత వేగవంతమవుతుందన్నారు. డేటా అనలిస్టులు, డేటా ఇంజినీర్లు, డేటా సైంటిస్టులు తదితర నిపుణులకు డిమాండ్ ఉంటుందని పేర్కొన్నారు.

జెన్–ఏఐలో పది లక్షల అవకాశాలు..

2028 నాటికి జెనరేటివ్ ఏఐ (జెన్–ఏఐ) పరిశ్రమలో 10 లక్షలకు పైగా కొత్త కొలువులు వస్తాయని, స్థూల దేశీయోత్పత్తి వృద్ధికి ఇది గణనీయంగా తోడ్పడగలదని నెహ్రా తెలిపారు. జెనరేటివ్ ఏఐ ఇంజినీర్, అల్గోరిథం ఇంజినీర్, ఏఐ సెక్యూరిటీ స్పెషలిస్ట్ వంటి ఉద్యోగాలకు వేతనాలు గణనీయంగా పెరగవచ్చని పేర్కొన్నారు. మిడ్–లెవెల్ ఉద్యోగులకు వేతన వృద్ధి 25–30 శాతం శ్రేణిలో ఉంటుందని వివరించారు. వ్యాపారాలు వృద్ధి చెందుతూ, కొత్త ఆవిష్కరణలు చేసే కొద్దీ నూతన ప్రాజెక్టుల కోసం హైరింగ్ చేసుకోవడం, డిజిటల్ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చుకోవడం, సాంకేతిక పురోగతులను అందిపుచ్చుకునేందుకు పోటీపడటం మొదలైన ధోరణులు పెరుగుతాయని తెలిపారు. 2018–19 నుంచి 2023–24 మధ్య కాలంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్‌లో (జీసీసీ) 6,00,000 ఉద్యోగాలు వచ్చినట్లు నెహ్రా చెప్పారు. 2030 నాటికి ఈ నిపుణుల సంఖ్య 25 లక్షల నుంచి 28 లక్షల వరకు పెరుగుతుందన్నారు.



మరిన్ని విశేషాలు..

- ✓ 2025లో బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, ఇన్సూరెన్స్), టెలికం వంటి టెక్‌యేతర రంగాల్లో కూడా ఐటీ/టెక్నాలజీ నిపుణుల నియామకాలు పెరుగుతాయి. మధ్య స్థాయి నుంచి భారీ స్థాయి సంస్థల వరకు చాలా మటుకు కంపెనీలు తమ ఉద్యోగులకు కొత్త నైపుణ్యాల్లో శిక్షణనిచ్చేందుకు కేటాయించే బడ్జెట్లు సగటున 15–20 శాతం వరకు పెంచే అవకాశం ఉంది. అంతేగాకుండా ఉద్యోగులు సైతం కొత్త తరం టెక్ కొలువులకు కావాల్సిన నైపుణ్యాలను సాధించేందుకు తమంతట తాముగా కూడా చొరవ తీసుకుంటారు.
- ✓ దేశీ ఐటీలో తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య మూడు రెట్లు పెరిగి 2030 నాటికి 2.4 కోట్ల స్థాయికి చేరుతుంది. టెక్నాలజీ రంగంలో ఎప్పటికప్పుడు మారిపోతున్న అవసరాలను పరిష్కరించుకునేందుకు, కావాల్సినప్పుడు అందుబాటులో ఉండే వర్కర్లపై ఆధారపడే ధోరణి పెరుగుతుండటం ఇందుకు కారణం.
- ✓ భారతీయ ఐటీ రంగం చాలా మటుకు స్థిరపడినప్పటికీ, ఇంకా కొన్ని సవాళ్లు ఉన్నాయి. ఏఐ, సైబర్‌సెక్యూరిటీ వంటి వర్ధమాన రంగాల్లో నిపుణుల కొరత ఉంటోంది. అలాగే, అంతర్జాతీయంగా ఆర్థిక అస్థిరత ప్రభావం కూడా మన ఐటీ రంగంపై పడతోంది.
- ✓ డిజిటల్ ఇండియా, స్కిల్ ఇండియాలాంటి కార్యక్రమాలు ప్రయోజనకరంగానే ఉంటున్నాయి. కానీ, వ్యయాలపరంగా ఒత్తిళ్లు పెరుగుతున్న తరుణంలో ఉద్యోగులకి కొత్త నైపుణ్యాల్లో శిక్షణ కల్పించేందుకు, కస్టమర్లకు మరింత విలువైన సేవలు అందించేందుకు వినూత్న వ్యూహాలు అవసరమవుతాయి. సాంకేతిక పరివర్తనకు సంబంధించి మరింతగా ముందుకెళ్లేందుకు ఇవి కీలకంగా ఉంటాయి.

మెరుగుపడిన 'ఫార్మా' ప్రమాణాలు

- తగ్గిన యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీలు
- జోష్ మీదున్న దేశీయ కంపెనీలు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ నియంత్రణ సంస్థ యూఎస్ ఫుడ్, డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ఎఫ్‌డీఏ) అమలు చేస్తున్న కఠిన నిబంధనలను పాటించడంలో 2024లో భారతీయ ఫార్మా కంపెనీలు పెద్ద ఎత్తున పురోగతి సాధించాయి. బయోలాజిక్స్, డ్రగ్స్, వైద్య పరికరాలు.. ఇలా విభాగం ఏదైనా యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీల ప్రతికూల వర్గీకరణ (క్లాసిఫికేషన్) సంఖ్య ప్రస్తుత సంవత్సరంలో తగ్గడం విశేషం. 2023లో యూఎస్ఎఫ్‌డీఏ దేశవ్యాప్తంగా 225 తనిఖీలను నిర్వహించింది. ఇందులో 18 అధికారిక చర్య (అఫీషియల్ యాక్షన్), 117 స్వచ్ఛంద చర్య (వాలంటరీ యాక్షన్) కేసులకు దారితీసింది. నియంత్రణ సంస్థ 2024 నాటికి ప్రమాణాలను కఠినతరం చేసినప్పటికీ తనిఖీల సంఖ్య 206కి పడిపోయింది. అయితే అఫీషియల్ యాక్షన్ కేసులు 14, వాలంటరీ యాక్షన్ కేసులు 115కి తగ్గాయి. భారతీయ ఔషధ రంగం సంస్థలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అధిక నాణ్యత, తయారీ పద్ధతులను పాటిస్తున్నాయనడానికి తగ్గిన ఈ కేసులే నిదర్శనం అని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ చెబుతోంది. మహమ్మారికి ముందు 2018తో పోలిస్తే 2019లో అఫీషియల్ యాక్షన్ కేసుల్లో 100 శాతం పెరుగుదల నమోదు కావడం గమనార్హం.

తనిఖీల ఆధారంగా..

తయారీ కేంద్రాలను యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీ చేసినప్పుడు.. తనిఖీల ఆధారంగా ఫలితాలను వర్గీకరిస్తుంది. అభ్యంతకర పరిస్థితులు, కార్యకలాపాల్లో ఏదైనా లోపం ఉన్నట్లయితే అట్టి ఫెసిలిటీ వాలంటరీ యాక్షన్ వర్గీకరణను అందుకుంటుంది. తక్షణ నియంత్రణ చర్యలు తీసుకోకుండా లోపాలను స్వచ్ఛందంగా సరిదిద్దడానికి అవకాశం ఇస్తారు. ఎఫ్‌డీఏ నియంత్రణ సమావేశం ద్వారా ఈ ప్రక్రియను సులభతరం చేయవచ్చు. భద్రత, సంక్షేమం లేదా డేటా విశ్వసనీయతను గణనీయంగా ప్రభావితం చేసే తీవ్ర నియంత్రణ ఉల్లంఘనలకు పాల్పడినట్టు గుర్తిస్తే అఫీషియల్ యాక్షన్ కేసు నమోదు చేస్తారు. ఇటువంటి సందర్భాలలో అడ్మినిస్ట్రేటివ్, రెగ్యులేటరీ చర్యలకు ఎఫ్‌డీఏ సిఫార్సు చేస్తుంది. ఇందులో వార్నింగ్ లెటర్స్, దిగుమతి హెచ్చరికలు, ఆదేశాలు వంటి చట్టపర చర్యలు కూడా ఉండవచ్చు. తనిఖీ సమయంలో ఎటువంటి ఉల్లంఘనలు కనుగొనకపోతే నో యాక్షన్ ఇండికేట్‌గా వర్గీకరిస్తారు. తనిఖీ పూర్తయిన 45 నుండి 90 రోజులలోపు కంపెనీకి తుది తనిఖీ వర్గీకరణను యూఎస్ఎఫ్‌డీఏ తెలియజేస్తుంది.



క్వాలిటీయే తొలి ప్రాధాన్యత..

నాణ్యత ప్రమాణాలు, మెరుగైన కార్యాచరణ, నిబంధనలను చురుకుగా అమలు చేయడం వల్లే ఇది సాధ్యపడిందని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ (ఐపీఏ) పేర్కొంది. 'నాణ్యతకు ప్రాధాన్యత నిచ్చే సంస్కృతిని పెంపొందించడంలో భారతీయ ఫార్మా కంపెనీలు గణనీయ కార్యాచరణను చేపట్టాయి. సీనియర్ నాయకత్వ బృందాలు ఆటోమేషన్, బలమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్, కొనసాగుతున్న ఉద్యోగుల శిక్షణ ద్వారా నిరంతరంగా ప్రమాణాలను మెరుగుపరచడానికి కట్టుబడి ఉన్నాయి. కంపెనీలు నాణ్యతకు తొలి ప్రాధాన్యత ఇచ్చాయి. కచ్చితత్వం, సామర్థ్యాన్ని పెంపొందించడానికి తయారీ కేంద్రాల్లో అధునాతన ఆటోమేషన్ సాంకేతికతలను అమలు చేశాయి' అని ఐపీఏ సెక్రటరీ జనరల్ సుదర్శన్ జైన్ తెలిపారు. నాణ్యతా ప్రమాణాలను మరింత మెరుగ్గా చేయడానికి కట్టుబడి ఉన్నామని ఐపీఏ వెల్లడించింది. 'ఈ పురోగతి భారత్‌లో నాణ్యతా ప్రమాణాలను ముందుకు తీసుకెళ్లాలనే మా నిబద్ధతను నొక్కి చెబుతోంది. నాణ్యమైన సంస్కృతిని బలోపేతం చేయడానికి, గ్లోబల్ బెంచ్‌మార్క్‌లతో సమం చేయడానికి నిరంతర ప్రయత్నంలో భాగంగా మేము దీనిని చూస్తాము' అని వివరించింది.

ప్రస్తుత సంవత్సరంలో దేశవ్యాప్తంగా యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీలు, కేసులు తగ్గిన నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన లిస్టెడ్ కంపెనీల 2024–25 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, 2024 జనవరి 1తో పోలిస్తే బీఎస్ఈలో మంగళవారం (డిసెంబర్ 31) నాటికి షేరు వృద్ధి, ధరను ఒకసారి పరిశీలిస్తే..

డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్



రూ.1,342 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత క్యూ2లో నమోదైన రూ.1,480 కోట్ల నికరలాభంతో పోలిస్తే ఇది 9 శాతం తక్కువ. గ్లోబల్ జనరిక్స్ జోరుతో టర్నోవర్ సుమారు 17 శాతం వృద్ధి చెంది రూ.8,016 కోట్లకు చేరింది. షేరు ధర 19.28 శాతం దూసుకెళ్లి రూ.1,388.25 వద్ద స్థిరపడింది.

అరబిందో ఫార్మా



నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 8.6 శాతం అధికమై రూ.817 కోట్లు నమోదు చేసింది. ఎబిటా 11.6 శాతం దూసుకెళ్లి రూ.1,566 కోట్లుగా ఉంది. టర్నోవర్ 8 శాతం పెరిగి రూ.7,796 కోట్లకు చేరింది. షేరు ధర 23.61 శాతం ఎగసి రూ.1,335.20 వద్ద ముగిసింది.

GLAND PHARMA LIMITED

గ్లాండ్ ఫార్మా

నికరలాభం 16 శాతం క్షీణించి రూ.163 కోట్లకు వచ్చి చేరింది. ఆదాయం రూ.1,373 కోట్ల నుంచి రూ.1,405 కోట్లకు పెరిగింది. షేరు ధర 6.21 శాతం క్షీణించి రూ.1,788.60లు తాకింది.

నాట్కో ఫార్మా

నికరలాభం అంతక్రితం త్రైమాసికంతో పోలిస్తే 83 శాతం ఎగసి రూ.676 కోట్లు సాధించింది. టర్నోవర్ రూ.1,031 కోట్ల నుంచి రూ.1,371 కోట్లకు చేరింది. షేరు ధర 69.73 శాతం వృద్ధి చెంది రూ.1,387 వద్ద స్థిరపడింది.

గ్రాన్యూల్స్ ఇండియా

నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 4.79 శాతం తగ్గి రూ.97 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్ 19.49 శాతం క్షీణించి రూ.956 కోట్లకు వచ్చి చేరింది. షేరు ధర 43.76 శాతం అధికమై రూ.591.80 వద్ద ముగిసింది.

దివీస్ ల్యాబొరేటరీస్

నికరలాభం రూ.510 కోట్లు సాధించింది. 2023–24లో ఇదే త్రైమాసిక లాభం రూ.348 కోట్లతో పోలిస్తే ఇది 46 శాతం అధికం. మొత్తం ఆదాయం రూ.1,909 కోట్ల నుంచి 22.5 శాతం పెరిగి రూ.2,338 కోట్లకు చేరింది. పన్నుకు ముందు లాభం 54 శాతం వృద్ధి చెంది రూ.722 కోట్లను తాకింది. షేరు ధర 55.89 శాతం పెరిగి రూ.6,099.75లకు చేరింది.



‘సై’ అంటే ‘సై’...

క్రీడాభిమానులకు కనువిందు చేయనున్న 2025 ● మెగా ఈవెంట్స్‌తో కొత్త ఏడాదికి స్వాగతం

మైదానంలో బరిలోకి దిగే ఆటగాళ్లకి ప్రతి రోజూ కొత్త అవకాశమే... అప్పటి వరకు అద్భుతాలు చేసినా, వైఫల్యాలతో అట్టడుగున నిలిచినా మళ్లీ పైకి లేచేందుకు సిద్ధం కావడమే... ఇక కొత్త సంవత్సరం వస్తుందంటే కొత్త టోర్నీలు, సరికొత్త తరహా ఆటతో అత్యుత్తమ ప్రదర్శనకు ‘సై’ అనడమే... ముగిసిన సంవత్సరంలో త్రుటిలో విజయాలు చేజార్చుకున్న క్షణాలు, అనూహ్యంగా ఎదురైన అపజయాలను మరచిపోయేలా అక్కడే, అదే వేదికపై తప్పులు దిద్దుకొని సత్తా చాటేందుకు కొత్త ఏడాది ఇస్తున్న మరో చాన్స్ అనుకొని చెలరేగిపోవడమే... మరోవైపు అభిమానులకు ఏడాదంతా ఆటలతో పండగనే... క్రీడాంశం ఏదైనా, టోర్నీ పేరు ఏదైనా మైదానంలోనైనా, ఇంట్లోనైనా, ఎక్కడి నుంచైనా తాము ఆశించిన వినోదం కోసం వారు ఎప్పుడూ ఎదురు చూస్తుంటారు. నాలుగేళ్లకు ఒకసారి వచ్చే పోటీలైనా... ప్రతీ ఏటా పలకరించే వార్షిక టోర్నీలైనా... ఫ్యాన్స్ మళ్లీ మళ్లీ ‘జై’ కొట్టేందుకు సిద్ధమైపోతారు... అందుకే క్యాలెండర్‌లో సంవత్సరం మారగానే కొత్త ఏడాదిలో వచ్చే ఈవెంట్‌లపై అందరికీ ఎప్పటిలాగే ఆసక్తి ఉంటుంది.

2025 అలాంటి కొన్ని ఉత్సాహవంతమైన క్రీడా పోటీలతో సిద్ధమైంది. క్రికెట్ అభిమానుల కోసం వన్డే వరల్డ్‌కప్‌కు సమఉజ్జీలాంటి చాంపియన్స్ ట్రోఫీ ఏడాది ఆరంభంలోనే కనువిందు చేయనుంది. ఈ టోర్నీకి ముందు మలేసియా వేదికగా అండర్-19 మహిళల వరల్డ్‌కప్‌లో భారత జట్టు టైటిల్ నిలబెట్టుకునేందుకు పోరాడనుంది. ఆ తర్వాత మహిళల క్రికెట్‌లో వన్డే వరల్డ్‌కప్‌నకు మన దేశమే ఆతిథ్యం ఇవ్వనుంది. ఆటగాళ్లు అటు ఇటు మారడం మినహా ఎప్పటిలాగే ఐపీఎల్ వేసవిలో అలరించనుంది. టెన్నిస్ గ్రాండ్‌స్లామ్‌లు, బ్యాడ్మింటన్‌లో బీడబ్ల్యూఎఫ్ టూర్ టోర్నీలు ఏడాదంతా కొత్త చాంపియన్ల కోసం తివాచీ పరచడం ఖాయం కాగా... భారత్ వేదికగానే జూనియర్ హాకీ వరల్డ్ కప్ యువ ఆటగాళ్లను పరిచయం చేయనుంది. షూటింగ్, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్‌వంటి క్రీడాంశాల్లో విశ్వ వేదికలపై మన ఆటగాళ్లు మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గత ఏడాదిలో అసాధారణ ప్రదర్శనలతో అలరించిన మన చదరంగం కొత్త సంవత్సరంలో కూడా మరిన్ని ఎత్తులు పై ఎత్తులతో కొత్త ఎత్తులకు చేరాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ సంవత్సరంలో జరిగే ప్రధాన ఈవెంట్లతో కూడిన క్రీడా క్యాలెండర్ మీ కోసం...

–సాక్షి క్రీడా విభాగం



అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్ ట్రోఫీతో భారత క్రికెటర్ల సంబరం (ఫైల్)



క్రికెట్

జనవరి 3-7: ఆస్ట్రేలియాతో ఐదో టెస్టు (సిడ్నీ)

భారత్‌లో ఇంగ్లండ్ పర్యటన

జనవరి 22: తొలి టి20 (చెన్నై)
జనవరి 25: రెండో టి20 (కోల్‌కతా)
జనవరి 28: మూడో టి20 (రాజ్‌కోట్)
జనవరి 31: నాలుగో టి20 (పుణే)
ఫిబ్రవరి 2: ఐదో టి20 (ముంబై)
ఫిబ్రవరి 6: తొలి వన్డే (నాగ్‌పూర్)
ఫిబ్రవరి 9: రెండో వన్డే (కటక్)
ఫిబ్రవరి 12: మూడో వన్డే (అహ్మదాబాద్)

చాంపియన్స్ ట్రోఫీ (దుబాయ్)

ఫిబ్రవరి 20: భారత్ x బంగ్లాదేశ్
ఫిబ్రవరి 23: భారత్ x పాకిస్తాన్
మార్చి 2: భారత్ x న్యూజిలాండ్
మార్చి 4: సెమీఫైనల్ (అర్హత సాధిస్తే)
మార్చి 9: ఫైనల్ (అర్హత సాధిస్తే)

ఇంగ్లండ్‌లో భారత్ పర్యటన

జూన్ 20-24: తొలి టెస్టు (హెడింగ్లే)
జూలై 2-6: రెండో టెస్టు (ఎడ్జ్‌బాస్టన్)
జూలై 10-14: మూడో టెస్టు (లార్డ్స్)
జూలై 23-27: నాలుగో టెస్టు (మాంచెస్టర్)
జూలై 31-ఆగస్టు 4: (ఓవల్)

బంగ్లాదేశ్‌లో భారత్ పర్యటన

ఆగస్టు: 3 వన్డేలు, 3 టి20లు

భారత్‌లో వెస్టిండీస్ పర్యటన

అక్టోబర్: 2 టెస్టులు

ఆస్ట్రేలియాలో భారత్ పర్యటన

నవంబర్: 3 వన్డేలు, 5 టి20లు

భారత్‌లో దక్షిణాఫ్రికా పర్యటన

నవంబర్-డిసెంబర్: 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టి20లు

ఇంగ్లండ్‌లో భారత మహిళల జట్టు పర్యటన

జూన్-జూలైలో
ఐదు టి20లు, మూడు వన్డేలు

మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్

జనవరి 18 నుంచి ఫిబ్రవరి 2 వరకు
వేదిక: మలేసియా

పురుషుల చాంపియన్స్ ట్రోఫీ వన్డే టోర్నీ

ఫిబ్రవరి 19 నుంచి మార్చి 9 వరకు
వేదిక: పాకిస్తాన్, దుబాయ్

ఐపీఎల్ టోర్నీ

మార్చి 14 నుంచి మే 25 వరకు

మహిళల వన్డే వరల్డ్ కప్

ఆగస్టు-సెప్టెంబర్
వేదిక: భారత్



బ్యాడ్మింటన్


జనవరి 7-12: మలేసియా ఓపెన్-1000 టోర్నీ (కౌలాలంపూర్)
జనవరి 14-19: ఇండియా ఓపెన్-750 టోర్నీ (న్యూఢిల్లీ)
ఫిబ్రవరి 11-16: ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్ (కింగ్‌డావో, చైనా)
మార్చి 11-16: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్‌షిప్ (బర్మింగ్‌హమ్)
ఏప్రిల్ 8-13: ఆసియా వ్యక్తిగత చాంపియన్‌షిప్ (నింగ్బో, చైనా)
ఏప్రిల్ 27-మే 4: సుదిర్మన్ కప్ (జియామెన్, చైనా)
మే 27-జూన్ 1: సింగపూర్ ఓపెన్-750 టోర్నీ (సింగపూర్ సిటీ)
జూన్ 3-8: ఇండోనేసియా ఓపెన్-1000 టోర్నీ (జకార్తా)
జూలై 15-20: జపాన్ ఓపెన్-750 టోర్నీ (టోక్యో)
జూలై 22-27: చైనా ఓపెన్-1000 టోర్నీ (చాంగ్జౌ)
ఆగస్టు 25-31: ప్రపంచ చాంపియన్‌షిప్ (పారిస్)
సెప్టెంబర్ 16-21: చైనా మాస్టర్స్-750 టోర్నీ (షెన్‌జెన్)
అక్టోబర్ 6-19: ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్, వ్యక్తిగత చాంపియన్‌షిప్ (గువాహటి, భారత్)
అక్టోబర్ 14-19: డెన్మార్క్ ఓపెన్-750 టోర్నీ (ఒడెన్స్)
అక్టోబర్ 21-26: ఫ్రెంచ్ ఓపెన్-750 టోర్నీ (పారిస్)
డిసెంబర్ 10-14: వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ (హాంగ్జౌ, చైనా)

ఆర్చరీ



ఫిబ్రవరి 16-23: ఆసియా కప్ వరల్డ్ ర్యాంకింగ్ టోర్నీ (బ్యాంకాక్)
ఏప్రిల్ 8-13: వరల్డ్ కప్ స్టేజ్-1 టోర్నీ (ఫ్లోరిడా, అమెరికా)
మే 6-11: వరల్డ్ కప్ స్టేజ్-2 టోర్నీ (షాంఘై, చైనా)
జూన్ 3-8: వరల్డ్ కప్ స్టేజ్-3 టోర్నీ (అంటాల్యా, టర్కీ)
జూలై 8-13: వరల్డ్ కప్ స్టేజ్-4 టోర్నీ (మాడ్రిడ్, స్పెయిన్)
ఆగస్టు 17-24: వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్ (విన్నీపెగ్, కెనడా)
సెప్టెంబర్ 5-12: వరల్డ్ చాంపియన్‌షిప్ (గ్వాంగ్‌జు, దక్షిణ కొరియా)

టెన్నిస్



జనవరి 12-26: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ (మెల్‌బోర్న్)
మే 25-జూన్ 8: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ (పారిస్)
జూన్ 30-జూలై 13: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ (లండన్)
ఆగస్టు 25-సెప్టెంబర్ 7: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ (న్యూయార్క్).
మార్చి 5-16: ఇండియన్ వెల్స్ ఓపెన్ మాస్టర్స్-1000 టోర్నీ (కాలిఫోర్నియా)
మార్చి 19-30: మయామి ఓపెన్ మాస్టర్స్-1000 టోర్నీ (ఫ్లోరిడా)
ఏప్రిల్ 5-13: మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్-1000 టోర్నీ (మొనాకో)
ఏప్రిల్ 22-మే 4: మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్-1000 టోర్నీ (స్పెయిన్)
మే 6-18: రోమ్ ఓపెన్ మాస్టర్స్-1000 టోర్నీ (ఇటలీ)
జూలై: టొరంటో ఓపెన్ మాస్టర్స్-1000 టోర్నీ (కెనడా)
ఆగస్టు: సిన్సినాటి ఓపెన్ మాస్టర్స్-1000 టోర్నీ (ఒహాయో)
అక్టోబర్ 1-13: షాంఘై ఓపెన్ మాస్టర్స్-1000 టోర్నీ (చైనా)
అక్టోబర్ 25-నవంబర్ 2: పారిస్ ఓపెన్ మాస్టర్స్-1000 టోర్నీ (ఫ్రాన్స్)
నవంబర్ 9-16: ఏటీపీ ఫైనల్స్ టోర్నీ (ఇటలీ)
నవంబర్ 18-23: డేవిస్‌కప్ ఫైనల్స్ టోర్నీ (ఇటలీ)

రెజ్లింగ్



మార్చి 25-30: ఆసియా చాంపియన్‌షిప్ (అమ్మాన్, జోర్డాన్)
జూన్ 14-23: ఆసియా అండర్-17, అండర్-23 చాంపియన్‌షిప్ (వియత్నాం)
జూలై 5-13: ఆసియా అండర్-15, అండర్-20 చాంపియన్‌షిప్ (కిర్గిస్తాన్)
జూలై 28-ఆగస్టు 3: వరల్డ్ అండర్-17 చాంపియన్‌షిప్ (ఏథెన్స్, గ్రీస్)
ఆగస్టు 18-24: వరల్డ్ అండర్-20 చాంపియన్‌షిప్ (సోఫియా, బల్గేరియా)
సెప్టెంబర్ 13-21: ప్రపంచ చాంపియన్‌షిప్ (జాగ్రెబ్, క్రొయేషియా)
అక్టోబర్ 20-26: ప్రపంచ అండర్-23 చాంపియన్‌షిప్ (నోవిసాద్, సెర్బియా)

టేబుల్ టెన్నిస్



జనవరి 30-ఫిబ్రవరి 9: సింగపూర్ స్మాష్ టోర్నీ
మార్చి 11-16: చాంపియన్స్ టోర్నీ (చైనా)
ఏప్రిల్ 1-6: చాంపియన్స్ టోర్నీ (కొరియా)
ఏప్రిల్ 14-20: పురుషుల, మహిళల వరల్డ్ కప్ (మకావు)
జూన్ 26-జూలై 2: ఆసియా యూత్ చాంపియన్‌షిప్ (తాష్కెంట్)
జూలై 3-13: యూఎస్‌ఏ స్మాష్ టోర్నీ
ఆగస్టు 7-11: చాంపియన్స్ టోర్నీ (జపాన్)
ఆగస్టు 14-24: గ్రాండ్‌స్మాష్ టోర్నీ
సెప్టెంబర్ 9-14: చాంపియన్స్ టోర్నీ (మకావు)
సెప్టెంబర్ 25-అక్టోబర్ 5: చైనా స్మాష్ టోర్నీ
అక్టోబర్ 11-15: ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ (భారత్)
అక్టోబర్ 28-నవంబర్ 2: చాంపియన్స్ టోర్నీ (ఫ్రాన్స్)
నవంబర్ 23-30: వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్ (రొమేనియా)

ఫార్ములావన్



మార్చి 16: ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి (మెల్‌బోర్న్)
మార్చి 23: చైనా గ్రాండ్‌ప్రి (షాంఘై)
ఏప్రిల్ 6: జపాన్ గ్రాండ్‌ప్రి (సుజుకా)
ఏప్రిల్ 13: బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి (సాఖిర్)
ఏప్రిల్ 20: సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి (జిద్దా)
మే 4: అమెరికా గ్రాండ్‌ప్రి (మయామి)
మే 18: ఇటలీ గ్రాండ్‌ప్రి (ఇమోలా)
మే 25: మొనాకో గ్రాండ్‌ప్రి (మోంటెకార్లో)
జూన్ 1: స్పెయిన్ గ్రాండ్‌ప్రి (బార్సిలోనా)
జూన్ 15: కెనడా గ్రాండ్‌ప్రి (మాంట్రియల్)
జూన్ 29: ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి (స్పీల్‌బర్గ్)
జూలై 6: బ్రిటన్ గ్రాండ్‌ప్రి (సిల్వర్‌స్టోన్)
జూలై 27: బెల్జియం గ్రాండ్‌ప్రి (స్పా ఫ్రాంకోర్‌చాంప్స్)
ఆగస్టు 3: హంగేరి గ్రాండ్‌ప్రి (బుడాపెస్ట్)
ఆగస్టు 31: డచ్ గ్రాండ్‌ప్రి (జాండ్‌వూర్ట్)
సెప్టెంబర్ 7: ఇటలీ గ్రాండ్‌ప్రి (మోంజా)
సెప్టెంబర్ 21: అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి (బాకు)
అక్టోబర్ 5: సింగపూర్ గ్రాండ్‌ప్రి (సింగపూర్ సిటీ)
అక్టోబర్ 19: యూఎస్‌ఏ గ్రాండ్‌ప్రి (ఆస్టిన్)
అక్టోబర్ 26: మెక్సికో గ్రాండ్‌ప్రి (మెక్సికో సిటీ)
నవంబర్ 9: బ్రెజిల్ గ్రాండ్‌ప్రి (సావోపాలో)
నవంబర్ 22: లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి (అమెరికా)
నవంబర్ 30: ఖతర్ గ్రాండ్‌ప్రి (దోహా)
డిసెంబర్ 7: అబుదాబి గ్రాండ్‌ప్రి (యూఏఈ)

షూటింగ్



ఫిబ్రవరి 9-22: ఆసియా రైఫిల్, పిస్టల్ కప్ (బ్యాంకాక్)
ఏప్రిల్ 1-11: వరల్డ్ కప్-1 రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ టోర్నీ (బ్యూనస్ ఎయిర్స్)
ఏప్రిల్ 13-22: వరల్డ్ కప్-2 రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ టోర్నీ (లిమా)
మే 3-12: వరల్డ్‌కప్ షాట్‌గన్ టోర్నీ (సైప్రస్)
జూన్ 1-12: ఆసియాకప్ షాట్‌గన్ టోర్నీ (చైనా)
జూన్ 8-15: వరల్డ్‌కప్ రైఫిల్, పిస్టల్ టోర్నీ (జర్మనీ)
జూలై 4-14: వరల్డ్‌కప్ షాట్‌గన్ టోర్నీ (ఇటలీ)
ఆగస్టు 16-30: ఆసియా చాంపియన్‌షిప్ (కజకిస్తాన్)
సెప్టెంబర్ 13-21: వరల్డ్‌కప్ రైఫిల్, పిస్టల్ టోర్నీ (చైనా)
అక్టోబర్ 8-19: ప్రపంచ చాంపియన్‌షిప్ షాట్‌గన్ టోర్నీ (గ్రీస్)
నవంబర్ 6-16: వరల్డ్ చాంపియన్‌షిప్ రైఫిల్, పిస్టల్ టోర్నీ (ఈజిప్ట్)



హాకీ

డిసెంబర్ 28-ఫిబ్రవరి 1: పురుషుల హాకీ ఇండియా లీగ్ (భారత్)
జనవరి 12-26: మహిళల హాకీ ఇండియా లీగ్ (భారత్)
ఫిబ్రవరి 15-జూన్ 29: ప్రొ హాకీ లీగ్ (మహిళలు)
ఫిబ్రవరి 15-జూన్ 22: ప్రొ హాకీ లీగ్ (పురుషులు)
డిసెంబర్: జూనియర్ పురుషుల వరల్డ్‌కప్ (భారత్)



చెస్

ఫిబ్రవరి 17-28: మహిళల గ్రాండ్‌ప్రి మూడో సిరీస్ (మొనాకో)
ఫిబ్రవరి 23-మార్చి 8: ప్రపంచ అండర్-20 చాంపియన్‌షిప్ (మోంటెనిగ్రో)
మార్చి 14-25: మహిళల గ్రాండ్‌ప్రి నాలుగో సిరీస్ (సైప్రస్)
ఏప్రిల్ 13-24: మహిళల గ్రాండ్‌ప్రి ఐదో సిరీస్ (భారత్)
మే 6-17: మహిళల గ్రాండ్‌ప్రి ఆరో సిరీస్ (ఆస్ట్రియా)
జూలై 5-29: మహిళల వరల్డ్‌కప్ టోర్నీ (జార్జియా)

అథ్లెటిక్స్

సెప్టెంబర్ 13-21: ప్రపంచ చాంపియన్‌షిప్ (జపాన్)



బాక్సింగ్



మార్చి 6-18: ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ (బెల్‌గ్రేడ్)
మే-జూన్: ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్

పంజాబ్ ‘పవర్’ హిట్టింగ్

- అభిషేక్ శర్మ భారీ సెంచరీ
- ‘శత’క్కొట్టిన ప్రభ్‌సిమ్రన్ సింగ్
- పంజాబ్ 424/5... సౌరాష్ట్ర 367

అహ్మదాబాద్: టీమిండియా ఆటగాడు అభిషేక్ శర్మ (96 బంతుల్లో 170; 22 ఫోర్లు, 8 సిక్స్‌లు) భారీ శతకానికి ప్రభ్‌సిమ్రన్ సింగ్ (95 బంతుల్లో 125; 11 ఫోర్లు, 8 సిక్స్‌లు) సమయోచిత సెంచరీ తోడవడంతో పంజాబ్ భారీ స్కోరు చేసింది. విజయ్ హజారే ట్రోఫీ గ్రూప్ ‘సి’లో భాగంగా మంగళవారం సౌరాష్ట్రతో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ జట్టు 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 424 పరుగులు చేసింది. ఈ టోర్నీ చరిత్రలో ఇది ఐదో అత్యధిక స్కోరు కావడం విశేషం. సౌరాష్ట్ర బౌలింగ్‌ను చీల్చి చెండాడిన పంజాబ్ ఓపెనర్లు తొలి వికెట్‌కు 31 ఓవర్లలో 298 పరుగులు జోడించారు. సౌరాష్ట్ర సారథి జైదేవ్ ఉనాద్కట్ ఎన్ని ప్రయత్నాలు చేసిన ఓపెనింగ్ జోడీని విడగొట్టలేకపోయాడు. బౌలర్ చేతి నుంచి బంతి రావడమే ఆలస్యం... అభిషేక్, ప్రభ్‌సిమ్రన్ విజృంభించడంతో పంజాబ్‌కు మెరుపు ఆరంభం లభించింది. ఈ ఇద్దరి జోరు చూస్తుంటే ... పంజాబ్ 500 పరుగులు చేయడం ఖాయమే అనిపించింది. అయితే ఆ తర్వాత కాస్త పోటీలోకి వచ్చిన సౌరాష్ట్ర బౌలర్లు పంజాబ్ జోరుకు బ్రేకులు వేయగలిగారు. అనంతరం కొండంత లక్ష్యం కళ్లముందు కనిపిస్తున్నా ఏమాత్రం బెదరని సౌరాష్ట్ర చివరకు 50 ఓవర్లలో 367 పరుగులకు ఆలౌటైంది. అర్పిత్ (104; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) ‘శత’క్కొట్టగా ... హార్విక్ దేశాయ్ (59; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఉనాద్కట్ (48; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఇరు జట్లు కలిసి ఈ మ్యాచ్‌లో 791 పరుగులు చేశాయి. ఈ టోర్నీ చరిత్రలో ఇది రెండో అత్యధిక ఓవరాల్ స్కోరు. 2022లో బెంగాల్ సర్వీసెస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రెండు జట్లు కలిసి 805 పరుగులు చేశాయి.



అభిషేక్ శర్మ

సాక్షి ప్లస్
బుధవారం । 1-1-2025



ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో మంగళవారం రాత్రి కొత్త సంవత్సర వేడుకలు



వియత్నాంలోని హనోయ్‌లో హొయెన్ కియెమ్ సరస్సు వద్ద ఏర్పాటు చేసిన న్యూ ఇయర్ 2025 వద్ద పర్యాటకుల సందడి



నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబైన కేరళలోని కోజికోడ్‌లోని మనంచిరా స్క్వేర్‌లో సెల్ఫీ

గ్రేట్ రాబరీ!

- 1.2 కోట్ల డాలర్ల విలువైన ఆభరణాల చోరీ
- ఖరీదైన హెర్మెస్ బ్యాగులు తదితరాలు కూడా

లండన్‌లో చోరీ జరిగింది. ఇందులో విశేషం ఏముందంటారా? నగర చరిత్రలోనే అతి పెద్ద చోరీల్లో ఇదొకటని పోలీసులు చెబుతున్నారు. ''అత్యంత అరుదైన ఆభరణాలతో పాటు ఖరీదైన హెర్మెస్ హ్యాండ్‌బ్యాగులు తదితరాలు చోరీకి గురయ్యాయి. వాటి విలువ 1.2 కోట్ల డాలర్ల పై చిలుకే'' అని వివరించారు. ఇంతగా చేతి వాటం చూపిన చోర మహాశయున్ని పట్టుకునే పనిలో పోలీసులు ప్రస్తుతం తలమునకలుగా ఉన్నారు. అతను తెల్ల జాతీయుడేనని, 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉంటాడని తేల్చారు. ''వాయవ్య లండన్‌లో విలాసవంతమైన అవెన్యూ రోడ్‌లోని ఇంటిని దొంగ టార్గెట్ చేసుకున్నాడు. డిసెంబర్ 7న సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని వేళ రెండో అంతస్తులోని కిటికీ గుండా లోపలికి దూరాడు. కోటి పౌండ్ల పై చిలుకు చేసే ఆభరణాలతో పాటు 1.5 లక్షల డాలర్ల విలువైన హెర్మెస్ క్రొకొడైల్ కెల్లీ హ్యాండ్‌బ్యాగులు, చేతికందినంత నగదు ఎత్తుకెళ్లాడు''అని వివరించారు. వాటిలో 10.73, 3.08 క్యారెట్ల రెండు వజ్రపుటుంగరాలు, రెండు డిబీర్స్ బటర్‌ఫ్లై వజ్రాల రింగులు, వజ్రాల దుద్దులు, ఖరీదైన బ్రేస్‌లెట్, నెక్లెస్, ఫ్రెంచి లగ్జరీ బ్రాండ్ వాన్ క్లీఫ్ అండ్ అర్పెల్స్‌కు చెందిన అమూల్య ఆభరణాల వంటివి ఉన్నాయని చెప్పారు. ముఖాన్ని గుర్తు పట్టకుండా మాస్క్ ధరించి మరీ రంగంలోకి దిగడంతో దొంగను గుర్తించడం కష్టంగా ఉందని సమాచారం. – సాక్షి, నేషనల్ డెస్క్

నేడు డీడీలో మంథన్

న్యూఢిల్లీ: దిగ్గజ దర్శకుడు శ్యామ్ బెనగళ్‌కు నివాళిగా 'మంథన్'హిందీ సినిమాను జనవరి ఒకటో తేదీన రాత్రి 8 గంటలకు ప్రసారం చేయనున్నట్లు దూరదర్శన్ తెలిపింది. ఈ సినిమా కొత్త వెర్షన్‌ను ప్రసారం చేయడంతో బుధవారం నూతన సంవత్సరం వేడుకలను ప్రారంభిస్తామని పేర్కొంది. 1970, 1980ల్లో భారతీయ సినీ రంగాన్ని శాసించిన శ్యామ్ బెనగళ్ 90 ఏళ్ల వయస్సులో డిసెంబర్ 23వ తేదీన కన్నుమూయడం తెలిసిందే. 1976నాటి నవీకరించిన మంథన్ సినిమాను 2024 ఆరంభంలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో క్లాసిక్ విభాగంలో ప్రదర్శించినట్లు ఫిల్మ్ హెరిటేజ్ ఫౌండేషన్(ఎఫ్‌హెచ్‌ఎఫ్) 'ఎక్స్'లో తెలిపింది. భారతదేశాన్ని ప్రపంచంలోని అతిపెద్ద పాల ఉత్పత్తిదారుల్లో ఒకటిగా మార్చిన డాక్టర్ వర్గీస్ కురియన్ సంచలనాత్మక పాల సహకార ఉద్యమం స్ఫూర్తితో 'మంథన్'రూపుదాలిచ్చింది. జనవరి ఒకటో తేదీన రాత్రి 8 గంటలకు దూరదర్శన్‌లో మంథన్ ప్రసారానికి గుజరాత్ కో ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్(అమూల్)తోడ్పాటునిస్తోందని ఎఫ్‌హెచ్‌ఎఫ్ వెల్లడించింది. ఈ సినిమాలో ప్రధాన నటులు స్మితా పాటిల్, నసీరుద్దీన్ షా, అమ్రిష్ పురి ఉన్నారు. దీన్ని ఇంగ్లిష్‌లో చుర్నింగ్ పేరుతో విడుదల చేశారు.

ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో చిరుత కలకలం

మైసూరు: మైసూరులోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో చిరుత కనిపించడంతో ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు. అండర్ గ్రౌండ్ కార్ పార్కింగ్ ప్రాంతంలో మంగళవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో చిరుత తిరుగుతుండగా భద్రతా సిబ్బంది కంటబడింది. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించాక అదేనని నిర్ధారించుకున్నారు. సమాచారం అందించడంతో అటవీ అధికారులు థర్మల్ కెమెరాను అమర్చిన డ్రోన్‌తో నిఘా పెట్టారు. సుశిక్షితులైన 40 మంది అటవీ సిబ్బంది క్యాంపస్‌లో వలలు, బోనులతోగాలింపు చర్యలు చేపట్టారు. ముందు జాగ్రత్తగా ఉద్యోగులకు 'వర్క్ ఫ్రం హోం'వెసులుబాటు కల్పించారు. ఆ చిరుత నివాస ప్రాంతంలోకి ప్రవేశించకుండా అధికారులు చర్యలు తీసుకున్నారని మంత్రి ఈశ్వరప్ప చెప్పారు. సుమారు 350 ఎకరాల్లో విస్తరించిన మైసూరు ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో కొంతభాగం అటవీ ప్రాంతం మాదిరిగానే ఉంటుందన్నారు.

చైనాతో తైవాన్ విలీనాన్ని ఎవరూ ఆపలేరు: జిన్‌పింగ్

బీజింగ్: చైనాతో తైవాన్ విలీనాన్ని ఎవరూ ఆపలేరని అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ నొక్కి చెప్పారు. నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం ఆయన ప్రభుత్వ టీవీలో ప్రసంగించారు. ''బాధ్యతాయుతమైన దేశంగా ప్రపంచ పాలనా సంస్కరణలను చైనా చురుగ్గా ప్రోత్సహిస్తోంది. గ్లోబల్ సౌత్ మధ్య సంఘీభావం, సహకారాన్ని పెంచుతుంది'' అని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న మార్పులకు అనుగుణంగా మారుతోందన్నారు. దేశ ఆర్థిక పురోగతి మందగించడం, అదే సమయంలో అమెరికా అధ్యక్షుడిగా మరోసారి పగ్గాలు చేపట్టనున్న డొనాల్డ్ ట్రంప్ చైనాపై పన్నులు భారీగా విధిస్తానని ప్రకటించిన వేళ జిన్ పింగ్ చేసిన ప్రసంగం ప్రాధాన్యం సంతరించుకుంది.

భారత సంతతి ప్రముఖులకు బ్రిటన్ గౌరవ పురస్కారాలు

లండన్: నూతన సంవత్సరం సందర్భంగా బ్రిటన్ రాజు చార్లెస్–3 అందించే గౌరవ పురస్కారాల జాబితాలో 30 మందికి పైగా భారత సంతతి వారికి చోటు లభించింది. క్రీడలు, ఆరోగ్య సంరక్షణ, విద్యారంగం, స్వచ్ఛంద సేవ సహా పలు రంగాల్లో ఆదర్శంగా నిలిచిన 1,200 మందిని జాబితాలో చేర్చారు. ''వీరంతా సాధారణ వ్యక్తులే. అయినా అసాధారణ రీతిలో ప్రజా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు''అని బ్రిటన్ ప్రధాని కియర్ స్టార్మర్ ప్రశంసించారు. వారి అద్భుత సేవలను గుర్తించడాన్ని గౌరవంగా తమ ప్రభుత్వం భావిస్తున్నట్టు చెప్పారు. ''వీరిలో చాలామంది ఓవైపు ఉద్యోగాలు చేస్తూనే సంఘ సేవను కొనసాగిస్తున్నారు. వీరిలో 12 శాతం మందిది మైనారిటీ నేపథ్యం''అంటూ కేబినెట్ ఒక ప్రకటనలో వెల్లడించింది.

జాబితాలో పలు రంగాల వారు

శ్రీలంక, భారత మూలాలున్న బ్రిటన్ ఎంపీ రణిల్ మాలకమ్ జయవర్ధనేకు రాజకీయ, ప్రజాసేవ రంగాల్లో నైట్‌హుడ్ దక్కనుంది. విద్యారంగంలో సేవలకు సత్వంత్ కౌర్ డియోల్ 'కమాండర్స్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్'గౌరవం దక్కించుకున్నారు. న్యాయరంగంలో సేవలకు చార్లెస్ ప్రీతమ్ సింగ్ ధనోవా, ఆరోగ్యం, శాస్త్ర సాంకేతిక రంగాల నుంచి ప్రొఫెసర్ స్నేహ ఖేమ్కా కూడా గౌరవ పురస్కారాలు అందుకోనున్నారు. జాబితాలో లీనా నాయర్, మయాంక్ ప్రకాశ్, పూర్ణిమ మూర్తి తణుకు, కార్డియాలజిస్ట్ ప్రొఫెసర్ సంజయ్ ఆర్య, ప్రొఫెసర్ నందినీ దాస్, తర్సేమ్ సింగ్ ధలీవాల్, జాస్మిన్ దోతీవాలా, మోనికా కోహ్లి, శౌర్య మజుందార్, సీమా మిశ్రా, ఉష్మా మన్‌హర్ పటేల్, గ్యాన్ సంగ్ పవర్, శ్రావ్యా రావ్, మన్‌దీప్ కౌర్ సంఘేరా, సౌరజ్ సింగ్ సిద్ధూ, స్మృతి శ్రీరామ్, టెక్ నిపుణుడు దలీప్ కుమార్ బసు, నర్సింగ్ చీఫ్ మారిమాత్ కొమరసామి, రుమటాలజిస్ట్ ప్రొఫెసర్ భాస్కర్ దాస్‌గుప్తా, పీడియాట్రిక్ హెమటాలజిస్ట్ ప్రొఫెసర్ అజయ్ జైకిషోర్ వోరా, కమ్యూనిటీ వర్కర్లు సంజీబ్ భట్టాచార్య, జగ్‌రూప్ బిన్నీ, పోస్టల్ వర్కర్ హేమంద్ర హిందోచా, స్వచ్ఛంద కార్యకర్త జస్వీందర్ కుమార్, సంగీతకారుడు బల్బీర్‌సింగ్ ఖాన్‌పూర్ భుజాంగీ తదితరులకూ జాబితాలో చోటు దక్కింది.



కొత్త సంవత్సరం వేడుకలకు ముస్తాబైన దుబాయ్‌లోని ప్రఖ్యాత బుర్జ్ ఖలీఫా

మ్యాట్రిమోనియల్ సైట్ల ద్వారా మహిళలకు ఎర..

ఘరానా మోసగాడి ముందస్తు బెయిల్‌కు నో

ముంబై: మ్యాట్రిమోనియల్ సైట్లలో అవివాహిత మహిళలను వేధిస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న ఓ ఘరానా మోసగాడికి కోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించింది. మహిళలను లక్ష్యంగా చేసుకుని పబ్బం గడుపుకోవడమే అలవాటుగా మార్చుకున్నాడంటూ మహారాష్ట్రలోని పాల్ఘార్ జిల్లా వసాయ్‌కి చెందిన ఇమాదుద్దీన్ ఇర్ఫాన్ షేక్ పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా అడిషనల్ సెషన్స్ జడ్జి జయేంద్ర జగ్దలే వ్యాఖ్యానించారు. మోసం, వేధింపులు, లైంగిక దాడికి యత్నం తదితర సెక్షన్ల కింద పోలీసులు ఇతడిపై కేసు పెట్టారు.

మ్యాట్రిమోనియల్ సైట్ ద్వారా వైద్యురాలైన బాధితురాలికి నిందితుడు ఇర్ఫాన్ షేక్ పరిచయమయ్యాడు. అనంతరం ఇద్దరి మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. ఇర్ఫాన్ షేక్‌కు అప్పటికే పెళ్లయి, ఒక కుమారుడు కూడా ఉన్నాడు. ఈ విషయం మాత్రం బాధితురాలికి చెప్పకుండా దాచాడు. కొన్ని రోజుల తర్వాత మోసం బయటపడింది. అప్పటి నుంచి అతడి నుంచి వేరుగా ఉంటోంది. నిందితుడు మాత్రం వాట్సాప్ కాల్స్‌తో వేధించడం మానలేదు. ఆమె వ్యక్తిగత ఫొటోలను బయటపెడతానంటూ బెదిరిస్తున్నాడు. ఈ క్రమంలో 2024 జూన్‌లో బాధితురాలి కారులోకి బలవంతంగా చొరబడ్డ ఇర్ఫాన్ షేక్ తుపాకీ లాంటి ఆయుధంతో బెదిరించి, లైంగిక దాడికి యత్నించాడు. తనను కాదని వేరెవరిని పెళ్లి చేసుకున్నా పరిణామాలు దారుణంగా ఉంటాయని వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు ఇర్ఫాన్ షేక్ గతంలో మ్యాట్రిమోనియల్ సైట్లలో బ్యాంక్ ఉద్యోగినంటూ ఒకరిని మోసం చేసినట్లు గుర్తించారు. పోలీసు అధికారి పేరుతో, న్యాయశాఖ చిహ్నాన్ని తన వాహనంపై అతికించుకుని వసూళ్లకు పాల్పడ్డాడని తేల్చారు. మ్యాట్రిమోనియల్ సైట్‌కు సంబంధించిన మరో కేసులో తెలంగాణ పోలీసులు ఇతడిని అరెస్ట్ కూడా చేశారని కోర్టుకు పోలీసులు నివేదించారు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకున్న జడ్జి జయేంద్ర..ఇతడి నేర చరిత్రను వెలికి తీసేందుకు, ముందుందు ఇతడి ఇటువంటి నేరాలకు పాల్పడకుండా కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరముందని అభిప్రాయపడ్డారు. ఇతడిపై అభియోగాలు తీవ్రమైనవని, అందుకు తగు ఆధారాలు సైతం ఉన్నాయన్నారు. బెయిలిస్తే విచారణకు అవరోధం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టి వేస్తూ తీర్పు వెలువరించారు.

మైనర్ స్టూడెంట్‌పై అత్యాచారం..

ట్యూషన్ టీచర్‌కు 111 ఏళ్ల జైలు

తిరువనంతపురం: విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన ట్యూషన్ టీచర్‌కు కేరళలోని స్పెషల్ ఫాస్ట్–ట్రాక్ కోర్టు ఏకంగా 111 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. సంరక్షకుడిగా వ్యవహరించాల్సిన వ్యక్తి, ఇటువంటి నేరానికి పాల్పడినందున జాలి చూపాల్సిన అవసరం లేదని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగి అయిన మనోజ్(44) తను ఉండే ఇంట్లోనే ట్యూషన్లు చెబుతుండేవాడు. అతడి వద్దకు వచ్చే 11వ తరగతి బాలికను 2019లో ఓ రోజు ప్రత్యేక క్లాసుకని పిలిపించుకున్నాడు. ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అదంతా సెల్‌ఫోన్‌లో షూట్ చేశాడు. ఈ ఘటనతో భయపడిపోయిన బాలిక ట్యూషన్‌కు వెళ్లడం మానేసింది. మనోజ్ తన ఘనకార్యాన్ని చెప్పుకునేందుకు ఆ ఫొటోలను మరికొందరికి పంపాడు. విషయం తెలిసి బాధితురాలి కుటుంబీకులు ఫోర్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మనస్తాపానికి గురైన మనోజ్ భార్య ఆత్మహత్యకు పాల్పడింది. మనోజ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు అతడి సెల్‌ఫోన్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. బాలికపై అత్యాచారం జరిపిన ఫొటోలు అందులో ఉన్నట్లు గుర్తించారు. అయితే, అదే సమయంలో ఆఫీసులో ఉన్నట్లు అక్కడి రిజిస్టర్‌లోని సంతకం చూపి పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించాడు. కానీ, మనోజ్ ఫోన్‌లోని కాల్ రికార్డుల ఆధారంగా అవన్నీ తప్పని తేలింది. దీంతో, ప్రత్యేక కోర్టు నిందితుడికి 111 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.1.05 లక్షల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది అదనంగా జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుందని జడ్జి ఆర్.రేఖ తీర్పు వెలువరించారు.

ఇండో–పసిఫిక్ స్వేచ్ఛా, సుస్థిరతలే లక్ష్యం

క్వాడ్ 20వ వార్షికోత్సవం సందర్భంగా సభ్యదేశాల ప్రతిన

న్యూఢిల్లీ: ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా దుందుడుకు, విస్తరణవాదానికి కళ్లెం వేస్తూ ఈ ప్రాంత స్వేచ్ఛా, సుస్థిరతలే లక్ష్యంగా ఉమ్మడిగా ముందడుగువేస్తున్నామని క్వాడ్ కూటమి దేశాలు పునరుద్ఘాటించాయి. క్వాడ్ కూటమిగా ఆవిర్భవించి పరస్పర సహకారం ఇచ్చిపుచ్చుకోవడం మొదలెట్టి 20 వసంతాలు పూర్తయిన సందర్భంగా క్వాడ్ సభ్యదేశాలు మంగళవారం ఒక సంయుక్త ప్రకటన విడుదలచేశాయి. 2004లో హిందూ మహాసముద్రంలో ఇండోనేసియా సమీపంలో సముద్రగర్భంలో భూకంపం కారణంగా ఉద్భవించిన సునామీ సృష్టించిన విలయం నుంచి కోలుకునేందుకు భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లు 20 ఏళ్ల క్రితం 'క్వాడ్'కూటమిగా ఏర్పడిన విషయం విదితమే. మంగళవారం క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రులు ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదలచేశారు. ఇటీవలికాలంలో ఇండో–పసిఫిక్ ప్రాంతంలో తరచూ సముద్రతీర భద్రత, మౌలిక వసతుల కల్పన, దేశాల మధ్య అనుసంధానత పెను సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో సంయుక్త ప్రకటన వెలువడటం గమనార్హం. ''ఇండో–పసిఫిక్ స్వేచ్ఛాయుతంగా ఉంటే ఇక్కడ సుస్థిరత, పారదర్శకత నెలకొనడంతోపాటు దేశాల మధ్య పరస్పర నమ్మకం, విశ్వాసం ఇనుమడిస్తుంది. పది దేశాలతో ఏర్పడిన ఆసియాన్ గురించి క్వాడ్ ఆలోచిస్తోంది. తూర్పు ఆసియా దేశాలకు పూర్తి సహాయసహకారాలు అందించడంతోపాటు దేశాల మధ్య ఐక్యతకు క్వాడ్ కృషిచేస్తోంది. పసిఫిక్ ఐలాండ్స్ ఫోరమ్, ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్‌లకూ క్వాడ్ తన మద్దతు పలుకుతోంది. సునామీ వంటి ప్రకృతి విపత్తులు మా నాలుగు దేశాలను దగ్గర చేశాయి. సునామీ వినాశనం వేళ దాదాపు 2.5 లక్షల మంది సజీవ సమాధి అయ్యారు. రాకాసి అలల ధాటికి తీరప్రాంతమున్న 14 దేశాల్లో 17 లక్షల మంది సర్వస్వం కోల్పోయి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. లక్షలాది బాధితులను ఆదుకునేందుకు 40,000కు పైగా అత్యయిక బృందాలు అవిశ్రాంతంగా సేవలందించాయి. వినాశనాల వేళ మానవీయ సాయం, విపత్తు స్పందన సహకారం అందించడమే క్వాడ్ ముఖ్యోద్దేశం. ఇండో–పసిఫిక్‌లో తలెత్తే ఎలాంటి ఉపద్రవాన్నైనా తక్షణం ఎదుర్కొనేందుకు మేం సదా సిద్ధంగా ఉన్నాం. 2021 నుంచి ప్రతి ఏటా క్వాడ్ దేశాధినేతలు దక్షిణాసియా, ఆగ్నేయాసియా, పసిఫిక్ ప్రాంతాల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేశారు''అని సంయుక్త ప్రకటన పేర్కొంది. 2025 ద్వితీయార్థంలో క్వాడ్ సదస్సు భారత్‌లో జరగనుంది. క్రితంసారి అమెరికాలోని విల్మింగ్టన్‌లో క్వాడ్ సదస్సు జరిగింది. అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తూ దేశాల సార్వభౌమత్వానికి భంగం వాటిల్లకుండా క్వాడ్ దేశాలు పనిచేస్తున్నాయని ప్రకటన స్పష్టంచేసింది.

కలిసే దూరంగా ఉందాం!

- వేర్వేరు ప్రాంతాల్లో విడిగా బతికే ధోరణిని అవలంభిస్తున్న పలు జంటలు
- పశ్చిమదేశాల్లో పెరిగిన ఎల్‌ఏటీ సంస్కృతి
- ప్రేమలు బలపడేందుకు ఓరకంగా ఇది మంచి పద్ధతేనంటున్న మానసిక నిపుణులు

పెళ్లయిన కొత్తలో ఆమె ఏం చెప్పినా, చేసినా అతనికి ఎంతో ఇష్టం. ఇద్దరికీ నచ్చిన ఫుడ్, నచ్చిన రంగు, నచ్చిన హాలిడే వెకేషన్. కొన్నాళ్ల గడిచాక సీన్ రివర్స్. ఏం చేసినా తప్పే. చేయకపోయినా తప్పే. టాయిలెట్ కమోడ్ మూత వేయకపోతే మాటల యుద్ధం. మంచంపై తడిసిన తువ్వాలు కనిపిస్తే పెద్ద వాగ్వాదం. ఏసీ నంబర్ పెంచినా, తగ్గించినా పట్టరానంత కోపాలు. పెద్దలు కుదిర్చిన పెళ్లికావొచ్చు మనసులు కలిపిన ప్రేమ వివాహం కావొచ్చు. కీచులాటలు కామన్. ఇలా కొట్టుకుంటూ కలిసుండే బదులు విడిపోతే బాగుండు అనే జంటలు కోకొల్లలు. శాశ్వతంగా విడిపోకుండా దూరం దూరంగా వేర్వేరు ఇళ్లలో ఉంటూ ఒకరికిపై మరొకరు గాఢమైన ప్రేమానుబంధాలను పెంచుకునే కొత్త ధోరణి ఇప్పుడు మొగ్గ తొడిగి వేగంగా విస్తరిస్తోంది. దీనికే ఇప్పుడు చాలా జంటలు 'దూరంగా కలిసి బతకడం(లివింగ్ అపార్ట్ టుగెదర్) అనే కొత్త పేరు పెట్టి ఆచరిస్తున్నాయి. ఈ నయా ట్రెండ్‌లోని విశేషాలను తెల్సుకునేందుకు ఆయా జంటల జీవితాల్లోకి ఓసారి తొంగిచూద్దాం..

ఏమిటీ ఎల్‌ఏటీ?

లివింగ్ అపార్ట్ టుగెదర్ (ఎల్‌ఏటీ) గురించి 19వ శతాబ్దానికి చెందిన లెబనాన్ మూలాలున్న అమెరికన్ రచయిత కహ్‌లిల్ గిబ్రాన్ తన 'పెళ్లి'కవితలో తొలి సారిగా ప్రస్తావించారు. భార్యభర్తలు ఒకరిపై మరొకరికి ఎనలేని ప్రేమానురాగాలు ఉన్నప్పటికీ తమ అహం కిరీటం కిందపడొద్దనే కారణంగా తమ మాటే నెగ్గాలనే మొండిపట్టుదలతో చిన్నపాటి వాగ్వాదాలకు దిగుతారు. తర్వాత బాధపడతారు. మళ్లీ అంతా సర్దుకోవడానికి కాస్తంత సమయం పడుతుంది. ఇప్పుడున్న ఆధునిక యుగంలో భార్యాభర్తలిద్దరూ సొంత కెరీర్‌లకు ప్రాధాన్యతనిస్తున్నారు. వేర్వేరు చోట్ల ఉద్యోగాలు, వృత్తుల్లో నిమగ్నమవుతున్నారు. పని కోసం వేరే చోట ఉండాల్సి రావడం, వ్యక్తిగత అభిప్రాయాలకు గౌరవించాల్సి రావడం, అన్యోన్యంగా ఉన్నాసరే కొన్నిసార్లు వ్యక్తిగత ఏకాంతం(పర్సనల్ స్పేస్) కోరుకోవడం వంటివి జరుగుతున్నాయి. వీటికి పరిష్కార మార్గంగా జంటలే తమకు తాముగా ఎల్‌ఏటీకి జై కొడుతున్నాయి. చినికిచినికి గాలివాన దుమారంగా మారే ప్రమాదాలను దూరం దూరంగా ఉండటం వల్ల తప్పించుకోవచ్చని జంటలు భావిస్తున్నాయి.

ఎలా సాధ్యం?

కథలు, సినిమాల్లో, నవలల్లో ప్రస్తావించినట్లు దూరంగా ఉన్నప్పుడు ప్రేమికులను విరహవేదన కాల్చేస్తుంది. అదే వేదన ఈ జంటలకు ఉంటుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. కలిసిమెలిసి ఉంటేనే బంధం బలపడుతుందన్న భావనకు భిన్నమైన సిద్ధాంతం ఇది. కాస్తంత కష్టపడితే ఈ బంధాన్నీ పటిష్టపరుచుకోవచ్చని మనోవిజ్ఞాన నిపుణులు చెప్పారు. ''వారాంతాలు, సెలవు దినాల్లో ఒకరి నివాస స్థలానికి ఇంకొకరు వచ్చి ఆ కాస్త సమయం అత్యంత అన్యోన్యంగా గడిపివెళ్తే చాలు. తమ మధ్య దూరం ఉందనే భావన చటుక్కున మటుమాయం అవుతుంది. కలిసి ఉన్నప్పటి సరదా సంగతులు, మధుర స్మృతులను మాత్రమే టెక్ట్స్ రూపంలో సందేశాలు పంపుతూ గుర్తుచేసుకుంటూ ప్రేమ వారధికి మరింత గట్టిదనం కల్పించొచ్చు. కలిసి ఉన్నప్పుడు జరిగిన గొడవలను భూతద్దంలోంచి చూడటం మానేయాలి. ఆధునిక జంటల్లో స్వతంత్ర భావాలు ఎక్కువ. గతంతో పోలిస్తే వ్యక్తిగత ఏకాంతం ఎక్కువ కోరుకుంటారు. జీవిత భాగస్వామి ఆలోచనలకు విలువ ఇవ్వాలి. పాత, చేదు విషయాలను తవ్వుకోవడం తగ్గించాలి''అని ఢిల్లీలోని ఎల్‌ఏటీ నిపుణుడు రుచీ రూహ్, మానసిక నిపుణుడు, జంటల మధ్య మనస్పర్థలను తగ్గించే డాక్టర్ నిషా ఖన్నా సూచించారు.

ఒకరి అభిప్రాయాలకు మరొకరు గౌరవం ఇస్తూనే ఇలా దూరంగా ఉంటూ మానసికంగా అత్యంత దగ్గరగా ఉంటున్నామని ఎల్‌ఏటీ జంటలు చెబుతున్నాయి. ''సాన్నిహిత్యంలోనూ కాస్తంత ఎడం ఉంచుదాం. ఈ స్వల్ప దూరాల్లోనే స్వర్గలోకపు మేఘాల స్పర్శను స్పృశిద్దాం''అంటూ జంటలు పాటలు పాడుకుంటున్నాయని కవి గిబ్రాన్ ఆనాడే అన్నారు.

ఎవరికి బాగా నప్పుతుంది?

వేర్వేరు చోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు చేసే జంటలు ఈ సిద్ధాంతాన్ని ఆచరించి మంచి ఫలితాలు పొందొచ్చు. ముఖ్యమైన పనుల మీద దూరంగా, విదేశాల్లో గడపాల్సిన జంటలు ఈ మార్గంలో వెళ్లొచ్చు. వ్యక్తిగత ఏకాంతం కోరుకుంటూనే జీవిత భాగస్వామికి అత్యంత విలువ ఇచ్చే జంటలూ ఈ సిద్ధాంతం తమకు ఆమోదయోగ్యమేనని చెబుతున్నాయి. వేర్వేరు కార్యాలయాలు, భిన్న వృత్తుల్లో, విభిన్న సమయాల్లో పనిచేసే జంటలకు ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. భాగస్వామికి అతిభారంగా మారకూడదని, ఆర్థికంగా సొంత కాళ్లపై నిలబడదామని భావించే జంటలూ ఈ ట్రెండ్‌ను ఫాలో కావొచ్చు. – సాక్షి, నేషనల్ డెస్క్

చివరగా చెప్పేదేమంటే?

విడివిడిగా జీవించే సమయాల్లో ఇద్దరి మధ్యా నమ్మకం అనేది అత్యంత కీలకం. ఆర్థిక, శారీరక, మానసిక అంశాలను నిజాయతీగా, నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా మాట్లాడుకుని కష్టాల కడలిలోనూ జీవననావ సాఫీగా సాగేలా చూసుకోవాలి. ఎప్పుడు కలవాలి? ఎక్కడ కలవాలి? ఎంతసేపు కలవాలి? ఏమేం చేయాలి? అనేవి ముందే మాట్లాడుకుంటే వేచి చూడటం వంటి ఉండవు. అనవసర కోపాలు, అపార్థాలు రావు. భారత్‌లో బ్రతుకు దెరువు కోసం లక్షలాది కుటుంబాల్లో పురుషులు వేరే జిల్లాలు, రాష్ట్రాలకు వలసవెళ్తూ భార్యను గ్రామాల్లో ఒంటరిగా వదిలి వెళ్తున్నారు. విశాల దృక్పథం, మానసిక పరిణతి కోణంలో చూస్తే భారత్‌లో దశాబ్దాలుగా ఎల్‌ఏటీ సంస్కృతి ఉందనే చెప్పాలి. ప్రత్యేకంగా పేరు పెట్టకపోయినా నోయిడా, గుర్గావ్, ఢిల్లీ, ముంబైలలో ఇద్దరూ పనిచేసే చాలా జంటలు ఇదే సంస్కృతిని ఆచరిస్తున్నాయి. వేర్వేరు చోట్ల ఉద్యోగాలు, సొంతూర్లలో వృద్ధ తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యతల కారణంగా మెట్రో నగరాల్లో చాలా జంటలు దూరంగా ఉంటున్నాయి. పశ్చిమదేశాల్లో ఇప్పుడిప్పుడే ఈ సంస్కృతి బాగా విస్తరిస్తోంది.

పోలీసు కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, సక్సెస్ స్టోరీలు మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

దేశంలో ఏర్పాటు చేసిన మొదటి మున్సిపాలిటీ ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

74వ రాజ్యాంగ సవరణ చట్టం

74వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని 'నగరపాలక చట్టం' అని కూడా అంటారు. దీని ద్వారా పట్టణ ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించారు. నగర పాలక బిల్లును పార్లమెంటులో 1991లో ప్రవేశపెట్టారు. దీన్ని 1992లో ఆమోదించారు. 1993 జూన్ 1 నుంచి దీన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ప్రకరణలు 243(P) నుంచి 243(ZG) వరకు ఈ చట్టం గురించి తెలియజేస్తాయి. వీటిని ప్రత్యేకంగా IX(A) భాగంలో చేర్చారు.

ప్రకరణ 243(P)–మున్సిపాలిటీల నిర్వచనం

మున్సిపల్ కార్పొరేషన్: ఒక నగరాన్ని పరిపాలించడానికి ఏర్పాటు చేసిన సంస్థ.

మున్సిపాలిటీ: ఒక పట్టణాన్ని పరిపాలించడానికి ఏర్పాటు చేసిన సంస్థ.

నగర పంచాయతీ: గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతంగా మారుతున్న పట్టణాన్ని పరిపాలించడానికి ఏర్పాటు చేసిన సంస్థ.

మెట్రోపాలిటన్ నగరం: జనాభా 10 లక్షలు దాటిన నగరం. దేశంలో వీటి సంఖ్య 53.

ప్రకరణ 243(Q)–మున్సిపాలిటీల ఏర్పాటు:

మున్సిపల్ కార్పొరేషన్: జనాభా 3 లక్షలు దాటిన నగరాన్ని కార్పొరేషన్‌గా గుర్తించవచ్చు.

తెలంగాణలో వీటి సంఖ్య 6. అవి:

1. హైదరాబాద్ 2. వరంగల్
3. కరీంనగర్ 4. నిజామాబాద్
5. రామగుండం 6. ఖమ్మం

ఆంధ్రప్రదేశ్‌లో 13 ఉన్నాయి. అవి:

1. కర్నూల్ 2. కడప
3. అనంతపురం 4. చిత్తూర్
5. తిరుపతి 6. నెల్లూరు
7. ఒంగోలు 8. గుంటూరు
9. విజయవాడ 10. ఏలూరు
11. కాకినాడ 12. రాజమండ్రి
13. విశాఖపట్నం

మున్సిపాలిటీ: జనాభా 40 వేలు దాటిన పట్టణాన్ని మున్సిపాలిటీగా గుర్తిస్తారు. తెలంగాణలో 37, ఆంధ్రప్రదేశ్‌లో 67 మున్సిపాలిటీలు ఉన్నాయి. వార్షిక ఆదాయం ఆధారంగా వీటిని అయిదు రకాలుగా పేర్కొంటారు.

1. థర్డ్‌గ్రేడ్ – రూ. కోటి లోపు ఆదాయం
2. సెకండ్ గ్రేడ్ – రూ. కోటి నుంచి రెండు కోట్ల ఆదాయం
3. ఫస్ట్‌గ్రేడ్ – రెండు నుంచి మూడు కోట్ల రూపాయల ఆదాయం
4. స్పెషల్ గ్రేడ్ – మూడు నుంచి నాలుగు కోట్ల ఆదాయం
5. సెలక్షన్ గ్రేడ్ – నాలుగు కోట్ల రూపాయలకు పైగా ఆదాయం

నగర పంచాయతీ: సాధారణంగా 11,000 కంటే ఎక్కువ 40,000 కంటే తక్కువ జనాభా ఉన్న, గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతంగా మారుతున్నదాన్ని నగర పంచాయతీగా గుర్తిస్తారు. తెలంగాణలో 26, ఆంధ్రప్రదేశ్‌లో 32 నగర పంచాయతీలు ఉన్నాయి.

ప్రకరణ 243(R) – మున్సిపాలిటీల నిర్మాణం

I. మున్సిపల్ కార్పొరేషన్

ఇందులో ప్రధానంగా 4 విభాగాలు ఉంటాయి.

కార్పొరేషన్ కౌన్సిల్: ఇందులో మూడు రకాల సభ్యులు ఉంటారు.

1. ప్రత్యక్షంగా ఎన్నికైన కార్పొరేటర్లు
2. పదవీ రీత్యా సభ్యులు
3. సహకార సభ్యులు

మేయర్: ఈయనను పరోక్షంగా ఎన్నుకుంటారు. అవిశ్వాస తీర్మానం ద్వారా ముందుగానే తొలగించవచ్చు.

స్థాయి సంఘాలు: కార్పొరేషన్‌లో 6 స్థాయి సంఘాలు ఉంటాయి. ఇవి కీలకపాత్ర పోషిస్తాయి.

కమిషనర్: ఈయన కార్పొరేషన్ సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారు.

II. మున్సిపాలిటీ

ఇందులో ప్రధానంగా మూడు విభాగాలు ఉంటాయి.

మున్సిపల్ కౌన్సిల్: ఇందులో మూడు రకాల సభ్యులు ఉంటారు.

1. ప్రత్యక్షంగా ఎన్నికైన కౌన్సిలర్లు
2. పదవీ రీత్యా సభ్యులు
3. సహకార సభ్యులు

మున్సిపల్ ఛైర్మన్: పరోక్షంగా అయిదేళ్లకు ఎన్నికవుతారు. అవిశ్వాస తీర్మానం ద్వారా ముందుగానే తొలగించవచ్చు.

మున్సిపల్ కమిషనర్: మున్సిపల్ సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారు.

ప్రకరణ 243(S)–వార్డు కమిటీల ఏర్పాటు: ప్రతి వార్డుకు లేదా ఒకటి కంటే ఎక్కువ వార్డులకు కలిపి వార్డు కమిటీని ఏర్పాటు చేయవచ్చు. దీని అధ్యక్షుడిగా వార్డు కౌన్సిలర్ కొనసాగుతారు. సభ్యులుగా పౌర ప్రముఖులను నియమిస్తారు. వీటి ఉద్దేశం పౌరుల సహకారం, భాగస్వామ్యంతో వార్డును అభివృద్ధి పరచడం.

ప్రకరణ 243 (T) – రిజర్వేషన్లు: జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు 18.25%, ఎస్టీలకు 8.25% రిజర్వేషన్లు కల్పించారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు 34%, మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించారు. ఈ రిజర్వేషన్లను రొటేషన్ పద్ధతిలో అమలు పరుస్తారు.

ప్రకరణ243 (U) – కాలపరిమితి: మున్సిపాలిటీల సాధారణ కాలపరిమితి అయిదేళ్లు. ఏదైనా మున్సిపాలిటీ రద్దైతే 6 నెలల్లోపు ఉప ఎన్నికలు నిర్వహించాలి. ఒకవేళ మున్సిపాలిటీ కాలం పూర్తవడానికి 6 నెలల కంటే తక్కువ సమయం ఉంటే ఉపఎన్నిక జరపాల్సిన అవసరం లేదు.

ప్రకరణ 243(V) – అభ్యర్థుల అనర్హతలు: మున్సిపాలిటీలకు పోటీ చేసే అభ్యర్థుల అర్హతలను రాజ్యాంగం ద్వారా కాకుండా శాసనసభ చట్టం ద్వారా నిర్ణయిస్తారు. వీటికి పోటీ చేయడానికి కనీస



వయసు 21 సంవత్సరాలు. 1995 తర్వాత ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్నవారు అనర్హులు.

ప్రకరణ 243(W) – మున్సిపాలిటీల విధులు, అధికారాలు: మున్సిపాలిటీలకు మొత్తం 18 అంశాలపై అధికారం కల్పించారు. వీటిని ప్రత్యేకంగా 12వ షెడ్యూల్లో చేర్చారు. ఈ అధికారాలను బదలాయించే అధికారం రాష్ట్ర శాసనసభకు కల్పించారు. వీటిలో 11 తప్పనిసరి, 7 ఐచ్ఛిక విధులు ఉన్నాయి.

తప్పనిసరి విధులకు ఉదాహరణ:

1. నగర ప్రణాళిక రూపకల్పన
2. భూముల క్రమబద్ధీకరణ,భవనాల నిర్మాణం
3. మురికివాడల అభివృద్ధి
4. రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం
5. ప్రజారోగ్యం, పారిశుధ్యం
6. అగ్నిమాపక సేవలు
7. పట్టణ పర్యావరణ రక్షణ ఏర్పాట్లు
8. పట్టణ, పేదరిక నిర్మూలన
9. జనన, మరణాల నమోదు
10. శ్మశానాల ఏర్పాటు, నిర్వహణ

ప్రకరణ 243 (X) – మున్సిపాలిటీల ఆదాయ మార్గాలు: మున్సిపాలిటీలకు ప్రధానంగా 5 రకాల ఆదాయ మార్గాలు ఉన్నాయి.

1. పన్నులు (ఇంటి పన్ను, నీటి పన్ను, ఆస్తి పన్ను, వినోద పన్ను).
2. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు
3. ఆస్తులు
4. విరాళాలు
5. ధర్మ, ఇతర సంస్థల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం

ప్రకరణ 243 (Y) – ఆర్థిక సంఘం: మున్సిపాలిటీలకు నిధుల పంపిణీ కోసం గవర్నర్ రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాలి. అధికరణ 243(I) ప్రకారం ఏర్పాటు చేసే ఆర్థిక సంఘం వీటికి కూడా వర్తిస్తుంది.

ప్రకరణ 243 (Z) – మున్సిపాలిటీల ఆడిటింగ్ అండ్ అకౌంటింగ్: వీటి నిర్వహణ కోసం శాసనసభ చట్టం ద్వారా ప్రత్యేక ఆడిటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం వీటిని ఏర్పాటు చేయలేదు. జిల్లా స్థాయి ఆడిటర్లు వీటిని నిర్వహిస్తున్నారు.

ప్రకరణ 243 (ZA) – మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణ: మున్సిపాలిటీలకు సకాలంలో, సక్రమంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి గవర్నర్ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేయాలి. ప్రకరణ 243(K) ప్రకారం ఏర్పాటు చేసే రాష్ట్ర ఎన్నికల సంఘం వీటికి కూడా ఎన్నికలను నిర్వహిస్తుంది.

ప్రకరణ 243 (ZB) – కేంద్రపాలిత ప్రాంతాలకు వర్తింపు: నగరపాలక చట్టం కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా వర్తిస్తుంది. అసెంబ్లీ ఉన్నవాటికి అసెంబ్లీ చట్టం ద్వారా, లేనివాటికి రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా వర్తింపజేస్తారు.

ప్రకరణ 243 (ZC) – కొన్ని ప్రాంతాలకు మినహాయింపు: ప్రకరణ 244లో పేర్కొన్న షెడ్యూల్డు ప్రాంతాలకు, ఆదివాసీ ప్రాంతాలకు నగరపాలక చట్టం వర్తించదు. పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతానికి కూడా వర్తించదు.

ప్రకరణ–243 (ZD) – జిల్లా ప్రణాళిక కమిటీ: ప్రతి జిల్లాకు ఒక ప్రణాళిక కమిటీని ఏర్పాటు చేయాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007లో ఏర్పాటు చేశారు. వీటిలో 30 మంది సభ్యులు ఉంటారు. వీరిలో 24 మంది ఎన్నికైనవారు (పంచాయతీలకు ఎన్నికైన సభ్యుల నుంచి 80%, మున్సిపాలిటీలకు ఎన్నికైన సభ్యుల నుంచి 20% మందిని తీసుకుంటారు). మిగిలిన ఆరుగురిలో.. అల్పసంఖ్యాక వర్గం నుంచి ఒకరు, వివిధ రంగాల్లో నిపుణులైన ముగ్గురు, జడ్పీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ ఉంటారు. పదవీ రీత్యా జడ్పీ ఛైర్మన్ దీని అధ్యక్షుడిగా కొనసాగుతారు.

ప్రకరణ 243 (ZE) – మెట్రోపాలిటన్ ప్రణాళిక కమిటీ: జనాభా 10 లక్షలు కంటే ఎక్కువ ఉన్న ప్రాంతాలకు వీటిని ఏర్పాటు చేస్తారు. దీని నిర్మాణం, విధులను రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా నిర్ణయిస్తారు. దీని అధ్యక్షునిగా నగర మేయర్ కొనసాగుతారు. కమిషనర్ మెంబర్ సెక్రటరీగా కొనసాగుతారు. మున్సిపల్ పరిపాలన అనుభవం ఉన్న నలుగురిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. మరికొందరిని గ్రామపంచాయతీ అధ్యక్షులు, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికైన సభ్యులు ఎన్నుకొంటారు.

ప్రకరణ 243 (ZF) – పాత శాసనాల కొనసాగింపు: 74వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చేంత వరకూ పాత చట్టాలే కొనసాగుతాయని, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు శాసనసభ చట్టం ద్వారా కొత్త చట్టాలను అనువర్తింపజేసుకోవాలని ఈ ప్రకరణ తెలియజేస్తుంది.

ప్రకరణ 243 (ZG) – న్యాయస్థానాల జోక్యం నుంచి మినహాయింపు: మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, ఎన్నికల నిర్వహణ, వార్డుల విభజన మొదలైన విషయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోకూడదు.

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో ఏర్పాటు చేసిన మొదటి మున్సిపాలిటీ ఏది?
ఎ) ముంబై బి) మద్రాస్
సి) మచిలీపట్నం డి) కోల్‌కతా
2. దేశంలో ఉన్న కంటోన్మెంటు బోర్డులెన్ని?
ఎ) 55 బి) 60 సి) 62 డి) 65
3. భారతదేశంలో కంటోన్మెంటు చట్టాన్ని ఏ సంవత్సరంలో చేశారు?
ఎ) 1907 బి) 1914
సి) 1924 డి) 1927
4. భారతదేశంలో మొదటగా ఏర్పాటు చేసిన పట్టణాభివృద్ధి సంస్థ ఏది?
ఎ) ముంబై బి) ఢిల్లీ
సి) కోల్‌కతా డి) అలహాబాద్
5. జిల్లా ప్రణాళిక కమిటీ అధ్యక్షునిగా ఎవరు కొనసాగుతారు?
ఎ) జిల్లా కలెక్టర్
బి) జిల్లా పరిషత్ అధ్యక్షుడు
సి) సంబంధిత జిల్లా మంత్రి
డి) పైన పేర్కొన్న ఎవరూ కాదు
6. భారతదేశంలో అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ ఏది?
ఎ) ముంబై బి) కోల్‌కతా
సి) ఢిల్లీ డి) చెన్నై
7. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మొదటి మేయర్ ఎవరు?
ఎ) సరోజినీ పుల్లారెడ్డి
బి) మాడపాటి హనుమంతరావు
సి) సలావుద్దీన్
డి) వెంకట్రామి రెడ్డి
8. నగరపాలక సంస్థలకు సంబంధించి ప్రత్యేక సిబ్బంది విధానం ఏయే రాష్ట్రాల్లో అమల్లో ఉంది?
ఎ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ
బి) ఉత్తరప్రదేశ్, బిహార్
సి) గుజరాత్, పశ్చిమబెంగాల్
డి) పైవేవీ కావు
9. సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ ఏ నగరంలో ఉంది?
ఎ) హైదరాబాద్ బి) పుణే
సి) న్యూఢిల్లీ డి) చెన్నై

సమాధానాలు

1) బి; 2) సి; 3) సి; 4) బి; 5) బి; 6) ఎ; 7) బి; 8) సి; 9) సి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. భారత రాజ్యాంగంలోని 12వ షెడ్యూల్‌లో మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్ని పాలనా నియంత్రణ వ్యవహారాల గురించి పేర్కొన్నారు?
ఎ) 15 బి) 16 సి) 17 డి) 18
2. గ్రామీణ ప్రాంతం నుంచి నగర ప్రాంతానికి మారేవి:
ఎ) నగర పంచాయతీలు
బి) రూరల్ మున్సిపాలిటీలు
సి) పంచాయతీ మున్సిపాలిటీలు
డి) మున్సిపల్ పంచాయతీలు
3. భారత రాజ్యాంగ ఎన్నో ఆర్టికల్ ప్రకారం మున్సిపాలిటీలకు అధికారాలను ఇచ్చే హక్కు రాష్ట్ర శాసనసభకు ఉంది?
ఎ) 243 (V) బి) 243 (W)
సి) 243 (Z) డి) 243 (S)
4. భారతదేశంలో మొత్తం స్థానాల్లో మూడో వంతు స్థానాలను మహిళలకు ఏ ఎన్నికలకు సంబంధించి కేటాయించారు?
ఎ) గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలు
బి) విధాన సభలు
సి) విధాన మండలి
డి) పైవన్నీ
5. భారతదేశంలో నగర స్థానిక సంస్థలకు సంబంధించిన రాజ్యాంగ సవరణ ఏది?
ఎ) 64వ సవరణ బి) 72వ సవరణ
సి) 73వ సవరణ డి) 74వ సవరణ

సమాధానాలు

1) డి; 2) ఎ; 3) బి; 4) ఎ; 5) డి.

'మోక్షలక్ష్మి', 'అంకశయ్య' లాంటి పదాల్లో ఉన్న సమాసం ఏది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

సమాసాలు

సమ ప్రాధాన్యం ఉన్న రెండు వేర్వేరు పదాలు ఏకపదంగా సమసించి కొత్త అర్థాన్ని సూచించడాన్ని 'సమాసం' అంటారు.

ఉదా: 'పని', 'మనిషి' అనే రెండు వేర్వేరు పదాలు కలిసి 'పనిమనిషి' అనే సమాస పదం ఏర్పడింది.

పద ప్రాధాన్యాన్ని అనుసరించి సమాసాలు ఆరు రకాలు.. అవి:

1) అవ్యయీభావ సమాసం
2) తత్పురుష సమాసం
3) ద్వంద్వ సమాసం
4) బహువ్రీహి సమాసం
5) కర్మధారయం
6) ద్విగువు

డీఈఈసెట్ పరీక్షలో సమాసాలపై తప్పనిసరిగా ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు వీటిపై అవగాహన పెంచుకోవాలి.

మాదిరి ప్రశ్నలు

1. 'చంపకవతి పట్టణం' ఏ సమాసం?
1) విశేషణ పూర్వ పద కర్మధారయం
2) సంభావన పూర్వ పద కర్మధారయం
3) ఉపమాన పూర్వ పద కర్మధారయం
4) ఉపమాన ఉత్తర పద కర్మధారయం
2. 'సూర్యచంద్రులు' ఏ సమాసం?
1) బహువ్రీహి
2) విశేషణ ఉభయ పద కర్మధారయం
3) ద్వంద్వ సమాసం
4) విశేషణ ఉత్తర పద కర్మధారయం
3. 'అబ్జముల వంటి పదములు' విగ్రహ వాక్యానికి సమాస పదం ఏమిటి?
1) పాదాబ్జములు 2) అబ్జపదాలు
3) పదాబ్జములు 4) అబ్జపాదాలు
4. 'నలుదెసలు' అనేది ఏ సమాసం?
1) ద్వంద్వ 2) ద్విగువు
3) విశేషణ పూర్వ పద కర్మధారయం
4) రూపకం
5. కింది వాటిలో ద్విగు సమాసం కానిది ఏది?
1) పంచకావ్యాలు 2) చతుర్వేదాలు
3) వేషభాషలు 4) ఎనిమిది మూరలు
6. కలువ కన్నులు అనేది ఏ సమాసం?
1) ఉపమాన ఉత్తర పద కర్మధారయం
2) ఉపమాన పూర్వ పద కర్మధారయం
3) విశేషణ పూర్వ పద కర్మధారయం
4) ద్వంద్వ సమాసం
7. 'రాజభటుడు' ఏ సమాసం?
1) సప్తమీ తత్పురుష
2) పంచమీ తత్పురుష
3) షష్ఠీ తత్పురుష
4) ప్రథమా తత్పురుష
8. 'పాపభీతి' ఏ సమాసం?
1) ద్వితీయా తత్పురుష
2) తృతీయా తత్పురుష
3) పంచమీ తత్పురుష
4) సప్తమీ తత్పురుష
9. 'మృదుమధురం' ఏ సమాసం?
1) విశేషణ పూర్వ పద కర్మధారయం
2) విశేషణ ఉభయ పద కర్మధారయం
3) విశేషణ ఉత్తర పద కర్మధారయం
4) ద్వంద్వ సమాసం
10. 'అమెరికా రాయబారి' ఏ సమాసం?
1) సప్తమీ తత్పురుష
2) పంచమీ తత్పురుష
3) షష్ఠీ తత్పురుష
4) సంభావన పూర్వపద
11. 'వయోవృద్ధుడు' ఏ సమాసం?
1) తృతీయా తత్పురుష
2) ద్వంద్వ 3) చతుర్థీ తత్పురుష
4) విశేషణ పూర్వ పద కర్మధారయం
12. 'విధాతృనానతి' ఏ సమాసం?
1) పంచమీ తత్పురుష
2) సప్తమీ తత్పురుష 3) షష్ఠీ తత్పురుష
4) విశేషణ ఉత్తర పద కర్మధారయం
13. కింది వాటిలో ద్విగు సమాసాన్ని గుర్తించండి.
1) విద్యాధికులు 2) స్త్రీ పురుషులు
3) భారతదేశం 4) ఏభై సంవత్సరాలు
14. 'కాశీ పట్టణం' ఏ సమాసం?
1) రూపక సమాసం
2) సంభావనా పూర్వపద కర్మధారయం
3) సప్తమీ తత్పురుష
4) పంచమీ తత్పురుష
15. 'కొండ యొక్క మలుపు' – సమాస పదం?
1) కొండదరి మలుపు
2) కొండమలుపు 3) కొండనున్న మలుపు
4) కొండ పక్క మలుపు
16. 'సత్యదూరం' – ఏ సమాసం?
1) పంచమీ తత్పురుష
2) ద్వంద్వ సమాసం 3) షష్ఠీ తత్పురుష
4) ద్వితీయా తత్పురుష
17. 'నెలతాల్పు' – ఏ సమాసం?
1) ప్రథమా తత్పురుష
2) ద్వితీయా తత్పురుష
3) తృతీయా తత్పురుష
4) రూపక సమాసం
18. 'దేశభక్తి' – ఏ సమాసం?
1) సప్తమీ తత్పురుష
2) ద్వంద్వ సమాసం
3) విశేషణ పూర్వ పద కర్మధారయం
4) తృతీయా తత్పురుష
19. కింది వాటిలో తృతీయా తత్పురుష సమాసం ఏది?
1) పొట్టకూడు 2) ధనహీనుడు
3) రాక్షసభయం 4) రాజశ్రేష్ఠుడు
20. 'అసత్యం' – ఏ సమాసం?
1) ద్వంద్వ సమాసం
2) నఞ్ బహువ్రీహి 3) నఞ్ తత్పురుష
4) విశేషణ ఉత్తర పద కర్మధారయం
21. 'సంఘ సంస్కర్తలు' – ఏ సమాసం?
1) బహువ్రీహి 2) ద్వితీయా తత్పురుష
3) ద్వంద్వ సమాసం
4) సప్తమీ తత్పురుష
22. 'శక్తిని అనుసరించి' విగ్రహ వాక్యంగా ఉన్న సమాస పదం ఏది?
1) శక్తి ప్రకారం 2) శక్త్యానుసారం
3) యథాశక్తి 4) శక్తిననుసరించి
23. 'ప్రతి నిత్యం' – ఏ సమాసం?
1) ప్రథమా తత్పురుష
2) అవ్యయీభావ సమాసం
3) ద్వితీయా తత్పురుష
4) చతుర్థీ తత్పురుష
24. కింది వాటిలో అవ్యయీభావ సమాసం కానిది?
1) నిశ్చలం 2) ప్రతి దినం
3) నిరుపయోగం 4) అన్యాయం
25. 'అర్ధరాత్రి' ఏ సమాసం?
1) అవ్యయీభావం
2) ప్రథమా తత్పురుష
3) ద్వంద్వ సమాసం
4) ద్వితీయా తత్పురుష
26. కింది వాటిలో ప్రథమా తత్పురుష సమాసం కానిది?
1) నడిరేయి 2) మధ్యాహ్నం
3) మద్యపానుడు 4) అర్ధరాజ్యం
27. 'కనకాభిషేకం' – ఏ సమాసం?
1) చతుర్థీ తత్పురుష
2) తృతీయా తత్పురుష
3) ద్వితీయా తత్పురుష
4) సప్తమీ తత్పురుష
28. కింది వాటిలో రూపక సమాసం కానిది?
1) విద్యాగంధం 2) లతాలలనలు
3) త్రిజగములు 4) కోపాగ్ని
29. కమలనాభుడు – ఏ సమాసం?
1) షష్ఠీ తత్పురుష
2) ద్వంద్వ సమాసం
3) పంచమీ తత్పురుష 4) బహువ్రీహి
30. కింది వాటిలో బహువ్రీహి సమాసం కానిది?
1) ముక్కంటి 2) రాజాజ్ఞ
3) చంచలాత్ములు
4) బాష్పపూరితనయన
31. కింది వాటిలో ద్వితీయా తత్పురుష సమాసం కానిది?
1) హితార్థకాంక్షులు 2) జలధరం
3) ధనాఢ్యుడు 4) విద్యార్థులు
32. 'అర్ధశతాబ్ది' ఏ సమాసం?
1) ద్వితీయా తత్పురుష
2) ప్రథమా తత్పురుష
3) ద్విగు సమాసం
4) తృతీయా తత్పురుష
33. 'అమృతతుల్యములు' ఏ సమాసం?
1) చతుర్థీ తత్పురుష
2) ద్వంద్వ సమాసం
3) పంచమీ తత్పురుష
4) తృతీయా తత్పురుష
34. కింది వాటిలో చతుర్థీ తత్పురుష సమాసం ఏది?
1) ఆవుదూడ 2) భిక్షాపాత్ర
3) నోటిమాట 4) విద్యాగురుడు
35. 'అథమాధముడు' – ఏ సమాసం?
1) నఞ్ తత్పురుష
2) చతుర్థీ తత్పురుష
3) పంచమీ తత్పురుష
4) సప్తమీ తత్పురుష
36. 'ద్వారకవాటం' – ఏ సమాసం?
1) ద్వంద్వ సమాసం
2) పంచమీ తత్పురుష
3) సప్తమీ తత్పురుష 4) షష్ఠీ తత్పురుష
37. కింది వాటిలో సప్తమీ తత్పురుష సమాసం?
1) దాస్యవిముక్తులు 2) నోటిమాట
3) సమాజ రుగ్మతలు 4) జీవనోపాధి
38. కింది వాటిలో నఞ్ తత్పురుష సమాసం కానిది?
1) అద్వైతం 2) అసాధ్యం
3) అసత్యం 4) క్రియాలోలురు
39. 'పుణ్యభూమి' ఏ సమాసం?
1) విశేషణ పూర్వ పద కర్మధారయం
2) ద్వంద్వ సమాసం
3) సప్తమీ తత్పురుష
4) ఉపమాన పూర్వ పద కర్మధారయం
40. కింది వాటిలో విశేషణ పూర్వ పద కర్మధారయ సమాసం కానిది?
1) తెల్లగుర్రం 2) చిరకాలం
3) గాజులాలు 4) చిరుగాలి
41. 'మామిడిగున్న' ఏ సమాసం?
1) విశేషణ పూర్వ పద కర్మధారయం
2) విశేషణ ఉత్తర పద కర్మధారయం
3) ద్వంద్వ 4) షష్ఠీ తత్పురుష
42. 'ఉదార విశాలం', 'ఇరుగు పొరుగు' లాంటి పదాల్లో ఉన్న సమాసం ఏది?
1) విశేషణ ఉత్తర పద కర్మధారయం
2) విశేషణ పూర్వ పద కర్మధారయం
3) విశేషణ ఉభయ పద కర్మధారయం
4) ఉపమాన పూర్వపద కర్మధారయం
43. 'కాటుక కొండ' పదంలో ఉన్న సమాసం?
1) విశేషణ పూర్వ పద కర్మధారయం
2) ద్వంద్వ సమాసం
3) ఉపమాన పూర్వ పద కర్మధారయం
4) ఉపమాన ఉత్తర పద కర్మ ధారయం
44. 'శూరమణి', 'పైరు పచ్చలు' లాంటి పదాల్లో ఉన్న సమాసం?
1) ద్వంద్వ సమాసం
2) ఉపమాన ఉత్తర పద కర్మధారయం
3) ఉపమాన పూర్వ పద కర్మధారయం
4) విశేషణ ఉత్తర పద కర్మధారయం
45. 'మోక్షలక్ష్మి', 'అంకశయ్య' లాంటి పదాల్లో ఉన్న సమాసం ఏది?
1) రూపకం 2) ద్వంద్వ
3) ఉపమాన పూర్వ పద కర్మధారయం
4) విశేషణ పూర్వ పద కర్మధారయం
46. కింది వాటిలో సంభావనా పూర్వ పద కర్మధారయ సమాస పదమేది?
1) సంసార సాగరం 2) ఆస్యగహ్వరం
3) కడిమి చెట్టు 4) వేదార్థములు
47. 'నవనాదులు', 'నూరు పద్యాలు' పదాల్లో ఉన్న సమాసం ఏది?
1) ద్వంద్వ 2) ద్విగు సమాసం
3) ప్రథమా తత్పురుష
4) అవ్యయీభావ సమాసం
48. కింది వాటిలో ద్వంద్వ సమాసం కానిది?
1) అర్ఘ్యపాద్యములు
2) ధైర్య సాహసాలు
3) ఐదుదినాలు 4) సౌభాగ్య సౌఖ్యాలు
49. 'బాలుడి నుండి గోపాలుని వరకు' అనే విగ్రహ వాక్యానికి సమాస పదం?
1) బాలగోపాలం 2) గోపాల బాలం
3) ఆబాలగోపాలం 4) ఆగోపాలబాలం

సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 2; 5) 3; 6) 2; 7) 3; 8) 3; 9) 2; 10) 3; 11) 1; 12) 3; 13) 4; 14) 2; 15) 2; 16) 3; 17) 2; 18) 1; 19) 2; 20) 3; 21) 2; 22) 3; 23) 2; 24) 4; 25) 2; 26) 3; 27) 2; 28) 3; 29) 4; 30) 2; 31) 3; 32) 2; 33) 4; 34) 2; 35) 3; 36) 4; 37) 3; 38) 4; 39) 1; 40) 3; 41) 2; 42) 3; 43) 3; 44) 2; 45) 1; 46) 3; 47) 2; 48) 3; 49) 3.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

చాపం దీపాలు కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భౌతిక శాస్త్రం

విద్యుత్

ఘటం (Cell)

నిర్జల/అనార్ధ ఘటం: ఇందులో ఎలాంటి ద్రవ పదార్థాలు ఉండవు. కాబట్టి దీన్ని 'డ్రై సెల్' అంటారు. ఈ ఘటాన్ని సులభంగా ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తీసుకెళ్లవచ్చు. అందువల్ల వీటిని కెమెరా, రేడియో, టార్చ్‌లైట్, గడియారాలు, ఆట బొమ్మలు, రిమోట్ కార్లు మొదలైనవాటిలో ఉపయోగిస్తారు.

గౌణ ఘటాలు: వీటిని గ్లాస్టన్ ప్లాంటే (ఫ్రాన్స్) అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఇందులో విద్యుత్ శక్తి రసాయన శక్తిగా, రసాయన శక్తి విద్యుత్ శక్తిగా మారుతుంది. ఇలాంటి ఘటాలను నిర్వహించడానికి లిథియం, కాడ్మియం, నికెల్, కోబాల్ట్ తదితర పదార్థాలను వినియోగిస్తారు. ఈ ఘటాలను మొబైల్ ఫోన్లు, హ్యాండీక్యామ్, కృత్రిమ ఉపగ్రహాలు, అంతరిక్ష నౌకల్లో ఉపయోగిస్తారు.

లెడ్ యాసిడ్ బ్యాటరీ: దీన్ని థామస్ ఆల్వా ఎడిసన్ కనుగొన్నాడు. ఈ ఘటాల్లో లెడ్‌ను ధన ధ్రువం (ఆనోడ్), లెడ్ పెరాక్సైడ్‌ను రుణ ధ్రువం (కేథోడ్)గా వాడతారు. ఈ ఘటంలో ఎక్కువగా ఉపయోగించే ఆమ్లం 'సజల సల్ఫ్యూరిక్ ఆమ్లం'. ఇలాంటి ఘటాలను వాహనాల్లో ఉపయోగిస్తారు.

- మానవాళికి ఎక్కువగా ఉపయోగపడుతున్న సజల సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని 'కింగ్ ఆఫ్ ది కెమికల్స్'గా పేర్కొంటారు.
- ప్రతి జీవిలో 'కార్బన్' మూలకం తప్పనిసరిగా ఉంటుంది. దీన్ని 'కింగ్ ఆఫ్ ది ఎలిమెంట్స్' అని పిలుస్తారు.
- బంగారం మెతకదనాన్ని అధికం చేసినప్పుడు దాన్ని సన్నటి తీగలా సాగదీయవచ్చు. అందువల్ల లోహాల్లో బంగారాన్ని 'కింగ్ ఆఫ్ ది మెటల్స్'గా పేర్కొంటారు.

విద్యుత్ బల్బు

విద్యుత్ బల్బును థామస్ ఆల్వా ఎడిసన్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. గాజుతో రూపొందించిన విద్యుత్ బల్బుల్లో టంగ్‌స్టన్ తీగను ఫిలమెంట్‌గా అమరుస్తారు. అందులో తక్కువ పీడనం వద్ద ఆర్గాన్ అనే జడవాయువును నింపుతారు.

టంగ్‌స్టన్ విద్యుత్ నిరోధం తక్కువగా, ద్రవీభవన స్థానం ఎక్కువగా (2400°C - 2900 °C) ఉంటుంది. అందువల్ల దీని ద్వారా విద్యుత్ ప్రవహిస్తున్నప్పుడు అది ఎక్కువ ఉష్ణోగ్రతకు వేడెక్కినప్పటికీ కాలిపోకుండా ఉంటుంది. కానీ ఈ బల్బుల్లో విద్యుత్ వ్యర్థం ఎక్కువగా ఉంటుంది.

సీఎఫ్ఎల్ బల్బ్

దీని పూర్తిపేరు Compact Flourocent Lamp. దీన్ని ఎడ్వర్డ్ హామర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఇందులో తక్కువ మోతాదులో పాదరసాన్ని ఉపయోగిస్తారు. సీఎఫ్ఎల్ బల్బుల్లో ఎలాంటి ఫిలమెంట్లు లేకపోవడం వల్ల విద్యుత్ వ్యర్థం దాదాపుగా ఉండదు.

ట్యూబ్‌లైట్

గాజుతో రూపొందించిన ఒక గొట్టం రెండు చివరల వద్ద ఆనోడ్, కెథోడ్ అనే ఎలక్ట్రోడ్‌లను అమరుస్తారు. వాటి మధ్య తక్కువ పీడనం వద్ద కావాల్సిన వాయువులను నింపుతారు.

ట్యూబ్‌లైట్ లోపలి గోడలపై టంగ్‌స్టన్ లేదా సిలికేట్ రసాయనిక పదార్థంతో పూత పూయడం వల్ల తెలుపురంగులో ఉన్న కాంతి విడుదలవుతుంది. ఇందులో ఎలాంటి ఫిలమెంట్ లేకపోవడం వల్ల విద్యుత్ పొదుపు ఎక్కువగా ఉంటుంది. కానీ ఈ ట్యూబ్‌లైట్ వెలగడానికి 220V వోల్టేజీ అవసరమవుతుంది.

ఫ్లోరోసెంట్ ల్యాంప్

ఇందులో తక్కువ మోతాదులో పాదరసాన్ని ఉపయోగిస్తారు.

చాపం దీపాలు (Arc Lamps)

వీటిని సర్ హంఫ్రీ డేవిస్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఇలాంటి బల్బుల నుంచి అధిక తీవ్రత ఉన్న కాంతి వెలువడుతుంది. అందువల్ల వీటిని కింద పేర్కొన్న సాధనాల్లో ఉపయోగిస్తారు.



- సినిమా ప్రొజెక్టర్లలో ఇలాంటి ల్యాంప్‌లను అమర్చి, వాటి నుంచి వెలువడుతున్న కాంతిని ఇనుముపై పతనమయ్యేలా చేస్తారు. ఆ ఫిల్మ్‌పై ఉండే బొమ్మ తెరపై ఏర్పడుతుంది.
- నౌకాశ్రయంలో లైట్ హౌస్ పై భాగంలో ఇలాంటి ల్యాంప్‌లను అమరుస్తారు. వీటి నుంచి వెలువడుతున్న కాంతిని ఉపయోగించి రాత్రి సమయంలో తీరం వైపు వస్తున్న నౌకలకు మార్గ నిర్దేశనం చేస్తారు.

ఆవిరి దీపాలు

వీటిని పీటర్ కూపర్ హెవిట్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. సాధారణంగా ఇలాంటి బల్బ్‌లలో పాదరస ఆవిరిని లేదా సోడియం వేపర్‌ను ఉపయోగిస్తారు.

- అలంకరణ దీపాలను శ్రేణిలో సంధానం చేస్తారు.

ఫ్యూజ్ తీగ

దీన్ని లెడ్, టిన్‌ల మిశ్రమంతో తయారు చేస్తారు. ఇందులో పరిగణనలోకి తీసుకోలేనంత తక్కువ మోతాదులో Cuను కూడా వినియోగిస్తారు. ఈ మిశ్రమ లోహాన్ని 'టైప్ మెటల్' అని కూడా అంటారు. ఈ ఫ్యూజ్ వైర్ విద్యుత్ నిరోధం ఎక్కువగా, ద్రవీభవన స్థానం తక్కువగా ఉంటుంది.

ఈ తీగను ఎలక్ట్రిక్ వలయంలో శ్రేణిలో కలుపుతారు. ఒకవేళ ఎలక్ట్రిక్ వోల్టేజీ 220V కంటే ఎక్కువగా ఉంటే ఈ ఫ్యూజ్ వైర్ వేడెక్కి కాలిపోతుంది. ఈ విధమైన అధిక వోల్టేజీల నుంచి ఎలక్ట్రిక్ ఫీల్డ్‌ను కాపాడటానికి ఫ్యూజ్ వైర్‌ను ఉపయోగిస్తారు.

- విద్యుత్ హీటర్‌లో నిక్రోమ్ తీగను ఫిలమెంట్‌గా వాడతారు. దీని విద్యుత్ నిరోధం, ద్రవీభవన స్థానాలు ఎక్కువగా ఉండటమే దీనికి కారణం. అందువల్ల దీని ద్వారా ప్రవహించే విద్యుత్ ప్రవాహం పూర్తిగా ఉష్ణశక్తిగా మారి ఆ ఫిలమెంట్ వేడెక్కుతుంది. ఈ ఉష్ణాన్ని ఉపయోగించి వంట చేసుకోవచ్చు. ఈ తీగ ద్రవీభవన స్థానం ఎక్కువగా ఉండటం వల్ల ఇది కరిగిపోకుండా ఉంటుంది.

విద్యుత్ ఫలితాలు (ఎలక్ట్రిక్ ఎఫెక్ట్)

సీబెక్ ఫలితం

రెండు వేర్వేరు లోహపు తీగలను తీసుకుని వాటి రెండు చివరలను రెండు సందులుగా అమరిస్తే ఏర్పడే వలయాన్ని 'ఉష్ణయుగ్మం' అంటారు. ఇందులో ఉన్న ఒక సంధిని మంచు ముక్కల్లో అమర్చినప్పుడు దాని ఉష్ణోగ్రత 0° సెంటీగ్రేడ్‌కు తగ్గుతుంది. దీన్ని చల్లని సంధి అంటారు. రెండో సంధిని ద్రవంలో అమర్చి వేడి చేసినప్పుడు దాని ఉష్ణోగ్రత పెరుగుతుంది. అందువల్ల దీన్ని వేడి సంధి అంటారు. ఈ వేడి సంధి వద్ద ఇచ్చిన ఉష్ణం విద్యుత్ వలయంలో విద్యుత్ శక్తిగా మారి ప్రవహిస్తుంది. ఈ విధంగా జనించిన విద్యుత్‌ను ఉష్ణ విద్యుత్ అంటారు. దీన్ని కనుగొన్న శాస్త్రవేత్త సీబెక్ కావడం వల్ల దీన్ని 'సీబెక్ ఫలితం' అంటారు.

సీబెక్ ఫలితంలో జనించిన ఉష్ణ విద్యుత్ రెండు అంశాలపై ఆధారపడి ఉంటుంది.

1. ఉష్ణయుగ్మాన్ని తయారు చేయడానికి ఉపయోగించే 'పదార్థాల స్వభావం'పై ఆధారపడి ఉంటుంది. అందువల్ల గరిష్ఠ ఉష్ణ విద్యుత్ జనించడానికి ఈ ఉష్ణయుగ్మాన్ని యాంటిమొని (Sb), బిస్మత్ పదార్థాలను ఉపయోగించి నిర్మిస్తారు.
2. చల్లని సంధి, వేడి సంధి ఉష్ణోగ్రతలోని తేడాపై ఉష్ణ విద్యుత్ ఆధారపడి ఉంటుంది. ఈ ఉష్ణోగ్రతలోని తేడా పెరిగితే ఉష్ణ విద్యుత్ కూడా పెరుగుతుంది.

ఉష్ణ విద్యుత్ ఉష్ణోగ్రతా మాపకం: ఇది సీబెక్ ఫలితం ఆధారంగా పనిచేస్తుంది. ఈ ఉష్ణోగ్రత మాపకాన్ని యాంటిమొని, బిస్మత్ పదార్థాలను ఉపయోగించి నిర్మిస్తారు.

ఉపయోగాలు:

1. క్రిమి కీటకాల ఉష్ణోగ్రతలను 0.025 °C వరకు కచ్చితంగా కొలవవచ్చు.
2. వేగంగా మార్పు చెందే ఉష్ణోగ్రతలను కచ్చితంగా నమోదు చేయడానికి వాడతారు.

పెల్టియర్ (Peltier) ఫలితం

ఒక ఉష్ణయుగ్మం ద్వారా విద్యుత్ ప్రవహిస్తున్నప్పుడు అది ఒక సంధి వద్ద పరిసరాల్లోని ఉష్ణం మొత్తాన్ని గ్రహించి ఆ ఉష్ణరాశిని ఎలక్ట్రాన్ల సహాయంతో రెండో సంధి వైపు బదిలీ చేసి బయటకు విడుదల చేయడం ద్వారా వేడేక్కుతుంది. దీన్నే పెల్టియర్ ఫలితం అంటారు.

అనువర్తనం:

1. ఎయిర్ కూల్డ్ గదులు, రిఫ్రిజిరేటర్లు పెల్టియర్ ఫలితం ఆధారంగానే పనిచేస్తాయి.

- రిఫ్రిజిరేటర్‌ను జేమ్స్ హారిసన్ కనుగొన్నాడు.
- రిఫ్రిజిరేటర్‌లో ఆహార పదార్థాలు మన్నికగా, తాజాగా ఎక్కువ కాలం పాటు నిల్వ ఉండటానికి కావాల్సిన ఆదర్శ ఉష్ణోగ్రత 4 డిగ్రీల సెల్సియస్.
- రిఫ్రిజిరేటర్‌లో ఉన్న డోర్‌ను తెరచి అందులో కావాల్సిన ఆహార పదార్థాలను అమర్చి తిరిగి డోర్‌ను మూసివేయడానికి కావాల్సిన ఆదర్శ సమయం అయిదు సెకన్లు మాత్రమే.
- పనిచేస్తున్న ఒక రిఫ్రిజిరేటర్‌ను అమర్చిన గది ఉష్ణోగ్రత పెరుగుతుంది.

థామ్సన్ ఫలితం

ఒక తీగ ద్వారా విద్యుత్ ప్రవహిస్తున్నప్పుడు ఆ తీగ మొత్తం వేడెక్కుతుంది లేదా చల్లబడుతుంది. దీన్నే జౌల్ లేదా థామ్సన్ ఫలితం అంటారు. మంచును తయారు చేసే ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్లు చల్లబడేవాటికి ఉదాహరణలు. విద్యుత్ హీటర్, విద్యుత్ బాయిలర్, విద్యుత్ స్టీమ్ బాయిలర్, విద్యుత్ కుంపటి, విద్యుత్ ఇస్త్రీ పెట్టె, విద్యుత్ కెటిల్ మొదలైనవి వేడెక్కేవాటికి ఉదాహరణలు.

- ఇస్త్రీ పెట్టె రెండు పలకల మధ్య అభ్రకం (మైకా) కాగితాన్ని అమరుస్తారు. అభ్రకం ఉత్తమ ఉష్ణ వాహకం, విద్యుత్ బంధక పదార్థం. కాబట్టి ఐరన్ బాక్స్‌లో పైన ఉన్న ఫలకలో ఉత్పత్తి చెందిన ఉష్ణాన్ని తన ద్వారా కింది ఫలకలోకి ప్రసారం చేస్తుంది. దీంతోపాటు ఇది విద్యుత్ బంధక ధర్మాన్ని కలిగి ఉండటం వల్ల రెండు పలకల మధ్య విద్యుత్ ప్రసారం జరగకుండా నిరోధిస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. విద్యుత్ శక్తిని యాంత్రిక శక్తిగా మార్చేది?
   ఎ) మోటారు బి) జనరేటర్
   సి) ట్రాన్స్‌ఫార్మర్ డి) కెపాసిటర్
2. స్థావర విద్యుత్తును నిల్వ చేసేది?
   ఎ) మోటారు బి) జనరేటర్
   సి) ట్రాన్స్‌ఫార్మర్ డి) కెపాసిటర్
3. ఇళ్లలో ఉపయోగించే విద్యుత్ పరికరాలను ఏ పద్ధతిలో కలుపుతారు?
   ఎ) శ్రేణి బి) సమాంతరం
   సి) విడివిడిగా డి) ఏదీకాదు
4. యాంత్రిక శక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చేది?
   ఎ) మోటారు బి) జనరేటర్
   సి) ట్రాన్స్‌ఫార్మర్ డి) విద్యుద్దర్శిని
5. కిందివాటిలో ఓమ్ నియమాన్ని పాటించనిది?
   ఎ) రాగి బి) ఇనుము
   సి) చెక్క డి) సిలికాన్
6. విద్యుత్‌కు ప్రమాణాలు?
   ఎ) ఓమ్ బి) ఓమ్-మీటర్
   సి) ఆంపియర్ డి) వోల్ట్

సమాధానాలు:
1) ఎ; 2) డి; 3) బి;
4) బి; 5) డి; 6) సి.

Operating System is an interface between?



BANK EXAMS
COMPUTER AWARENESS

1. The key which lets you to exit a program when pushed?
   a) Arrow key b) Space bar
   c) Escape key d) Return key
   e) Back space key
2. The ability of an OS to run more than one application at a time is called?
   a) Multitasking
   b) Object-oriented programming
   c) Multi-user computing
   d) Time-sharing
   e) Time computing
3. Which of the following statements best describes the batch method of input?
   a) Data is processed as soon as it is input.
   b) Data is input at the time it is collected.
   c) Data is collected in the form of source documents, placed into groups, and then input to the computer.
   d) Source documents are not used.
   e) All the above
4. The benefit of using computers is that:
   a) Computers are very fast and can store huge amounts of data.
   b) Computers provide accurate output even when input is incorrect.
   c) Computers are designed to be inflexible.
   d) All the above
   e) None of these
5. The function of CPU is:
   a) To provide external storage of text
   b) To communicate with the operator
   c) To read, interpret and process the information and instruction
   d) To provide a hard copy
   e) all the above
6. To find a saved document in the computer's memory and bring it up on the screen to view is called:
   a) Reversing b) Rerunning
   c) Retrieving d) Returning
   e) Removing
7. The Internet is a system of:
   a) Software bundles
   b) Web pages c) Website
   d) Interconnected networks
   e) Trusted networks
8. Code consisting of bars and lines of varying widths or lengths that is computer-readable is known as:
   a) An ASCII code
   b) A magnetic tape
   c) An OCR scanner
   d) A bar code
   e) An OMR Code
9. A ____ is a unique name that you give to a file of information.
   a) Device letter b) Folder
   c) File name
   d) File name extension
   e) None of these
10. What is an email attachment?
    a) A receipt sent by the recipient.
    b) A separate document from another program sent along with an email message.
    c) A malicious parasite that feeds off your messages and destroys the contents.
    d) A list of CC or BCC recipients.
    e) None of these
11. Which of the following are all considered advantages of e-mail?
    a) Convenience, speed of delivery, generality and reliability
    b) Printable, global and expensive
    c) Global, convenience and Microsoft owned
    d) Slow delivery, reliable, global and inexpensive
    e) None of these
12. Windows is?
    a) CUI b) GUI
    c) Voice User Interface
    d) Application e) AUG
13. In a client/ server model, a client program:
    a) Asks for information
    b) Provides information and files
    c) Serves software files to other computers
    d) Distributes data files to other computers
    e) None of these
14. Computers manipulate data in many ways, and this manipulation is called _____.
    a) Utilizing b) Batching
    c) Upgrading d) Processing
    e) None of these
15. A worksheet can have a maximum of ____ Number of rows:
    a) 256 b) 1024 c) 32,000
    d) 65,535 e) 10,000
16. A worksheet range is a:
    a) A command used for data modeling
    b) A range of values such as from 23 to 234
    c) A group of cells
    d) A group of worksheets
    e) All the above
17. The short cut key to quickly create a Bullet Point in MS WORD is:
    a) Ctrl + Shift + B
    b) Ctrl + B
    c) Ctrl + Shift + *
    d) Ctrl + Shift + L
    e) None of these
18. ______ hard drives are permanently located inside the system unit and are not designed to be removed, unless they need to be repaired or replaced.
    a) Static b) Internal
    c) External d) Dynamic
    e) None of these
19. DFD is:
    a) Data file distribution
    b) Data file definition
    c) Digital file distribution
    d) Data flow diagram
    e) Data file definition
20. The quickest and easiest way in MS-Word to locate a particular word or phrase in a document is to use the ______ command.
    a) Replace b) Find
    c) Lookup d) Search
    e) Rename
21. Word processing, spreadsheet, and photo-editing are example of ?
    a) Application software
    b) System software
    c) Operating system software
    d) Platform software
    e) Keyboard software
22. Which of the following is/ are used to identify a user who returns to a Website?
    a) ASPs b) Plug-ins
    c) Scripts d) Cookies
    e) History
23. RAM can be thought of as the ___ for the computer's processor.
    a) Planning room b) Waiting room
    c) Factory d) Operating room
    e) System room
24. Which of the following functions is not performed by CPU?
    a) Graphical Display of data
    b) Arithmetic calculations
    c) Managing Memory
    d) Managing Input and Output
    e) None of these
25. The Feature that keeps track of the right margins is:
    a) Find and Replace
    b) Word Wrap
    c) Right justified
    d) Left justified
    e) Ragged Right
26. Which of the following options is used to display information such as title, page number of the document?
    a) Insert Table b) Auto correct
    c) Thesaurus
    d) Spelling and grammar
    e) Header and Footer
27. The processor is a _____chip plugged onto the motherboard in a computer system.
    a) LSI b) VLSI c) ULSI
    d) XLSI e) WLSI
28. Which of the following will be used if a sender of e-mail wants to bold, italics etc the text message?
    a) Reach Signature
    b) Reach Text c) Reach Format
    d) Plain Format
    e) Plain Text
29. CPU is also called as?
    a) Microprocessor
    b) Execute c) Microchip
    d) Decoder e) Register
30. A menu contains a list of
    a) Commands b) Data
    c) Objects d) Reports
    e) Files
31. A command to get a file you worked on from the memory where it was stored
    a) Close b) Delete
    c) Open d) Get it
    e) Remove
32. A ______ is a collection of data that is stored electronically as a series of records in a table.
    a) Spreadsheet
    b) Presentation
    c) Database d) Web page
    e) File system
33. The software tools that enable a user to interact with a computer for specific purposes are known as?
    a) Hardware
    b) Networked softwares
    c) Sharewares d) Applications
    e) None of these
34. What is the term for unsolicited e-mail?
    a) Newsgroup b) Usenet
    c) Backbone d) Flaming
    e) Spam
35. Two or more Computers are Connected to each other for sharing Information form a?
    a) Network b) Router
    c) Server d) Tunnel
    e) Pipeline
36. Punched cards are associated with the name?
    a) Leibniz b) Jacquard
    c) Pascal d) Cobal
    e) Hollerith
37. A device or system not directly connected to the CPU is:
    a) On-line b) Keyboard
    c) Memory d) Off-line
    e) Mouse
38. Modern Computers are very reliable but they are not
    a) Fast b) Powerful
    c) Infallible d) Cheap
    e) None of above
39. Which is not a system tool?
    a) Folder b) Backup
    c) Scandisk d) Format
    e) None of these
40. _______ are specialized utility programs that make using the Internet and the Web easier and safer.
    a) Telecom b) Web utilities
    c) Norton Utilities
    d) Web firewalls e) None
41. A(n) _______ can be used to block access to specific sites.
    a) Filter b) Hardware block
    c) Censor d) Rubicon
    e) None of these
42. Operating System is an interface between?
    a) User and program
    b) User and hardware
    c) User and client
    d) a and c e) a and b
43. Memory that requires refreshing of data is:
    a) SRAM b) EPROM
    c) DRAM d) Bubble Memory
    e) SPAD

KEY

1) c;	2) a;	3) c;	4) a;
5) c;	6) c;	7) d;	8) d;
9) c;	10) b;	11) a;	12) b;
13) a;	14) d;	15) d;	16) c;
17) d;	18) b;	19) d;	20) b;
21) a;	22) d;	23) b;	24) a;
25) e;	26) e;	27) b;	28) b;
29) a;	30) a;	31) c;	32) c;
33) d;	34) b;	35) a;	36) e;
37) d;	38) c;	39) a;	40) b;
41) a;	42) b;	43) c.	